మంగళవారం 3-6-2025

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 22 వెల: ₹ 5.50


సంపుటి: 18 సంచిక: 72



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 72

మంగళవారం 3-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 72

మంగళవారం 3-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులు పూర్తి చేసి
శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి
ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'



మొదటి ట్రోఫీ వేటలో...

నేడు ఐపీఎల్ ఫైనల్లో తలపడనున్న బెంగళూరు, పంజాబ్ కింగ్స్ - 16లో



కార్ల్‌సన్‌కు గుకేశ్ షాక్

వరల్డ్ చెస్ నంబర్‌వన్ కార్ల్‌సన్‌పై తొలిసారి గెలిచిన భారత గ్రాండ్‌మాస్టర్ - 16లో

2047 నాటికి ప్రపంచంలోనే నంబర్ 1

పదేళ్లలో ట్రిలియన్ ఎకానమీ.. 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ: రేవంత్



హైదరాబాద్‌లోని గన్‌పార్కులో స్మారకవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

14 లో

ఆ దిశగా ప్రణాళికలకు రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన

ప్రజా ఆలోచనలే ఆచరణగా ప్రజా ప్రభుత్వం ముందుకు..

పదేళ్లలో నాశనమైన వ్యవస్థలన్నింటినీ చక్కదిద్దుతున్నాం

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం

సన్న బియ్యం ఓ ట్రెండ్ సెట్టర్.. పెట్టుబడులకు గమ్యస్థానంగా రాష్ట్రం.. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రి ప్రసంగం

పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండా ఆవిష్కరించిన సీఎం

ముఖ్యఅతిథిగా హాజరైన జపాన్ కితాక్యూషు నగర మేయర్ టకేచి

కవులు, కళాకారులకు రూ.కోటి చొప్పున పురస్కారం

మన స్నేహం సుదీర్ఘంగా ఉండాలి

- జపాన్ ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి
- తమ విద్యార్థులకు జపనీస్ నేర్పాలన్న ముఖ్యమంత్రి
- జపాన్ నగరం కితాక్యూషు, తెలంగాణల మధ్య ఒప్పందం

5 లో

ఎవరితోనూ పొత్తు ఉండదు



- వంద అసెంబ్లీ సీట్లలో గులాబీ జెండా ఎగురుతుంది: హరీశ్‌రావు
- దివానా గాళ్లే తెలంగాణ దివాలా తీసింది అంటారు
- బనకచర్ల ప్రాజెక్టుపై సుప్రీంకోర్టుకు వెళ్తాం
- సీఎం రేవంత్‌రెడ్డితో తెలంగాణకు తలవంపులు
- రేవంత్‌కు స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ధైర్యం లేదు

3 లో

11న 'కాళేశ్వరం' విచారణకు కేసీఆర్

- జస్టిస్ పీసీ ఘోష్‌కు లేఖ రాసిన మాజీ సీఎం
- 5న రాలేనన్న బీఆర్ఎస్ అధినేత.. ఓకే చెప్పిన కమిషన్

3 లో



సోమవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ సుందరి పోటీ విజేతలకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దంపతులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి, పొన్నం తదితరులు -14లో

17 మందిపై క్రిమినల్ చర్యలు



- 'మేడిగడ్డ'పై ప్రభుత్వానికి విజిలెన్స్ కమిషన్ సిఫారసు
- సీనియర్ ఇంజినీర్లతో పాటు నిర్మాణ సంస్థపైనా చర్యలు తీసుకోవాలి
- 33 మందిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలి..
- ఆర్థికశాఖ అధికారులపై కూడా చర్యలు తీసుకోండి
- బరాజ్ పునఃనిర్మాణ ఖర్చు కాంట్రాక్టు సంస్థ నుంచే వసూలు చేయాలి
- మార్చి 18న ఇచ్చిన నివేదిక తాజాగా వెలుగులోకి..

5 లో



రజిత్ గుప్తా



దేవదత్త



రుత్విక్ సాయి



అజయ్‌రెడ్డి

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తెలుగు తేజాలు

ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ విభాగాల్లో రుత్విక్ సాయి, వంగల అజయ్‌రెడ్డికి ఫస్ట్ ర్యాంకులు

టాప్–100 ర్యాంకర్లలో తెలంగాణ, ఏపీ నుంచి 18 మంది విద్యార్థులు

ఓపెన్ కేటగిరీలో ఆలిండియా టాపర్‌గా నిలిచిన రాజస్తాన్‌లోని కోటాకు చెందిన విద్యార్థి రజిత్ గుప్తా

మొత్తం 54,378 మందికి అర్హత.. వారిలో తెలుగు విద్యార్థులు సుమారు 8 వేలు

ఫలితాలు ప్రకటించిన కాన్పూర్ ఐఐటీ.. నేటి నుంచి జోసా కౌన్సెలింగ్ మొదలు

- వివరాలు 7లో

నీట్-పీజీ పరీక్ష వాయిదా



- రెండు షిఫ్టుల బదులు ఒకే షిఫ్టులో పరీక్ష నిర్వహించాలన్న సుప్రీంకోర్టు
- అందుకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్న ఎన్‌బీఈఎంఎస్ - 7లో

ఆపరేషన్ స్పైడర్స్ వెబ్...
నయా పెరల్ హార్బర్!





ఆధునిక యుద్ధ చరిత్రలోనే అతి పెద్ద సర్జికల్ స్ట్రైక్స్.. రష్యాకు తీరని అవమానం మిగిల్చిన ఉక్రెయిన్ డ్రోన్ దాడులు

మూడు టైమ్ జోన్ల పరిధిలో దాడులు

41 బాంబర్, నిఘా విమానాలు ధ్వంసం

మూడో వంతు ఫ్లీట్‌ను నష్టపోయిన రష్యా

నష్టం విలువ రూ.60 వేల కోట్ల పైచిలుకే!

ఒక్కోటీ రూ.42 వేలు విలువ చేసే 117 డ్రోన్లతో కారుచౌకగా పని పూర్తి చేసిన ఉక్రెయిన్

6 లో

బీజేపీలో రాజాసింగ్ రచ్చ



- రోజుకో ప్రకటనతో పార్టీ నేతలపై తీవ్ర విమర్శలు
- పరోక్షంగా మీడియాకు లీకు నోట్‌లు.. గతంలో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నా అదేతీరు
- దీంతో నోటీసు ఇవ్వాలని భావిస్తున్న రాష్ట్ర పార్టీ
- ఇప్పటికే ఈ అంశంపై ఆరాతీసిన పార్టీ ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్

- వివరాలు 8లో

క్లుప్తంగా...



తెలంగాణ ప్రిన్సిపల్ సీసీఏగా అశోక్‌కుమార్ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కొత్త ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ (సీసీఏ)గా సీనియర్ అధికారి అశోక్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇండియన్ పోస్ట్, టెలీకమ్యూనికేషన్ అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ సర్వీస్ 1992 బ్యాచ్‌కు చెందిన అధికారి. టెలికాం ఫైనాన్స్, ప్రభుత్వ వ్యయ నిర్వహణ, పాలసీ అమలులో అశోక్‌కుమార్‌కు విస్తృత అనుభవం ఉందని టెలీకమ్యూనికేషన్ విభాగం ఈ సందర్భంగా తెలిపింది. టెలీకమ్యూనికేషన్స్ శాఖతోపాటు ఇతర ప్రభుత్వ సంస్థల్లో వివిధ హోదాల్లో ఆయన పనిచేశారని, ఆర్థిక పర్యవేక్షణ, డిజిటల్ గవర్నెన్స్‌ను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని వెల్లడించింది. లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రమ్ వినియోగ చార్జీల వసూలు, యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యూఎస్ఓఎఫ్) చెల్లింపు, ఉద్యోగుల పింఛన్, జీపీఎఫ్ నిర్వహణ, భారత్‌నెట్ లాంటి అంశాల్లో రాష్ట్రంలో టెలీకమ్యూనికేషన్స్ విభాగం ఆర్థిక విధుల నిర్వహణలో ప్రిన్సిపల్ సీసీఏ కార్యాలయం కీలకపాత్ర పోషిస్తోంది. అశోక్‌కుమార్ చేరికతో పనులు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సాగుతాయని ఆశిస్తున్నామని టెలీకమ్యూనికేషన్స్ విభాగం వెల్లడించింది.

జస్టిస్ వినోద్‌కుమార్ బదిలీ ఆపండి

హైకోర్టు బార్ అసోసియేషన్ తీర్మానం

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్‌ను బదిలీ చేయాలన్న సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులను ఆపాలని హైకోర్టు బార్ అసోసియేషన్ సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. రాష్ట్రానికి చెందిన సీనియర్ న్యాయమూర్తిని బదిలీ చేయడం సమంజసం కాదని, దీనిపై సుప్రీంకోర్టుతో పాటు కేంద్ర ప్రభుత్వం మరోసారి పరిశీలన చేయాలని విజ్ఞప్తి చేసింది. హైకోర్టులో 5వ సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమా ర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం గత వారం సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఇంకా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

11న 'కాళేశ్వరం' విచారణకు కేసీఆర్

జస్టిస్ పీసీ ఘోష్‌కు లేఖ రాసిన మాజీ సీఎం!

- 5న రాలేనన్న బీఆర్ఎస్ అధినేత..ఓకే చెప్పిన కమిషన్
- హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వాయిదా



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల 11న ఉదయం 11.30కు కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కమిషన్ ముందు హాజరుకానున్నారు. ఈ నెల 5న విచారణకు హాజరు కావాల్సిందిగా కమిషన్ గత నెలలో ఆయనకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ రోజున తాను విచారణకు హాజరు కాలేనంటూ జస్టిస్ ఘోష్‌కు కేసీఆర్ లేఖ రాసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన 11వ తేదీన హాజరయ్యేందుకు కమిషన్ అంగీకరించింది. విచారణకు హాజరు కావాల్సిందిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీజేపీ ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ గతంలో నోటీసులు ఇచ్చింది. ఈటల రాజేందర్ ఈ నెల 6న, హరీశ్‌రావు ఈ నెల 9న విచారణ కమిషన్ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించనున్నారు.

నివేదికతో సిద్ధం

కమిషన్ ఎదుట వినిపించాల్సిన వాదనకు సంబంధించి కేసీఆర్ ఇప్పటికే మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు నీటిపారుదల శాఖ నిపుణులతో ఎర్రవల్లి నివాసంలో పలు విడతలు భేటీ అయ్యారు. ప్రాజెక్టుపై విచారణ కమిషన్ ఏర్పాటు మొదలుకుని ఇప్పటివరకు జరిగిన విచారణ తీరుతెన్నులు పరిశీలించారు. ఈ క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు అందులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌కు సంబంధిచి అన్ని అంశాలను క్రోడీకరించి డాక్యుమెంట్ల సహితంగా ఒక నివేదికను సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

6న పవర్ పాయింట్ ప్రజెంటేషన్

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్వాపరాలు, స్థితిగతులను పార్టీ నాయకులు, కేడర్.. ప్రజలకు వివరించేందుకు కేసీఆర్ ఆదేశాల మేరకు హరీశ్‌రావు 'కాళేశ్వరంపై దుష్ప్రచారం- వాస్తవాలు' పేరిట ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉండగా, ఈ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. కేసీఆర్ ఈ నెల 11న విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో ఈ నెల 6న తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు వపర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉపయోగపడుతుందని పార్టీ నేతలు చెప్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న విమర్శలు, లేవనెత్తుతున్న సందేహాలు అన్నింటికీ సమాధానం ఇచ్చేలా ఈ ప్రజెంటేషన్‌ను రూపొందించినట్లు తెలిసింది.





డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరీనాలో సోమవారం జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, బీఆర్ఎస్ రజతోత్సవంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాళేశ్వరంపై విష ప్రచారం ఆపాలి

- ఆ ప్రాజెక్టును సద్వినియోగం చేసుకోవాలి
- కేసీఆర్‌కు పేరు వస్తుందనే పాలమూరును పండబెట్టారు
- అమెరికన్ డ్రీమ్ స్ఫూర్తితోనే తెలంగాణ: కేటీఆర్
- డాలస్‌లోని పెప్పర్ ఎరీనాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

సాక్షి, హైదరాబాద్: 'కాళేశ్వరం ప్రాజెక్టు.. కూలేశ్వరం అయ్యిందని కొంతమంది మూర్ఖులు తెలిసీతెలియక మాట్లాడుతు న్నారు. అది 45 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే జల అక్షయపాత్ర. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాళేశ్వరంతోనే పునరుజ్జీవనం పొందింది. త్రీ గోర్జెస్ డ్యామ్‌ను నిర్మించేందుకు చైనాకు 16 ఏళ్లు పట్టింది. కానీ ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును తెలంగాణలో నాలుగేళ్లలోనే నిర్మించిన ఘనత కేసీఆర్‌ది. 371 పిల్లర్లు కలిగిన మూడు బరాజ్‌లలో రెండు పిల్లర్లకు నష్టం జరిగితే మొత్తం ప్రాజెక్టు కూలిపోయిందనే విష ప్రచారాన్ని ఆపి.. కాళేశ్వరం ప్రాజెక్టును సద్వినియోగం చేసుకోవాలి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. దక్షిణ తెలంగాణకు వరప్రదాయిని అయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన 10 శాతం పనులు పూర్తయితే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందని కాంగ్రెస్ పనులు చేపట్టడం లేదన్నారు. డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరీనాలో భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాల్లో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2023 నాటికి రెండు పంటలకు కలిపి 2.29 కోట్ల ఎకరాలకు నీళ్లు అందించి పంజాబ్, హరియాణాలను తలదన్ని ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను కేసీఆర్ అగ్రస్థానంలో నిలిపారన్నారు. పదేళ్లలో తెలంగాణ ఆర్థిక క్రమశిక్షణ తప్పలేదని, మితిమీరి అప్పులు చేయలేదని చెప్పారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ చేయకూడని అప్పు, చేయకూడని తప్పులేవీ చేయలేదని కేటీఆర్ అన్నారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...

ఘనంగా రజతోత్సవ సభ

డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరీనాలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాలకు వేలాదిమంది హాజరయ్యారు. విదేశాల్లో బహిరంగ సభ నిర్వహణ ద్వారా బీఆర్ఎస్ కొత్త సాంప్రదాయానికి తెరలేపింది. సభాప్రాంగణ సామర్థ్యం 7 వేల కెపాసిటీకాగా, ఫైర్‌కోడ్ యాక్టివేట్ కావడంతో సుమారు ఐదు వేల మంది సభా ప్రాంగణం బయటే ఉండిపోయారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. అమెరికాలో సభలు నిర్వహించే ప్రాంగణాల్లోకి నిర్ణీత సంఖ్యను దాటి జనం వస్తే ఫైర్‌కోడ్ యాక్టివేట్ అవుతుంది. కాగా అమెరికా నలుమూలల నుంచి ఈ సభకు ప్రవాస తెలంగాణవాసులు, ఎన్‌ఆర్‌ఐలు హాజరయ్యారు. ఈ సభా వేదికగా, బీఆర్ఎస్, తెలంగాణ విజయగాథను కేటీఆర్ ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తెలంగాణ సాంస్కృతిక ప్రదర్శన, ధూంధాంకు నేతృత్వం వహించారు.

అవకాశాల అక్షయపాత్ర తెలంగాణ

'తెలంగాణను పదేళ్ల పాలనలో అవకాశాల అక్షయ పాత్రగా తీర్చిదిద్దాం. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల స్ఫూర్తి డాలస్‌లోనూ కనిపిస్తోంది. ఎన్నారైలను చూసి తెలంగాణ తల్లి గర్విస్తుంది. అమెరికన్ డ్రీమ్ తరహాలో కేసీఆర్ తెలంగాణ స్వప్నాన్ని మహాత్ముడు, అంబేడ్కర్, మార్టిన్ లూథర్‌కింగ్ స్ఫూర్తితో ముందుకు సాగి సాకారం చేశారు. మళ్లీ మూడేళ్లలో తిరిగి అధికారంలోకి వస్తాం. కేసీఆర్ సీఎం అవుతారు.

తెలంగాణను ప్రేమించడంలో వెనుకబడం

అధికారాన్ని బాధ్యతగా భావిస్తూ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వాన్ని నడిపి విడిపోతే విఫల రాష్ట్రం అవుతుందని హేళన చేసిన చోటనే విజయకేతనం ఎగరవేశాం. గేలి చేసిన నోళ్లతోనే మాకు కూడా మీలాంటి నాయకులు ఉంటే బాగుంటుందనిపించాం. స్వరాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా నిలపడంలో ఏ ఒక్క అవకాశాన్ని కూడా కేసీఆర్ నాయకత్వంలో వదులుకోలేదు. ఉద్యమంలో తెలంగాణ ఎన్నారైలు పోషించిన పాత్ర అద్వితీయం. పుట్టిన గడ్డకు వేలాది మైళ్ల దూరంలో ఉన్నా ఏనాడూ బతుకమ్మ, బతుకునిచ్చిన తెలంగాణ తల్లిని మర్చిపోలేదు. అమెరికాలో మన విద్యార్థులకు వస్తున్న ఇబ్బందులను తొలగించేందుకు లీగల్ సెల్ ఏర్పాటు చేసి అండగా నిలబడతామని కేసీఆర్ దూతగా మీకు మాట ఇస్తున్నా.

ఎవరితోనూ పొత్తు ఉండదు



జాతీయ జెండాకు అభివాదం చేస్తున్న హరీశ్‌రావు, మధుసూదనాచారి, వినోద్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుంది అన్నట్లుగా ఎవరో మాట్లాడుతున్నారు. ఎన్నికలు ఏవైనా బీఆర్ఎస్ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదు. సొంతంగానే మనుగడ సాగిస్తూ.. ఒంటరిగానే పోటీ చేసి మళ్లీ అధికారంలోకి వస్తుంది. వంద అసెంబ్లీ సీట్లతో గులాబీ జెండా ఎగురుతుంది'అని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్న అనంతరం జరిగిన సమావేశంలో హరీశ్‌రావు ప్రసంగించారు. 'బీజేపీకి తెలంగాణ మీద మాట్లాడే హక్కు లేదు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంతో పాటు బనకచర్ల లింకు అక్రమ ప్రాజెక్టుకు నిధులు ఇస్తున్నది. బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణకు శాపం కాబోతున్నా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడటం లేదు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే గోదావరి జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. బనకచర్ల ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోకపోతే సుప్రీం కోర్టుకు వెళ్లి నిలుపుదల చేస్తాం. కృష్ణా నదిలో నీళ్లు ఆపకుండా, గురువు చంద్రబాబుకు దాసోహం అయిన సీఎం ఇప్పుడు గోదావరి నీళ్ల విషయంలోనూ అదే చేస్తున్నారు. బనకచర్లపై అసెంబ్లీలో చర్చ పెట్టినా, ఢిల్లీలో ధర్నా చేసినా కలసి వచ్చేందుకు సిద్ధం, బీఆర్ఎస్‌కు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం కాబట్టి ఏదైనా చేస్తాం'అని హరీశ్ అన్నారు.

ఆ ఫుటేజీ బయట పెట్టాలి..

'సీఎంకు దగ్గరగా ఉండే ఒక ఎంపీ, కార్పొరేషన్ చైర్మన్, ఐఏఎస్ అధికారి.. మిస్ ఇంగ్లండ్ పట్ల అనుచితంగా వ్యవహరించారనే వార్తలు వచ్చాయి. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే దీనికి సంబంధించిన వీడియో ఫుటేజీ బయట పెట్టి, వారిపై కేసులు నమోదు చేయాలి. తెలంగాణను కేసీఆర్ ప్రపంచ పటంలో నిలబెడితే, రేవంత్ తెలంగాణకు తలవంపులు తెచ్చారు'అని హరీశ్ ధ్వజమెత్తారు.

రేవంత్ పాలనలో ఆదాయం నేలచూపులు..

'రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందని దిక్కుమాలిన ప్రచారం చేసే వాళ్లు దివానా గాళ్లు. ఆరు గ్యారంటీల పేరిట హామీలు ఇచ్చి, తాను తీసుకున్న గోతిలో రేవంత్ తానే పడిపోయారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ఆదాయం ఆకాశం వైపు చూస్తే, రేవంత్ పాలనలో నేల వైపు చూస్తున్నది. ఎన్నడూ జై తెలంగాణ అనని రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ద్రోహి. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ధైర్యం రేవంత్‌కు లేదు'అని హరీశ్ విమర్శించారు.

దుర్మార్గుల చేతుల్లోకి తెలంగాణ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత నెలకొందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేసి గందరగోళానికి గురి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం దుర్మార్గుల చేతుల్లోకి వెళ్లిందని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆత్మ బలిదానాలు కలిచివేశాయని, ఓ దశలో మంత్రి పదవికి రాజీనామా చేయాలి అనుకున్నట్లు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు ప్రసంగించారు. మధుసూదనాచారి, హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అలాగే జయశంకర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. తర్వాత జాతీయ పతాకాన్ని మధుసూదనాచారి ఆవిష్కరించారు.

ఇదండీ సంగతి



నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- భూముల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్న తహసీల్దార్లు
- ప్రజలు కోరిన విధంగా భూభారతి చట్టం: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: భూభారతి చట్టం అమల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం కానున్నాయి. మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు అన్ని మండలాలు, గ్రామాల్లో ఈ సదస్సులు జరగను న్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ల నేతృత్వంలోని బృందాలు గ్రామాలకు వెళ్లి వ్యవసాయ భూముల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను మాన్యువల్‌గా స్వీకరించనున్నాయి. అనంతరం వాటిని పరిశీలించి పరిష్కరిస్తాయి. ఈ సదస్సులపై సోమవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కోరిన విధంగా రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చామని చెప్పారు. ఈ చట్టం పైలట్ ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో నాలుగు మండలాలు, ఆ తర్వాత మరో 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ఇప్పుడు ఆ మండలాలు కాకుండా మిగిలిన చోట్ల సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల వద్దకే రెవెన్యూ అనే నినాదంతో భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని వివరించారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా రైతులు తమ ప్రమేయం లేకుండానే సమస్యల్లో చిక్కుకున్నారని, ఆ సమస్యల పరిష్కారానికి ఎక్కడకు వెళ్లాలో, ఎవరిని సంప్రదించాలో కూడా అర్థమయ్యేది కాదని అన్నారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ప్రభుత్వంలో అధికారులే రైతుల వద్దకు వెళ్లి, రూపాయి ఫీజు లేకుండా దరఖాస్తులు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజలకు, ప్రభుత్వా నికి మధ్య రెవెన్యూ శాఖ వారధిగా ఉంటుందని తెలిపారు.



"చదవడం అనేది ఆలోచించడంతో సమానం.
తన మెదడుతో కాకుండా ఇంకొకరి మెదడుతో.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 3 జూన్ 2025

సంయమనం అవసరం

నెత్తురు చిందకుండా, నష్టం జరగకుండా యుద్ధం సాగుతుందనీ, ముగుస్తుందనీ ఎవరూ అనుకోరు. ప్రత్యర్థిని చిత్తు చేద్దామని ఇరుపక్షాలూ విశ్వప్రయత్నం చేస్తాయి. కానీ అనేక కారణాలవల్ల ఎవరో ఒకరినే విజయం వరిస్తుంది. ఇందులో సరైన అంచనాలకు రాలేకపోవటం దగ్గరనుంచి స్థానిక వాతావరణ స్థితిగతుల వరకూ చాలా వుంటాయి. ఈ సంగతి తెలిసి కూడా మన విపక్షాలు, ప్రత్యేకించి కాంగ్రెస్ మొన్నటి 'ఆపరేషన్ సిందూర్'లో మనకు కలిగిన నష్టాలగురించి వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాయి. యాదృచ్ఛికంగానే కావొచ్చుగానీ... మన రక్షణ దళాల చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ శనివారం సింగపూర్‌లో మాట్లాడుతూ మన దళాలు చేసిన కొన్ని 'వ్యూహాత్మక తప్పిదాల' కారణంగా జెట్ విమానాలు కోల్పోయామని చెప్పటం వివాదాస్పదమైంది. ఆ అంశాన్ని ప్రభుత్వ పెద్దలకు వదలటం లేదా వారితో చర్చించి ఎప్పుడు ఏ విధంగా చెప్పాలో సలహా తీసుకోవటం సరైన విధానం. విదేశీ గడ్డపై చెప్పటమైతే ఎంతమాత్రమూ సరికాదు. పైగా ఆయన సింగపూర్ వెళ్లింది ఏటా జరిగే అంతర్ ప్రభుత్వాల భద్రతా వ్యవహారాలపై నిర్వహించే 'షాంగ్రీ లా డైలాగ్' కోసం. అందులో పాకిస్తాన్ త్రివిధ దళాల చీఫ్ కూడా పాల్గొన్నారు. ఒకపక్క మన ఎంపీల అఖిలపక్ష బృందాలు పాకిస్తాన్ ఆగడాల గురించీ, వాటిని నిలువరించక తప్పని స్థితి గురించీ వివరించటానికి వేర్వేరు దేశాల్లో పర్యటిస్తున్నాయి. కనుక జనరల్ చౌహాన్ ప్రకటన ఏ రకంగా చూసినా సమయం, సందర్భం లేనిది. కొందరు మాజీ సైనికాధికారులూ, నిపుణులూ చెప్పినట్టు పాకిస్తాన్‌కు మన దళాలు కలిగించిన భారీ నష్టంతోపాటు దీన్నీ చెప్పివుంటే ఇంత వివాదమయ్యేది కాదేమో!

గత నెల 7 నుంచి పదో తేదీ వరకూ సాగించిన దాడుల్లో మన నష్టం ఏపాటో చెప్పాలని విపక్షాలు కోరుతున్నాయి. దాడి చేయటానికొచ్చిన రఫేల్ యుద్ధ విమానాలను కూల్చేశామని పాకిస్తాన్ ప్రభుత్వం చేసిన ప్రచారం ఆధారంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఈ డిమాండ్ మొదలుపెట్టారు. మన సైనిక దళాలు సాధిస్తున్న విజయాలను ఎన్డీయే ప్రభుత్వం తన సత్తాకు ప్రతీకగా చెప్పుకోవటాన్ని నిరోధించేందుకు విపక్షాలు ఈ ప్రయత్నం చేసివుండొచ్చు. కానీ ఎప్పుడు ఎక్కడ ఎలా దాడిచేయాలనే అంశాలను పూర్తిగా త్రివిధ దళాలకు అప్పగించాక వాటిపై అనుకూలంగా లేదా వ్యతిరేకంగా మాట్లాడటం ఎవరు చేసినా తప్పే. యుద్ధంలో తొలి క్షతగాత్ర సత్యమేనంటారు. ఎందుకంటే అవతలి పక్షాన్ని చావుదెబ్బ తీశామని, అనేకమంది శత్రు సైనికుల్ని హతమార్చామని, కీలక స్థావరాలు ధ్వంసం చేశామని ప్రభుత్వాలు చెప్పటం ప్రపంచంలో ఎక్కడైనా వున్నదే. యుద్ధం ముగిసిన కొన్నాళ్లకుగానీ వాస్తవ గణాంకాలు బయటకు రావు. మన విపక్షాలు అంతవరకూ ఆగలేకపోయాయి. పాక్ మీడియా వార్తల్ని విశ్వసించి మన ప్రభుత్వాన్ని నిలదీయటం మొదలుపెట్టాయి. ఇదంతా రాజకీయంగా బీజేపీకి లాభిస్తుందన్న ఆందోళనే దీనికి కారణం.

ఎప్పుడూ లేనివిధంగా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో సామాజిక మాధ్యమాల్లో, చానెళ్లలో మన సేనలు పాకిస్తాన్ నగరాలను నేలమట్టం చేయటం మొదలుకొని పలు విజయాలు సాధించినట్టు ప్రచారం సాగింది. ఇదెంత ముదిరిందంటే... ఒక దశలో మన ప్రభుత్వం ఖండించాల్సి వచ్చింది కూడా. మరోపక్క యుద్ధంవల్ల కలిగే అనర్థాల గురించి చెప్పిన మాజీ సైనికాధికారులనూ, వారి కుటుంబసభ్యులనూ దూషించటం, ఉగ్రవాదుల దుర్మార్గానికి భర్తను కోల్పోయిన యువతి ముస్లింలపై ద్వేషం వద్దని అన్నందుకు ఆమెను దుర్భాషలాడటం వంటి వైపరీత్యాలూ చోటుచేసుకున్నాయి. కొందరైతే దాడులు నిలిపేస్తున్నట్టు ప్రకటించిన మన విదేశాంగ శాఖ కార్యదర్శిపైనా, ఆయన కుటుంబసభ్యులపైనా నోరుపారేసుకున్నారు. యుద్ధకాలంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలనూ, సలహాలనూ పాటించటం తప్ప ఉన్మాదం ఆవహించినట్టు ఊగిపోవటం సరైంది కాదు. ఇందువల్ల మన జవాన్లకు వీసమెత్తు ఉపయోగం లేదు సరికదా... ప్రజల్లో తప్పుడు భావాలు వ్యాప్తి చెందే ప్రమాదం వుంటుంది. దాడులు ఎప్పుడు మొదలెట్టాలో, ఎప్పుడు ఆపాలో, ఏ దశలో ఏం చేయాలో నిర్ణయించటానికి ప్రభుత్వం ఉన్నప్పుడు గుంపులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించటం అనర్థదాయకం.

చౌహాన్ చెబుతున్న ప్రకారం నాలుగు రోజుల దాడుల్లో తొలి రెండు రోజులూ మనకు నష్టం వాటిల్లింది. వెంటనే లోపాలు గుర్తించి సరిచేసుకోవటం పర్యవసానంగా ఆ తర్వాత మన జెట్ విమానాలు శత్రు స్థావరాలను ధ్వంసం చేయగలిగాయని ఆయన అన్నారు. ఏ లోపమూ చోటుచేసుకోకుండా, ఏ నష్టమూ జరగకుండా మనం కోరుకున్న ప్రకారం అంతా జరిగిపోవాలనుకునేవారికి ఇది నిరాశ కలిగించవచ్చు. బీజేపీ అగ్ర నాయకులంతా ఈ విజయాలను తమ వ్యక్తిగత ఖాతాలో వేసుకోవటం కాంగ్రెస్ పార్టీకి కంటగింపు కావొచ్చు. కానీ దేశ రక్షణకు సంబంధించిన అంశాల్లో సంయమనం పాటించటం అందరి బాధ్యత. దాడులు ప్రారంభించటానికి ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించి వారి మద్దతు కోరిన ప్రభుత్వం ముగించటానికి ముందు కూడా ఆ పనే చేసివుంటే బాగుండేది. కనీసం మన దళాలు సాధించిన విజయాలు, మన నష్టాల గురించి ఈ నెల్లాళ్లలోనైనా అఖిలపక్షం నిర్వహిస్తే సమస్య తలెత్తేది కాదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఈ తరహా ఉదంతాలు ఇకపై పునరావృతం కాకూడదనుకుంటే కేంద్రం ఆ పని చేయాలి. అందులో అధికార, విపక్షాల వ్యవహారశైలి గురించీ, కొన్ని శక్తులనుంచి అతిగా వచ్చిన స్పందనల గురించీ తన వైఖరేమిటో చెప్పాలి. కష్టకాలంలో సంయమనం పాటించటం ఎంత ముఖ్యమో వివరించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయనం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.అష్టమి రా.12.36 వరకు, తదుపరి నవమి; **నక్షత్రం:** పుబ్బ రా.3.44 వరకు, తదుపరి ఉత్తర; **వర్జ్యం:** ప.10.55 నుండి 12.36 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8.06 నుండి 8.58 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.38 వరకు; **అమృత ఘడియలు:** రా.9.07 నుండి 10.50 వరకు

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.27
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

నదీ జలాలతో ఆటలాడవచ్చా?

విశ్లేషణ



కిసలయ భట్టాచార్జీ

పాల్ సెజాన్ (ఫ్రాన్స్) 1890లో ఓ పెయింటింగ్ వేశారు. దాని పేరు 'ఎట్ ద వాటర్'స్ ఎడ్జ్.' నీటిపై కాంతి ప్రతిఫలనాన్ని వినూత్న రీతిలో చూపెడుతూ చేసిన చిత్రమిది. దాన్ని గీసేందుకు రంగులను పొరలు పొరలుగా అద్దారు. అవి కరుగుతున్నట్టుగా ఉంటాయి. దీనికి ఈ టైటిల్ ఇవ్వడం వెనుక చిత్రకారుడి ఉద్దేశం ఏమిటో తెలియదు. కానీ, పహల్గామ్ ఊచకోత ఇండియా, పాకిస్తాన్ దేశాలను సింధూ నది నీటి అంచున నిలబెట్టింది.

టిబెట్ పర్వతాల మీద 18,000 అడుగుల ఎత్తున మానస సరోవరం వద్ద పుట్టిన సింధూ నది వేల సంవత్సరాలుగా ఎన్నో నాగరికతలకు ఆలవాలమైంది. ఇటీవలి సంవత్సరాల్లో నదుల గురించి, వాటి చరిత్రల గురించి చాలా రచనలు వెలువడుతున్నాయి. బ్రిటిష్ చరిత్రకారుడు, 'ద కాంక్వెస్ట్ ఆఫ్ నేచర్' రచయిత డేవిడ్ బ్లాక్‌బోర్న్ ఇలా అంటాడు: ''ప్రకృతిపై విజయం సాధించాలన్న మానవుడి తపన వెనుక అనేక ఊహలు ఇమిడి ఉంటాయి. మానవ, సాంకేతిక శక్తులతో ప్రకృతిని జయించాలని మనిషి అనుకుంటాడు. నదుల అస్తిత్వం పట్ల అతడి వైఖరి కూడా దీనికి ఒక కారణమవుతుంది''.



- పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టుగా ఇండియా ప్రకటించింది. జలప్రవాహాన్ని నిలిపివేయడం తెలివైన దౌత్యవ్యూహమే కావచ్చు. కానీ నదీప్రవాహంతో ఆటలాడితే దీర్ఘకాలంలో ప్రమాదం తప్పదు.
- నైలు నదీ స్వరూపాన్ని మార్చేయాలని గత 200 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నా అది సాధ్యపడలేదు. ఆస్వాన్ డామ్ కట్టడంతో నైలు నదీ డెల్టాను వేల సంవత్సరాలుగా సారవంతం చేసిన ఒండ్రుమట్టి ఆ ప్రాంతంలో మేట వేయడం నిలిచిపోయింది. అంతేకాదు, నత్తగుల్లల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధి శిస్టోమియాసిస్ ప్రబలడానికీ, మలేరియా వ్యాప్తికీ కారణమైంది.
- ఇండియా ప్రస్తుతం సింధూ నదిలోని 20 శాతం నీటినే వినియోగించుకోగలుగుతోంది. మరీ ఎక్కువగా నీరు నిల్వ చేస్తే వరద ముంపు ప్రమాదం ఎదురవుతుంది.

నైలు నదిని మార్చిన ఫలితం?

నదులకు వ్యక్తిత్వం ఉందీ అనుకున్నా, అవి ఏం ఆలోచిస్తాయో తెలియదు. అయితే, నదుల గురించి మనుషులు ఏ విధంగా ఆలోచిస్తారో మనకు తెలుసు. నీటి ప్రవాహాన్ని క్యూసెక్కులలో లెక్కగట్టి వాటి స్వరూపాన్ని నిర్ణయిస్తాం. అంతే కాకుండా, వాటిపై ఆధారపడి ఉండే వృక్ష జంతుజాలం, ఆ నదులను పెనవేసుకుని ఉండే ఆచార వ్యవహారాలు, కల్పిత గాథలు ఆధారంగా వాటి గొప్పతనాన్ని అంచనా వేస్తాం.

శత్రుదేశం మీద ప్రయోగించడానికి సింధూ నదిని ఒక అస్త్రంగా మార్చుకోవాలని ఇండియా భావిస్తోంది. నదులతో ఆడుకుంటే వాటి పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో తెలిసిన విషయమే. నైలు నదీ స్వరూపాన్ని మార్చేయాలని 200 సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నా అది సాధ్యపడలేదు. అస్వాన్ డామ్ కట్టడంతో నైలు నదీ డెల్టాను వేల సంవత్సరాలుగా సారవంతం చేసిన ఒండ్రుమట్టి ఆ ప్రాంతంలో మేట వేయడం నిలిచిపోయింది. అంతేకాదు, నత్తగుల్లల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధి శిస్టోమియాసిస్ ప్రబలడానికీ, మలేరియా వ్యాప్తికీ కారణమైంది.

నది మీద డ్యామ్ కడితే అది ఇక నదే కాదు. ''నీటిని అదుపులోకి తెచ్చుకోవడమంటే, జీవవైవిధ్యాన్ని నాశనం చేయడమే. హైడ్రలాజికల్ ప్రాజెక్టుల వల్ల అక్కడి మానవ ఆవాసాలు అంతరిస్తాయి. ఆ మానవ సమూహాల విలువైన పారంపరిక విజ్ఞానం శాశ్వతంగా కనుమరుగవుతుంది'' అని కూడా బ్లాక్‌బోర్న్ రాస్తాడు.

భారీ నీటిని నిల్వ చేయగలమా?

కశ్మీర్ 'పాకిస్తాన్ జీవనాడి' అంటూ, పహల్గామ్ ఊచకోతకు కొద్దిరోజుల ముందు, పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ రెచ్చగొట్టే ప్రకటన చేశాడు. వాస్తవానికి సింధూ నది ఈ రెండు దేశాలను యుద్ధం వైపు నడిపించే అవకాశం ఉన్నది! సైనిక ప్రతిచర్యలకు అదనంగా, ఇండియా 1960 నాటి సింధు నదీజలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది. ఇండియా, పాకిస్తాన్ ఉద్రిక్తతలు ఇన్నిసార్లు వచ్చినా ఇలా చేయడం ఇదే ప్రథమం. జల యుద్ధాలు సంభవించే ముప్పు ఉందంటూ కొన్ని దశాబ్దాలుగా భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదిప్పుడు పరీక్షా సమయం.

ఒప్పందం నిలిపివేయడంతోనే సింధూ జలాలు దిగువకు ప్రవహించకుండా ఆగిపోవు. ఒక్క చుక్క నీటిని కూడా వదలం అంటూ జలశక్తి మంత్రి హెచ్చరించడం పాక్‌ను బెదిరించే రాజకీయ ప్రకటన. సింధూ ప్రవాహాన్ని అకస్మాత్తుగా ఆపేయడం సాధ్యపడేది కాదన్నది మనకు తెలిసిన విషయమే. ''నెత్తురు నీరు కలసి ప్రవహించజాలవు'' అని 2016 కశ్మీర్ ఉగ్రదాడి అనంతరం ఇండియా హెచ్చరించింది. అయితే, ఇస్లామాబాద్‌కు మద్దతుగా చైనా రంగంలోకి దిగి త్సాంగ్పో (బ్రహ్మపుత్ర) ఉపనది ప్రవాహాన్ని అడ్డుకుందని వార్తలు వచ్చాయి.

ఇండియా ప్రస్తుత జలవిద్యుత్ ప్రాజెక్టులతో భారీ పరిమాణంలో నీటిని నిల్వ చేయలేదు. ఇండస్ వాటర్ ట్రీటీ (1960) అందుకు అంగీకరించదు కూడా. ఒప్పందాన్ని పునః సమీక్షించడం కోసం, స్టోరేజ్ సదుపాయాల ఏర్పాటు కోసం దౌత్యపరమైన ఒత్తిడి తెచ్చేందుకు రచించిన వ్యూహం ఇది. ఇండియా ప్రస్తుతం 20 శాతం నీటినే వినియోగించుకోగలుగుతోంది. మరీ ఎక్కువగా నీరు నిల్వ చేస్తే వరద ముంపు ప్రమాదం ఎదురవుతుంది.

దౌత్యవ్యూహంగా సరే!

ఇరు దేశాలూ తమ జల వివాదాలను పరిష్కరించుకోడానికి 2022 నుంచీ ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. మారుతున్న జనాభా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ ఒప్పందంపై పునః సమీక్ష జరగాలని 2023లో ఇండియా ప్రతిపాదించింది. నదీ ప్రవాహాన్ని మళ్లించడం అంటే వ్యయంతో కూడుకున్న పని. నీటి మళ్లింపు ఆర్థిక రీత్యా సాధ్యం కాకపోవచ్చు. చైనా సైతం త్సాంగ్పో నీటి మళ్లింపు విషయంలో ఈ కారణంతోనే సందిగ్ధంలో పడింది.

''సింధూ నదుల పరీవాహక ప్రాంతంలో ప్రత్యేకించి చీనాబ్ బేసిన్‌లో జలవాతావరణం భారీ మార్పులకు లోనవుతోంది. ఈ వాతావరణ మార్పుతో ఇప్పటికే మనం సమరం చేస్తున్నాం'' అని 'సౌత్ ఏషియా నెట్‌వర్క్ ఆన్ డామ్స్, రివర్స్ అండ్ పీపుల్' (ఎస్‌ఏఎన్‌డీఆర్‌పీ) సమన్వయకర్త పరిణీతా దాండేకర్ చెబుతున్నారు.

ఇండియాలోని సింధూ పరీవాహక ప్రాంతపు పశ్చిమ నదులపై ఎక్కడా లేనన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు చీనాబ్ బేసిన్లో ఉన్నాయి (హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, పంజాబ్‌లో కొంతభాగం చీనాబ్ పరీవాహక ప్రాంతం కిందకు వస్తాయి). తొందరపడి మరిన్ని రిజర్వాయర్లు, ఆనకట్టలు నిర్మించాలని నిర్ణయిస్తే ఇండియా, పాకిస్తాన్ దేశాలు రెండూ ప్రకృతి విపత్తుల బారిన పడే ప్రమాదం ఉంది.

ఎస్‌ఏఎన్‌డీఆర్‌పీ బృందం 2024లో చీనాబ్ నది ఆసాంతం పర్యటించి సమగ్ర నివేదిక రూపొందించింది. ఇప్పటికే భూకంపాలు, నిరంతర వాతావరణ విపత్తులు ఎదుర్కొంటున్న చీనాబ్ నదీ ప్రాంతం మరిన్ని భారీ ప్రాజెక్టులను తట్టుకోలేదు. అయినా సరే నిర్మిస్తే పెను ఉపద్రవం తప్పదని ఈ నివేదిక హెచ్చరించింది. వీటి వల్ల ఉత్పన్నమయ్యే జీవావరణ, భూగర్భ సంబంధిత దుష్పరిణామాలను సరిదిద్దడానికి వీలు కూడా కాదు. నదీజలాల మళ్లింపు వల్ల ఆ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఇక్కట్ల పాలవుతారు. లక్షల మంది నిర్వాసితులు అవుతారు. జలప్రవాహాన్ని నిలిపివేయడం తెలివైన దౌత్యవ్యూహమే కావచ్చు. కానీ నదీప్రవాహంతో ఆటలాడితే దీర్ఘకాలంలో ప్రమాదం తప్పదు.

వ్యాసకర్త జిందాల్ స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ డీన్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ఏ ఇమేజ్ ముఖ్యం?



పాకిస్తాన్‌తో డ్రోన్లు, క్షిపణుల వినిమయం తర్వాత ప్రపంచానికి చెప్పడానికి ఇండియా దగ్గర మంచి కథ ఉండింది. మరి సైన్యంలోని ఉన్నతాధికారులు ఆ కథను ఎందుకు చెప్పలేదు? ఎందుకంటే, విమానాలు(రఫేల్) నష్టపోవడం అనేది ప్రధాని ఇమేజ్‌కు భంగకరం. ఇండియా ఇమేజ్ కంటే ఆయన ఇమేజ్ ముఖ్యమైపోయింది. విషాదం, కానీ నిజం.

– ఎం.కె.వేణు, సంపాదకుడు

అసలు బలం



జనాలు మనల్ని నిరాశపరిచినా మర్యాదగా, నిజాయితీగా, తొణక్కుండా ఉండగలగడమే సూపర్ పవర్.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

మొదలైంది అప్పుడే!



ఇది (ఉక్రెయిన్ దాడి) కచ్చితంగా రష్యాకు 'పెరల్ హార్బర్' క్షణం కాదు(1941లో యూఎస్ మీద జపాన్ దాడిని సూచిస్తూ). ఏ ప్రమాణాల్లో చూసినా రష్యా దురాక్రమణదారే. 2022 ఫిబ్రవరి 24 నిజానికి యూరప్ శక్తులన్నీ దానికి అనుగుణంగా నడుచుకోవాల్సిన పెరల్ హార్బర్ క్షణం(ఉక్రెయిన్ మీద రష్యా దాడి మొదలైన రోజు). ఇప్పటికీ ఆశలేమీ అడుగంటిపోలేదు.

– వెలీనా త్చకరోవా, జియోపొలిటికల్ స్ట్రాటజిస్ట్

చెప్పకోవడానికేనా?



దశాబ్దాలుగా ఏ విధమైన మినహాయింపు లేకుండా ప్రతి ఏడాదీ ఈశాన్య భారత రాష్ట్రాలది వరదలు, విపత్తుల కథే. జీడీపీ అనేది మన సాటి పౌరుల ప్రాథమిక అవసరాలను తీర్చలేకపోతే, ఇంక ఆ సంఖ్యల్లో మనం గర్వపడాల్సింది ఏముంటుంది?

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

ప్రయాణంలో పుస్తకం



రైలు ప్రయాణంలో పుస్తకం చదువుతూ భిన్న ప్రపంచంలోకి ఆరోగ్యంగా తప్పించుకోవడం అనేది మరిచిపోయిన విలాసం.

– హెంద్ అల్ ఖసీమీ, యూఏఈ యువరాణి

వైరాగ్యమే ఉత్సాహం



మూలంతో అనుసంధానం అయివున్నప్పుడు ఉత్సాహం అనేది సహజం, దానికి దారం కావడం ఉదాసీనత. వైరాగ్యం అనేది ఉదాసీనత కాదు– అది విశాల దృక్పథం, మూలానికి తిరిగి వెళ్లడం. ఉత్సాహం, వైరాగ్యం అనేవి వ్యతిరేకంగా కనబడినా అవి రెండూ పరస్పర పూరకాలు.

– శ్రీశ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక బోధకుడు

పులుల నేస్తం



వాల్మీక్ థాపర్‌కు కడపటి సెలవు. ఆయన అన్ని భారతీయ పులుల రక్షక సాధువు. చిన్న పరిధికి పరిమితం కాకుండా పులులు దేశంలో వర్ధిల్లుతున్నాయంటే అది ఆయన కృషి వల్లే. ఓం శాంతి.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

సైకిల్ ఓ ఆరోగ్య సాధనం

నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లో అందరికీ అందుబాటులో ఉన్న అత్యంత చౌకైన వాహనం సైకిల్. ఒకప్పుడు సైకిల్ ఉందంటే ధనిక కుటుంబంగా భావించే పరిస్థితి. పల్లెటూరు నుంచి పట్టణాలకు వెళ్ళాలన్నా, సినిమాలకు వెళ్ళాలన్నా సైకిల్‌నే వాడేవారు. కొత్తగా పెళ్లయిన జంటలు, అక్కా చెల్లెళ్ళు, అన్నాదమ్ములు, స్నేహితులు ఇలా ఎంతోమంది సరదాగా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్ళాలంటే సైకిలే ఆధునిక ప్రయాణ సాధనం. అటువంటి సైకిల్ కొంతకాలంగా తన ప్రభావాన్నీ, ప్రాధాన్యాన్నీ కోల్పోతోంది. మోటార్ సైకిళ్ళు, కార్లు వంటి వాహనాలు సైకిళ్ల స్థానాన్ని ఆక్రమించాయి. అయితే నార్డిక్ దేశాల్లో నేటికీ రవాణా సాధనంగా సైకిల్‌కి అత్యంత ప్రాధాన్యం ఉండటం గమనార్హం.



మోటారు వాహనాల వాడకం కాలుష్య కారకం కాబట్టి సైకిల్‌ను వాడాలని స్వీడన్ ప్రజల్లో చైతన్యం తెచ్చింది. అలాగే ప్రతి సంవత్సరం జూన్ 3వ తేదీన 'అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం' జరిపే విధంగా ఐక్యరాజ్య సమితిపై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా 2018 నుంచి ఈ దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఈ ఏడాది 'సైకిల్ ద్వారా ఆరోగ్యం, సమానత్వం, స్థిరత్వాన్ని ప్రోత్సహించడం' అనే థీమ్‌ను ఎన్నుకున్నారు. నేడు సైకిల్ వాడకంలో ప్రపంచంలోనే ముందున్న దేశం 'నెదర్లాండ్స్'. సైకిల్ తొక్కడం ఓ మంచి వ్యాయామం. కనీస శారీరక శ్రమ లేకపోవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎందరో వివిధ రకాల రోగాల బారిన పడుతున్నారు. చిన్న చిన్న దూరాలకు కూడా మోటార్ సైకిళ్ళు, కార్లు వినియోగించడం సరికాదు. నడవడమో లేక సైకిల్‌పై వెళ్లిరావడమో అలవాటు చేసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో 'సైకిల్ ట్రాక్'లు ఏర్పాటు చేయాలి. 'సైక్లింగ్' ఒక ఫ్యాషన్‌గా మారాలి. ఊబకాయం, డయాబెటీస్ వంటి సమస్యలు పరిష్కారానికీ; ఊపిరితిత్తుల ఆరోగ్యానికీ, మంచి నిద్రకీ, అధిక రక్తపోటు నియంత్రణకూ సైకిల్ తొక్కడం మంచి తరుణోపాయం.

– ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయుడు, కాకినాడ.
(నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం)

ఇది సఫ(బ)ల తెలంగాణ

అభిప్రాయం



ఇందిరా శోభన్

మన ఉపనిషత్తులు, శాస్త్రాలు... స్త్రీని సాధికారత కలిగిన స్వరూపంగా పేర్కొన్నాయి. అలాంటి మహిళకు తెలంగాణ వచ్చాక ఎలాంటి ఆదరణ లభించలేదు. సంక్షేమ పథకాల నుంచి మొదలుకొని కేబినెట్ బెర్త్‌ల దాకా అడుగడుగునా అన్యాయమే. కానీ 2023 డిసెంబర్ 7న గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు స్త్రీ సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నది. ఆడబిడ్డల మోములపై నవ్వులు చిందుతుండగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించింది.

2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఇక తమ ఆకాంక్షలన్నీ నెరవేరుతాయనుకున్న యువత, ముఖ్యంగా మహిళల ఆశలు అడియాసలే అయ్యాయి. బీఆర్ఎస్ మొదటి కేబినెట్‌లో ఒక్క మహిళను కూడా తీసుకోకుండా అతివలను అతి ఘోరంగా అవమానించింది. ఇతర పదవులూ ఇవ్వలేదు. కానీ... కాంగ్రెస్ సర్కారు మహిళలకు పెద్దపీట వేసింది. కేబినెట్‌లోకి ఆదివాసీ బిడ్డ ధనసరి సీతక్కను, బీసీ బిడ్డ కొండా సురేఖను తీసుకున్నది. అలాగే, 'తెలంగాణ స్టేట్ ఉమెన్స్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్', 'తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్'ల చైర్మన్లుగా, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలిగా అతివలకు అవకాశం కల్పించింది.



తెలంగాణలోని మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చి తెలంగాణ కాంగ్రెస్ సర్కారు అతివల ఇంటి కష్టాలను తీర్చుతున్నది. స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం విద్యార్థులు, పోలీసుల యూనిఫామ్ కుట్టే పనిని అప్పగించింది. దీంతో మహిళలకు స్థిరమైన ఆదాయం వస్తున్నది.

అలాగే మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందిస్తున్నది. దీంతోపాటు 'రాజీవ్ యువ వికాసం' ద్వారా రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల దాకా స్వయం ఉపాధికి సాయం అందజేస్తున్నది. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు, ప్రభుత్వం 1000 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను మహిళల స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేయిస్తున్నది. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా తిరగడమే కాదు... ఆ బస్సులకు వారినే ఓనర్లను చేసే మరో మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళల స్వయం సహాయక సంఘాల ద్వారా 150 ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇప్పించింది. మరో 450 బస్సులను కూడా అద్దెకు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. మహిళలు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు శిల్పారామంలో డ్వాక్రా బజార్‌లు ఏర్పాటు చేసింది. ఈ బజార్‌లు స్వయం సహాయక సంఘాల ద్వారా ఉత్పత్తి అయిన వస్తువులకు మార్కెట్‌ను అందిస్తాయి. దీనివల్ల మహిళల ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతున్నది. అలాగే, మహిళల స్వయం సహాయక సంఘాల ద్వారా 196 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు' ఏర్పాటు చేసింది. ఈ క్యాంటీన్లు మహిళలకు స్వయం ఉపాధిని అందిస్తున్నాయి. మహిళలంతా ఒకేచోట చేరి తమ పురోగతికి ప్రణాళికలు రచించుకునేలా 22 'ఇందిరా మహిళా శక్తి' భవనాలను నిర్మించింది. ఇవి మహిళలకు కార్యాలయాలుగా, వ్యాపార కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. మహిళలకు 'మీ సేవా' కేంద్రాలను అప్పగించి, వారికి ఉపాధి కల్పిస్తున్నది. డైరీ సహకార రంగంలో 40 వేల మంది మహిళలకు శిక్షణ ఇప్పించింది. మహిళలకు రూ. 10 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, ఆర్థిక భద్రతకు భరోసానిస్తున్నది.

ఇలా నేటి ప్రభుత్వం మహిళా సాధికారతకు పాటుపడటంతో పాటు ఆర్థికంగా ఆగమైపోయిన రాష్ట్రాన్ని అత్యంత క్రమశిక్షణతో ఒక్కో పువ్వేసి బతుకమ్మను పేర్చినట్టు పునర్నిర్మిస్తున్నది.

కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు

ఉండాల్సిన నమ్మకం

భగవంతుడు సర్వాంతర్యామి అనేది భారతీయుల విశ్వాసం. అందుకే భారతీయులకు నదీనదాలూ, కొండలూ, గుట్టలూ, జంతువులూ, పక్షులూ... ఒకటేమిటి– అన్నీ పూజనీయాలే. పండుగలూ పబ్బాలలో ప్రకృతితో మమేకమై తన్మయత్వంతో పూజలు చేయడం అందుకే! అయితే వివిధ రూపాల్లో ఉన్న దేవుని గుర్తించడంలో మాత్రం చాలా మంది విఫలమవుతూ ఉంటారు. ఇందుకు దైవాన్ని గుర్తించగలిగిన జ్ఞానం వారికి లేకపోవడమే కారణం. దేవుణ్ణి దర్శించుకోవడానికి గుడి లోపలికి చాలా భక్తిప్రపత్తులతో వెళతారు. కానీ గుడి మెట్లపై కూర్చునే యాచకులు, దీనులను చాలామంది పట్టించుకోరు. వారితోనే నిజంగా దేవుడు కూర్చున్నా గుర్తించలేరు. అయితే భగవంతుని గుర్తించడానికి శోధన అవసరం.

అన్వేషించే కొద్దీ భగవంతుణ్ణి ఏదో ఒకరోజు తెలుసుకోవచ్చు. ఆరాధనా పద్ధతులతోపాటు అన్వేషణా జ్ఞానాన్నీ సముపార్జించాలి. ఆ జ్ఞానం లేకపోతే ఆ నారాయణుడే మన ముందుకొచ్చి నిల్చున్నా తెలుసుకోలేం. పైపెచ్చు అనుమానిస్తాం. అతను నిజంగా నారాయణుడేనా అని ఆలోచనలో పడతాం. నారాయణుడేదో మన అవసరాలను తీర్చడానికొస్తే ఎదురు మనమే అవీ ఇవీ అడిగి అనుమానిస్తాం. అప్పుడు 'నేను సాక్షాత్తూ ఆ నారాయణుడినే నయ్యా' అని భగవంతుడు చెప్పినా సరే... మన మనసు ఒప్పుకోవడానికి ససేమిరా అంటుంది. 'అదేంటీ, నాకంత సులభంగా పరమాత్మ ప్రత్యక్షమవుతాడా' అని సందేహిస్తాం. ఇటువంటి స్థితిలోనైనా మనకు ప్రహ్లాదుడి మాట గుర్తుకు రావాలిగా... ఆ హరి నారాయణుడు లేని చోటేది? అతను సర్వాంతర్యామి అనేది తెలిసుండాలిగా! అలాకాక 'నీకు శంఖం, చక్రం లేవేమిటీ? నీ వాహనమైన గరుత్మంతుడేడీ?' అని ప్రశ్నిస్తే ఆ నారాయణుడిని ఎలా చూడగలం?

మనకు మన మీదే అపనమ్మకం. అటువంటప్పుడు సాక్షాత్తూ ఆ వైకుంఠవాసుడైనా ఏమీ చేయలేడు. కనుక మనకు ఉండాల్సింది నమ్మకం. అన్నింట్లోనూ ఆ భగవంతుడు ఉంటాడనేది తెలియాలి.

– యామిజాల జగదీశ్

రాజముద్రకు అవమానం


రాజముద్రకు తాడు చుట్టి ఉన్న దృశ్యం

మేడిపల్లి (వేములవాడ): రాజముద్రకు తాడుతో ఉరేసినట్లు అవమానించిన ఘటన జగిత్యాల జిల్లా భీమారం మండలం కమ్మరిపేటలో సోమవారం జరిగింది. తెలంగాణ అవతరణ వేడుకల్లో భాగంగా కమ్మరిపేట గ్రామపంచాయతీలో సిబ్బంది జెండా ఆవిష్కరించి ఇలా తాడుతో రాజముద్రకు ఉరేసినట్లు చుట్టడం మండలవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సిబ్బంది తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

17 మందిపై క్రిమినల్ చర్యలు తీసుకోండి

'మేడిగడ్డ'పై ప్రభుత్వానికి తెలంగాణ విజిలెన్స్ కమిషన్ సిఫారసు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై వచ్చిన ఆరోపణలపై తెలంగాణ విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి కీలక సిఫారసులు చేసింది. ఈ ప్రాజెక్టులో పనిచేసిన 17 మంది సీనియర్ ఇంజనీర్లపై, నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ–పీఈఎస్ (జేవీ)పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సూచించింది. మరో 33 మంది ఇంజనీర్లపై జరిమానా విధించడంతో పాటు శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములైన ఏడుగురు రిటైర్డ్ ఇంజనీర్లపైనా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. దీనికి సంబంధించి పోలీసు కేసులు పెండింగ్‌లో ఉన్నా, ఏ ఇతర విచారణ అంశాలు పెండింగ్‌లో ఉన్నా..సంబంధిత శాఖ క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి ఎలాంటి అడ్డంకి కాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కమిషన్ తన నివేదికలో ఉటంకించింది. ప్రాజెక్టు డిజైన్లనూ తప్పుబట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుకు కారణాలపై దర్యాప్తు జరిపి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ఇచ్చిన నివేదిక మేరకు విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్ ఈ ఏడాది మార్చి 18న ప్రభుత్వానికి మొత్తం పది సిఫారసులతో నివేదిక సమర్పించారు. ఈ నివేదిక తాజాగా సోమవారం వెలుగులోకి వచ్చింది. మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం విచారణ కమిషన్ ఎదుట హాజరుకానున్న నేపథ్యంలో విజిలెన్స్ కమిషన్ నివేదిక బహిర్గతం కావడం గమనార్హం.

డిజైన్లలో లోపాలు.. పగుళ్లు వచ్చినా పట్టించుకోలేదు

మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్లలో లోపాలు ఉన్నాయని కమిషన్ పేర్కొంది. 2023 అక్టోబర్‌లోనే ప్రాజెక్టుకు పగుళ్లు వచ్చినా అధికారులు తనిఖీలు చేపట్టడం కానీ, దిద్దుబాటు చర్యలు తీసుకోవడం కానీ చేయలేదని ఆక్షేపించింది. నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి..

- నిర్మాణ సంస్థ కాంట్రాక్టు ఆబ్లిగేషన్స్ అన్నింటినీ పూర్తి చేయకుండానే పూర్తి చేసినట్టు సర్టిఫికెట్ తీసుకుంది. అదనపు ఒప్పందానికి సంబంధించిన రూ.4,613 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.
- మేడిగడ్డలోని బ్లాక్ 7 పునః నిర్మాణానికి అయ్యే వ్యయం మొత్తం కాంట్రాక్టు సంస్థ నుంచే వసూలు చేయాలి. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి సరైన విధానాన్ని అమలు చేయలేదు.



- 2015లో ప్రాజెక్టు రీ డిజైనింగ్ చేసిన సమయంలో అందుకు సంబంధించి మెరిట్స్ పరిగణనలోకి తీసుకోకుండా గుడ్డిగా ప్రతిపాదనలు అమోదించిన అప్పటి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శులు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులపై కూడా చర్యలు తీసుకోవాలి. చర్యలు తీసుకునే క్రమంలో ఆ శాఖను సంప్రదించాలి.
- ఒప్పందం ప్రకారం..కఠినంగా అమలు చేయాల్సిన అంశాలను చేయలేదు.
- సాధారణ ఒప్పందం నిబంధనల ప్రకారం.. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా డీవాటరింగ్ చేయాలన్న అంశాన్ని విస్మరించారు.
- స్టేట్ లెవెల్ స్టాండింగ్ కమిటీ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా సమగ్ర మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉన్నా..ఆ బాధ్యతను సీఈ ప్రాజెక్టుపైనే వదిలేసింది.
- ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేసిన ఉత్తర్వులు, మెమోలు, సర్క్యులర్లను చీఫ్ ఇంజనీర్ ఉల్లంఘించారు.

17 మంది వీరే..

క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించిన 17 మంది సీనియర్ ఇంజనీర్లలో.. చీటి మురళీధర్ (ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్) రిటైర్డ్), భూపతిరాజు నాగేంద్రరావు (ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్), తొడుపునూరి శ్రీనివాస్ (చీఫ్ ఇంజనీర్, ఇరిగేషన్ ఆదిలాబాద్ (గతంలో చీఫ్ ఇంజనీర్ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్‌గా పనిచేశారు), వి.ఫణిభూషణ్ శర్మ (డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్), మహ్మద్ అజ్మల్ ఖాన్ (డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్) కార్యాలయం), ఎన్.వెంకటేశ్వర్లు (ఇంజనీర్ ఇన్ చీఫ్ (రిటైర్డ్) కాళేశ్వరం ప్రాజెక్టు), కొట్టే సుధాకర్‌రెడ్డి (చీఫ్ ఇంజనీర్ (ఇరిగేషన్), జగిత్యాల, ఎఫ్ఏసీ రామగుండం), బి.వెంకట రమణారెడ్డి (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్–1, మహదేవ్‌పూర్ (ప్రస్తుతం చీఫ్ ఇంజనీర్ మహబూబ్‌నగర్), సర్దార్ ఓంకార్ సింగ్ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్ డివిజన్ నంబర్–3, రామగుండం) సీహెచ్ తిరుపతి రావు (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ డివిజన్ నంబర్–1, మహదేవ్‌పూర్), బి.వెంకటేశ్వర్లు (చీఫ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ అండ్ ఇన్‌స్పెక్షన్ (రిటైర్డ్)), వి. అజయ్ కుమార్ (చీఫ్ ఇంజనీర్ (రిటైర్డ్), ఇరిగేషన్ సంగారెడ్డి), పీఏ వెంకట కృష్ణ (చీఫ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్), ఎం రఘురామ్ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ అండ్ ఇన్‌స్పెక్షన్ డివిజన్ నంబర్ –9), ఎ.నరేందర్‌రెడ్డి (ఇంజనీర్ ఇన్ చీఫ్ (రిటైర్డ్) సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్), కేఎస్ఎస్ చంద్రశేఖర్ (సూపరింటెండెంట్ ఇంజనీర్, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్), హెచ్.బస్వరాజ్ (సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, సిద్దిపేట)

వీరిపై క్రమశిక్షణ చర్యలు, జరిమానా..

భూపతిరాజు నాగేంద్రరావు (ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్), తొడుపునూరి శ్రీనివాస్ (చీఫ్ ఇంజనీర్ సెంట్రల్ డిజైన్స్), ఫణిభూషణ్ శర్మ (డైరెక్టర్ ఆఫ్ వర్క్ అండ్ అకౌంట్స్), మహ్మద్ అజ్మల్‌ఖాన్ (డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, ఈఎన్‌సీ (జనరల్) ఆఫీస్), కొట్టే సుధాకర్‌రెడ్డి (చీఫ్ ఇంజనీర్, జగిత్యాల అండ్ రామగుండం), సూదగోని సత్యనారాయణ (డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్, కాళేశ్వరం ప్రాజెక్టు), బి.వెంకటరమణారెడ్డి (ఎస్ఈ రామగుండం (ప్రస్తుతం చీఫ్ ఇంజనీర్ మహబూబ్‌నగర్), సర్దార్ ఓంకార్ సింగ్ (ఈఈ రామగుండం), సీహెచ్ తిరుపతిరావు (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కాళేశ్వరం), బానోతు నంద (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మహదేవ్‌పూర్), అజ్మీరా సురేశ్‌కుమార్ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబటిపల్లి), ఎల్.భీమరాజు (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబటిపల్లి), వలీషేక్ (ఏఈఈ, అంబటిపల్లి), బోగే శ్రీనివాస్ (ఏఈఈ, అంబటిపల్లి), అంకిలీయ రవికాంత్ (ఏఈఈ, అంబటిపల్లి), ఆర్.విజయ్ (ఏఈఈ, కాళేశ్వరం), జి.గంగాధర్ (ఏఈఈ, అంబటిపల్లి), జి.సాయిచరణ్ (ఏఈఈ, మేడిగడ్డ బరాజ్), ఎం.ప్రసాద్ (ఏఈఈ, అంబటిపల్లి), మేరుగ రాజు (ఏఈఈ, మహదేవ్‌పూర్), బి.గణేశ్ (ఏఈఈ, అంబటిపల్లి), మహ్మద్ ఇస్మాయిల్ సాజిద్ (డీఏఓ, పెద్దపల్లి), పీఏ వెంకటకృష్ణ (చీఫ్ ఇంజనీర్ క్వాలిటీ కంట్రోల్), కె.దేవేందర్‌రెడ్డి (ఎస్ఈ క్వాలిటీ కంట్రోల్ వరంగల్), ఎం.రఘురామ్ (ఈఈ, క్వాలిటీ కంట్రోల్), బి.కిరణ్‌కుమార్ (డిప్యూటీ ఈఈ క్వాలిటీ కంట్రోల్), ఎ.కృష్ణమోహన్ (ఏఈఈ, ఈఎన్‌సీ అడ్మిన్‌లో లీగల్ అండ్ ఈ గవర్నెన్స్), జి.కృష్ణారెడ్డి (ఏఈఈ, కాటారం), ఇ.సుకుమార్ (ఏఈఈ, క్వాలిటీ కంట్రోల్ మహదేవ్‌పూర్), పి.శ్రవణ్‌కుమార్ (ఏఈఈ, క్వాలిటీ కంట్రోల్ మహదేవ్‌పూర్), కేఎస్ఎస్ చంద్రశేఖర్ (ఎస్ఈ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్), హెచ్.బస్వరాజ్ (ఎస్ఈ, ఇరిగేషన్, సిద్దిపేట), తౌతం హేమలత (డీఈఈ, ఆఫీస్ ఆఫ్ సీఈసీడీఓ).

రిటైర్డ్ అధికారులు వీరే..

చీటి మురళీధర్ (ఈఎన్‌సీ (జనరల్), నల్లా వెంకటేశ్వర్లు (ఈఎన్‌సీ (కాళేశ్వరం ప్రాజెక్టు), గజ్జల హరిహరాచారి (డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (సీఈ, కాళేశ్వరం ప్రాజెక్టు), డి.వెంకటేశ్వర్లు (చీఫ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్), చాట్ల గంగాధర్ (ఎస్ఈ, హైదరాబాద్ లేక్స్ అండ్ వాటర్‌బాడీస్), వి.అజయ్‌కుమార్ (చీఫ్ ఇంజనీర్, సంగారెడ్డి), ఎ.నరేందర్‌రెడ్డి (ఇంజనీర్ ఇన్ చీఫ్, సీడీఓ).

ఈ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి

ఇంజనీర్లు, అధికారులపై ఐపీసీ సెక్షన్లు 120 (బి), 336, 409, 418, 423, 426తో పాటు అవినీతి నిరోధక చట్టంలోని తగిన సెక్షన్ల కింద, డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021, పీడీపీపీ యాక్ట్,1984 కింద కేసులు నమోదు చేయాలని కమిషన్ సూచించింది.

మన స్నేహం సుదీర్ఘంగా ఉండాలి

- జపాన్ ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి
- తమ విద్యార్థులకు జపనీస్ నేర్పాలన్న ముఖ్యమంత్రి
- జపాన్ నగరం కితాక్యూషు, తెలంగాణ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలతో సీఎం రేవంత్ రెడ్డి, కితాక్యూషు నగర మేయర్ కజుహిసా టకేచి

సాక్షి, హైదరాబాద్: జపాన్‌లోని కితాక్యూషు నగర అభివృద్ధి తెలంగాణ రైజింగ్ నినాదానికి సరితూగేలా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కితాక్యూషు, తెలంగాణ రాష్ట్రాల మధ్య స్నేహం సుదీర్ఘంగా, అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. సోమవారం ఐటీసీ కాకతీయ హోటల్‌లో కితాక్యూషు, తెలంగాణ రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం కోసం ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. తెలంగాణ అవతరణ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన జపాన్ బృందానికి స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. తెలంగాణ భవిష్యత్తు కోసం కొత్త ప్రపంచ భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడం ద్వారా రాష్ట్ర పురోగతిని మరింత ముందుకు తీసుకెళుతున్నామని, ఈ క్రమంలో కితాక్యూషు నగరంతో తెలంగాణ ఒప్పందం చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.

ఎకో టౌన్ మోడల్‌తో ప్రేరణ

ఈ ఏడాది ఏప్రిల్‌లో జపాన్ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడి అభివృద్ధిని తాను చూశానని, కితాక్యూషు నగరం ఎకో టౌన్ మోడల్‌తో చాలా ప్రేరణ పొందానని సీఎం చెప్పారు. ఆ స్ఫూర్తితోనే తెలంగాణలో ఎకో మోడల్ అభివృద్ధి చేయడం కోసం జపాన్ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ, శూన్య ఉద్గారాలు, పట్టణ ఆవిష్కరణలకు ఈ ఒప్పందం పునాది కానుందని చెప్పారు. తెలంగాణ యువతలో నైపుణ్యాభివృద్ధి తమ ప్రథమ ప్రాధాన్యత అని అన్నారు. తెలంగాణ విద్యార్థులు జపనీస్ భాష నేర్చుకోవాలనుకుంటున్నారని, కితాక్యూషు సహకారంతో వారికి జపనీస్ నేర్పించి ప్రపంచ అవకాశాలు పొందేలా చూడాలని కోరారు. హైదరాబాద్, కితాక్యూషు నగరాల మధ్య విమాన కనెక్టివిటీ కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కితాక్యూషు నగర మేయర్ కజుహిసా టకేచితో పాటు జపాన్ బృంద సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేవంత్‌కు కూడా కేసీఆర్ గతే..

- పవన్‌కల్యాణ్‌ను జైల్లో పెట్టాలి: కె.నారాయణ



హుడాకాంప్లెక్స్: ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలను అమలు చేయకపోతే కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి కూడా పడుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సోమవారం సరూర్‌నగర్‌లో జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. గడిచిన పదేళ్లలో కేసీఆర్ కుటుంబం మాత్రమే లబ్ధి పొందిందని ఆరోపించారు. సనాతన ధర్మం గురించి ఏమీ తెలియని వ్యక్తి పవన్‌కల్యాణ్ అని.., ఇప్పుడు ఆయన సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని నారాయణ ఎద్దేవా చేశారు. సనాతన ధర్మంలో విడాకులు ఉండవని, ముగ్గురు భార్యలను మార్చిన పవన్ కల్యాణ్‌ను ముందుగా అరెస్ట్ చేసి, జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు.

80 ఎకరాల్లో ఎకో టౌన్: మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా జపాన్‌లోని కితాక్యూషూ సిటీ స్ఫూర్తితో రాష్ట్రంలో 80 ఎకరాల్లో ఎకో టౌన్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. తెలంగాణ, కితాక్యూషూ నగరం మధ్య కుదిరిన పరస్పర సహకార ఒప్పందం ఇందుకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని టీ–హబ్‌లో 'ఫ్రం కితాక్యూషూ టు తెలంగాణ: కేటలైజింగ్ సస్టెయినబుల్ ఇండస్ట్రియల్ గ్రోత్'అంశంపై రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ సోమవారం సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సులో శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్–2047 అనే లక్ష్యంతో అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కితాక్యూషూ నగరంతో కలిసి పనిచేస్తాం..

రాబోయే రోజుల్లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, సర్క్యులర్ ఎకానమీ, క్లీన్ టెక్నాలజీస్, డిజిటల్ ఇన్నోవేషన్ తదితర అంశాల్లో కితాక్యూషూ నగరంతో కలిసి పనిచేస్తామని శ్రీధర్‌బాబు తెలిపారు. కితాక్యూషూ, హైదరాబాద్ మధ్య విమాన సర్వీసులను నడిపేందుకుగల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తామన్నారు. ఎమ్మెల్యే లక్ష్మణ్, కితాక్యూషూ మేయర్ కజుహిసా టకేచి, టీజీఐఐసీ ఎండీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ డైరెక్టర్ అవినాష్, సీఐఐ తెలంగాణ చైర్మన్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆగని కోడెల మృత్యుఘోష

- సోమవారం మరో మూడు మృతి


రాజన్న గోశాలలో అనారోగ్యంగా ఉన్న కోడెలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ అర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న తిప్పాపూర్ గోశాలలో కోడెల మృత్యుఘోష కొనసాగుతోంది. అనారోగ్యంతో మరో మూడు కోడెలు సోమవారం మృతి చెందాయి. ఆరు కోడెల పరిస్థితి విషమంగా ఉందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. అకాల వర్షాలతో అనారోగ్యంతో గోశాలలో మొదటిరోజు ఎనిమిది కోడెలు మృతి చెందాయి. ఐదుగురు వెటర్నరీ డాక్టర్లతో కూడిన 12 మంది వైద్యబృందం గోశాలలోని పశువులను పరిశీలించింది. రెండోరోజు మరో ఐదు, మూడోరోజు నాలుగు, సోమవారం మూడు కోడెలు.. మొత్తం 20 కోడెలు మృతి చెందాయని పశుసంవర్ధక అధికారి వెల్లడించారు. అనారోగ్యం పాలైన 20 కోడెలకు ప్రత్యేకంగా చికిత్స అందించి, 16 కోడెలను రక్షించామన్నారు. మొత్తం 1,300 కోడెల్లో 16 అనారోగ్యంతో బాధపడుతున్నాయని, ఆరు కోడెల పరిస్థితి తీవ్ర విషమంగా ఉందన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా గోశాలను సందర్శించి, పరిస్థితిపై ఆరా తీశారు. అనారోగ్యంతో ఉన్న కోడెలకు చికిత్స అందించాలని సూచించారు.

గో సంరక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

- గోరక్షకులు, గోసంఘాల నేతల డిమాండ్


ధర్నాలో మాట్లాడుతున్న కొలిశెట్టి శివకుమార్

కవాడిగూడ (హైదరాబాద్): రాష్ట్రంలో జరుగుతున్న గో హత్యలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, గోరక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని యుగతులసి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొలిశెట్టి శివకుమార్ డిమాండ్ చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఓ వర్గం ప్రజలు వేలాది గోవులను నగరంలోని వధశాలలకు తరలించారని ఆయన ఆరోపించారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో గోరక్షకులు, వివిధ గోసంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గోసంరక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా వందలాది చెక్ పోస్టులు ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాకపోవడంతో ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతోందని అన్నారు. ఓ వర్గం ఓట్లకోసం ప్రభుత్వాలు దిగజారి వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. గో సంరక్షణ చట్టాలు అమలు చేయాలని అనేక సంవత్సరాలుగా ఉద్యమాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

16 మంది మావోయిస్టుల లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో సోమవారం 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో ఆరుగురిపై రూ.25 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'నియాద్ నెల్లానార్' పథకంలో భాగంగా ఆపరేషన్ చేయూత పేరుతో తక్షణ ఆర్థికసాయం, జీవనోపాధి కల్పిస్తామన్న హామీతో మావోయిస్టులు భారీగా లొంగిపోతున్నట్టు తెలుస్తోంది. తాజా లొంగుబాటుతో కెర్లపెంట గ్రామం నక్సల్స్ రహిత గ్రామంగా మారిందని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

మానవ అక్రమ రవాణాకు నిజామాబాద్‌కు లింకు

- హరియాణాలోని హిసార్‌లో గుడి వద్ద లభించిన లేఖ



ఖలీల్‌వాడి: మానవ అక్రమ రవాణాకు సంబంధించి హరియాణాలోని హిసార్‌లో ఓ దేవాలయంలో పూజారికి దొరికిన లేఖ కవర్‌పై ఐజీ హిసార్, దాని కింద నిజామాబాద్‌కు చెందిన ఆలకుంట సంపత్ పేరు ఉండటం స్థానికంగా కలకలం రేపింది. ఉత్తరం పూర్తిగా హిందీలో రాశారు. దీనిని పూజారి హిసార్ పోలీసులకు అందజేశారు. ఈ లేఖలో మనుషులను అక్రమ రవాణా చేసి 2018 నుంచి దుబాయ్, పాకిస్తాన్‌కు పంపించినట్టు రాసి ఉంది. లేఖ కవర్‌పై ఆలకుంట సంపత్ పేరు రాసి ఉన్న నేపథ్యంలో నిజామాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. రెండుమూడు నెలల క్రితం ఇతర కేసుల్లో సంపత్‌ను పోలీసులు విచారించారు. ఈ సమయంలోనే గుండెపోటుతో మృతి చెందాడు. ఈ లేఖ వ్యవహారం తమ దృష్టికి వచ్చిందని పోలీసులు చెప్పారు.

ఆపరేషన్ స్పైడర్స్‌వెబ్...

నయా పెరల్ హార్బర్!

ఆధునిక యుద్ధ చరిత్రలోనే అతి పెద్ద సర్జికల్ స్ట్రైక్

రష్యాకు తీరని అవమానం మిగిల్చిన ఉక్రెయిన్ డ్రోన్ దాడులు



డ్రోన్ దాడుల్లో కాలిపోతున్న రష్యా విమానం

మూడు టైమ్ జోన్ల పరిధిలో దాడులు

- 41 బాంబర్, నిఘా విమానాలు ధ్వంసం
- మూడో వంతు ఫ్లీట్‌ను నష్టపోయిన రష్యా
- నష్టం విలువ రూ.60 వేల కోట్ల పై చిలుకే!
- ఒక్కోటీ రూ.42 వేలు చేసే 117 డ్రోన్లతో కారుచౌకగా పని పూర్తి చేసిన ఉక్రెయిన్

నాటో దేశాలు నిరంతరం ఆయుధాలతో సహా సర్వ సామగ్రీ సమకూరుస్తుంటే తప్ప యుద్ధరంగంలో పూట గడవని పరిస్థితి ఉక్రెయిన్‌ది. అవతలున్నదేమో అపార సైనిక పాటవానికి మారుపేరైన రష్యా. అలాంటి అగ్రరాజ్యానికి చెందిన ఏకంగా 41 బాంబర్ విమానాలను ఏదో వీడియోగేమ్ ఆడుతున్నంత అలవోకగా దాని సొంత గడ్డ మీదే ధ్వంసం చేసిన తీరు ప్రపంచవ్యాప్తంగా పెను కలకలం సృష్టించింది. అది కూడా ఏ ఒక్కచోటో కాదు. రష్యావ్యాప్తంగా ఏకంగా మూడు టైమ్ జోన్లలో, ఏకంగా 6,000 కి.మీ. పరిధిలో ఉన్న ఐదు వైమానిక స్థావరాలపై ఏకకాలంలో విజయవంతంగా దాడులు జరగడం విశేషం. ఆ దెబ్బకు రష్యా బాంబర్ శ్రేణి విమానాల్లో మూడో వంతు తుడిచిపెట్టుకుపోయాయి! అత్యంత సంక్లిష్టమైన ఇంతటి ఆపరేషన్‌ను పూర్తి కచ్చితత్వంతో, కేవలం డ్రోన్ల సాయంతో కారుచౌకగా, తనవైపు ఎలాంటి ప్రాణనష్టమూ లేకుండా పూర్తి చేసిన వైనం రక్షణ నిపుణులనే విస్మయపరిచింది. ఆధునిక ప్రపంచ యుద్ధ చరిత్రలోనే అతి పెద్ద, అత్యంత సంక్లిష్టమైన సర్జికల్ స్ట్రైక్ ఇదేనని చెబుతున్నారు. అంతేగాక ఏ కోణం నుంచి చూసినా అత్యంత విజయవంతమైన దాడిగా కూడా ఇది నిలిచింది. రష్యా చరిత్రలో అతి పెద్ద నిఘా వైఫల్యంగా కూడా ఇదేనని చెబుతున్నారు. ఈ దాడులను తమ పాలిట 'పెరల్ హార్బర్' ఉదంతంగా రష్యా మీడియానే అభివర్ణిస్తోంది. రెండో ప్రపంచయుద్ధం చివర్లో హవాయిలోని పెరల్ హార్బర్‌పై జపాన్ మెరుపు దాడులకు దిగి అమెరికా యుద్ధనౌకలను సముద్రంలో ముంచేసింది. ఈ ఉదంతం అమెరికాను యుద్ధంలోకి లాగడమే గాక జర్మనీ, జపాన్ తదితర అక్షదేశాల ఓటమికి ప్రధాన కారణంగా నిలిచింది. 'ఆపరేషన్ స్పైడర్స్‌వెబ్' పేరిట ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడులు రష్యాను ఆ స్థాయిలో దెబ్బకొట్టాయని అక్కడి మీడియా వాపోతోంది. అది అక్షరాలా నిజమేనని రక్షణ నిపుణులు ముక్త కంఠంతో చెబుతున్నారు. ప్రపంచ దేశాలన్నీ ఆధునిక యుద్ధ వ్యూహాలను తక్షణం సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని ఇది మరోసారి గుర్తు చేసిందని వారంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కారుచౌకే.. కానీ ఖతర్నాక్

రష్యా ఎయిర్‌బేస్‌లపై దాడుల్లో ఉక్రెయిన్ వాడింది ఎఫ్‌పీవీ (ఫస్ట్ పర్సన్ వ్యూ) రకం డ్రోన్లు.

- ఇవి కారుచౌకగా దొరుకుతాయి. పేలుడు పదార్థాలను బిగించి పంపగల ఒక్కో ఎఫ్‌పీవీ డ్రోన్ ఖరీదు కేవలం రూ.42 వేలు మాత్రమేనని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది.
- అయితే గురితప్పకుండా లక్ష్యాన్ని ఛేదించడంలో వీటికివే సాటి.
- డ్రోన్‌కు అమర్చిన కెమెరా సాయంతో అక్కడి పరిసరాలను దాని ఆపరేటర్ ప్రత్యేక కళ్లద్దాల సాయంతో లైవ్‌లో చూడటమే గాక వీడియో తీయగలడు. రిమోట్‌గా ఆపరేట్ చేయగలడు.
- పరిసరాల చిత్రీకరణ వంటి సైనికేతర పనుల్లో ఈ డ్రోన్లను విరివిగా వాడుతుంటారు. వీటి రేంజ్ కొన్ని కిలోమీటర్లకే పరిమితం.

రష్యా అణుదాడి చేస్తుందా...?

ఉక్రెయిన్ డ్రోన్ దాడులపై రష్యా తీవ్ర అవమాన భారంతో ఉడికిపోతోంది. కారుచౌకైన డ్రోన్లతో కోలుకోలేని దెబ్బతీయడాన్ని జీర్ణం చేసుకోలేకపోతోంది. దీనికి ప్రతీకారం తప్పదని రష్యా రక్షణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. కనుక ఉక్రెయిన్‌పై భారీ స్థాయిలో విరుచుకుపడటం ఖాయమే.

- ఉక్రెయిన్ ప్రధానంగా నాటో సభ్యదేశాలు సమకూర్చిన ఆయుధాలనే తనపై వాడుతోంది. కనుక యూరప్‌లోని నాటో దేశాల్లోని సైనిక స్థావరాలు, ఆయుధాగారాలను రష్యా లక్ష్యంగా చేసుకోవచ్చు. వాటిపై దాడులు చేస్తామని గతంలోనే ఎన్నోసార్లు హెచ్చరించింది కూడా.
- ఉక్రెయిన్ బహుశా ఈ ప్రమాదాన్ని ముందే ఊహించింది. డ్రోన్ దాడులు పూర్తిగా తన పనేనని, నాటో మిత్రులకు ఏ సంబంధమూ లేదని జెలెన్‌స్కీ ప్రకటించారు. వాణిజ్యపరంగా సులువుగా అందుబాటులో ఉన్న డ్రోన్లనే దాడుల్లో వాడినట్టు వివరించారు. అందుకు రుజువుగా దాడుల ఫొటోలను విడుదల చేశారు.
- నష్ట, అవమాన తీవ్రత దృష్ట్యా ఉక్రెయిన్‌పై రష్యా అణుదాడికి దిగినా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు.

రష్యాకు నష్టం ఇలా...

- 41 టీయూ–95, టీయూ–22ఎం3 దీర్ఘ శ్రేణి బాంబర్లు, దాడుల్లో వాటికి ఆద్యంతం దన్నుగా నిలిచే ఏ–50 నిఘా విమానాలపై డ్రోన్ దాడులు జరిగాయి.
- వాటిలో 14 పూర్తిగా, మిగతా 27 చాలావరకు ధ్వంసమైనట్టు చెబుతున్నారు.
- మూడున్నరేళ్లుగా ఉక్రెయిన్‌పై క్షిపణి, బాంబు దాడులకు రష్యా ప్రధానంగా ఉపయోగిస్తున్నది ఈ విమానాలనే!
- ఈ నష్టం విలువ కనీసం రూ.60 వేల కోట్ల (700 కోట్ల డాలర్ల)పై చిలుకేనని రష్యా రక్షణ శాఖే అంచనా వేసింది.


ఎఫ్‌ఎస్‌బీ పక్కనే దాడుల అడ్డా!

ఇంత భారీ ఆపరేషన్‌కు రష్యా గడ్డ మీద కూడా అవసరమైన మద్దతు తప్పనిసరి. ఇందుకోసం ఉక్రెయిన్ రష్యాలో ఏకంగా ఆఫీసే తెరిచింది! అది కూడా రష్యా అంతర్గత భద్రతా విభాగం ఎఫ్‌ఎస్‌బీ కార్యాలయం పక్కనేనని జెలెన్‌స్కీ వెల్లడించడం విశేషం. ఏ ప్రాంతంలో అన్నది మాత్రం చెప్పలేదు.

- మొత్తం ఆపరేషన్‌ను ఉక్రెయిన్ సీక్రెట్ సర్వీస్ (ఎస్‌బీయూ) పక్కాగా నిర్వహించింది.
- దీన్ని జెలెన్‌స్కీ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. దాడి వెనక ఏడాదిన్నర ప్రణాళిక ఉన్నట్టు వెల్లడించారు. "రష్యా గడ్డ నుంచే ఎంతోమంది ఇందుకు తోడ్పడ్డారు. వారందరినీ దాడులకు ముందే సురక్షితంగా తరలించాం. మావైపు ప్రాణనష్టం లేకుండా రష్యాను చావుదెబ్బ తీశాం" అన్నారు. రష్యాపై మరిన్ని దాడులు తప్పవన్నారు.
- డ్రోన్ దాడుల అనంతరం రష్యా ప్రతీకార దాడుల్లో 12 మంది ఉక్రెయిన్ సైనికుల మృతికి బాధ్యత వహిస్తూ ఉక్రెయిన్ పదాతి దళాధిపతి మేజర్ జనరల్ మైకేలియో ద్రాపత్యు రాజీనామా చేశారు.

ఎక్కడెక్కడ దాడులు...

- ఒలెన్యా (ముర్మాన్‌స్క్), బెలయా (ఇర్కుట్స్క్–సైబీరియా), డ్యాగిలెవొ (సెంట్రల్ ర్యాజాన్), ఇవనొవొ
- వీటిలో ఒలెన్యా, బెలయా స్థావరాల మధ్య దూరం ఏకంగా 6,000 కి.మీ.! ఇవి పరస్పరం మూడు టైమ్ జోన్ల దూరంలో ఉండటం విశేషం.
- ఉక్రెయిన్ సరిహద్దుల నుంచి బెలయా ఏకంగా 4,000 కి.మీ. దూరంలో ఉంటుంది!
- అమూర్, ఇవనోవో, ర్యాజన్ తదితర ప్రాంతాల్లోనూ డ్రోన్ దాడుల యత్నాలు జరిగాయని రష్యా ధ్రువీకరించింది.



గతంలోనూ...

మూడేళ్ల పై చిలుకు యుద్ధంలో అనూహ్య, ఆకస్మిక దాడులతో రష్యాకు ఉక్రెయిన్ తీవ్ర నష్టం కలిగించడం ఇది తొలిసారేమీ కాదు.

- 2022 ఏప్రిల్లో రష్యా యుద్ధనౌక మోస్క్‌వాను నెప్ట్యూన్ యాంటీ షిప్ మిసైళ్లతో ఉక్రెయిన్ నల్లసముద్రంలో ముంచేసింది.
- 2022 అక్టోబర్‌లో ఆక్రమిత క్రిమియాను రష్యా భూభాగానికి కలిపే కీలక కెర్చ్ బ్రిడ్జిని బాంబులతో పేల్చేసింది.
- 2024 ఆగస్టులో ఉక్రెయిన్ సైన్యం తొలిసారిగా సరిహద్దులు దాటి రష్యా భూభాగంపై మెరుపు దాడులకు దిగి కుర్స్క్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంది. తీరని అవమానం మిగిల్చింది!


డ్రోన్ కంటైనర్లతో కూడిన ట్రక్కు

ట్రక్కుల్లో తరలించి...

సింపుల్ ప్లానింగ్. పూర్తి గోప్యత. పక్కా రిహార్సల్స్. ఆకస్మిక దాడి. అమలులో మెరుపువేగం. 100 శాతం లక్ష్యసాధన. సర్జికల్ స్ట్రైక్స్ వంటి స్పెషల్ ఆపరేషన్స్ ఏ మేరకు సఫలమైందీ తేల్చేందుకు ప్రఖ్యాత సైనిక నిపుణుడు అడ్మిరల్ విలియనం మెక్‌రావెన్ సిద్ధాంతీకరించిన గీటురాళ్లు. వాటన్నింటినీ పూర్తి స్థాయిలో మేళవించిన ఆపరేషన్‌గా స్పైడర్స్ వెబ్ నిలిచింది.

- మొత్తం ఆపరేషన్‌లో ఉక్రెయిన్ చాలావరకు పౌర మౌలిక సదుపాయాలనే వాడుకుంది.
- ఇంతటి భారీ స్థాయి దాడులకు ప్రణాళిక రచించిన ఉక్రెయిన్, అందుకు సిద్ధం చేసిన డ్రోన్లను రష్యాలోకి తేలిగ్గా దొంగచాటుగా తరలించడం విశేషం.
- అనంతరం వాటిని ట్రక్కుల్లో చెక్క కంటైనర్లలో పెట్టి ఎయిర్‌బేస్‌లకేసి తరలించారు.
- ఒక్కో కంటైనర్‌లో 36 డ్రోన్లను ఉంచారు. వాటిని ప్రత్యేకంగా డిజైన్ చేశారు.
- దాడుల్లో ఎక్కడా ప్రత్యక్షంగా సిబ్బందిని నియోగించే అవసరమే లేకుండా పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేశారు.
- ట్రక్కులను వైమానిక స్థావరాలకు అతి సమీపంలోకి తీసుకెళ్లారు.
- అక్కడినుంచి నిర్ధారిత సమయంలో కంటైనర్ల పైకప్పును రిమోట్ ద్వారా తెరిచారు.
- ఆ వెంటనే వాటిలోంచి డ్రోన్లు పైకెగిరి లక్ష్యాలపైకి దూసుకెళ్లాయి. సరిగ్గా విమానాలపై పడి పేలిపోయాయి.

కంటైనర్ల నుంచి డ్రోన్లు పైకి ఎగురుతున్న దృశ్యాలతో కూడిన వీడియోలను రష్యా మీడియా విడుదల చేసింది. వాటిని అడ్డుకునేందుకు కొందరు సాయుధులు ట్రక్కులపైకి ఎక్కుతున్న దృశ్యాలు కూడా కొన్నింట్లో కనిపిస్తున్నాయి.



పోలండ్ అధ్యక్షుడిగా కరోల్ ఎన్నిక

వార్సా: పోలండ్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో కన్జర్వేటివ్ లా అండ్ జస్టిస్ పార్టీకి చెందిన కరోల్ నవ్‌రొకి(42) ఎన్నికయ్యారు. అత్యంత ఉత్కంఠగా సాగిన పోరులో నారొకికి 50.89% శాతం ఓట్లు రాగా, ప్రత్యర్థి, వార్సా మేయర్ రఫాల్ ట్రస్ కోవ్‌స్కీకి 49.11% ఓట్లు పోలయ్యాయి. రెండు వారాల క్రితం జరిగిన మొదటి రౌండ్ ఓటింగ్ సమయంలో ఈయూ, నాటో అనుకూల పార్టీల మధ్య నెలకొన్న తీవ్ర విభేదాలు తేటతెల్ల మయ్యాయి. ఆదివారం సాయంత్రం ప్రకటించిన ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో రఫాల్ ట్రస్‌కోవ్‌స్కీ ముందంజలో ఉన్నారు. కేవలం రెండు గంటల్లోనే ఫలితం తారుమారవడం గమనార్హం. ఓటమిని అంగీకరించిన ట్రస్‌కోవ్‌స్కీ సోమవారం నవ్‌రొకికి అభినందనలు తెలిపారు. మాజీ బాక్సర్, చరిత్రకారుడు, అయిన నవ్‌రొకికి ఎటువంటి రాజకీయ అనుభవం లేదు. నవ్‌రొకికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు ప్రకటించడం విశేషం. ఆయనకే గెలుపు అవకాశాలున్నాయని కూడా వ్యాఖ్యానించారు. నవ్‌రొకి ఎన్నికల కార్యక్రమాల్లో అమెరికా జెండాలు సైతం కనిపించడం గమనార్హం. వైట్‌హౌస్‌కు రావా లంటూ నెల క్రితమే నవ్‌రొకిని ట్రంప్ ఆహ్వానించారు.

తుర్కియేలో ముగిసిన రష్యా–ఉక్రెయిన్ చర్చలు

ఇస్తాంబుల్: తుర్కియే వేదికగా రష్యా–ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య జరిగిన రెండో విడత చర్చలు పట్టుమని కనీసం గంట సేపు కూడా కొనసాగలేదు. సోమవారం ఇస్తాంబుల్‌లో మొదలైన ఈ చర్చలు గంటలోపే ముగిసినట్లు ఇరుదేశాలు ప్రకటించాయి. లిథువేనియా రాజధాని విల్నియస్‌లో ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ విషయం ధ్రువీకరించారు. ఇరు వర్గాలు తుర్కియే మధ్యవర్తి ద్వారా పత్రాలను మార్చుకున్నాయన్నారు. దీని ప్రకారం యుద్ధ ఖైదీల మార్పిడి మరో దఫా చేపట్టే అవకాశముందన్నారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన 6 వేల మంది సైనికుల మృతదేహాలను పరస్పరం అప్పగించుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు వివరించారు. యుద్ధం సమయంలో తమ దేశం నుంచి బలవంతంగా తరలించుకుపోయిన చిన్నారుల జాబితాను కూడా రష్యా అధికారులకు అందజేశామన్నారు.

వరద ప్రభావిత ఈశాన్యానికి నిధులివ్వాలి: ఖర్గే

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాల్లో వరద పరిస్థితుల నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. పీఎం కేర్స్ పేరుతో ఎలాంటి ఆడిట్ లేకుండా భారీ మొత్తంలో ఉంచిన నిధుల గేట్లను తెరిచి ఇకనైనా ఈశాన్య రాష్ట్రాలకు సాయంగా ఇవ్వాలని కోరారు. 'అస్సాంకు వరద బెడద లేకుండా చేస్తామని 2016లో ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. 2022లో అమిత్ షా ఇదే హామీని పునరుద్ఘాటించారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మాత్రం రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేసినట్లుగా కనిపిస్తోంది' అని ఖర్గే అన్నారు.



కెనడాలో జీ7 శిఖరాగ్రానికి మోదీ డుమ్మా!?

న్యూఢిల్లీ: కెనడాలో ఈ నెల 15 నుంచి మొదలయ్యే జీ7 శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీ వెళ్లకపోవచ్చని తెలుస్తోంది. ఆరేళ్లుగా జీ7 సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరవుతున్న ప్రధాని మోదీ మొదటిసారిగా డుమ్మా కొట్టే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. జూన్ 15–17 తేదీల మధ్య అల్బర్టాలో ఈ భేటీ జరగనుంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం వంటి కీలకమైన అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లపై కూటమిలోని ప్రముఖ పారిశ్రామిక దేశాల నేతలు చర్చించనున్నారు. శిఖరాగ్రానికి రావాలంటూ ప్రధాని మోదీకి కెనడా ఇప్పటి వరకు ఆహ్వాన సైతం పంపలేదు. ఇప్పటికిప్పుడు ఆహ్వానం వచ్చినా ఇరుదేశాల మధ్య నెలకొన్న సంబంధాలు, వేగంగా మారుతున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో సన్నద్ధతకు సమయం పడుతుందని చెబుతున్నారు. జీ7 కూటమిలో అమెరికా, యూకే, ఇటలీ, జర్మనీ, కెనడా, జపాన్ సభ్యదేశాలు కాగా, ప్రస్తుతం కెనడా అధ్యక్షత బాధ్యతల్లో ఉంది.

కొండచరియలు విరిగిపడి ముగ్గురు జవాన్ల మృతి

గాంగ్‌టక్: ఈశాన్య రాష్ట్రం సిక్కింలో వరద బీభత్సం కొనసాగుతోంది. మిలటరీ క్యాంప్‌పై కొండచరియలు విరిగి పడిన ఘటనలో ముగ్గురు జవాన్లు మృత్యువాతపడగా ఆరుగురు గల్లంతయ్యారు. మంగన్ జిల్లా ఛాటెన్‌లో ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగి పడుతున్నట్లు ఆర్మీ ప్రతినిధి తెలిపారు. మృతులను హవల్దార్ లఖ్వీందర్ సింగ్, లాన్స్ నాయక్ మునీశ్ ఠాకూర్, పోర్టర్ అభిషేక్ లఖాడాలుగా గుర్తించామన్నారు. మృతదేహాలను వెలికి తీసి, స్వల్పంగా గాయపడిన నలుగురు జవాన్లను కాపాడామన్నారు. అననుకూల వాతావరణంలో కూడా గల్లంతైన ఆరుగురి కోసం సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని వివరించారు. మరోవైపు, కొండచరియలు విరిగిపడి రహదారులు మూసుకుపోవడంతో లచుంగ్, చుంగ్‌తంగ్ పట్టణాల్లో చిక్కుకుపోయిన 737 మంది పురుషులు, 561 మంది మహిళలు, 380 మంది చిన్నారులు కలిపి మొత్తం 1,678 మంది పర్యాటకులను రక్షించినట్లు రాష్ట్ర డీజీపీ అక్షయ్ సచ్‌దేవా సోమవారం తెలిపారు. మంగన్ జిల్లా లచుంగ్‌లో తెగిపోయిన రహదారిని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్(బీఆర్‌వో)పునరుద్ధరించడంతో పర్యాటకులను బయటకు తీసుకురావడం సాధ్యమైందని చెప్పారు. మొత్తం 284 వాహనాలు, 16 బైక్‌లపై పోలీసు భద్రత నడుమ గాంగ్‌టక్‌కు చేర్చామన్నారు. లచెన్‌లో చిక్కుకుపోయిన మరో 100 మంది పర్యాటకులను కాపాడేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు.


కిమ్ మూన్ సూ   లీ జే మ్యుంగ్

దక్షిణ కొరియాలో నేడే ఎన్నికలు

విపక్ష అభ్యర్థి మ్యుంగ్‌కే అధ్యక్ష పీఠం!

సియోల్: నెలల తరబడి కొనసాగిన రాజకీయ సంక్షోభం అనంతరం దక్షిణ కొరియాలో మంగళవారం అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. గత డిసెంబర్‌లో మార్షల్ విధించి పరువుతోపాటు అంతిమంగా పదవి కూడా కోల్పోయిన యూన్ సుక్ యెల్ స్థానంలో 4.4 కోట్ల మంది ఓటర్లు నూతన అధ్యక్షున్ని ఎన్నుకోనున్నారు. ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉన్నా ప్రధాన పోటీ అధికార పీపుల్ పవర్ పార్టీ అభ్యర్థి కిమ్ మూన్ సూ, విపక్ష డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ కొరియా పార్టీకి చెందిన లీ జే మ్యుంగ్ మధ్యే నెలకొంది. వారు తొలుత నువ్వా నేనా అన్నట్టుగా తలపడ్డా, మ్యుంగ్ క్రమంగా పై చేయి సాధించారు. దీనికి తోడు తాజా మాజీ అధ్యక్షుని ఏకపక్ష పోకడలను విమర్శించేందుకూ నిరాకరించడంతో ఆయన గ్రాఫ్ బాగా పడిపోయింది. ఈ నేపథ్యంలో 61 ఏళ్ల మ్యుంగ్ భారీ మెజారిటీతో నెగ్గడం ఖాయమని పరిశీలకులు అంటున్నారు. సాయంత్రానికల్లా ఎన్నికల ఫలితాలు వెలువడి నూతన అధ్యక్షుడు బుధవారమే బాధ్యతలు చేపడతారు.

అక్కడ ఏడాదికి 25,000 రోజులు

వాషింగ్టన్: భూమి సూర్యుని చుట్టూ ఒకసారి తిరిగిరావడానికి 365 రోజులు పడుతుందని తెల్సిందే. అదే మాదిరి ఒక చిన్నపాటి మరుగుజ్జు గ్రహం లాంటి ఖగోళ వస్తువు మన సూర్యుని చుట్టూ అత్యంత నెమ్మదిగా తిరుగుతోంది. ఎంతగా అంటే ఒక చుట్టు చుట్టేయడానికి ఏకంగా 25,000 రోజుల సమయం తీసుకుంటోంది. సౌరమండలంలో కొత్తగా కనిపెట్టిన ఈ మరుగుజ్జు గ్రహానికి 2017 ఓఎఫ్201 అని పేరుపెట్టారు. అయితే దీనిని గ్రహం హోదా ఇవ్వాలా వద్దా అనే చర్చ జరుగుతోంది. ఎందుకంటే దీనిని పూర్తిస్థాయిలో గ్రహ లక్షణాలు లేవని తేలింది. నెప్ట్యూన్ గ్రహం ఎంత దూరంలో అయితే సూర్యుడి చుట్టూ తిరుగుతోందో అంతకంటే కాస్తంత ఎక్కువ దూరంలో ఈ అంతరిక్ష పదార్థం మన సూర్యుని చుట్టూ తిరుగుతోంది. ఇది చాలా నెమ్మదిగా పరిభ్రమిస్తోంది. ఒకసారి సూర్యుడిని చుట్టిరావడానికి 25,000 రోజుల సమయం తీసుకుంటోంది. దీని వెడల్పు ఏకంగా 700 కిలోమీటర్లు. '' కోట్ల సంవత్సరాలుగా ఒకే కక్ష్యలో పరిభ్రమిస్తోంది. ఆ లెక్కన చూస్తే బుల్లి గ్రహం హోదా పొందే అర్హత కాస్తంత దీనికి ఉంది'' అని అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా పనిచేసే ప్రిన్స్‌టన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీలో ఖగోళ భౌతిక శాస్త్రవేత్త సిహావో చెంగ్ అన్నారు. మరుగుజ్జు గ్రహాల హోదా పొందిన ఐదింటికంటే ఈ కొత్త ఖగోళ వస్తువు కాస్తంత చిన్నగా ఉంది. గతంలో గ్రహంగా చెలామణి అయిన ఇటీవల మరుగుజ్జు గ్రహంగా స్థిరపడిపోయిన ప్లూటో వ్యాసం 2,377 కిలోమీటర్లుకాగా ఈ 2017 ఓఎఫ్201 వ్యాసం కేవలం 700 కిలోమీటర్లే!

ఎండలు ముందే ముగిశాయెందుకు?

- గత ఏడాది మే, జూన్ నెలల్లో భగభగలు.. ఈసారేమో చల్లదనం
- దేశవ్యాప్తంగా చాలాచోట్ల వర్షాలు
- వాతావరణ మార్పులే కారణం

మే నెల భానుడి ప్రచండ వేడికి పెట్టింది పేరు. రోహిణి కార్తెలో రోకళ్లు పగులుతాయని పెద్దల మాట. సూర్యప్రకోపానికి జనం విలవిల్లాడిపోయే కాలంగా ఎండాకాలం దశాబ్దాలుగా పేరు తెచ్చుకుంది. కానీ ఈసారి మే నెలలో దాదాపు వేడి మాయమై చల్లదనమే రాజ్యమేలింది. దేశవ్యాప్తంగా చాలా చోట్ల వర్షాలు పడ్డాయి. పైగా ముందస్తుగానే ఎండాకాలం జనాలకు బైబై చెప్పి వెళ్లిపోయింది. 2024లో మే, జూన్ నెలల్లో ఎండలు విపరీతంగా ఉండటంతో 2025లో ఆదిత్యుడు ఇంకెంత రెచ్చిపోతాడోనన్న భయాలను పటాపంచలు చేస్తూ ఈసారి మే నెలలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే నమోదవడం విశేషం. తక్కువ ఎండలకు తోడు తక్కువ రోజులే ఎండాకాలం కొనసాగడం గమనార్హం. వేడిమి, ఉక్కబోతతో విసుగుతెప్పించే వేసవికాలం వేగంగా గడిచిపోయింది. 2024 సంవత్సరం భూమి మీద అత్యంత ఉష్ణమయ ఏడాదిగా చరిత్రలో నిలిచిపోయింది. ఇక భారత్‌లో గత ఏడాది మేలో దేశవ్యాప్తంగా వడగాలులు చండ ప్రచండంగా వ్యాపించి జనాన్ని బెంబేలెత్తించాయి. ఇందుకు పూర్తి భిన్నంగా 2025 మేనెల సాగిపోవడం సాధారణ ప్రజానీకాన్ని ఆశ్చర్యంలో, ఒకింత ఆలోచనలో పడేసింది. ఈసారి దేశ వాతావరణ ముఖచిత్రంలో మార్పులొచ్చాయని కొందరు విశ్లేషణలు మొదలెట్టారు.

2024 మే, జూన్‌లో..

గత ఏడాది మే, జూన్ నెలల్లో దేశవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడంతోపాటు వడగాల్పుల ఘటనలు చాలా చోట్ల సంభవించాయి. దీంతో చాలా ప్రాంతాల్లో కరువు తాండవించింది. దీంతో జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటాయి. నీటి లభ్యత బాగా తగ్గిపోయింది. భూగర్భజలాలు మరింత కిందకు వెళ్లిపోయాయి. విద్యుత్ కొరత సమస్య సైతం అధికమైంది. వాతావరణ మార్పులతో ముడిపడిన ఈ అధిక ఉష్ణోగ్రతల విపరిణామాలు వెనువెంటనే వ్యవసాయం, ఆరోగ్యంతోపాటు కోట్లాది మంది మధ్యతరగతి ప్రజల జీవనంపైనా దుష్ప్రభావాలు చూపాయి. వడదెబ్బకు జనం పిట్టల్లా రాలిపోయారు. 2025 మేలో అధిక ఉష్ణోగ్రతలు నమోదుకాకుండా అకాలవర్షాలు అడ్డుకున్నాయి. దేశవ్యాప్తంగా మెజారిటీ రాష్ట్రాల్లో వర్షాలు పడ్డాయి. పలు చోట్ల కుండపోత వర్షాలు కురిశాయి. వాతావరణ చక్రంలో మార్పుల కారణంగానే మేలో వేడిమి మటుమాయమై చల్లదనం వచ్చి చేరిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. చల్లదనం అత్యధిక రోజులు కొనసాగడంతో అది అంతిమంగా ఎండకాలం ముగింపునకు ముందస్తు నాంది పలికిందని నిపుణులు విశ్లేషించారు.

మరెన్నో కారణాలు..

వర్షాకాలం ఈసారి ముందస్తుగా ముంచుకురావడం సైతం ఎండకాలం తీవ్రతను తగ్గించేసింది. వాతావరణంలో ముందస్తుగా తేమ శాతం పెరగడం, చల్లని గాలుల క్రమానుగతిలో మార్పులు సైతం ఉష్ణోగ్రత అధికం కాకుండా అడ్డుకున్నాయి. దీంతో వేసవికాలంలో వేడి తగ్గిపోయింది. గతంతో పోలిస్తే ఈసారి ఎండాకాలంలో వాతావరణం చాలావరకు మేఘావృతమైంది. దాంతోపాటు దేశంలో మేనెలలో ప్రతిరోజూ ఏదోఒక చోట వర్షాలు పడుతూ సగటు ఉష్ణోగ్రత పెరగకుండా నిలువరించాయి. ఈ చల్లదన పరిస్థితులు పరోక్షంగా ప్రభుత్వాల మీదా పెనుభారాన్ని ఒక్కసారిగా దించేశాయి. విద్యుత్ డిమాండ్ పెరగకుండా అడ్డుకున్నాయి.

ముందుకొచ్చిన కొత్త ధోరణి

ఉడికించే ఉష్ణోగ్రతలు ఉన్నపళంగా తగ్గిపోవడం కొన్ని రకాల పంటల దిగుబడిపైనా ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చక్కటి వేడి పరిస్థితుల్లోనే కొన్నిరకాల పంటలు ఏపుగా పెరిగే పరిస్థితులు ఉంటాయని, ఈసారి ఎండలు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో ఆయా పంటల సాగుఫలంపై ప్రతికూల ప్రభావం పడొచ్చని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు. ఈసారి మారిన ఈ పరిస్థితులకు తగ్గట్లు కర్షకులు తమ పంటల విత్తునాటడం మొదలు ఎరువులు, పురుగుమందులు చల్లడం దాకా ప్రతిదాంట్లో కాస్తంత సమయపాలన పాటించడం తప్పనిసరి అయిందని వాళ్లు చెబుతున్నారు. హఠాత్తుగా ఎండాకాలం వ్యవధి తగ్గి వర్షాలు మొదలవడంపై వాతావరణ విభాగం సైతం వాతావరణ ముందస్తు అంచనాల వ్యూహాలకు పదునుపెట్టింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

క్లుప్తంగా...

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభను చాటారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అన్నికేటగిరీల్లో కలిపి ఎం.రవిచంద్రారెడ్డి 8వ ర్యాంకు, వి.నాగ సిద్ధార్థ 13వ ర్యాంకు, పి.సాక్షి 40వ ర్యాంకు, ఎ.అనుశ్రీ 47వ ర్యాంకు, బి.సాయి 68వ ర్యాంకు, బి.భరణీశంకర్ 90వ ర్యాంకు, జి.రాజేశ్ 106వ ర్యాంకు, బి.వినోద్ 115వ ర్యాంకు, ఎం.వెంకటకౌషిక్ 123వ ర్యాంకు, ఎస్.పవన్ 204వ ర్యాంకు, ఎ.సంతోష్ 265వ ర్యాంకు, బి.వాగ్దేవి 269వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అల్ఫోర్స్‌కు ర్యాంకులు

కొత్తపల్లి (కరీంనగర్): ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు జాతీయస్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. అజ్మీరా పురుషోత్తంనాయక్ 166వ ర్యాంకు సాధించగా.. పి.ఎన్.సాయి ధ్రువ 557, ఎస్.అనిరుధ్‌సాయి 657, బి.ఆదిత్య 945, బి.విష్ణు 1,203, ఎం.అక్షిత 1,224, వి.హృషికేశ్ 1,329, ఆర్.గోవర్ధన్ 1,506, జె.వామిక 1,604, బి.చైత్రవ్ రాజు 1,640, ఇ.శశిలాల్ 1,899, కె.వీరేంద్రప్రసాద్ 2,120, డి.కార్తీక్‌రెడ్డి 2,150, ఎస్.విఘ్నేశ్ 2,293, డి.అభిరామ్ 2,349, ఎ.శ్రీప్రీతమ్ 2,463, ఇ.అంకిత్‌సాయి 2,613, మహ్మద్ అబ్దుల్ హక్ 2,766, డి.విశాల్ 2,917 ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని పెంచారని సంతోషం వ్యక్తం చేశారు. వెయ్యి లోపు నలుగురు, 2 వేల లోపు 11 మంది, 3 వేల లోపు 19 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'రెసోనెన్స్' విద్యార్థుల జయభేరి

మాదాపూర్: ఆలిండియా జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో రెసోనెన్స్ జూనియర్ కాలేజీల విద్యార్థులు ఘనవిజయాన్ని సాధించారు. ఫలితాలకు సంబంధించిన విలేకరుల సమావేశాన్ని మాదాపూర్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ జూనియర్ కళాశాలలో డైరెక్టర్ పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ నగరంలోని వివిధ రెసోనెన్స్ క్యాంపస్‌ల నుంచి 170కి పైగా విద్యార్థులు దేశంలోని ప్రముఖ ఐఐటీలలో ప్రవేశం పొందనున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌కి చెందిన 21 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్-2025లో 1000లోపు ర్యాంకులను (ఓపెన్, ఇతర కేటగిరీలలో) సాధించినట్టు వెల్లడించారు. ర్యాంకులను సాధించిన వారికి నగదు బహుమతులను, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్యాన్ని బతికించుకోవాలి: కవిత



సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): యువ కవులు కవిత్వం రాస్తే తెలంగాణ సాహిత్యం వందేళ్లు బతికి ఉంటుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో యువ కెరటాలు కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కవిత హాజరై తెలంగాణ కవులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 35 ఏళ్లలోపు వయసున్న యువ కవులు అన్ని భాషల్లో కవిత్వం రాయాలనే ఆకాంక్షతో ఈ కవి సమ్మేళనం నిర్వహించామన్నారు. తెలంగాణ బిడ్డలకు ధిక్కారం ఎలా ఉంటుందో మమకారం కూడా అంతే ఉంటుందని చెప్పారు. కవులు ఏ పాలకుడి ముందూ తల వంచకూడదని, పాలనా లోపాలను ధైర్యంగా ఎత్తి చూపాల్సిందేనన్నారు. భవిష్యత్ తెలంగాణ అభివృద్ధి కోసం మన నీళ్లు, వనరుల రక్షణపై కవిత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభించాల్సి ఉండగా ఆ పథకానికి తెలంగాణ అమరవీరుల పేర్లు పెట్టాలని జాగృతి డిమాండ్ చేయడంతో ఏకంగా ఈ రోజున యువవికాసాన్ని రద్దు చేసుకుందన్నారు.

'గ్లోబల్ మ్యాక్సీ అవార్డు'ల్లో మెరిసిన లులూ మాల్స్

సాక్షి, హైదరాబాద్: ఐసీఎస్‌సీ గ్లోబల్ మ్యాక్సీ అవార్డుల అంతర్జాతీయ వేదికపై లులూ మాల్స్ ప్రత్యేకంగా నిలిచాయి. షాపింగ్ సెంటర్ పరిశ్రమలో నైపుణ్యానికి 3 ప్రతిష్టాత్మక అవార్డులు సాధించాయి. 15కు పైగా దేశాల నుంచి అగ్రశ్రేణి షాపింగ్ సెంటర్లతో పోటీపడి భారత్‌లోని లులూ మాల్స్ రెండు బంగారు అవార్డులు, ఒక వెండి అవార్డుతో దేశానికి గొప్ప విజయాన్ని అందించాయి. ఈమేరకు లాస్ వేగాస్‌లోని కౌన్సిల్ ఆఫ్ షాపింగ్ సెంటర్స్ (ఐసీఎస్‌సీ) గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు.

జేఈఈ 'అడ్వాన్స్‌డ్'లో తెలుగు తేజాలు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు మెరిశారు. ఈడబ్ల్యూఎస్, ఓబీసీ విభాగాల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించారు. ఓబీసీ కేటగిరీలో 310 మార్కులతో ఏపీలోని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్ సాయి (ఓపెన్ కోటాలో 18వ ర్యాంకు), జనరల్ ఈడబ్ల్యూఎస్ కోటాలో ఏపీకే చెందిన వంగల అజయ్‌రెడ్డి (ఓపెన్ కోటాలో 19వ ర్యాంకు) ఆలిండియా టాపర్లుగా నిలిచారు. మరో తెలుగు తేజం వడ్లమూడి లోకేష్ ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 10వ ర్యాంకు సాధించగా ఐఐటీ హైదరాబాద్ జోన్‌కు చెందిన మరో విద్యార్థి అవనగంటి అనిరుధ్‌రెడ్డి ఓపెన్ కేటగిరీలో 20వ ర్యాంకు సాధించాడు. ఏపీలోని కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన అప్పన రాజరాజేశ్వరి తన్వీ దివ్యాంగుల కేటగిరీలో 2వ ర్యాంకు సాధించింది. అలాగే ఏపీలోని ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలంలోని ఖాజీపురానికి చెందిన మంతు వెంకట రవిచంద్రారెడ్డి ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో జాతీయ స్థాయి 8వ ర్యాంక్ సాధించాడు. దేశంలోని 23 ఐఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి మే 18న నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలను ఐఐటీ కాన్పూర్ సోమవారం విడుదల చేసింది. ఇందులో మొత్తంగా 54,378 మంది అర్హత సాధించారు. ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన రజిత్ గుప్తా 360 మార్కులకుగాను 332 మార్కులు సాధించి ఓపెన్ కోటాలో ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. అలాగే ఐఐటీ ఖరగ్‌పూర్ జోన్‌కు చెందిన దేవదత్తా మాఝీ 312 మార్కులతో మహిళా విభాగం టాపర్ (ఓపెన్ కోటాలో 16వ ర్యాంకు)గా నిలిచింది. టాప్-100 ర్యాంకర్లలో తెలంగాణ, ఏపీ నుంచి 18 మంది చోటు సంపాదించారు. అత్యధికంగా ఐఐటీ హైదరాబాద్ జోన్ (తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి) పరిధిలో 12,946 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించగా వారిలో సుమారు 8 వేల మంది తెలుగు విద్యార్థులు ఉన్నారు. టాప్-10లో హైదరాబాద్ జోన్ పరిధిలో ఇద్దరు ఉన్నారు. జేఈఈ-మెయిన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన టాప్ 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్ ప్రవేశపరీక్షకు ఎంపిక చేయగా వారిలో సుమారు 1.80 లక్షల మంది పరీక్ష రాశారు. తెలుగు రాష్ట్రాల నుంచి 40 వేల మంది అడ్వాన్స్‌డ్ రాశారు.

నేటి నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ

దేశంలోని ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే సంస్థలు 127 ఉన్నాయి. వాటిల్లో సీట్ల భర్తీని జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) చేపడుతుంది. ఈ ప్రక్రియ మంగళవారం నుంచి మొదలవుతుంది. ఇదేరోజు నుంచి రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తారు. గతేడాది ఐదు విడతల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌ను ఈసారి ఆరు విడతల్లో చేపట్టనున్నట్లు 'జోసా' వెల్లడించింది. ఈ నెల 12న ఫైనల్ చాయిస్ లాకింగ్ చేయనుంది. తొలివిడత సీట్ల కేటాయింపు ఈ నెల 14న ఉంటుంది. ఐఐటీల్లో 17,740, ఎన్‌ఐటీల్లో 24,229, ట్రిపుల్ ఐటీల్లో 8,546, జీఎఫ్‌టీఐల్లో 9,402 కలిపి మొత్తం 59,917 సీట్లు ఉన్నాయి.

ఆశించిన స్థాయిలో ర్యాంకులు రాలేదు!

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు మన విద్యార్థులను నిరుత్సాహానికి గురిచేశాయి. గతేడాది ఫలితాల్లో టాప్ ర్యాంకుతోపాటు అత్యుత్తమ ర్యాంకులను తెలుగు విద్యార్థులు కైవసం చేసుకోగా ఈసారి ఆ స్థాయి ఫలితాలను అందుకోలేకపోయారు. ఈ ఏడాది రెండుసార్లు జరిగిన జేఈఈ మెయిన్ ఫలితాల్లో కటాఫ్ మార్కులు తగ్గినప్పటికీ ర్యాంకులు నిరుత్సాహానికి గురిచేశాయి. అడ్వాన్స్‌డ్ ఫలితాలు సైతం అదే తరహాలో వచ్చాయి. జేఈఈ మెయిన్‌లో ముగ్గురు తెలుగు విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించగా అడ్వాన్స్‌డ్‌లో వెనుకబడ్డారు. ఈసారి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో విపరీతమైన పోటీ ఉంది. మరోవైపు ప్రశ్నల సరళి క్లిష్టంగా ఉండటం... వాటికి సమాధానాలను గుర్తించేందుకు సమయం చాలక పోవడం ఈసారి తెలుగు విద్యార్థులు కాస్త వెనకబడటానికి కారణం అయ్యుండొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ అర్హులు బాలురు, బాలికలవారీగా

విభాగం	రాసిన వారు	అర్హులు
బాలురు	1,39,085	44,974
బాలికలు	41,337	9,404
మొత్తం	1,80,422	54,378

ఓపెన్ కేటగిరీ టాపర్లు వీరే

పేరు	మార్కులు
రజిత్ గుప్తా	332
సాక్షమ్ జిందాల్	332
మాజిద్ ముజాహిద్ హుస్సేన్	330
పార్థ్ మందర్ వర్తక్	327
ఉజ్వల్ కేసరి	324
అక్షత్ కుమార్ చౌరాసియా	321
సాహిల్ ముకేష్ దేవ్	321
దేవేష్ పంకజ్ భయ్యా	319
అర్నవ్ సింగ్	319
వడ్లమూడి లోకేష్	317

ఐఐటీ హైదరాబాద్ పరిధిలో టాపర్స్

పేరు	జాతీయ ర్యాంకు
అర్నవ్ సింగ్	9
వడ్లమూడి లోకేష్	10
ధర్మాన గుణ రుత్విక్ సాయి	18
వంగల అజయ్‌రెడ్డి	19
అవనగంటి అనిరుధ్‌రెడ్డి	20
కోరికన రసజ్ఞ (మహిళా టాపర్)	78

అడ్వాన్స్‌డ్ అర్హత కటాఫ్ మార్కులు

కేటగిరీ	ప్రతి సబ్జెక్టు మార్కులు	అగ్రిగేట్ మార్కులు
ఓపెన్	7	74
ఓబీసీ	6	66
ఈడబ్ల్యూఎస్	6	66
ఎస్సీ	3	37
ఎస్టీ	3	37

విభాగాలవారీగా జేఈఈ అడ్వాన్స్‌డ్ అర్హత

విభాగం	పీడబ్ల్యూడీ	దరఖాస్తులు	రాసినవారు	అర్హులు
జనరల్	లేదు	40,213	39,000	17,273
	ఉంది	989	902	238
ఓబీసీ	లేదు	69,085	1,063	66,525
	ఉంది	1,063	988	216
ఈడబ్ల్యూఎస్	లేదు	29,631	28,871	6,414
	ఉంది	308	298	86
ఎస్సీ	లేదు	30,929	29,577	12,499
	ఉంది	201	188	29
ఎస్టీ	లేదు	14,732	14,010	5,008
	ఉంది	72	63	9
మొత్తం		1,87,223	1,80,422	54,378

జోన్లవారీగా టాప్-10 నుంచి టాప్-500 మంది టాపర్లు

	10	100	200	300	400	500	అర్హులు
ముంబై	3	31	60	88	117	145	11,226
ఢిల్లీ	4	31	48	71	89	111	11,370
గౌహతి	0	0	1	1	1	3	2,743
కాన్పూర్	1	4	8	9	9	17	5,295
ఖరగ్‌పూర్	0	5	11	19	25	32	5,353
హైదరాబాద్	2	23	57	78	116	139	12,946
రూర్కీ	0	6	15	34	43	53	5,445

టాపర్ల మనోగతం

సాక్షి, నెట్‌వర్క్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా చాటిన ర్యాంకర్లలో చాలా మంది సామాన్య కుటుంబాలకు చెందిన వారే. వారిలో రైతు బిడ్డ మొదలు టీచర్ కుమారుడు దాకా ఉన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా పలువురు తెలుగు తేజాలు తమ భవిష్యత్ ప్రణాళికలను 'సాక్షి'తో పంచుకున్నారు.

సివిల్స్ సాధించడమే ధ్యేయం..



మాది కాకినాడ జిల్లా పిఠాపురం. మా నాన్న రాజేష్ వ్యాపారి, అమ్మ సుప్రియ గృహిణి. కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేసి సివిల్స్ సాధించాలన్నదే నా ధ్యేయం.

– దివ్యాంగుల కేటగిరీలో 2వ ర్యాంకర్ అప్పన రాజరాజేశ్వరి తన్వీ

ఐఏఎస్ అయి పేదలకు సేవ చేయడమే లక్ష్యం..



మాది నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం జగ్యాతండా. అమ్మానాన్న భూక్యా వెంకన్న, అరుణ వ్యవసాయం చేస్తుంటారు. రోజుకు 10–12 గంటలపాటు చదివేవాడిని. కంప్యూటర్ సైన్స్‌లో ప్రావీణ్యం కోసం కృషి చేస్తా. ఐఏఎస్ అయి పేదలకు సేవ చేయడమే నా లక్ష్యం.

– ఎస్టీ కేటగిరీలో 19వ ర్యాంకర్ మోహిత్‌రాజా నాయక్

కొత్త టెక్నాలజీని పరిచయం చేయాలని ఉంది



మాది సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల పరిధిలోని కరివిరాల. మా నాన్న వీరారెడ్డి అనంతగిరి మండలం పాలారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకు సాధించా. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయి ఊరికి పేరు తేవాలని ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త టెక్నాలజీని పరిచయం చేయాలని ఉంది.

– 110వ ర్యాంకర్ ఆరె ప్రణీత్‌రెడ్డి

సొంతంగా ప్రొడక్ట్ తయారు చేస్తా..



మాది నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రం. ఇంజనీరింగ్ చేసి సొంతంగా ఒక ప్రొడక్ట్ తయారు చేయాలని ఉంది. దాన్ని అతితక్కువ ధరకు దేశ ప్రజలకు అందించాలన్నదే నా లక్ష్యం.

– 318వ ర్యాంకర్ వంగాల ప్రణీత్‌రెడ్డి

టెన్త్ నుంచే ప్రిపరేషన్

ఆలిండియా టాపర్ రజిత్ గుప్తా

కోటా: 'ఐఐటీలో సీటు సాధించాలని పదో తరగతిలోనే లక్ష్యంగా పెట్టుకున్నా. అప్పటి నుంచి ప్రిపరేషన్ మొదలుపెట్టా. నా కష్టానికి తగ్గ ఫలితం లభించినందుకు చాలా సంతోషిస్తున్నా' అని జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించిన రాజస్తాన్‌లోని కోటావాసి రజిత్ గుప్తా చెప్పాడు. అతన్ని పీటీఐ వార్తాసంస్థ సోమవారం పలకరించగా తన ప్రిపరేషన్ సాగిన తీరుతెన్నుల గురించి వివరించాడు. 'నేను మాక్ పేపర్లను విశ్లేషించడంపై అధిక దృష్టి పెట్టే వాడిని. అలాగే ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలనూ ఎక్కువగా అనుసరించా. హెచ్‌సీ వర్మ, ఇరోడోవ్ పుస్తకాల నుంచి ఎంపిక చేసిన ప్రశ్నలను కూడా పరిష్కరించేవాడిని. నా ప్రిపరేషన్‌లో పెద్దగా ప్రత్యేకత లేదు. ఏ రోజుకారోజు నిర్దేశించుకున్న పనులను పూర్తి చేయడం, నిర్దేశిత మాడ్యూల్స్‌ను సమయానికి పరిష్కరిస్తూ ముందుకు సాగా. ప్రిపరేషన్ మధ్యలో విరామం తీసుకొనేవాడిని.' అని రజిత్ గుప్తా వివరించాడు. కచ్చితంగా ఇన్ని గంటలపాటు చదవాలని ఏరోజూ నియమం పెట్టుకోలేదని తెలిపాడు. ఏదైనా ప్రశ్నను పరిష్కరించలేకపోతే కాసేపు విరామం తీసుకొనేవాడినని.. తన చెల్లెలితో కాసేపు మాట్లాడం ద్వారా మూడ్‌ను మార్చుకొనే వాడినని అతను వివరించాడు. పరీక్ష ఎలా రాయగలనన్న భయాన్ని దరిచేరనివ్వలేదని స్పష్టం చేశాడు. స్నేహితులమంతా పరస్పరం సహకరించుకోవడం కూడా తన ప్రిపరేషన్‌కు ఉపయోగపడిందని రజిత్ గుప్తా చెప్పాడు. రజిత్ గుప్తా తండ్రి దీపక్ గుప్తా బీఎస్ఎన్ఎల్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తుండగా అతని తల్లి రష్మీ గుప్తా కోటాలోని బీడీజే కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ (హోం సైన్స్)గా పనిచేస్తున్నారు.

మెడికల్ వీసాపై వచ్చి.. డ్రగ్స్ సరఫరా చేస్తూ

- సైనిక్‌పురిలో టీజీ న్యాబ్‌కు చిక్కిన నైజీరియన్
- మూడుసార్లు మూడు పేర్లతో ఇండియాకు రాక



సాక్షి, హైదరాబాద్ : మెడికల్ వీసా పేరుతో భారత్‌కు వచ్చిన ఓ నైజీరియన్.. డ్రగ్స్ సరఫరా ద్వారా రూ.కోట్లు సంపాదించాడు. పలు దఫాల్లో ఎంతో చాకచక్యంగా భారత్‌కు వచ్చి తిరిగి వెళ్లినా... చివరకు టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు చిక్కాడు. సోమవారం ఆ వివరాలను ఒక ప్రకటనలో వారు వెల్లడించారు. 2013లో మెడికల్ వీసాపై బెంగళూరుకు వచ్చేందుకు మ్యాక్స్‌వెల్ పాస్‌పోర్టు తీసుకున్నాడు. అయితే అతడు బెంగళూరుకు వెళ్లకుండా నేరుగా గోవాకు వెళ్లి డ్రగ్స్ సరఫరా దందా ప్రారంభించాడు. క్రమంగా తన నెట్‌వర్క్‌ను విస్తరించాడు. ఇలా 2022 జూలై వరకు భారత్‌లో ఉన్న మ్యాక్స్‌వెల్ మొత్తం రూ.2 కోట్ల విలువైన డ్రగ్స్ సరఫరా చేయడం ద్వారా రూ.40 లక్షల వరకు కమీషన్ రూపంలో పొందాడు. ఆ తర్వాత నైజీరియాలో ఉన్న అతడు రెండోసారి 2023 డిసెంబర్‌లో పేరు మార్చుకొని చిరోతమ్ వాలెంటైన్‌గా బెంగళూరుకు మెడికల్ వీసాపై వచ్చాడు. బెంగళూరులో కాకుండా గోవాలో ఉంటూ డ్రగ్స్ పెడ్లర్‌గా మత్తుపదార్థాలు రవాణా చేసేవాడు. ఇలా డిసెంబర్ 2023 వరకు మొత్తం ఏడు నెలల్లో రూ.కోటి విలువైన డ్రగ్స్ సరఫరా చేసి మొత్తం రూ.20 లక్షలు కమీషన్‌గా పొందాడు. మూడోసారి నకిలీ పేరు (ఎమ్మాన్యుల్ బెడియాకో)పై ఘన దేశస్తుడిగా పాస్‌పోర్టు తయారు చేయించుకున్నాడు. ఆ పాస్‌పోర్టుతో ఢిల్లీకి మెడికల్ వీసాపై ఈ ఏడాది జనవరి 25న చేరాడు. అక్కడి నుంచి గోవాకు చేరుకొని అక్కడ మళ్లీ డ్రగ్స్ సరఫరా దందా మొదలు పెట్టాడు. ఇలా మూడుసార్లు భారత్‌కు వచ్చి వెళ్లిన మ్యాక్స్‌వెల్ రూ.1.17 కోట్లు కమీషన్‌గా సంపాదించినట్టు అధికారులు ఆధారాలు సేకరించారు. గోవాలో పోలీసుల నిఘా పెరగడంతో మ్యాక్స్‌వెల్ తన డ్రగ్స్ నెట్‌వర్క్‌ను హైదరాబాద్‌కు విస్తరించే ప్రయత్నాల్లో ఉన్నాడు. ఈ క్రమంలోనే ఆయన కదలికలపై నిఘా పెట్టిన టీజీ న్యాబ్ అధికారులు సైనిక్‌పురిలో అరెస్టు చేశారు. మ్యాక్స్‌వెల్ అరెస్టులో కీలకంగా పనిచేసిన డీఎస్పీ మధుమోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సంతోష్‌కుమార్, గోపి, ఎస్సైలు వెంకటేశ్, షేక్‌బురాన్, జీవన్ రెడ్డిలను అధికారులు అభినందించారు.

150 బ్యాంకు ఖాతాలతో మనీలాండరింగ్

డ్రగ్స్ విక్రయాలతో సంపాదించిన సొమ్మును మ్యాక్స్‌వెల్ మొత్తం 150 బ్యాంకు ఖాతాల ద్వారా నైజీరియాలోని తన కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలకు మనీలాండరింగ్ చేసినట్టు కీలక ఆధారాలు లభించాయి. 150కి పైగా బ్యాంకింగ్ ఆర్థిక లావాదేవీల వివరాలు అందుబాటులో ఉన్నందున ఈ కేసులో రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయడానికి, నైజీరియా నుంచి పనిచేస్తున్న డ్రగ్ కార్టెల్‌లను బహిష్కరించడానికి మంచి కేసుగా టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు భావిస్తున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్య ప్రతిభ

బంజారాహిల్స్ (హైదరాబాద్): ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు సత్తాచాటారు. టాపర్లతో కలిసి జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల సీఈవో అండ్ అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ బొప్పన తన ఆనందాన్ని పంచుకున్నారు. ఆలిండియా మొదటి ర్యాంకుతో పాటు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 3, 5, 6, 11 ర్యాంకులతో శ్రీచైతన్య తన ఆధిపత్యాన్ని కొనసాగించిందన్నారు. ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఆలిండియా 1వ ర్యాంకు వంగల అజయ్‌రెడ్డి (జనరల్, ఈడబ్ల్యూఎస్), జేఈఈ మెయిన్ 2025లో 300కి 300 మార్కులతో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించడం గమనార్హం. ఆలిండియా 1వ ర్యాంకు డి.జి.రిత్విక్ సాయి (ఓబీసీ), ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మూడో ర్యాంకు మాజిద్ హుస్సేన్, 5వ ర్యాంకు ఉజ్వల్ కేసరి, 6వ ర్యాంకు అక్షత్ కుమార్ చౌరాసియా, 11వ ర్యాంకు అర్ణవ్ నిగమ్, 16వ ర్యాంకు దేవదత్తా మాజి, 18వ ర్యాంకు డి.జి. రిత్విక్ సాయి, 19వ ర్యాంకు వంగల అజయ్‌రెడ్డి సాధించారని పేర్కొన్నారు.

ఓపెన్ కేటగిరీలో టాప్ 10లోపు 3 ర్యాంకులతో పాటు, 20 లోపు 7 ర్యాంకులు, 50లోపు 19 ర్యాంకులు, 100 లోపు 29 ర్యాంకులు సాధించారని తెలిపారు. దేశంలో నిష్ణాతులైన టాప్ ఫ్యాకల్టీతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో నాణ్యమైన శిక్షణను అందిస్తూ.. మైక్రో షెడ్యూల్స్, ఆలిండియా టెస్ట్ సిరీస్ ప్రోగ్రాములతో మాత్రమే ఈ విజయాలు సాధ్యమయ్యాయని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సుష్మ అభినందించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ హవా

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు జయభేరి మోగించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మాజిద్ హుస్సేన్ 3వ ర్యాంకు, పార్థ్ మందర్ వార్తక్ 4వ ర్యాంకు, అక్షత్ చౌరాసియా 6వ ర్యాంకు, సాహిల్‌డియో 7వ ర్యాంకు, వడ్లమూడి లోకేశ్ 10వ ర్యాంకుతో టాప్-10 ర్యాంకుల్లో 5 ర్యాంకులు నారాయణ కైవసం చేసుకుందని ఆ విద్యాసంస్థల డైరెక్టర్స్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. అలాగే ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 17, 20, 21, 22, 23, 27, 29, 30, 31, 34, 37, 38, 40, 43, 44, 46, 49, 50, 51, 52, 53, 54, 56, 57, 58, 63, 64, 73, 76, 77, 80, 82, 83, 85, 87, 88, 91, 98 వంటి టాప్ 100 లోపు 43 ర్యాంకులు తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. ఆలిండియా అన్ని కేటగిరీల్లో 1, 2, 2, 2, 4, 5, 7, 8, 10, 10 వంటి 10లోపు 10 ర్యాంకులు, 50 లోపు 42 ర్యాంకులు, 100 లోపు 75 ర్యాంకులను కైవసం చేసుకుని తమకెవ్వరూ సాటిరారని నారాయణ విద్యార్థులు నిరూపించారన్నారు. అనితరసాధ్యమైన శిక్షణ, రీసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్‌లు, మైక్రోషెడ్యూల్, బెస్ట్ స్టడీమెటీరియల్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, టాప్ ఫ్యాకల్టీతో ఈ విజయం సాధించామని వెల్లడించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ అభినందనలు తెలిపారు.

నీట్-పీజీ పరీక్ష వాయిదా

- రెండు షిఫ్టుల బదులు ఒకే షిఫ్టులో పరీక్ష నిర్వహించాలన్న సుప్రీంకోర్టు
- అందుకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్న ఎన్‌బీఈఎంఎస్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా లక్షలాది మంది మెడికల్ పీజీ అభ్యర్థులు ఎదురుచూస్తున్న నీట్ పీజీ-2025 ప్రవేశ పరీక్ష వాయిదా పడింది. రెండు షిఫ్టులలో ఈ నెల 15న నిర్వహించాలనుకున్న ఈ పరీక్షను సుప్రీంకోర్టు ఒకే షిఫ్టులో నిర్వహించాలని ఆదేశించిన నేపథ్యంలో పరీక్షను వాయిదా వేస్తూ నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) సోమవారం నిర్ణయం తీసుకుంది. రెండు షిఫ్టుల వల్ల పరీక్ష రాయడం కష్టంగా ఉంటుందని.. ప్రశ్నల స్థాయి వేర్వేరుగా ఉండే అవకాశం ఉందని కొందరు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఒకే షిఫ్టులో పరీక్ష నిర్వహించేందుకు తగిన మౌలిక వసతులు, పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వీలుగా నీట్-పీజీ ఎంట్రన్స్‌ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. కొత్త తేదీని త్వరలోనే ప్రకటించనుంది. అభ్యర్థులు natboard.edu.in, nbe.edu.in వెబ్‌సైట్లను పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది నీట్-పీజీ కోసం 2,42,678 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో తెలంగాణ నుంచి సుమారు 10–12 వేల మంది అభ్యర్థులు ఉండొచ్చని అంచనా.

'స్థానికత'పై సర్కారుకు సుప్రీం నోటీసులు

- విద్యార్థుల పిటిషన్లపై కౌంటర్ దాఖలుకు ఆదేశం
- తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మెడికల్ సీట్ల కేటాయింపులో స్థానికత అంశంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. విద్యార్థులు దాఖలు చేసిన ఇంటర్‌లొక్యూటరీ అప్లికేషన్ (ఐఏ) పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జీవో 33 విడుదల చేసింది. నీట్ పరీక్షకు ముందు నాలుగేళ్లపాటు రాష్ట్రంలో చదివి ఉండాలని జీవో లోని నిబంధన 3 (ఏ)లో పేర్కొంది. దీనిని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్ సహా 160 మంది తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం గతేడాది సెప్టెంబర్ 5న విద్యార్థులకు అనుకూలంగా తీర్పు చెప్పింది. ఈ తీర్పును సెప్టెంబర్ 11న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అయితే.. ఒకసారి మినహాయింపు కింద హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. దీంతో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ తర్వాత మరి కొంతమంది విద్యార్థులు కూడా తమకు స్థానికత వర్తింపజేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం ఇందుకు సంబంధించిన అన్ని పిటిషన్లను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనల అనంతరం కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఫైర్ సేఫ్టీ ఎన్‌ఓసీకి ఏఐ సిస్టం

- తెలంగాణ అగ్నిమాపక శాఖలో అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి..
- వట్టినాగులపల్లిలో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించిన ఫైర్ డీజీ నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: బిల్డింగ్స్‌కు ఫైర్ సేఫ్టీ ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఆన్‌లైన్ ఆటోమేటిక్ బిల్డింగ్ ఫైర్, లైఫ్ సేఫ్టీ ఆటో డ్రాయింగ్స్ స్క్రూటినీ సాఫ్ట్‌వేర్‌ను తెలంగాణ అగ్నిమాపక శాఖ అధికారులు ఫైర్ సర్వీసెస్‌తో అనుసంధానం చేశారు. వట్టినాగులపల్లిలోని ఫైర్ సర్వీసెస్ అకాడమీలో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, ఆటో డ్రాయింగ్ స్క్రూటినీ సిస్టమ్‌ను సినీనటుడు మురళీమోహన్‌తో కలిసి ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి సోమవారం ప్రారంభించారు. బిల్డింగ్ నిర్మాణాల్లో ఫైర్ నిబంధనలు, ఫైర్ డయాగ్రామ్ సహా ఇతర సేఫ్టీకి అవసరమైన ఎన్‌ఓసీ మంజూరు చేసేందుకు ఈ ఏఐ ఆధారిత సిస్టం వినియోగించనున్నారు. దేశంలోనే మొదటి సారిగా రాష్ట్ర ఫైర్ సర్వీసెస్‌లో ఈ సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ.. బిల్డింగ్‌లకు అనుమతులివ్వడం కోసం రూపొందించిన ఈ ఆటో డ్రాయింగ్ స్క్రూటినీ సిస్టమ్ దేశంలోనే మొదటిదన్నారు. ఆటో క్యాట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అనుమతులిస్తామని చెప్పారు. ఇరిగేషన్, మున్సిపల్ ఇతర డిపార్ట్‌మెంట్లలో అనుసంధానం చేసుకుని ట్రాకింగ్, ప్రాసెసింగ్, అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో 101 నంబర్‌కి కాల్ వస్తే కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు బంజారాహిల్స్‌లోని మెయిన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కనెక్ట్ అవుతుందని నాగిరెడ్డి తెలిపారు. అగ్నిమాపక శాఖలో అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి తేవడంపై సినీ నటుడు మురళీమోహన్ సంతోషం వ్యక్తంచేశారు.

ఐఎస్‌బీకి ప్రపంచ టాప్-23వ స్థానం

ఫైనాన్షియల్ టైమ్స్-2025 ర్యాంకుల్లో ఘనత



రాయదుర్గం: దేశంలోని ప్రఖ్యాత విద్యాసంస్థ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అంతర్జాతీయ స్థాయిలో మరోసారి సత్తాచాటింది. ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ) ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కస్టమ్ ర్యాంకింగ్-2025లో ఆసియాలోకెల్లా మొదటి ర్యాంకును, ప్రపంచ స్థాయిలో 23వ ర్యాంకును సాధించింది. గతేడాది ప్రపంచ స్థాయిలో 26వ ర్యాంకులో నిలిచిన ఐఎస్‌బీ.. ఈసారి మూడు ర్యాంకులు మెరుగుపరుచుకొని 23వ ర్యాంకు సాధించడం విశేషం. అలాగే వివిధ విభాగాలవారీగా సైతం ఐఎస్‌బీ మెరుగైన ర్యాంకులు సాధించింది. ఫ్యూచర్ యూజ్ విభాగంలో 2వ ర్యాంకు, డబ్బుకు తగ్గ విలువ విభాగంలో 12వ ర్యాంకు, ప్రోగ్రామ్ డిజైన్‌లో 22వ ర్యాంకు, ఇంటర్నేషనల్ క్లెయింట్స్ విభాగంలో 23వ ర్యాంకు, నెరవేరిన లక్ష్యాల విభాగంలో 24వ, బోధనా పద్ధతుల విభాగంలో ప్రపంచ స్థాయిలో 25వ స్థానంలో నిలిచింది. ఐఎస్‌బీలోని యంత్రాంగం, విద్యార్థులు, పూర్వ విద్యార్థుల సమష్టి కృషికి ఈ ర్యాంకింగ్స్ నిదర్శనమని ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్ సూద్ పేర్కొన్నారు. ఐఎస్‌బీ కార్యనిర్వాహక విద్యా కార్యక్రమాలను మరింత శక్తివంతంగా నిర్వహించేందుకు చొరవ తీసుకుంటామన్నారు.

ఒక వస్తువు కావాల్సి వచ్చి ఆన్‌లైన్‌లో వెతికేటప్పుడు.. ఆ ఉత్పాదన తాలూకు పేజీలో 'ఒకటి మాత్రమే ఉంది', '10 నిమిషాల్లో కొంటే భారీ డిస్కౌంట్', 'ఫ్లాష్ డీల్ ఈ రోజు వరకే' వంటి సందేశాలు దర్శనమిస్తాయి. అవి నిజమనుకుని నమ్మి కస్టమర్లు వెంటనే కొనేస్తారు. అమ్మకాలను పెంచుకోవడమే లక్ష్యంగా చేసే ఈ మాయాజాలాన్ని 'డార్క్ ప్యాటర్న్స్' అని పిలుస్తారు. ఈ-కామర్స్ కంపెనీలు పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ఆర్భాటంగా నిర్వహించే 'ఆన్‌లైన్ సేల్స్' సమయంలో ఈ మాయాజాలం విభిన్న రూపాల్లో 'స్క్రీన్'పైన దర్శనమిస్తుంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



డీల్ కాదు.. జేబు ఖాళీ!

ఓ సర్వే ప్రకారం కొనాలన్న ఆలోచన లేనప్పటికీ డార్క్ ప్యాటర్న్స్ కారణంగా ఆకర్షితులై 40% కంటే ఎక్కువ మంది వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేస్తున్నారట. షాపింగ్ వెబ్‌సైట్ల తప్పుదారి పట్టించే, మోసపూరిత, చట్టవిరుద్ధ వ్యూహాలే ఇందుకు ప్రధాన కారణం. ఈ-కామర్స్, క్విక్ కామర్స్ కంపెనీలు వివిధ రకాల డార్క్ ప్యాటర్న్స్‌తో కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి. తీరా చూస్తే తాము ఎక్కువ ఖర్చు చేశామనో.. లేదా అంతగా ఉపయోగకరం కాని ఉత్పత్తులను కొన్నామనో వినియోగదారులు తరువాత తెలుసుకుంటున్నారు. ఆన్‌లైన్ కస్టమర్లు తమకు కావాల్సిన వస్తు, సేవలను వేగంగా, సౌకర్యంగా పొందడం కోసం తరచూ డబ్బు, సమాచారం, గోప్యతతో రాజీ పడుతున్నారనేది నగ్న సత్యం.

ఈ-కామర్స్ కంపెనీల మాయాజాలం
'డార్క్ ప్యాటర్న్స్'తో గాలం
అవసరం లేకపోయినా కొనిపించేలా ఎత్తులు
రంగంలోకి కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ

ఒకటికి రెండుసార్లు..

ఏ వెబ్‌సైట్ ఉపయోగిస్తున్నా, సర్వీస్ ప్రొవైడర్‌ను ఎంతగా విశ్వసించినా మీ నుంచి ఏ సమాచారం అడుగుతున్నారు, ఎటువంటి అనుమతులు కోరుతున్నారు అనే అంశాలపై వినియోగదార్లు అప్రమత్తంగా ఉండాలి. స్క్రీన్‌పై ఉన్న సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. 'బై' బటన్ క్లిక్ చేసే ముందు మీకు కావాల్సింది మాత్రమే అక్కడ ఉందో లేదో ఒకటికి రెండుసార్లు గమనించాలి. ఆన్‌లైన్ సేవల కోసం సైన్ అప్ చేసే ముందు అన్ని సమయాల్లో రద్దు చేసుకునేందుకు స్పష్టమైన, కచ్చిత అవకాశం ఉందా లేదా నిర్ధారించుకోవాలి.

కనీసం ఒకటి..

అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా–2024 నివేదిక ప్రకారం.. అత్యధికంగా డౌన్‌లోడ్ అయిన టాప్–53 భారతీయ యాప్స్‌లో ఒకటి మినహా మిగిలినవన్నీ కనీసం ఒక డార్క్ ప్యాటర్న్ ఉపయోగించాయట. లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వే ప్రకారం దాదాపు 50% భారతీయ వినియోగదారులు ఆన్‌లైన్ చెల్లింపుల సమయంలో కనీసం ఒక డార్క్ ప్యాటర్న్ సమస్యను ఎదుర్కొన్నారట.

రంగంలోకి కేంద్ర ప్రభుత్వం

ఈ–కామర్స్ సంస్థలు అనుసరిస్తున్న ఈ మోసపూరిత విధానాల పట్ల వినియోగదారులు, ఆఫ్‌లైన్ ట్రేడర్ల నుంచి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఉత్పత్తులు పరిమితంగా ఉన్నాయని బుకాయించడం, పేమెంట్ చేసే సమయానికి అదనపు చార్జీ, నకిలీ కౌంట్‌డౌన్ టైమర్స్, ఒక వస్తువు చూపించి మరొకటి అంటగట్టడం, లావాదేవీ రద్దు చేసే అవకాశం లేకపోవడం, యూజర్ కోరకున్నా ప్రకటనల వీడియో ప్లే కావడం, తప్పుడు రివ్యూలు, పోల్చుకునే అవకాశం లేకపోవడం వంటి 13 రకాల డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించింది. నిబంధనలను పాటించకపోతే చట్ట పరంగా చర్యలు ఉంటాయని ఈ–కామర్స్ కంపెనీలను వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. వినియోగదారుల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే, అనాలోచిత కొనుగోళ్లు, చర్యలకు దారితీసే తప్పుదారి పట్టించే డార్క్ ప్యాటర్న్స్‌ను తొలగించడానికి చేసిన మార్పులను వివరిస్తూ అంతర్గత వార్షిక తనిఖీ నివేదికలను మంత్రిత్వ శాఖకు సమర్పించాలని కంపెనీలకు స్పష్టం చేసింది.

విదేశాల్లో చట్టాలు

భారత్‌లో ఇప్పటివరకు ఈ పద్ధతిని నిషేధించే నిర్దిష్ట చట్టాలు లేవు. వినియోగదారుల రక్షణ చట్టం –2019 ప్రకారం అన్యాయమైన వాణిజ్య పద్ధతులుగా గుర్తిస్తూ డార్క్ ప్యాటర్న్స్‌ను అరికట్టడానికి కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ (సీసీపీఏ) 2023 నవంబర్‌లో మార్గదర్శకాలను జారీ చేసింది. అమెరికా, ఈయూ తదితర దేశాల్లో దీనికి సంబంధించి చట్టాలు అమలులోనూ ఉన్నాయి. వినియోగదారులు కుకీజ్‌ను అంగీకరించడం కంటే తిరస్కరించడం కష్టతరం చేసినందుకు గూగుల్, ఫేస్‌బుక్ రెండింటికీ ఈయూ, ఫ్రెంచ్ డేటా రక్షణ చట్టాల ప్రకారం 2022లో జరిమానా విధించారు.

డార్క్ ప్యాటర్న్స్‌కు సంబంధించి వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లు/వేదికలు
- జాగృతి యాప్
- జాగో గ్రాహక్ జాగో యాప్
- జాగృతి డ్యాష్‌బోర్డ్

కొన్ని డార్క్ ప్యాటర్న్స్

తొందరపెట్టడం (ఫాల్స్ అర్జెన్సీ)
ఉదా: 'కేవలం రెండే ఉన్నాయి', 'మరో 50 నిమిషాల్లో కొంటేనే భారీ డిస్కౌంట్' అని వినియోగదారులను ఆలోచించుకోనివ్వకపోవడం

అదనపు బరువు అంటగట్టడం (బాస్కెట్ స్నీకింగ్)
ఉదా: విమాన టికెట్ కొన్నప్పుడు.. వినియోగదారుడికి తెలియకుండానే ప్రయాణ బీమాను అంటగట్టడం

కించపరిచి.. పబ్బం గడుపుకొని (కన్ఫర్మ్ షేమింగ్)
ఉదా: వస్తువు కొనేటప్పుడు మొత్తం కింద 'చారిటీ' అని పెట్టి 'ధనవంతులకే దానాలు. నేను చేయను'; విమాన టికెట్లు కొనేటప్పుడు బీమా కూడా చేర్చి 'నాకు రక్షణ అక్కర్లేదు' వంటివి పెట్టడం

షరతులతో.. (ఫోర్స్‌డ్ యాక్షన్)
ఉదా: ఒక వినియోగదారుడు ఎక్స్ అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే.. దాన్ని తెరవాలంటే వై అనే మరో యాప్ కూడా డౌన్‌లోడ్ చేయాలని షరతులు పెట్టడం. అది చేసేవరకూ ఎక్స్ ఓపెన్ కాకపోవడం

సబ్‌స్క్రైబింగ్ వల
ఉదా: ఒక వస్తువు కొనే సమయంలో ఆటో డెబిట్ వంటివి ప్రతిసారీ వచ్చేలా చేయడం. పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ క్యాన్సిల్ చేసే ప్రక్రియ చాలా సంక్లిష్టంగా ఉండటం

తప్పుదారి పట్టించేలా.. (ఇంటర్‌ఫేస్ ఇంటర్‌ఫియరెన్స్)
ఉదా: ఏదైనా కొనేటప్పుడు లేదా వద్దనుకున్నప్పుడు 'యస్', 'నోలలో'.. నో అనే పదాన్ని లైట్ కలర్‌లో కనిపించీ కనిపించనట్టు చేయడం

వలవేసి.. వేరే చేసి (బెయిట్ అండ్ స్విచ్)
ఉదా: ఒక వస్తువును తక్కువ ధరకు చూపించి, తీరా పేమెంట్ చేసే సమయానికి ఆ వస్తువు కనిపించకుండా పోవడం, అలాగే కనిపించే ఎక్కువ ధర ఉండే వస్తువు ప్రత్యక్షం కావడం

మోసపూరిత ధర (డ్రిప్ ప్రైసింగ్)
ఉదా: చెస్ ఆడటానికి ఒక యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే.. మొదట ఉచితం అని చూపించి, వారం రోజుల తరువాత.. డబ్బులు చెల్లిస్తేనే తప్ప ఆడలేరు అని చెప్పడం.

ప్రకటన అని తెలియకుండా..
ఉదా: మరొక యాప్‌నకు సంబంధించిన ప్రకటన.. ఇప్పుడు చూసే పేజీలో ఉండటం, దాన్ని నొక్కితే అనూహ్యంగా ఆ యాప్‌లోకి వెళ్లిపోవడం లేదా ప్రకటనలను ప్రకటనల్లా కాకుండా కంటెంట్‌లానో మరోలానో ఇవ్వడం

పదేపదే వేధించడం
ఉదా: పదే పదే తమ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని వెబ్‌సైట్లు అడగడం, ఫోన్ నంబర్లు అడగడం, 'నోటిఫికేషన్లు' ఆన్ చేయాలని బలవంతపెట్టడం.. నో చెప్పేందుకు నో బటన్ స్పష్టంగా కనిపించకపోవడం.



తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా జగిత్యాల జిల్లా ఐడీవోసీలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాయికల్‌కు చెందిన చిన్నారి బొమ్మకంటి అంజనశ్రీ కృత్రిమ కాలుతో చేసిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. -జగిత్యాల టౌన్

తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్పంచుల జేఏసీ అందజేత

సాక్షి, హైదరాబాద్: సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదంటూ ప్రభుత్వానికి నిరసనగా సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుర్వి యాదయ్య గౌడ్, రాంపాక నాగయ్య మాట్లాడారు. గ్రామ అభివృద్ధి కోసం చేసిన పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి అనేక విధాలుగా వినతిపత్రాలు సమర్పించినా స్పందించలేదని వాపోయారు. రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. బిల్లులు చెల్లించాలని తెలంగాణ తల్లి విగ్రహం, అమర జ్యోతి, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించామన్నారు.

బీజేపీలో రాజాసింగ్ రచ్చ

- రోజుకో ప్రకటనతో పార్టీ నేతలపై తీవ్ర విమర్శలు
- పరోక్షంగా మీడియాకు లీకు నోట్‌లు
- గతంలో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నా అదేతీరు
- దీంతో నోటీసు ఇవ్వాలని భావిస్తున్న రాష్ట్ర పార్టీ
- ఇప్పటికే ఈ అంశంపై ఆరాతీసిన పార్టీ ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రకటనలు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నేరుగా ఆయన మీడియా ముందుకొచ్చి వ్యాఖ్యలు చేయకపోయినా, సామాజిక మాధ్యమాల ద్వారా పంపుతున్న ప్రకటనలు మాత్రం కాక రేపుతున్నాయి. రాష్ట్ర బీజేపీలో కీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని రాజాసింగ్ విమర్శలు సంధిస్తున్నారు. కొంతకాలంగా సాగుతున్న ఈ విమర్శలు ఇప్పుడు తారస్థాయికి చేరాయి. అగ్రనేతల వైఖరిని పార్టీ నాయకత్వానికి లింకుపెడుతూ చేస్తున్న విమర్శలు అటు నేతలు, ఇటు పార్టీ పరువు బజారున పడుతోందనే చర్చ జరుగుతోంది.

అందరి జాతకాలు బయటపెడతా అంటూ....

కొంతకాలంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్... సోమవారం మరోమారు తన ప్రకటనలో తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. 'మీడియాలో ఒక వార్త నడుస్తోంది. రాజాసింగ్‌కు నోటీస్ ఇవ్వడానికి రాష్ట్ర పార్టీ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ అది నిజమే అయితే... నోటీస్ కాదు, ఏకంగా సస్పెండ్ చేయండి. కొజ్జాగాళ్ల వెంట కలిసి పార్టీని స్ట్రాంగ్ చేయలేం. ధర్మ కార్యక్రమాలు చేపట్టలేం. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేం. ఒకవేళ సస్పెండ్ చేస్తే ఎవరి వల్ల పార్టీకి నష్టం జరిగిందనే నిజాలను బయటపెడతా. అందరి జాతకాలను ప్రజల ముందు ఉంచుతా'అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

- ఇటీవల కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని వ్యాఖ్యానించిన సమయంలోనూ రాజాసింగ్ ఒక ప్రకటన చేస్తూ.. 'మా పార్టీలోని వాళ్లకు ప్యాకేజీలు భారీగా వస్తే.. వీళ్లే విలీనం చేస్తారు'అంటూ కామెంట్ చేయడం, దీనికి కరీంనగర్ కార్యకర్తల నుంచి నిరసన వ్యక్తం కావడంతో.. దొంగలు దొంగలు కలిసిపోయారంటూ వివాదాస్పద కామెంట్లు చేసిన సంగతి విదితమే.

ఏం చేద్దాం..?

మీడియాలో రాజాసింగ్ చేస్తున్న విమర్శలు, వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. ఆయన తీరు పట్ల రాష్ట్ర నాయకత్వం పార్టీ కీలక నేతలతో సమాలోచనలు చేస్తోంది. ప్రస్తుతానికి నోటీసులు ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ అంశంపై సంఘ్‌పరివార్‌తోనూ సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. మరోవైపు పార్టీ జాతీయ నాయకత్వం దృష్టికి సైతం రాజాసింగ్ వైఖరిని తీసుకెళ్లారు. దీనిపై రాష్ట్రపార్టీ ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్ ఆరా తీశారు.

- గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో రాజాసింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసి టికెట్ ఇవ్వడంతో బీజేపీ తరపున పోటీచేసి గోషామహల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. కొంతకాలంగా రాష్ట్రపార్టీ నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న తీరు, పార్టీ సమావేశాలు, కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వైనంపై కూడా జాతీయ నాయకత్వం పూర్తి సమాచారం తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఆగని బెదిరింపులు

తల నరికి చంపుతామని హెచ్చరిక

అబిడ్స్ (హైదరాబాద్): మరోసారి గుర్తు తెలియని వ్యక్తులు తనకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారని, ఏకంగా తల నరికి చంపుతామని హెచ్చరించారని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వేర్వేరు ఫోన్ నంబర్ల ద్వారా తనకు కాల్ చేసి తీవ్రంగా బెదిరించడంతోపాటు తనను హత్య చేస్తామని చెప్పినట్లు వివరించారు. ఇప్పటివరకు ఎన్నోసార్లు తనకు బెదిరింపు కాల్స్ వచ్చాయని, బెదిరింపులకు పాల్పడుతూ చేసిన ఫోన్ నంబర్లను ఆయన విడుదల చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

సాఫీగా స్లాట్ బుకింగ్

సంగారెడ్డి జిల్లాలో సాంకేతిక సమస్యలు..

సాక్షి, నెట్‌వర్క్: రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన తొలిరోజు సోమవారం పలుచోట్ల సాఫీగా ప్రక్రియ కొనసాగగా, ఒకటి రెండుచోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తాయి. సంగారెడ్డిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. మొత్తం 51 స్లాట్‌లు బుక్ కాగా, సాయంత్రం ఆరు గంటల వరకు 28 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. మిగిలిన వాటిని మంగళవారానికి రీషెడ్యూల్ చేస్తామని అధికారులు తెలిపారు. మరికొన్నిచోట్ల కూడా చిన్నపాటి సమస్యలు తలెత్తాయి. చాలా జిల్లాల్లో మాత్రం స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాఫీగా కొనసాగింది.

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానంలో ఎక్కడా సాంకేతిక సమస్యలు తలెత్తలేదు. తొలిరోజు 109 రిజిస్ట్రేషన్లు చేసినట్టు అధికారులు తెలిపారు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 140 దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేశారు.
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్క స్లాట్ కూడా బుక్ కాలేదు. మిగతాచోట్ల 126 స్లాట్లు బుక్ కాగా.. అందరి డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేశారు.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 111 స్లాట్స్ బుక్ అయ్యాయి. ఇందులో 105 రిజిస్ట్రేషన్లు జరగగా, ఎలాంటి సమస్యలు తలెత్తలేదు.

సాయి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

- మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



లక్ష్మికి ఇందిరమ్మ ఇల్లు ఉత్తర్వుల కాపీని అందిస్తున్న విప్ అయిలయ్య. పక్కన కొడుకును భుజాలపై ఎత్తుకున్న తండ్రి మల్లయ్య

సాక్షి ఎఫెక్ట్

జనగామ: జనగామ పట్టణం 21వ వార్డు కురుమవాడకు చెందిన దివ్యాంగుడు పర్శ సాయికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. 'ఉచిత కరెంటు రాలేదు.. ఇందిరమ్మ ఇల్లు లేదంటున్నారు.. కొడుకును సాదుకునే శక్తిలేదు.. ఇక మేము ఎలా బతకాలి' అంటూ తల్లిదండ్రులు లక్ష్మి, మల్లయ్య దంపతులు విలపిస్తున్న తీరుపై 'నా కొడుకును సంపేయండి' శీర్షికన ఏప్రిల్ 4న సాక్షి స్టేట్ పేజీలో ప్రచురితమైన కథనానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సైతం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబ స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు, కుమారుడు సాయి పరిస్థితిని వివరిస్తూ కలెక్టర్ రిజ్వాన్ బాషా నివేదిక రూపంలో సర్కారుకు పంపించారు. ఎక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగిన రాష్ట్రావతరణ వేడుకల్లో విప్ బీర్ల అయిలయ్య చేతుల మీదుగా సాయి తల్లిదండ్రులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఉత్తర్వుల కాపీని అందించారు. తమ కుటుంబం పడుతున్న బాధను సీఎం దృష్టికి తీసుకువెళ్లడంలో కృషి చేసిన 'సాక్షి'కి రుణపడి ఉంటామని తల్లి లక్ష్మి భావోద్వేగమయ్యారు. ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

మహిళా నేతలకు పార్టీలో తగిన ప్రాధాన్యం

- మహిళా కాంగ్రెస్ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: మహిళా కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారందరికీ పార్టీలో తగిన ప్రాధాన్యమిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయమై చర్చించి తగిన అవకాశాలిస్తామని చెప్పారన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు నేతృత్వంలో గాంధీభవన్‌లో జరిగిన సమావేశానికి హాజరైన ఆయన మహిళా కాంగ్రెస్ కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నాయకులకు పార్టీలో, ప్రభుత్వంలో తగిన అవకాశాలు కల్పించాలని పలువురు కోరారు. ఇందుకు స్పందించిన మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ కష్టపడే వారికి కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ అవకాశాలుంటాయన్నారు. అయితే రాజకీయాల్లో ఓపిక ఉండాలని సూచించారు. పార్టీ లైన్ దాటి ఎవరూ వెళ్లకూడదని, క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాలన చేతకాకపోతే సీఎంను మార్చుకోండి

- ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



సిద్దిపేట జోన్: 'కాంగ్రెస్ పార్టీకి పాలన చేతకాకపోతే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సలహాలు, సూచనలు అడగండి.. లేకుంటే ముఖ్యమంత్రిని మార్చి కొత్త సీఎంను తెచ్చుకోండి' అని జిల్లా పార్టీ అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా పొన్నాల శివారులోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పథకాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రాజీవ్ యువ వికాసం వాయిదా వేయడం అంటే ప్రభుత్వం సరిగ్గా పనిచేయడం లేదని అర్థమవుతోందన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు చిన్నగా ఉన్నాయని ప్రజలు అనాసక్తి వ్యక్తం చేస్తూ తిరస్కరిస్తున్నారని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

రాహుల్ ప్రశ్నలు అడిగితే నిందలు వేస్తారా?

- బీజేపీ నేతలకు తలకాయ ఉంటుంది కానీ మెదడు ఉండదు: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్/సంగారెడ్డి: ఆపరేషన్ సిందూర్ విషయంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఆయనపైనే నిందలు మోపుతున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తానీ మిలిటెంట్లు మన దేశంలోకి చొరబడి 26 మందిని కాల్చి చంపేంతవరకు బీజేపీ ప్రభుత్వానికి సోయి లేదని, ఆ తర్వాత జరిగిన పరిణామాలపై ఎవరైనా ప్రశ్నిస్తే మాత్రం వారిపై ఎదురుదాడికి దిగుతోందన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతలకు తలకాయ ఉంటుంది కానీ మెదడు ఉండదన్నారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డిది అటెండర్ పోస్టే: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ వద్ద అటెండర్ లాగా నిలబడాల్సిందేనని జగ్గారెడ్డి హాట్ కామెంట్ చేశారు. కేసీఆర్ కూర్చోమంటే కూర్చోవాలని.. నిలబడమంటే నిలబడాల్సినస్థాయి ప్రభాకర్‌రెడ్డిదని ఎద్దేవా చేశారు.



పట్టాలపై మృత్యుఘంటికలు

రైలు పట్టాలు మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. పట్టాలు దాటుతూ రైళ్లు ఢీకొని కొందరు, బలవన్మరణాలకు పాల్పడుతూ మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. -10లో



చల్ మేరే దిల్..

జనాల్లో సైకిల్ అండ్ సైక్లింగ్‌పై క్రేజ్ పెరుగుతోంది. క్రేజ్‌కు తగ్గట్లుగా అన్ని వర్గాలకు అనుకూలంగా అనేక మోడళ్లు ఇప్పుడు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
35.0/24.0

వాతావరణం

నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

సమష్టిగా పనిచేద్దాం

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో మేయర్ విజయలక్ష్మి



లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ అభివృద్ధికి అందరం సమష్టిగా అంకితభావంతో పని చేద్దామని, నగరాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మేయర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో కలిసి జాతీయ జెండాను ఎగరవేశారు. తెలంగాణ పోరాటంలో ఎందరో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడి అసువులు బాశారని, ఈ సందర్భంగా వారందరిని స్మరిస్తూ, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు, స్వాతంత్ర్య సమరయోధులకు, తెలంగాణ ఉద్యమకారులకు, కార్పొరేటర్లకు, ఇతర ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్ఎంసీలో చేపట్టిన, చేపడుతున్న హెచ్-సిటీ, ఎస్.ఆర్.డి.పి, ఎస్.ఎన్.డి.పి, డి-సిల్టింగ్, సుందరీకరణ, వాటర్ లాంగిగ్, కమ్యూనిటీ డెవలప్మెంట్, స్కిల్ డెవలప్మెంట్, పి.ఎం స్వానిధి, ఫుడ్ సేఫ్టీ, అర్బన్ బయో డైవర్సిటీ తదితర కార్యక్రమాలపై క్లుప్తంగా వివరించారు. అనంతరం శానిటేషన్, వెటర్నరీ, ఎంటమాలజీ విభాగాల కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, రఘు ప్రసాద్, వేణుగోపాల్, సుభద్రా దేవి, నళినీ పద్మావతి, గీతా రాధిక, యాదగిరిరావు, అశోక్ సామ్రాట్, సీసీపీ శ్రీనివాస్, సీఈ సహదేవ్ రత్నాకర్, అడిషనల్ సీసీపీలు వెంకన్న, ప్రదీప్, ఈవీడీఎం అడిషనల్ ఎస్.పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవ వేళ...













తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్ని సోమవారం నగరవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన పోలీసుల పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

నిధుల కొరతతో ఆగిన గ్రేటర్ అభివృద్ధి : కిషన్‌రెడ్డి



అడ్డగుట్ట: జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాలకు సంబంధించి నిధుల కొరత కారణంగా సరైన అభివృద్ధి జరగడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అడ్డగుట్ట డివిజన్‌లో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తుకారాంగేట్ సాయినగర్‌లోని షిరిడీ సాయిబాబా స్కూల్ ప్రాంగణంలో వి అధికారులు, స్థానిక బస్తీవాసులతో సమావేశమైన కేంద్ర మంత్రి డివిజన్‌లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు స్థానికులు రోడ్లు, నీటి ఎద్దడి, పవర్‌బోర్ రిపేర్లు, ఎలక్ట్రిక్ పోల్స్, స్ట్రీట్ లైట్లు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలకు సంబంధించి నిధుల కొరత చాలా ఉందన్నారు. దీంతో నగరంలో జరిగే అభివృద్ధి పనులకు కుంటుపడుతుందన్నారు. వీధి లైట్లు కాలిపోయినా కొత్త బల్బులు ఇవ్వలేని దుస్థితిలో జీహెచ్ఎంసీ ఉందని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన తాగునీరు, విద్యుత్, కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, నాయకులు మేకల సారంగపాణి, బండ కార్తీకరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కన్నాభిరాం, డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య, కళావతి, శ్యామల, శివాజీ, ఉదయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నీటితో కాసుల వేట!

గ్రేటర్‌లో యథేచ్ఛగా అక్రమ నీటి వ్యాపారం



- అధికారుల కళ్లకు కనిపించని ఈ దందా
- ప్రైవేట్ స్థలాల్లో బోర్లు వేసి భారీ స్థాయిలో..
- మూసీ తీరం నుంచీ పెద్ద ఎత్తున విక్రయం
- వాల్టా చట్టానికి అడుగడుగునా తూట్లు

సాక్షి, సిటీబ్యూరో: నాగోలు ఠాణా పరిధిలోని జైపురికాలనీ చౌరస్తాలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదం గ్రేటర్‌లో సాగుతున్న అక్రమ నీటి వ్యాపారాన్ని బయటపెట్టింది. బోర్ల ద్వారా జరుగుతున్న నీటి దందాను వెలుగులోకి తెచ్చింది. నగరంతో పాటు మూసీ తీరం వెంట అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులూ లేకుండా భారీగా బోర్లు వేస్తున్న కొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు. వాటర్-ల్యాండ్-ట్రీ యాక్ట్‌ను (వాల్టా చట్టం) అడ్డంగా ఉల్లంఘిస్తున్నా...ఒక్క రూపాయి పన్ను చెల్లించకుండా ప్రతి రోజూ రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నా సంబంధిత విభాగాలు పట్టినట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ అక్రమ నీటి వ్యాపారం ఫలితంగా అనేక కాలనీల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి.

పట్టుమని పది సంస్థలూ లేవు...

గృహావసరాల కోసం బోరు వేయాలన్నా కచ్చితంగా స్థానిక తహసీల్దార్ నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. ఇలా వేసిన బోరు నీటిని కేవలం గృహ, వ్యక్తిగత అవసరాలకు మాత్రమే వినియోగించాలి. కనీసం ఒక్క ట్యాంకర్ కూడా విక్రయించడానికి ఆస్కారం లేదు. ప్లాంట్ ఏర్పాటు చేసి, అనుమతి పొందితే శుద్ధి చేసిన తాగు నీరు విక్రయించవచ్చు. ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్మాలంటే కచ్చితంగా భూగర్భ జల శాఖ వద్ద అనుమతి తీసుకోవాలి. ప్రస్తుతం ఇలా అనుమతి తీసుకున్న వ్యక్తులు, సంస్థలు కనీసం పది కూడా లేకపోవడం గమనార్హం. భూగర్భ జలాలు పరిమితంగా ఉన్న చోట ఇలా బోర్ల ద్వారా విక్రయానికి అనుమతి లభించదు. ప్రస్తుతం నగరంలో మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా వందల అడుగుల బోర్లు వేసి ఆ నీటిని విక్రయిస్తున్న వాళ్లు పదుల సంఖ్యలో ఉన్నారు.

పగటి కంటే రాత్రివేళ ఎక్కువగా...

సాధారణ రోజుల్లో ఈ అక్రమ నీటి దందా పగటి వేళలో కంటే రాత్రి వేళల్లోనే ఎక్కువగా జరుగుతుంది. వేసవి కాలం వచ్చిందంటే చాలు అక్రమ వ్యాపారులు ట్యాంకర్ల ద్వారా 24 గంటలూ నీటిని తరలిస్తూనే ఉంటున్నారు. భారీ పరిణామంలో బోర్లు వేసిన ఈ అక్రమార్కులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జనరేటర్లు వినియోగించి మరీ నీటిని తోడేస్తున్నారు. కనీసం ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించకుండా రూ.లక్షల్లో వ్యాపారం చేసేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌ను దాని పరిమాణాన్ని బట్టి రూ.1,000 నుంచి రూ.3,000 వరకు విక్రయిస్తున్నారు. రోజుకు కొన్ని వందల ట్యాంకర్ల నీరు ఇలా ట్యాంకర్ల ద్వారా నీటికి ప్రముఖ హోటళ్లు, లాడ్జిలు, అపార్ట్‌మెంట్స్, హాస్టళ్లకు అమ్మేస్తున్నారు.

వినియోగం ఎంత శ్రేయస్కరం...?

ఈ అక్రమ నీటి వ్యాపారం వెనుక ఆరోగ్యానికి చేటు కలిగించే కోణమూ ఉందని తెలుస్తోంది. ట్యాంకర్లలో నీటిని నింపే బోర్లలో కొన్ని మూసీ తీరంలో ఉన్నాయి. ఫలితంగా వీటి నుంచి వచ్చే నీళ్లలో మూసీలోని రసాయన వ్యర్థాలకు సంబంధించిన ఆనవాళ్లు ఉంటున్నాయని తెలుస్తోంది. ఈ నీటిని ఖరీదు చేస్తున్న హోటళ్లు, లాడ్జిల నిర్వాహకులు, అపార్ట్‌మెంట్స్ వాసుల్లో కొందరికి ఈ విషయం తెలిసినా తప్పక ఖరీదు చేస్తున్నారు. ఈ నీటిని తాగడానికి వాడకపోయినా ఇతర అవసరాలకు, హోటల్, లాడ్జిల్లో సరఫరాకి వాడేస్తున్నారు. మరికొందరికి ఈ ట్యాంకర్ డ్రైవర్లు విషయం చెప్పకుండా విక్రయించేస్తున్నారని సమాచారం. వేసవి కాలంలో ఉండే నీటి డిమాండ్‌ను ఈ బోర్ల నిర్వాహకులు క్యాష్ చేసుకుంటున్నారు.

పట్టించుకోని సంబంధిత విభాగాలు...

అక్రమ నీటి దందాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు ఈ బోర్ల ద్వారా జరుగుతున్న దందా వైపు కన్నెత్తి కూడా చూడట్లేదనే విమర్శలు ఉన్నాయి. యథేచ్ఛగా సాగుతున్న ఈ దందా కారణంగా రాజధానిలోని అనేక ప్రాంతాల్లో భూగర్భ జాలాలు అడుగంటిపోతున్నాయి. ట్యాంకర్ డ్రైవర్ల నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ కారణంగా వాహనచోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. ఇవి తిరిగే మార్గాల్లో రహదారులు సైతం ఛిద్రం అవుతున్నాయి. ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి నీటి అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. 'అనుమతులు లేకుండా బోర్లు వేయడం నేరం. ట్యాంకర్ల ద్వారా అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు ఉంటాయి. అలాంటి బోర్లు, వాహనాలు సీజ్ చేస్తాం' అని రెవెన్యూ అధికారులు చెప్తున్నారు.

అక్రమ దందాలకు మచ్చుతునకలు:

- ఉప్పల్ మండలంలో మూసీ తీరం వెంట అనేక చోట్ల ఈ అక్రమ నీటి వ్యాపారం జరుగుతోంది.
- అంబర్‌పేట శ్మశాన వాటికను కూతవేటు దూరంలోనూ బోర్ల ద్వారా నీటిని తోడేసి ట్యాంకర్ల ద్వారా విక్రయించే దందా నడుస్తోంది.
- న్యూ మార్కెట్ మెట్రోస్టేషన్ సమీపంలో, ఛే నంబర్ ఫ్లైఓవర్ మార్గంలో, శ్రీనగర్ కాలనీలో జోరుగా సాగుతోంది.



జైపురి కాలనీ చౌరస్తాలో ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ (ఫైల్)

ముంపు ముప్పు తప్పేలా...

తిప్పలు పెడుతున్న మూడు ప్రాంతాలపై దృష్టి

- ఓ మోస్తరు వానకే రహదారులన్నీ జలమయం
- వాటి కేంద్రంగా కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్స్
- ఒక ప్రాంతంలో సమస్య పరిష్కరించిన అధికారులు
- మరో రెండు ప్రాంతాల్లో చర్యలకు సన్నాహాలు

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నగర ట్రాఫిక్ విభాగం అధికారులు సిటీలో ఉన్న కీలక వాటర్ లాగింగ్ ఏరియాలపై దృష్టి పెట్టారు. ఏఏ ప్రాంతాల్లో, ఏ స్థాయిలో వర్షానికి, ఎన్ని నీళ్లు నిలుస్తున్నాయి? అనే అంశాన్ని గడిచిన కొన్నాళ్లుగా అధ్యయనం చేశారు. దీని ఆధారంగా జాబితాను రూపొందించారు. ఈ నివేదికను జీహెచ్ఎంసీకి పంపిన ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాల్లో మరమ్మతులు చేయిస్తున్నారు. తొలి దశలో బేగంపేట, సైఫాబాద్‌ల్లో ఉన్న మూడు వాటర్ లాగింగ్ ఏరియాల రూపురేఖలు మారుస్తున్నారు. ఇప్పటికే ఓ ప్రాంతంలో పని పూర్తయిందని, మిగిలిన రెండు చోట్లా ఉన్న సమస్యని త్వరలోనే పరిష్కరిస్తామని ట్రాఫిక్ చీఫ్ డి.జోయల్ డెవిస్ 'సాక్షి'కి తెలిపారు. -సాక్షి, సిటీబ్యూరో

ఆ ప్రాంతాలు అత్యంత ఇబ్బందికరం...

జీహెచ్ఎంసీ గణాంకాల ప్రకారం 'గ్రేటర్'లో దాదాపు 150 వాటర్ లాగింగ్ ఏరియాలు ఉన్నాయి. ఇవన్నీ ప్రధాన రహదారుల పైనే ఉండటంతో ఓ మాదిరి వర్షానికీ రోడ్లు మునిగిపోయి ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నాయి. డ్రైనేజీ, వరద కాల్వలు అన్నిచోట్లా లేకపోవడం, ఉన్నవీ ప్రస్తుత అవసరాలకు సరిపోకపోవడంతో ఈ ఇబ్బందులు వస్తున్నాయి. ఈ ట్రాఫిక్ జామ్స్ సైతం నగర వ్యాప్తంగా ఒకేలా ఉండట్లేదు. కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్స్ ఆ ప్రాంతానికే పరిమితం అవుతున్నాయి. మరికొన్ని చోట్ల చుట్టుపక్కల ఏరియాల పైనా ప్రభావం చూపుతున్నారు. వాటర్ లాగింగ్ ఏరియాల్లో ఇలాంటి సమస్యాత్మకమైనవి గుర్తించిన ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రాధాన్యత క్రమంలో జీహెచ్ఎంసీ సహకారంతో అక్కడి సమస్యలు పరిష్కరిస్తున్నారు.

కోర్ సిటీలో ఇవి అత్యంత ఇబ్బందికరం...

నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న మూడు వాటర్ లాగింగ్ ఏరియాలు అత్యంత ఇబ్బందికరంగా మారాయి. వీటివల్ల ఆ ప్రాంతంతో పాటు దాని చుట్టుపక్కల ఉన్న ఏరియాల్లోనూ కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నారు. అత్యంత కీలకమైన రహదారుల్లో ఒకటైన బేగంపేట పరిధిలోని అమీర్‌పేట-సికింద్రాబాద్ మధ్య ఉన్న చీకోటి గార్డెన్స్‌తో పాటు సైఫాబాద్ పరిధిలోని ఓల్డ్ సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్, లక్డీకాపూల్ బస్టాండ్ వద్ద ఉన్న వాటర్ లాగింగ్ ఏరియాలు ట్రాఫిక్ పోలీసులకు చుక్కలు చూపిస్తున్నాయి. చీకోటీ గార్డెన్స్ వద్ద ప్రభావంతో పంజాగుట్ట, సోమాజీగూడ వరకు, మిగిలిన రెండు చోట్ల వాటర్ లాగింగ్ ప్రభావంతో ఖైరతాబాద్, నిరంకారి, అయోధ్య జంక్షన్, మాసబ్‌ట్యాంక్, రవీంద్రభారతి తదితర ప్రాంతాల వరకు ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నాయి. ఇవి క్లియర్ కావడానికి ఒక్కోసారి గంటలు పడుతుండటంతో సాధారణ వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

క్యారో సహకారంతో చీకోటి గార్డెన్స్ వద్ద...

ఈ పరిణామాలను పరిగణలోకి తీసుకున్న నగర ట్రాఫిక్ విభాగం అధికారులు జీహెచ్ఎంసీ సహకారంతో ఆయా సమస్యలకు కారణాలు అధ్యయనం చేశారు. మురుగు, వరదనీటిని కూకట్‌పల్లి నాలాలోకి తీసుకువెళ్లే డ్రైనేజీ చీకోటి గార్డెన్స్ వద్ద అంతకు ముందు ప్రాంతాల కంటే చిన్నగా ఉండటంతో పాటు వర్షం కురిసినప్పుడు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్), బేగంపేటలోని ఓల్డ్ ఎయిర్‌పోర్టు నుంచి భారీగా వరదనీరు రావడం కారణంగా గుర్తించారు. దీనికి పరిష్కారం కోసం అన్వేషించిన అధికారులు అక్కడ ఉన్న సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (క్యారో) సహకారం తీసుకున్నారు. వారి అనుమతితో అందులో ఉన్న ఓ చెరువును అభివృద్ధి చేసి హెచ్‌పీఎస్, ఓల్డ్ ఎయిర్‌పోర్టు నుంచి వచ్చే నీటిని డైవర్షన్ కెనాల్స్ ద్వారా అందులోకి మళ్లిస్తున్నారు. ఓ గేటు ఏర్పాటు చేయడం ద్వారా చెరువు నిండిపోతే... వంతుల వారీగా నీటిని బయటకు వదులి చీకోటీ గార్డెన్స్ డ్రైనేజీపై ఒత్తిడి తగ్గిస్తున్నారు. దీంతో అది పొంగిక వాటర్ లాగింగ్ తగ్గింది.

జీహెచ్ఎంసీ సహకారంతో ముందుకు



వాటర్ లాగింగ్ ఏరియాల వద్ద సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. తొలి దశలో కోర్ సిటీలోని మూడు ప్రాంతాలను ఎంచుకున్నాం. జీహెచ్ఎంసీ సహకారంతో అక్కడి సమస్యలు పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నాం. చీకోటి గార్డెన్స్ వద్ద సమస్య పరిష్కారమైంది. మిగిలిన రెండు చోట్లా పైప్ లైన్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ ముమ్మరంగా చర్యలు తీసుకుంటోంది. వర్షాలు ప్రారంభమయ్యే లోపు ఈ రెండు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వారికి అవసరమైన పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నాం.

- డి.జోయల్ డెవిస్, సిటీ ట్రాఫిక్ చీఫ్



చీకోటి గార్డెన్స్ వద్ద రహదారిపై వరద (ఫైల్)

అన్నిచోట్లా 'స్మార్ట్' రిజిస్ట్రేషన్లు

- గ్రేటర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో 'స్లాట్' విధానం అమలు
- అరగంటలోనే స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న దస్తావేజుదారులు

సాక్షి, సిటీబ్యూరో: స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ స్లాట్ ప్రకారం స్మార్ట్‌గా పూర్తవుతోంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణల్లో భాగంగా ప్రయోగాత్మకంగా రెండు విడతలుగా అమలు చేస్తున్న స్లాట్ బుకింగ్ ప్రక్రియ సత్ఫలితాలు ఇవ్వడంతో..తాజాగా అన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో సోమవారం అదే విధానాన్ని అమలు చేశారు. స్థిరాస్తి క్రయ, విక్రయదారులు అత్యవసర పనులు వదులుకొని దస్తావేజుల నమోదు కోసం గంటల తరబడి వేచి ఉండడం, అన్నింటికీ డాక్యుమెంట్ రైటర్లపై ఆధారపడే ఆనవాయితీకి ఇక ఫుల్‌స్టాప్ పడింది. దస్తావేజుదారులు స్లాట్ బుకింగ్ ద్వారా తమకు కేటాయించిన సమయంలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వచ్చి ప్రశాంతంగా కేవలం 15 నుంచి 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకొని, మరో 15 నిమిషాల్లో దస్తావేజులు అందుకుని ఇంటిదారిపడుతున్నారు. అయితే సోమవారం అష్టమి తిథి కావడంతో దస్తావేజుదారులు స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల కోసం కొంతమేర ఆసక్తి కనబర్చలేదు. సాంకేతిక సమస్యలు లేకుండానే రిజిస్ట్రేషన్ల నమోదు ప్రక్రియ ముందుకు సాగింది. రెండు, మూడు రోజుల్లో డాక్యుమెంట్ల సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

అన్ని చోట్లా అమలు...

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ విధానం అమలవుతోంది. మొదటి విడతలో ఎనిమిది, రెండో విడతలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలవుతోంది. తాజాగా మిగిలిన ఆఫీసుల్లో అమలు ప్రారంభమైంది. ఒక్కో సబ్ రిజిస్ట్రార్‌కు రోజువారీగా 48 చొప్పున స్లాట్లను కేటాయించారు. దస్తావేజుల తాకిడి అధికంగా గల సబ్ రిజిస్ట్రార్లలో మాత్రం డబుల్, త్రిబుల్ స్లాట్స్‌కు అవకాశం కల్పిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో సైతం దస్తావేజుదారులకు కేటాయించి స్లాట్ల సమయం ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసే విధంగా ప్రయత్నిస్తున్నారు. స్లాట్ బుక్ చేసుకోని అత్యవసర దస్తావేజుదారుల కోసం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు కేవలం ఐదు వాక్ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తున్నారు. నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరించి నమోదు ప్రక్రియ పూర్తి చేస్తున్నారు.



గ్రేటర్ పరిధిలో ఇలా....		
సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్	స్లాట్ బుకింగ్	రిజిస్ట్రేషన్ల పూర్తి
గండిపేట	36	36
అబ్దుల్లాపూర్‌మెట్	20	12
పెద్ద అంబర్‌పేట	22	22
శేరిలింగంపల్లి	23	23
ఇబ్రహీంపట్నం	30	30

దస్తావేజుదారుల సంతృప్తి

స్లాట్ బుకింగ్ విధానంపై స్థిరాస్తి దస్తావేజుదారుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం అర్ధగంటలోపు దస్తావేజుల ప్రక్రియ పూర్తి కావడం పట్ల క్రయ విక్రయ దారులు హర్షం వ్యక్తం స్తున్నారు. దళారుల ప్రమేయం, డాక్యుమెంట్ రైటర్లపై ఆధారపడడం ఇక ఉండదని పేర్కొంటున్నారు. స్వయంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో ఒక మాడ్యూల్‌ను కూడా ప్రవేశపెట్టడం బాగుందని అంటున్నారు.

ఇద్దరు వాహన దొంగల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ సత్యనారాయణ



స్వాధీనం చేసుకున్న వాహనాలు

జీడిమెట్ల: వాహనాల చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను జీడిమెట్ల, బాలానగర్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు.

షికారు చేసేందుకే..

సూరారం సాయిబాబానగర్‌కు చెందిన నక్క శ్రీనివాసరావు నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాల చోరీకి పాల్పడ్డాడు. అతను వాహనాలను చోరీ చేసి వాటిపై షికా చేసేవాడు. అతడిపై పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆరు కేసులు నమోదై ఉన్నాయి. గతంలో ఓ సారి జైలుకు వెళ్లి వచ్చిన అతను తన వైఖరి మార్చుకోకుండా వాహనాల చోరీకి పాల్పడుతున్నాడు. సోమవారం అతను దొంగిలించిన వెర్నా కారులో తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. జీడిమెట్ల పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

చోరీ చేసి సొమ్ము చేసుకుంటాడు..

దుండిగల్ మండలం, బౌరంపేట గ్రామానికి చెందిన మహ్మద్ షోహెబ్ వివిధ పీఎస్‌ల పరిధిలో వాహనాలు చోరీ చేసి విక్రయించేవాడు. ఓ చోరీ కేసులో తప్పించుకుతిరుగుతున్న అతడిని జీడిమెట్ల పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన బాలానగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రాజు, జీడిమెట్ల డీఐ కనకయ్య, ఎస్సైలు పోచయ్య, గిరిష్, శ్యాంబాబు, హెడ్‌కానిస్టేబుల్ ఇలేజర్, కానిస్టేబుళ్లు అర్జున్, విశాల్, రాజ్‌కుమార్‌లను ఏడీసీపీ సత్యనారాయణ అభినందించి మెరిట్ సర్టిఫికెట్‌లను అందజేశారు.

పట్టాలపై మృత్యుఘంటికలు

రైల్వేట్రాక్‌లపై పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్న వైనం
- సెల్ఫీలు, రీల్స్ మాయలో పడి మృత్యువాత
- ఎంఎంటీఎస్, సబర్బన్ మార్గాల్లోనే ఎక్కువ



సాక్షి, సిటీబ్యూరో: పట్టాలు మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. పట్టాలు దాటుతూ రైళ్లు ఢీకొని కొందరు, బలవన్మరణాలకు పాల్పడుతూ మరికొందరు పట్టాలపైనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా పెరుగుతున్న ప్రమాదాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ట్రాక్‌లకు రెండు వైపులా సరైన రక్షణ వ్యవస్థలు, కంచెలు లేకపోవడం వల్ల ప్రజలు యథేచ్ఛగా పట్టాలు దాటేస్తున్నారు. మరోవైపు ట్రైన్ తమను చేరే లోపు ట్రాక్ దాటేయొచ్చనే అతివిశ్వాసం కూడా నిండు ప్రాణాలను హరిస్తోంది. నగరంలోని ఎంఎంటీఎస్, సబర్బన్ ప్రాంతాల్లోనే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగించే ట్రాక్‌లకు రెండు వైపులా కాలనీలు, బస్తీలు ఉన్నాయి. రాత్రింబవళ్లు ఈ ట్రాక్‌లను దాటుతూ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దక్షిణమధ్య రైల్వేలోని జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు, అధికారుల అంచనాల ప్రకారం ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 450 ప్రమాదాలు నమోదయ్యాయి. ప్రతి రోజు సగటున మూడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. నిజానికి రైల్వే భద్రతా చట్టాల ప్రకారం పట్టాలు దాటడం నేరం. కానీ నగరంలోని వివిధ ప్రాంతాల్లో కాలనీలు, నివాస సముదాయాలకు సరైన రోడ్డు రవాణా సదుపాయాలు, పట్టాలు దాటవలసిన చోట ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వంటి ఏర్పాట్లు లేకపోవడం వల్ల గత్యంతరం లేని పరిస్థితుల్లోనే పట్టాలు దాటాల్సి వస్తోందని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ''పట్టాలను దాటుతూ ప్రమాదాల బారిన పడాలని ఎవరూ కోరుకోవడం లేదు. కానీ ఇవి తమ దైనందిన జీవితంలో భాగమయ్యాయి.'' అని డబీర్‌పూరా ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ఒక్క డబీర్‌పురా, ఉప్పుగూడ, మలక్‌పేట్, చాంద్రాయణగుట్ట వంటి ప్రాంతాలే కాదు. లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకు, నాంపల్లి నుంచి లింగంపల్లి వరకు, మేడ్చల్, మల్కాజిగిరి, చర్లపల్లి, ఉందానగర్, బీహెచ్‌ఈఎల్, సికింద్రాబాద్ వంటి అనేక చోట్ల పట్టాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

మలుపులు...మృత్యు పిలుపులు

''లింగంపల్లి నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే క్రమంలో నేచర్‌క్యూర్ హాస్పిటల్, భరత్‌నగర్, హఫీజ్‌పేట్, తదితర చోట్ల ట్రాక్ మలుపులు ఉన్నాయి. ఈ రూట్‌లో ట్రైన్ దగ్గరకు వచ్చే వరకు గుర్తించడం కష్టం. ట్రైన్ వచ్చేలోపు దాటేయవచ్చునని భావిస్తారు. ట్రైన్ శబ్దాన్ని విని చాలా దూరంగా ఉందనుకుంటారు. కానీ కేవలం 10 సెకన్ల వ్యవధిలోనే అది వందల మీటర్ల దూరం పరుగులు తీస్తుంది.'' అని దక్షిణ మధ్య రైల్వే అధికారి ఒకరు చెప్పారు. ఈ మలుపుల వద్దనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మరోవైపు ఆత్మహత్యలకు పాల్పడేందుకు ట్రాక్‌లను ఆశ్రయిస్తున్నారు. దూసుకొచ్చే రైళ్లకు ఎదురెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు.'' ట్రైన్‌కు ఎదురుగా మనిషి ఉన్నట్లు గుర్తించి బ్రేక్ అప్లయ్ చేస్తాం, కానీ అది కనీసం కిలోమీటర్ దూరంలో ఆగుతుంది. అప్పటికే ఆ వ్యక్తిని రైలు ఢీకొంటుంది.'' అని ఎంఎంటీఎస్ లోకోపైలెట్ ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 189 మంది ఇలా ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

సోషల్ మీడియా మేనియా....

సామాజిక మాధ్యమాల పిచ్చి కూడా నిండుప్రాణాలను బలితీసుకుంటోంది. ట్రాక్‌లపైన నించొని రకరకాల రీల్స్ చేస్తున్నారు. రైళ్లకు ఎదురెళుతూ వీడియోలు తీసి ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా వంటి వేదికల్లో తమ సాహసకృత్యాలను ప్రదర్శించుకుంటున్నారు. ముఖ్యంగా టీనేజ్ యువత ఇలాంటి సోషల్ మీడియా మేనియాలో పడి ప్రాణాలను కోల్పోతున్నారు. ఇటీవల ఓ యువకుడు సనత్‌నగర్ వద్ద పరుగులు తీస్తున్న ఎంఎంటీఎస్ పక్కన నించొని ఫొటోలు, వీడియోలు తీసుకొనేందుకు ప్రయత్నించి రైలు ఢీకొనడంతో చనిపోయాడు. ఫుట్‌బోర్డుపైన నిలుచుని గాలిలో ఊగుతూ వీడియోలు తీస్తూ దుస్సాహసాలకు పాల్పడుతున్నారు. '' తాము పట్టాల పక్కనే నించున్నాం. ప్రమాదం లేదనుకుంటారు. కానీ ట్రైన్ వెడల్పును అంచనా వేయలేరు.అలా ఢీకొని చాలా ప్రమాదాలు జరిగాయి.'' అని ఆర్పీఎఫ్ సిబ్బంది ఒకరు తెలిపారు.

పట్టాలపై ప్రమాదాలు ఇలా...

సంవత్సరం	ప్రమాదాలు	ఆత్మహత్యలు	అనుమానాస్పద మృతి
2024	735	631	206
2025 (ఇప్పటికి)	214	189	57

◆ 2021లో 408 మంది ప్రమాదాలు బారిన పడగా, 2024 నాటికి ఆ సంఖ్య 735 కు చేరింది.

రైలు ఢీకొని అన్నదమ్ముల దుర్మరణం

కాచిగూడ: రైలు ఢీకొని అన్నదమ్ములు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాకుత్‌పుర ప్రాంతానికి చెందిన మహ్మద్ కమల్ కుటుంబంతో కలిసి సమీపంలోని రైలు పట్టాల వద్ద నివాసం ఉంటున్నాడు. అతడికి ఇద్దరు కుమారులు. వారిలో పెద్దవాడైన మహ్మద్ షాబుద్దీన్ (26) ఎలక్ట్రికల్ షాపులో వర్కర్‌గా పని చేస్తుండగా, చిన్న కుమారుడు మహ్మద్ ఫైజల్ (21) వెల్డింగ్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం అన్నదమ్ములిద్దరూ గడ్డికోసం పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో కుళ్లిన శవం

రసూల్‌పురా: నిర్మాణంలో ఉన్న భవనం నీటి సంపులో కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన సోమవారం కార్ఖాన పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవి కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విక్రంపురి కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనం నీటి సంపులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన భవన యజమాని పోలీసులకు సమాచారం అందించాడు . సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీసి గాంధీ మార్చురీకి తరలించారు. గత కొన్ని నెలలుగా భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆదివారం పనులను పునః ప్రారంభించేందుకు గాను సంపు శుభ్రం చేయిస్తుండగా మృతదేహం బయట పడిందని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి రాత్రి వేళల్లో చోరీకి వచ్చి ప్రమాదవశాత్తు సంప్‌లో పడి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. సీఐ రామకృష్ణ నేతృత్వంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ రిప్రజెంటేటివ్ ఆత్మహత్య



వినయ్ కుమార్ (ఫైల్)

ఉప్పల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మెడికల్ రిప్రజెంటేటివ్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకానగర్ డివిజన్, సాయిరాంనగర్‌కు చెందిన మామిడాల వినయ్ కుమార్ (24) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న అతను సోమవారం గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. సాయంత్రం అతడి తల్లి, సోదరి తలుపు తట్టినా తీయక పోవడంతో అనుమానం వచ్చి పగల గొట్టి చూడగా బెడ్ షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. అతడిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సాయిమాధవ్ (ఫైల్)

మాదాపూర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 6.30 గంటలకు చింతలపూడి సాయిమాధవ్ అనే వ్యక్తి సుజుకి యాక్సెస్‌పై గచ్చిబౌలి నుంచి కేపీహెచ్‌బీ వైపు వెలుతుండగా మార్గమధ్యంలో సైబర్ టవర్ ఫ్లైఓవర్ శిల్పారామం ముందుకురాగానే వాహనం అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీచి అప్పటికే మరణించినట్టు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాజ్‌భవన్‌లో సోమవారం జరిగిన తేనీటి విందులో పాల్గొన్న ప్రపంచ సుందరి-2025 సుచాత చువాంగ్‌శ్రీని మర్యాద పూర్వకంగా కలిసిన యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యులు దశరథరామారెడ్డి, సంజోగ్ మాథుర్ (యూఎస్‌ఏ)

ఈఎస్ఐసీలో అత్యాధునిక వైద్య సేవలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- అవయవ మార్పిడిపై దృష్టి సారిస్తున్నాం
- వివిధ విభాగాలపై సమీక్ష



రోగులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: ఈఎస్ఐసీలో అన్ని రకాల స్పెషలైజ్డ్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అలాగే అవయవ మార్పిడిపై కూడా దృష్టి సారించామన్నారు. సోమవారం సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ హాస్పిటల్‌ను సందర్శించిన ఆయన వివిధ విభాగాలపై సమీక్ష నిర్వహించారు. హాస్పిటల్‌లో అమలులో ఉన్న విధానాలను, కార్మిక కుటుంబాలకు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా హాస్పిటల్ సిబ్బంది వివరించారు. అనంతరం నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ ఈఎస్ఐ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిగా అవార్డు దక్కించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఓపీలో రోజుకు మూడు వేల మంది రోగులు వస్తున్నారని, 900 మంది సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రిని విస్తరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, ఇప్పటికే ఓపీ బ్లాక్ విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలో ఈ బ్లాక్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సుమారు 200 బెడ్స్, 245 ఐసీయూ బెడ్స్‌తో కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నేలా ఈఎస్ఐ ఆస్పత్రి ఉందన్నారు. తెలంగాణలో 17 లక్షల కార్డుల ద్వారా దాదాపు 80 లక్షల మందికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో డాక్టర్ల అపాయింట్‌మెంట్ తీసుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. బ్లడ్ శాంపిల్స్‌ను కూడా ఇంటికి వెళ్లి సేకరిస్తున్నామని, వాటిని ఆన్‌లైన్‌లో మొబైల్‌కు రిపోర్ట్ పంపించే ఏర్పాటు చేస్తున్నామన్నారు.

తెలంగాణకు పెద్దపీట..

మోదీ హయాంలో తెలంగాణకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఎయిమ్స్, ఈఎస్ఐ, రెండు మెడికల్ కాలేజీలను కేంద్రం మంజూరు చేసిందన్నారు. రూ.800 కోట్లతో కొత్తగా మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 300 బెడ్స్ ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఐపీ కోసం 35 శాతం సీట్లు రిజర్వ్..

మెడికల్ కళాశాలలో ఇన్సూర్డ్ పర్సన్ (ఐపీ) కోసం 35 శాతం సీట్లు రిజర్వ్ చేసినట్లు తెలిపారు. దీని ద్వారా 1027 మంది ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే 3,000లకు పైగా ఎంబీబీఎస్ విద్యార్థులు పట్టా పొంది ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ఎండీ, ఎంఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులు 44 మంది ఉన్నట్లు తెలిపారు. ఏటా వివిధ విభాగాల్లో 307 మంది విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసేలా విద్యాబోధన సాగుతున్నదన్నారు. స్పెషలైజేషన్ కోర్సులు కూడా ఈఎస్ఐ ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. మెడికల్ కళాశాల, పారా మెడికల్, ఎండీఎంఎస్, ఎంసీహెచ్, డీఎన్‌బీల విభాగాల్లో విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఉన్నతాధికారులతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో స్థానిక కోటా కల్పించాలి

రాయదుర్గం: హెచ్‌సీయూ అడ్మిషన్లలో తెలంగాణ విద్యార్థులకు స్థానిక కోటా కల్పించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఏఐబీసీఎస్ఏ, బీఎస్ఎఫ్, టీఎస్ఎఫ్ సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ హెచ్‌సీయూలో తెలంగాణ విద్యార్థులకు డొమెసైల్ ఆధారిత రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఏటా అధికారికంగా నిర్వహించాలని కోరారు. హెచ్‌సీయూ ఆర్టికల్ 371–ఈ ప్రకారం ఏర్పాటైన ఏకై క కేంద్రీయ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. దేశంలోని ఇతర కేంద్ర విశ్వవిద్యాలయాలలో ఇప్పటికే డొమెసైల్ ఆధారిత రిజర్వేషన్ విధానాలు అమలులో ఉన్నాయన్నారు.

చలో పాతబస్తీ భగ్నం

- వీహెచ్‌పీ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు
- పలువురి అరెస్ట్



హిందూ సంఘాల కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

సుల్తాన్‌బజార్: దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి, గో రక్షా విభాగ్ విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో సోమవారం కోఠిలోని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. గో హత్యలకు వ్యతిరేకంగా పలువురు వక్తలు ప్రసంగిస్తుండగా గో భక్తులు ఒక్కసారిగా 'ఛలో పాతబస్తీ' అని నినాదాలు చేస్తూ రోడ్డుపైకి రావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ గో భక్తులు పోలీసులను లెక్కచేయకుండా ముందుకు సాగడంతో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ మట్టయ్య, ఇన్‌స్పెక్టర్ నర్సింహ తదితరులు టాస్క్‌ఫోర్స్ ఇతర బలగాలతో వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.ఈ సందర్భంగా పోలీసులకు, హిందూ సంఘాల కార్యకర్తల మధ్య తోపులాట వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అడిషనల్ డీసీపీ నర్సయ్య జోక్యం చేసుకుని శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే తాను డీజీపీతో మాట్లాడి ర్యాలీకి అనుమతి ఇప్పిస్తానని లేని పక్షంలో అరెస్టులు తప్పవని హెచ్చరించడంతో గో రక్ష నాయకులు వెనక్కి తగ్గారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ మాట్లాడుతూ.... ప్రభుత్వం వెంటనే పాతబస్తీలో అక్రమంగా ఉంచిన వేలాది గోవులకు విముక్తి కలిగించి హిందూ సంస్థలకు అప్పగించాలని కోరారు. ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో ఎంఐఎం కార్పొరేటర్లు, ఎమ్మెల్సీలు కూర్చుని నగరం బయటి నుంచి వస్తున్న గోమాతలను పోలీసు పహారా మధ్య తమ గమ్యస్థానాలకు చేరుస్తున్నారని ఆరోపించారు. పోలీసు అధికారులు గోవులను స్వాధీనం చేసుకుని గోశాలలకు తరలించాలని కోరారు. గో రక్షకులపై అక్రమ కేసులు బనాయిస్తే సహించేది లేదన్నారు. గో రక్షణ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు సుభాష్ చందర్, సుధాకర్, రాంచందర్, రమేష్‌లతో పాటు పెద్ద ఎత్తున గో భక్తులు పాల్గొన్నారు.

కారు దగ్ధం



గచ్చిబౌలి: రోడ్డుపై వెళుతున్న కారు దగ్ధమైన సంఘటన సోమవారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో టయోటా క్యామ్రీస్ హైబ్రీడ్ కారు బయోడైవర్సిటీ వైపు నుంచి గచ్చిబౌలికి వెళుతోంది. సైబరాబాద్ కమిషనరేట్ సమీపంలోకి రాగానే కారు ఇంజిన్‌లోనుంచి పొగ రావడాన్ని గుర్తించిన కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు కారును రోడ్డు పక్కన నిలిపి కిందకు దిగారు. కారులో నుంచి మంటలు వ్యాపించడంతో నిమిషాల వ్యవధిలోనే కారు పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడినట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.

నాలాలపై నజర్

- వర్షాకాలం నేపథ్యంలో దృష్టి పెట్టిన హైడ్రా
- తమ దృష్టికి తేవాలంటూ ప్రజలకు విజ్ఞప్తి
- సోమవారం ప్రజావాణిలో 23 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలే కాదు నాలాలూ మాయమయ్యాయి. వర్షాకాలం నేపథ్యంలో దీనిపై దృష్టి పెట్టిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ప్రజల నుంచి సమాచారం కోరింది. దీనికి అనూహ్య స్పందన వచ్చిందని అధికారులు చెబుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలాల కబ్జాలకు సంబంధించి 23 ఫిర్యాదులు అందాయని, మొత్తం ఫిర్యాదుల్లో ఇవి 70 శాతం వరకు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం నాలాల కబ్జాల ఫిర్యాదులపై ఎక్కువగా దృష్టి పెడుతున్నాయని అధికారులు స్పష్టం చేశారు. మరోపక్క రాష్ట్ర అవతరణ దినోత్సవం నేపథ్యంలో సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హైడ్రా పోలీస్ స్టేషన్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు.

◆ తిరుమలగిరి భూదేవినగర్‌లోని సాయిదత్తా గార్డెన్స్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉద్దేశించిన 225 గజాల స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 2004లోనే జీహెచ్‌ఎంసీకి ఆ స్థలాన్ని ఇచ్చి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరినా ఫలితం లేదని వాపోయారు.

◆ శేరిలింగంపల్లి మండలంలోని ఖానామెట్‌లో సర్వే నెం.11/20, 11/21ల్లో గురుకుల ట్రస్టు లేఔట్‌ను 1983లో వేశారు. అందులోని ప్లాట్లతో పాటు రహదారులు కబ్జాకు గురయ్యాయని స్థానికులు ఫిర్యాదు చేశారు.

◆ బేగంపేటలోని చికోటి గార్డెన్స్ ప్రాంతంలో నాలా కుంచించుకుపోవడంతో బృందావన్ అపార్టుమెంట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. 2020లో వరదలకు దీని సెల్లార్ నీట మునిగింది. ఇక్కడి వారికి ప్రతి వర్షాకాలం ఇబ్బందికరంగా పరిణమిస్తోంది.

◆ కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలతోపాటు ఈ చెరువు నుంచి ఐడీఎల్ చెరువుకు వెళ్లే నాలా కూడా కబ్జా జరిగిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు ఏడు కాలనీలకు వరద ముప్పు ఉంటోందని వాపోయారు. వెంటనే ఆక్రమణలను తొలగించి వరద నీరు సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.

◆ హస్మత్‌పేట నాలా, పికెట్ నాలాలు కుంచించుకుపోవడంతో బేగంపేట పరిసరాల్లోని పైగా కాలనీ, విమాన్ నగర్, బీహెచ్‌ఈఎల్ కాలనీ, అవంతి కాలనీ, రసూల్‌పుర బస్తీ వరద నీటిలో చిక్కుకుంటున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు.

◆ సైదాబాద్, బాలాజీ నగర్‌లో మురుగు, వరద కాలువలు కబ్జాకు గురయ్యాయని బాలాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఒవైసీ ఆసుపత్రి వద్ద చెరువు నిండితే ఆ వరద ఆదర్శ్‌నగర్ మీదుగా సరూర్‌నగర్ చెరువుకు చేరాలి. అయితే వరద కాలువ కుంచించుకుపోవడంతో బస్తీలు నీట మునుగుతున్నాయని వారు పేర్కొన్నారు.



హైడ్రా ఠాణా వద్ద జెండా ఆవిష్కరిస్తున్న రంగనాథ్

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, నల్లవంకాయ 25, పొడుగువంకాయ 25, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికం 55, పచ్చికాకరకాయ 38, పందిరిబీర 55, క్యాబేజీ 15, క్యారెట్ 37, దొండకాయ 18, గుండు బీన్స్ 125, గింజచిక్కుడు 75, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 24, చామగడ్డ 33, మొరంగడ్డ 19, కందగడ్డ 55, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 4, మామిడికాయ 40, ముల్లంగి 4-5, ఉల్లిపొరక 45 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సర్దార్ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నేతల పరామర్శ

రహమత్‌నగర్: ఇటీవల మరణించిన బీఆర్‌ఎస్ నాయకుడు సర్దార్ కుటుంబ సభ్యులను సోమవారం రాత్రి కాంగ్రెస్ నాయకుడు, టీఎంఆర్‌ఈఐఎస్ అధ్యక్షుడు ఫయూమ్ ఖురైషీ, మాజీ ఎంపీ కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహమ్మద్ అజహరుద్దీన్, తెలంగాణ స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ అసదుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు భవానీశంకర్, నేతలు నవీన్ యాదవ్, మోసిన్, ఖురైష, సుల్తాన్, బోరబండ డివిజన్ నేతలు అశోక్, నరసింహా తదితరులు పరామర్శించారు.

8న సామూహిక 'భగవద్గీత పారాయణం'

నల్లకుంట: సనాత ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఈనెల 8న సామూహిక భగవద్గీత పారాయణం కార్యక్రమం ఉంటుందని సమితి ప్రతినిధి వేముల వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చందానగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని విశాఖ శారదా పీఠపాలితలో ఉదయం 8గంటలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. 1116 మంది భక్తులతో సామూహిక పారాయణం ఉంటుందన్నారు. ఆసక్తి గలన వారు ఫోన్ నం.92465 08682లో సంప్రదించాలని కోరారు.

ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోండి

కాచిగూడ: హర్రాస్‌పెంట హిందూ శ్మశానవాటిక ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఫిజియోథెరపీ, క్లినిక్, కుట్టు శిక్షణ, మెహిందీ, బోటిక్, యోగా తదితర విభాగాల్లో అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని బోర్డు అధ్యక్షుడు రాజేందర్ పటేల్ కోరారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేదల కోసం లక్షలు వెచ్చించి నిర్వహిస్తున్న క్లినిక్‌లో షుగర్, బీసీ, బ్లడ్ టెస్ట్ తదితర వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. ఉచితంగా మందులను సైతం అందజేస్తున్నట్లు తెలిపారు. మొదటి అంతస్తులో ఆధ్యాత్మిక పుస్తకాలతో కూడిన రీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ విగ్, సాయి గిరిధర్, సి.నందకిషోర్ యాదవ్, భీమగోని కృష్ణగౌడ్, సత్యనారాయణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకరంజకంగా స్వామి అయ్యప్ప నాటక ప్రదర్శన



కళాకారులతో లంకా లక్ష్మీనారాయణ, ఎంకే రాము, సాల్వాచారి

చిక్కడపల్లి: ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో సోమవారం స్వామి అయ్యప్ప నాటక ప్రదర్శన ప్రేక్షక రంజకంగా సాగింది. కళాకారులు పాత్రోచితంగా ప్రదర్శనను రక్తికట్టించారు. 16వ నాటకోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, ఎంకే రాము, సాల్వాచారి, బాబురాజు, వెంగమాంబ, పరమేష్, రాజేశ్వర్, లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలి



అమీర్‌పేట: పేద, బడుగు వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. అమీర్‌పేట ఆదిత్య పార్క్ హోటల్‌లో సోమవారం అలయ్ బలయ్ ఫౌండేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయన్నారు.

దుర్గాభవానీనగర్ పార్కుకు సొబగులు

- మొన్నటి దాకా దుర్గంధం...
- సుందరీకరణకు నోచుకుంటున్న జీహెచ్‌ఎంసీ పార్కు
- జూబ్లీహిల్స్ నడిబొడ్డున నిర్లక్ష్యానికి గురైన పార్కు
- రూ. 75 లక్షలతో ఆకర్షణీయంగా మలుస్తున్న రోటరీ క్లబ్‌ఆఫ్ జూబ్లీహిల్స్

బంజారాహిల్స్: కాలనీవాసులు, పాదచారులకు, చిరు వ్యాపారులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన ఉద్యానవనాలు చాలాచోట్ల చెత్తాచెదారంతో పచ్చదనం కరువై ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నాయి. కొన్ని చోట్ల అయితే మురికి కుంటలు అక్కడికి వచ్చేవారికి ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తుండగా దోమలు, ఈగలు, దుర్గంధంతో పార్కులకు వెళ్లాలంటేనే నరకప్రాయంగా మారుతున్నది. పార్కులను పచ్చదనం పరిశుభ్రతతో తీర్చిదిద్దాల్సిన జీహెచ్‌ఎంసీ నిధుల లేమితో నీరుగారిపోతున్నది. ఫలితంగా చాలా పార్కులు ఆహ్లాదానికి దూరమై మురికి కూపాలుగా మారుతున్న నేపథ్యంలో మేమున్నామంటూ స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. అలాంటిదే జూబ్లీహిల్స్ రోడ్ నెం.5లోని వెంకటగిరి చౌరస్తాలో దుర్గా భవానీ నగర్ బస్తీని ఆనుకొని ఎకరన్నర విస్తీర్ణంలో విస్తరించిన జీహెచ్‌ఎంసీ పార్కు. ఈ పార్కులోకి బడాబాబులు నివసించే జూబ్లీహిల్స్ కాలనీకి చెందిన డ్రైనేజీ మురుగంతా చేరి చిన్నపాటి కుంటగా మారింది. దుర్గంధం, దుర్వాసనలతో ఇక్కడికి వచ్చేవారు ముక్కులు మూసుకొని కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రజాప్రతినిధులకు, అధికారులకు పట్టలేదు. ఈ పార్కును బాగు చేయాలనే ఆలోచన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే



మురుగు బయటకు వెళ్లేందుకు నిర్మిస్తున్న పైప్‌లైన్

రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ పార్కును సుందరంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చింది.

రూ. 75 లక్షల వ్యయంతో...

జూబ్లీహిల్స్ నడిబొడ్డును ఎకరన్నర విస్తీర్ణంలో జీహెచ్‌ఎంసీ పార్కులో డ్రైనేజీ మురుగు చేరి చిన్నపాటి కుంటగా మారడంతో ఈ పార్కును సుందరంగా తీర్చిదిద్దడానికి ముందుకొచ్చిన రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ స్వచ్ఛంద సంస్థకు అడుగడుగునా సవాళ్లు ఎదురవుతున్నాయి. పార్కును తీర్చిదిద్దాలంటే ఇక్కడ మురుగును, బురదను తొలగించడానికే రూ. 40 లక్షలు ఖర్చు చేస్తున్నారు. కొత్తగా డ్రైనేజీ పైప్‌లైన్లు వేసి పార్కులోకి మురుగు చేరకుండా మురుగు నీటి కాల్వలోకి పైప్‌లైన్ మళ్లించారు. దీంతో మురుగు రావడం లేదు. అయితే ఇప్పటి వరకు మురుగు పేరుకుపోవడంతో వ్యర్థాలు, బురద, దుర్గంధం తొలగించే ప్రక్రియను ప్రస్తుతం ముమ్మరంగా చేపడుతున్నారు. ఇందుకోసం రూ. 10 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఇక వాక్‌వేతో పాటు లాన్ పూల మొక్కలు, ఇతర అలంకరణ మొక్కలు నాటేందుకు మరో రూ. 25 లక్షలు ఖర్చు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. మొత్తంగా ఈ పార్కు అభివృద్ధికి సంస్థ రూ.75 లక్షలు ఖర్చు చేస్తున్నది. ఇప్పటికే జీహెచ్‌ఎంసీతో ఎంవోయూ కూడా కుదుర్చుకుంది. మరో నెల రోజుల్లో ఈ పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దే ప్రక్రియ జోరుగా సాగుతుంది.

పచ్చదనం, పరిశుభ్రతే లక్ష్యం

జూబ్లీహిల్స్ నడిబొడ్డున విశాలమైన జీహెచ్‌ఎంసీ పార్కు దోమలు, ఈగలు, దుర్గంధం దుర్వాసనలతో స్థానికులకు ఏ మాత్రం ఆహ్లాదాన్ని ఇవ్వడం లేదు. స్థానికులు పలుమార్లు ఈ విషయాన్ని మా దృష్టికి తీసుకొచ్చారు. నిత్యం వందలాది మంది ఈ పార్కుకు వస్తుంటారు. కూర్చున్నంత సేపు ముక్కుమూసుకొని ఉండాల్సి వస్తున్నది. దీంతో పార్కును సుందరీకరించాలని మా కార్యవర్గం తలపెట్టింది. అనుకున్నట్లుగానే నిధులు కూడా సమకూరాయి. ఇటీవలే ఎంవోయూ పూర్తయింది. పచ్చదనం, పరిశుభ్రత నినాదంగా ఈ పార్కును తీర్చిదిద్దుతున్నాం. స్థానికులకు ఆనందాన్ని పంచేలా ఇక్కడ మొక్కలు నాటాలని నిర్ణయించాం. అరుదైన పూల మొక్కలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం. కొద్ది రోజుల్లోనే స్థానికులకు అందుబాటులోకి వస్తుంది. ఆర్కిటెక్టర్లు డిజైన్లు కూడా రూపొందించగా ఈ ప్లాన్ ప్రకారమే ఇక్కడ పనులు జరుగుతున్నాయి.

– రొటేరియన్ బాలకోటి రెడ్డి, ప్రెసిడెంట్ రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్



సీఎస్‌ఆర్ కింద రూపుదిద్దుకుంటున్న జూబ్లీహిల్స్ రోడ్ నెం. 5లోని పార్కు



మురుగుతో నిండిపోయిన పార్కు

ప్రతిభా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

బంజారాహిల్స్: ప్రతిభా పోటీల్లో సత్తా చాటి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఇంటలెక్ట్ ఇగ్నైట్ సంస్థ ఘనంగా సత్కరించింది. సోమవారం బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో అబ్దుల్ కరీం విద్యార్థులకు మెడల్స్ అందజేయడంతో పాటు మెమెంటోలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని వివిధ పాఠశాలల్లో తాము నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 110 మంది విద్యార్థులను సత్కరించడంతో పాటు వారికి ఏడాది పాటు ఉచితంగా స్పాన్సర్‌షిప్ చేయనున్నామని తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్‌లలో ప్రైవేట్ పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు తాము ఇటువంటి టాలెంట్ టెస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ ఎండీ మహ్మద్ సల్మాన్, ఇస్మాయిల్, మహ్మద్ ఒసామా పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న ఇంటలెక్ట్ ఇగ్నైట్ సంస్థ ప్రతినిధులు

తాత్కాలిక మరమ్మతులు చేయాలి



మాన్‌సూన్ టీమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లో కేబుల్ తవ్వకాల వల్ల ఎక్కడికక్కడ ప్రధాన రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయని జీహెచ్‌ఎంసీ అధికారులు మాన్‌సూన్ బృందాలతో ఆ రోడ్లకు తక్షణ మరమ్మతులు చేయాలని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ డివిజన్‌కు కేటాయించిన మాన్‌సూన్ ప్రత్యేక టీమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈ హరేరామ్ మాట్లాడుతూ అయిదు నెలల పాటు ఈ మాన్‌సూన్ టీమ్ విధుల్లో ఉంటుందని షిఫ్ట్‌ల వారిగా 24 గంటల పాటు కార్మికులు ఉంటారని తెలిపారు. 14 మంది కార్మికులతో పాటు రెండు ప్రత్యేక వాహనాలు ఈ మాన్‌సూన్ టీమ్‌కు కేటాయించినట్లు తెలిపారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లతో పాటు వరద నీరు నిల్వకుండా వీరు చూసుకుంటారని తెలిపారు. ఎమర్జెన్సీ పనులన్నింటిని ఈ మాన్‌సూన్ టీమ్‌లు పూర్తి చేస్తాయని తెలిపారు. ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వినాయకనగర్ బస్తీ ఎన్నికలు

రహమత్‌నగర్: బస్తీలో సొంత నివాసమున్న ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎస్పీఆర్‌హిల్స్ వినాయకనగర్ వీకర్స్ సెక్షన్ అసోసియేషన్, అబ్జర్వేషన్ డెవలప్‌మెంట్ కమిటీ నాయకులు వీరస్వామి యాదవ్, డానియల్, మాణిక్యం, శ్రీనివాస్, కేశవులు తదితరులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... బస్తీ కార్యవర్గం కాలపరిమితి ముగిసినందున ఎన్నికల నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే బస్తీ ఓటర్ల వివరాల కోసం జనరల్ లిస్టు రూపొందించనున్నట్లు తెలిపారు. త్వరలోనే మరోమారు సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటామని వారు వివరించారు. నేతలు పద్మారావు, అమృతరావు, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ఖైరతాబాద్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయం ఎదురుగా ఉన్న జలదృశ్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ వ్యవస్థాపక చైర్మన్ రాపోలు జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాస్కి గౌడ్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రితో మాట్లాడి కొండా లక్ష్మణ్ బాపూజీని జాతిపితగా ప్రకటించేందుకు కృషి చేస్తానన్నారు. బీసీ కమిషన్ వకళాభరణం కృష్ణమోహన్, టీబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ ప్రతినిధులు, బీసీ సంఘాల, దళిత, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డు అదృశ్యం

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో ఓ సెక్యూరిటీ గార్డు అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్.నగర్‌లో నివసించే మ్యాథ్యూస్ అర్చన్ కుంజం(36) సికింద్రాబాద్‌లోని ఓ చర్చిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఈ నెల 23వ తేదీన మ్యాథ్యూస్ ఇంట్లో భార్యకు చెప్పకుండా బయటికి వెళ్లిపోయి మూడు రోజులుగా తిరిగి రాలేదు. దీంతో ఆమె ఫోన్ చేసినా స్పందించలేదు. ఈ నెల 26వ తేదీన మ్యాథ్యూస్ పని చేస్తున్న చర్చికి వెళ్లి చూడగా ఫలితం లేదు. దీంతో తన భర్త కనిపించడం లేదంటూ పుష్పవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87125 69090 నెంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.



మ్యాథ్యూస్ అర్చన్ కుంజం

రోడ్ల రూపురేఖలు మారాలి



మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ జడ్‌సీ రవికిరణ్

- చెత్త తొలగింపు పనులు వేగవంతం చేయాలి
- చిలకలగూడ, పాటిగడ్డ జంక్షన్‌ల ఆధునీకరణ
- జోనల్ కమిషనర్ రవికిరణ్

సికింద్రాబాద్: చెత్తాచెదారం, దుర్గంధంతో కూడిన సికింద్రాబాద్ ప్రాంత రహదారుల రూపురేఖలు మార్చడంతోపాటు ప్రయాణికుల సమస్యలు తొలగించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్ సూచించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో ఆయన కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈవో పల్లవి విజయ వర్షిని, ట్రాఫిక్ ఏసీపీలు శంకర్ రాజు, సంపత్ కుమార్, జలమండలి సీజీఎం ప్రభు, జీహెచ్‌ఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆశాలత, సిటీ ప్లానర్ శ్రీనివాస్. విద్యుత్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ రవికిరణ్ మాట్లాడుతూ.. రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త చెదారాలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. రహదారులపై చెత్త వేయకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలన్నారు.

◆ ప్రస్తుతం ఏర్పాటు చేసి ఉన్న విద్యుత్ దీపాల నిర్వహణ వ్యహారాలను సక్రమంగా కొనసాగించడంతోపాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చిలకలగూడ, పాటిగడ్డ జంక్షన్‌లలో ఆధునీకరణ పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. ఫుట్‌ఓవర్ వంతెనల నిర్వహణ వ్యవహారాలను క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో పేర్కొన్న అంశాలకు సంబంధించిన పనులన్నింటిని నెల రోజుల్లోగా పూర్తి చేయాలని జడ్‌సీ కోరారు.

చిన్నారులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

సనత్‌నగర్: చిన్నతనం నుంచి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాని సాధన దిశగా పట్టుదలతో ముందుకుసాగాలని ఎమ్మెల్సీ వాణీదేవి విద్యార్థులకు సూచించారు. బేగంపేటలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు సోమవారం జరిగాయి. మెమోరియల్ కమిటీ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీవీ ప్రభాకర్ రావు, శేఖర్ మారంరాజు తదితరులు పాల్గొన్నారు.



జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డి



హిమాయత్‌నగర్ వైజంక్షన్‌లో మాజీ కార్పొరేటర్ హేమలత యాదవ్

వాడవాడలా అవతరణ దినోత్సవం

బంజారాహిల్స్: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు సోమవారం వాడవాడలా జరిగాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన అవతరణ దినోత్సవ వేడుకల్లో జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పాల్గొన్నారు. షేక్‌పేట మండల కార్యాలయంలో జరిగిన అవతరణ దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ తహసిల్దార్ రమేష్ జాతీయ జెండాను ఎగుర వేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్బీటీ నగర్ బస్తీలో మహనీయుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు కొమ్ము విజయ్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వెంకట్ రాములు, నర్సింహులు, గంధం రవి, శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్, మన్నె కవితారెడ్డి...



జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ దేదీప్య విజయ్...



సోమాజిగూడ బస్తీలో కార్పొరేటర్ విజయారెడ్డి



బంజారాహిల్స్ పీఎస్‌లో ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి



రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి...



హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్...



ఎర్రగడ్డలో కాంగ్రెస్ నేతలు



ఎన్బీటీ నగర్‌లో మహనీయుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...



షేక్‌పేట మండల కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్...

ఉద్యమంలో టీడీఎఫ్‌ది ముఖ్య భూమిక



చిక్కడపల్లి: తెలంగాణ ఉద్యమంలో ఎన్నారైలను ఏకం చేయడంలో తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం (టీడీఎఫ్) ముఖ్యభూమిక పోషించిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన టీడీఎఫ్ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్సీ కోదండరాం ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోదండ రామ్ మాట్లాడుతూ టీడీఎఫ్ ఆధ్వర్యంలో కృష్ణా నదీ జలాలపై, విద్యా రంగంపై విస్తృతంగా ప్రచారం, చర్చలు జరిగాయని తెలిపారు. టీడీఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు పాటి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా ఫోరం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ కమిషన్ సభ్యురాలు భవానీ, ఫోరం అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి, చైర్మన్ మారం వెంకట గోనారెడ్డి, కార్యదర్శి వినీల్, ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కోశాధికారి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలానికీ ఇక పన్ను!

వసూళ్లకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ

- బకాయిలున్నట్లు ప్లాట్లలో బోర్డులు సైతం
- ఓవైపు ఆదాయం.. మరోవైపు చెత్త సమస్యల పరిష్కారం



వీఎల్‌టీ చెల్లించని ఖాళీ ప్లాట్లలో ఈ విధంగా ఏర్పాటు చేయనున్న ఫ్లెక్సీ బోర్డులు

సాక్షి, సిటీబ్యూరో: పెరిగిన ఖర్చులతో ఆదాయాన్ని పెంచుకునేందుకు వివిధ మార్గాలు అన్వేషిస్తున్న జీహెచ్‌ఎంసీ కన్ను ఖాళీ ప్లాట్లపై పడింది. సాధారణంగా భవనాలు నిర్మించుకున్నాక ఆస్తిపన్ను చెల్లించడం ప్రజలకు అలవాటు. భవనం కట్టకుండా ఖాళీ ప్లాట్‌గా ఎంతకాలం ఉన్నా దానికి పన్ను చెల్లించేందుకు చాలామంది సుముఖంగా ఉండరు. పన్ను చెల్లించాలనే విషయం తెలియని వారు కూడా ఎందరో. ఎలాంటి నిర్మాణం జరగకుండా ఖాళీ ప్లాట్ ఉన్నప్పటికీ, జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 212(2) మేరకు వేకెంట్ ల్యాండ్ టాక్స్(వీఎల్‌టీ) చెల్లించాలి. భూమి ధర మార్కెట్ రేట్‌లో 0.05 శాతం వీఎల్‌టీగా చెల్లించాలి. దాదాపు రెండేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ల మేరకు వీఎల్‌టీ చెల్లించాల్సిన ప్లాట్లు 31వేల వరకు ఉన్నాయి. వీఎల్‌టీ వసూలైతే దాదాపు రూ.110 కోట్ల మేర జీహెచ్‌ఎంసీ ఖజానాకు చేరతాయని అధికారుల అంచనా. అది జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఒక నెల వేతనాల చెల్లింపులకు సరిపోతుంది. జీహెచ్‌ఎంసీకి ఏటా వస్తున్న ఆదాయం కంటే ఖర్చు రెట్టింపు ఉంటోంది. ఈ నేపథ్యంలో ప్రతి రూపాయీ విలువైనదే కావడంతో ఎన్ని రకాలుగా ఆదాయం వచ్చే అవకాశముందో పరిశీలిస్తున్న అధికారులు తగిన చర్యల ద్వారా ఆదాయం పెంచుకునేందుకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగానే వీఎల్‌టీ వసూళ్లపై తాజాగా చర్యలకు సిద్ధమయ్యారు. వీఎల్‌టీ చెల్లించాల్సిన ఖాళీ స్థలాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. డిప్యూటీ కమిషనర్లకు వసూళ్ల బాధ్యత లప్పగించారు. ప్రతి బిల్ కలెక్టర్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌కు రోజువారీ టార్గెట్ విధించి వసూళ్ల చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్ కర్ణన్ సూచించారు. ఆమేరకు అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లు(ఏఎంసీ) సైతం వారితోపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి వీఎల్‌టీ వసూలు చేయాలి. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదైన ఖాళీ ప్లాట్లలో ఆ ప్లాట్ నుంచి చెల్లించాల్సిన వీఎల్‌టీ చెల్లించలేదనే ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు అసెస్ కాని ఖాళీ ప్లాట్లను కూడా క్షేత్రస్థాయిలో గుర్తించి వాటిని ట్యాక్స్ జాబితాలోకి తేవాలి. అన్ని ఖాళీప్లాట్ల నుంచి పన్ను వసూలయ్యేలా డిప్యూటీ కమిషనర్లు, ఏఎంసీలు యజమానులను సంప్రదించి, అవసరమైన చర్యలు తీసుకోవాలి. పన్ను చెల్లించని వారి స్థలాల్లో బకాయిలున్నట్లు తెలిపే బోర్డులను రెండు వారాల్లోగా ఏర్పాటు చేయాలి. వసూళ్ల ప్రగతిని అడిషనల్ కమిషనర్(రెవెన్యూ) అనురాగ్ జయంతి వారానికోమారు సమీక్షించనున్నారు.

చెత్త సమస్యలకూ పరిష్కారం..

వీఎల్‌టీ వసూళ్ల ద్వారా జీహెచ్‌ఎంసీకి ఆదాయంతో పాటు ప్రజలకు పలు రోగాలు వ్యాప్తి చెందేందుకు కారణమవుతున్న ఖాళీ ప్లాట్లలో ఇకపై అలాంటి పరిస్థితులుండవని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ఖాళీ ప్లాట్లలో చాలా వరకు ఇరుగుపొరుగువారు, వీధివారంతా అన్ని రకాల చెత్తను వేస్తున్నారు. పిచ్చిమొక్కలు, మొక్కలూ పెరుగుతున్నాయి. అన్ని రకాల వ్యర్థాలతోపాటు నిల్వ నీటితో దోమల వ్యాప్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో ప్రజలు దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల బారిన పడుతున్నారు. ఖాళీ మద్యం బాటిళ్ల వంటివి సైతం వాటిల్లోనే వేస్తున్నవారు కూడా ఉన్నారు. ప్రహరీలు కూడా లేకుండా ఉన్నవి కూడా ఉన్నాయి. ఖాళీ ప్లాటయినా దానికి పన్ను కడితే యజమానులు దాన్ని కాపాడుకుంటారని, తద్వారా ఈ సమస్యలు కూడా తీరతాయని అధికారులు భావిస్తున్నారు.

నగరంలో నేడు

- రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఆధ్వర్యంలో డిజైన్ ఎక్స్‌ప్లోర్ సమ్మర్ ఇన్నోవేషన్ క్యాంప్–2025 ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- జూబ్లీహిల్స్‌లోని దస్పల్లా హోటల్‌లో సాయంత్రం 5 గంటలకు మిస్ వరల్డ్ ఈవెంట్ ముగింపు వేడుక జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

టెక్స్‌టైల్ భూములను కాపాడాలి

హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్క్ సభ్యుల విజ్ఞప్తి



పంజగుట్ట: ఇరవై వేల మంది నేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు కేటాయించిన టెక్స్‌టైల్‌కు చెందిన 142 ఎకరాల భూమిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కాపాడాలని హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్క్ మెంబర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రతినిధులు గజం శ్రీరాములు, సురేంద్ర మామిడాల, వేముల రమేష్ మాట్లాడుతూ 2002– 2005 మధ్య కాలంలో హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్క్‌కు చేయూతనందించాలని అప్పటి ప్రభుత్వాలు నిర్ణయించాయని తెలిపారు. 108 మంది సభ్యులతో పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ వర్తింపచేసి హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా కొల్లూరు మండలం చేగూరు గ్రామంలో 142 ఎకరాల భూమిని పేద పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన నేత కార్మికులు సొంత డబ్బుతో కొనుగోలు చేశారని తెలిపారు. ఆ భూమిపై కన్నేసిన కొంతమంది కబ్జాదారులు అధికారులతో కుమ్మక్కై అడ్డదారిలో టెక్స్‌టైల్ పార్క్ షేర్లను సొంతం చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెక్స్‌టైల్ పార్క్‌లో ఉన్న సభ్యులను బెదిరించి తప్పించారని, దొంగచాటుగా సదరు భూమిని విక్రయించారని, దీనిపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పురుషోత్తం, గడ్డం దేవదాస్, చిన్నం వెంకటరమణ, చిలుక రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బహిష్టు శుభ్రతపై టాటా ట్రస్ట్ ప్రచారం

సాక్షి, సిటీబ్యూరో: బహిష్టు రోజుల్లో శుభ్రత ఒక ఆరోగ్యపరమైన అంశంగా గుర్తించాల్సి ఉన్న నేపథ్యంలో నగరవాసుల్లో అవగాహన పెంచడానికి టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టనున్నారు. ఈ విషయాన్ని టాటా ట్రస్ట్ నీరు, పారిశుద్ధ్యం పరిశుభ్రత (వాష్) విభాగానికి చెందిన దివ్యాంగ్ వాఘేలా ఒక ప్రకటనలో తెలిపారు. తమ తాజా అధ్యయనం ప్రకారం.. 71 శాతం మంది బాలికలకు తొలిసారి బహిష్టు వచ్చేవరకూ దాని గురించిన అవగాహన ఉండటం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై భిన్న మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టనున్నామని తెలిపారు.

ఘనంగా 'సెల్యూట్ టు సోల్జర్స్'


మాజీ సైనికాధికారులను సత్కరిస్తున్న దృశ్యం

చైతన్యపురి: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ చేపట్టిందని, దీనిపై ప్రేరణ పొందిన ప్రజలు భిన్న రూపాల్లో దేశభక్తిని చాటుకున్నారని రిటైర్డ్ కలెక్టర్ ఎంవీ రెడ్డి అన్నారు. కోదాడ ఆత్మీయ ప్రవాస సమితి, అపోలో మెడికల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 'సెల్యూట్ టు సోల్జర్స్' పేరిట చైతన్యపురిలోని అపోలో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బుర్రి రామయ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. సంగోజు నాగాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్మీ అధికారులు పలువురు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం పోరాడుతున్న త్రివిధ దళాల అధికారులు, సైనికుల సేవలను మనం గుర్తు తెచ్చుకోవాలన్నారు. రిటైర్డ్ కల్నల్ సుంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి యువత ఆర్మీలో చేరేందుకు అవగాహన కల్పించాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న మేజర్ టి.సాయి భార్గవ్ మాట్లాడుతూ పాకిస్తాన్ డ్రోన్ దాడులను తిప్పికొట్టడంలో తన అనుభవాలను వివరించారు. కోదాడ నియోజకవర్గం నుంచి వందలాది మంది ఆర్మీలో విధులు నిర్వహిస్తుండటం మనకెంతో గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఆర్మీ అధికారులు కల్నల్ స్వర్ణారెడ్డి, సుబేదార్ మేజర్ పీఎస్‌ఎన్ స్వామి, సార్జెంట్‌లు జి.నర్సింహారెడ్డి, రామనాథం, వనం సుదర్శన్, దయాకర్‌రెడ్డి, సుబేదారు ఎస్.నర్సయ్యను ఘనంగా సత్కరించి.. వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పహల్గాం మృతులు, పాకిస్తాన్ దాడుల్లో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అపోలో అకాడమీ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూదన్, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, కోదాడ ఆత్మీయ ప్రవాస సమితి సభ్యులు వాలీబాల్ శ్రీనివాస్, బుడిగ అంజయ్య, కళింగరావు, గుంజ వెంకటేశ్వర్లు, సతీష్, నారాయణరావు, శ్యాంప్రసాద్, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్‌కు సత్కారం


హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజే రావుకు జ్ఞాపిక అందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఘనంగా సత్కరించారు. సోమవారం రాజ్‌భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో జరిగిన 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'వేడుకల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, తెలంగాణ సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేరావు మాట్లాడుతూ దేశంలో అత్యధిక జీఎస్‌డీపీ, జీడీపీని అందిస్తూ రాష్ట్రం అద్భుతమైన పురోగతిని సాధించిందన్నారు. రాష్ట్రం అభివృద్ధికి హెచ్‌సీయూ తన వంతు కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

వంద రోజుల్లో వంద విజయ డెయిరీ పార్లర్లు



లాలాపేట: విజయ డెయిరీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా రానున్న వంద రోజుల్లో వంద విజయ డెయిరీ పార్లర్లు ఏర్పాటు చేయనున్నట్లు డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. విజయ డెయిరీలో సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అమిత్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో విజయ డెయిరీ టర్నోవర్‌ను రూ.1,500 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు అనుగుణంగా నాణ్యమైన పాలను రైతుల నుంచి సేకరిస్తూ పాల ఉత్పత్తులు, పాల అమ్మకాలను పెంచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ డెయిరీ జనరల్ మేనేజర్ కామేష్, దేవేందర్ కుమార్, మధుసూదన్‌రావు, చీఫ్ క్వాలిటీ ఆఫీసర్ కవిత, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు చొరవ చూపాలి: కలెక్టర్


సుల్తాన్‌బజార్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సుల్తాన్‌బజార్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేవిధంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఈ మేరకు సోమవారం సుల్తాన్‌బజార్, ఉస్మాన్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సుల్తాన్‌బజార్‌లో ఇటీవల నిర్మించిన పాఠశాలలో మెరుగైన సదుపాయాలు కల్పించామని, చుట్టుపక్కల బస్తీల పిల్లలు ఎక్కువగా పాఠశాలకు వచ్చేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బాగా పనిచేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు. సుల్తాన్‌బజార్ పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టకపోవడంతో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉస్మాన్‌గంజ్ ప్రభు త్వ పాఠశాలలో నూతన భవనాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాలలో పనులు అసంపూర్తిగా ఉండటంతో కాంట్రాక్టర్‌కు నిధులు చెల్లించవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు ఏడీ శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షఫీమియా, డీఈ ఆశీర్వాదం, ప్రధానోపాధ్యాయురాళ్లు మాధురి, విజయలక్ష్మీ, శోభ ఆదర్శపాఠశాల కమిటీ చైర్‌పర్సన్ శీలం సరస్వతి పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు ఉచితంగా పాలు

- విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి


అనాథ విద్యార్థులకు విజయ పాలను అందజేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి రోజూ 12 లీటర్ల విజయ పాలను ఏడాది వరకు ఉచితంగా ఇస్తామని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ప్రకటించారు. అనాథ విద్యార్థులను అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. రాష్ట్ర విజయ డెయిరీ ఆధ్వర్యంలో అనాథ విద్యార్థి గృహంలో ప్రపంచ పాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాలను గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ సమక్షంలో అందించారు. విజయ పాల ఉత్పత్తులను విద్యార్థులకు అందచేశారు. అమిత్ రెడ్డి మాట్లాడుతూ అనాథ విద్యార్థి గృహం అద్భుత ఆశ్రమమని, ఇక్కడ ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికి బంగారు భవిష్యత్తు కల్పిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా, బలంగా ఉండాలని తమ వంతుగా విజయ పాలను, లస్సీ, స్వీట్‌లను రోజూ ఇస్తామని ప్రకటించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో గృహ చైర్మన్ సీతామోహన్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, జనరల్ మేనేజర్‌లు మధుసూదన్‌రావు, మల్లికార్జునరావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి సింగరేణి పునరంకితం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్డీఎం సుభాని

నాంపల్లి: అమరుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు సింగరేణి సంస్థ తన వంతుగా బొగ్గు, విద్యుత్‌ను అందిస్తోందని, సంస్థ ప్రగతితో పాటు రాష్ట్ర అభివృద్ధికి పునరంకితమై పనిచేస్తోందని సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కోల్ మూవ్‌మెంట్ ఎస్డీఎం.సుభాని అన్నారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ముందుగా తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సింగరేణి సంస్థ మార్కెట్లో పోటీని తట్టుకునేందుకు టన్నుకు కనీసం వెయ్యి రూపాయల ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని, పని గంటలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, ఉత్పాదకత పెంచాలని, గైర్హాజర్లు తగ్గించాలని కార్మికులకు సూచించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


బ్రహ్మోత్సవాలలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీటీడీ ఏఈఓ రమేష్

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం(టీటీడీ) 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి పంచాంగ శ్రవణం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణలు, సన్నాయి రాగాలు, మేళతాళాల మధ్య అంకురార్పణ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. నేటి నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని దేవాలయానికి అందంగా రంగులు వేశారు. విద్యుత్ దీపాలు, పూల దండలతో దేవాలయాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామికి సంబంధించిన భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీటీడీ ఏఈఓ రమేష్, దాత త్రినాథబాబుతోపాటు దేవాలయ ఉద్యోగులు, సిబ్బంది, వందలాది మంది భక్తులు పాల్గొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

'అగ్రి' వర్సిటీలో విత్తనాల పంపిణీ


అభ్యుదయ రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ చాన్స్‌లర్

ఏజీవర్సిటీ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అభ్యుదయ రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు భద్రాది కొత్తగూడెం జిల్లా రైతులకు విత్తనాలు పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించారని తెలిపారు. మంగళవారం(నేటి) నుంచి అభ్యుదయ రైతులకు రాష్ట్రమంతా వ్యవసాయ అధికారులు విత్తనాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. వర్సిటీ చేపట్టిన 'గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం'కార్యక్రమం ద్వారా 11 వేల గ్రామాల్లో 40 వేల మంది అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయనున్నట్లు చెప్పారు.

జీహెచ్‌ఎంసీ పాలకమండలి భేటీలో వివక్ష

బీజేపీ కార్పొరేటర్ల ఆరోపణ

సాక్షి, సిటీబ్యూరో: లక్షల రూపాయలు వెచ్చించి నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ పాలకమండలి సర్వసభ్య సమావేశం సైతం కొందరి స్వార్థానికి అనుగుణంగా సాగుతోందని బీజేపీ కార్పొరేటర్లు ఊరపల్లి శ్రవణ్, మహేందర్, ఆకుల శ్రీవాణి, బండారు శ్రీవాణి, దర్శన్ ఆరోపించారు. తమ డివిజన్ల ప్రజల సమస్యలు ప్రస్తావించేందుకు కార్పొరేటర్లకు అవకాశం ఇవ్వడంలేదని విచారం వ్యక్తం చేశారు. తాము చెప్పినట్లు వినని అధికారులను లక్ష్యంగా చేసుకొని వారి విభాగాలపై ప్రశ్నలు సంధించేలా చేసి వారిని ఇరుకున పెట్టడం ద్వారా తమ పబ్బం గడుపుకునే విధానాన్ని పాలకమండలి అనుసరిస్తోందని ఆరోపించారు. ప్రతి సమావేశంలోనూ తమకు కావాల్సిన కార్పొరేటర్ల ద్వారా ప్రశ్నలు పంపుతున్నారని, ఇకనైనా ఈ పద్ధతి మారి ప్రజల కోసం పనిచేసే కార్పొరేటర్లందరి ప్రశ్నలకూ అవకాశమివ్వాలని వారు డిమాండ్ చేశారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'ఆకాష్' విద్యార్థుల ప్రతిభ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్)కు చెందిన ఐదుగురు విద్యార్థులు దేశంలోని అత్యంత కఠినమైన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లో ఒకటైన జేఈఈ అడ్వాన్స్‌డ్–2025లో టాప్ స్కోరర్స్‌గా నిలిచారు. ఐఐటీ కాన్పూర్ వెల్లడించిన ఈ ఫలితాల వివరాలను సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థుల్లో కొత్త ధనుష్‌రెడ్డి అఖిల భారత స్థాయిలో 74వ ర్యాంకు, సమ్మిత పాలాడి 130వ ర్యాంకు, హర్ష్ ఎ.గుప్తా 210వ ర్యాంకు, రఘువన్ ఏపూరి 770, విశ్వ నవదీప్ గుంజె 877 ర్యాంకులను దక్కించుకున్నారని తెలిపారు. ఈ విద్యార్థులు ప్రత్యేకంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ కోసం రూపొందించిన తమ ప్రోగ్రామ్‌లో శిక్షణ పొందారని వివరించారు. ఈ సందర్భంగా సంస్థ అకడమిక్ చీఫ్ డా.ధీరజ్ మిశ్రా విద్యార్థులను అభినందించారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుక


హైదరాబాద్ కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేరవేయడంలో అధికారులు, ఉద్యోగుల పనితీరు అభినందనీయమని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, జాతీయ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, డాక్టర్ జి.ముకుంద రెడ్డి, డీఆర్‌ఓ ఈ.వెంకటాచారి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్రోరైల్ భవన్‌లో..

బేగంపేట్‌లోని హైదరాబాద్ మెట్రోరైల్ భవన్‌లో ఘనంగా జరిగాయి. ఎండీ ఎన్వీఎస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర సాధన కోసం త్యాగం చేసిన అమరుల త్యాగాలను స్మరిస్తూ నివాళులర్పించారు. నగర, రాష్ట్ర పురోగతిలో మెట్రో రైల్ కీలక పాత్ర నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏలో...

అమీర్‌పేట్‌లోని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో హెచ్‌ఎండీఏ ప్రధాన భాగస్వామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు, ప్లానింగ్ డైరెక్టర్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.


హెచ్‌ఎండీఏ కార్యాలయంలో..


మెట్రో రైల్ భవన్‌లో..

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, మంగళవారం, 3, జూన్, 2025



చల్ మేరే దిల్..

ఇప్పుడంటే మోటారు సైకిల్, కార్లు సర్వసాధారణం అయ్యాయిగాని.. ఒక జనరేషన్ వెనక్కి వెళితే సైకిల్ అనేది స్టేటస్ సింబల్‌గా ఉండేది. ఊర్లో అక్కడక్కడా కనిపించేవి. పెళ్లిళ్లలో మగ పెళ్లి వారు సైకిల్ బహుమానంగా ఇవ్వాల్సిందేనని అడిగి మరీ తీసుకునేవారు. ఆ పరిస్థితుల నుంచి మధ్యలో కొంత కాలం విరామం వచ్చింది. ప్రస్తుతం మళ్లీ సైకిల్‌కు క్రేజ్ పెరుగుతోంది. ఆరోగ్యం, శారీరక వ్యాయామం, ఒత్తిడి నుంచి రిలాక్సేషన్, కాలుష్య నివారణ, పెట్రోల్ వినియోగం తగ్గించడం వంటి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని గ్రహించిన పట్టణ యువత తిరిగి సైక్లింగ్ వైపు మొగ్గుచూపుతోంది. జూన్ 3 ప్రపంచ సైక్లింగ్ డే సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం. - సాక్షి, సిటీబ్యూరో

క్రేజ్ సంతరించుకుంటున్న సైకిల్



అన్ని వర్గాలకు అనుకూలంగా అనేక మోడళ్లు

అప్పటి జనరేషన్‌లో సైకిల్ ఓ స్టేటస్ సింబల్

సైక్లింగ్‌పై నగర యువతలో పెరుగుతున్న అవగాహన

కాలక్రమంలో ఆకారంలో అనేక మార్పులు

నేడు ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం

ఇటీవల కాలంలో నగర యువత నుంచి పెద్ద వారి వరకూ సైక్లింగ్ పట్ల ఆసక్తి చూపుతున్నారు. వారాంతాల్లో సైక్లింగ్ టూర్లకు పోవడం, నిత్యావసరాల కొనుగోలు, ఇంటికి సమీపంలోని దుకాణాలు, ఇతర అవసరాలకు సైకిల్ వాడటం ట్రెండ్‌గా మారుతోంది. కార్లు, మోటారు సైకిళ్లు ఉన్నవారు సైతం సైకిల్ వినియోగిస్తూ పరత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఇంకొందరు టూర్లకు వెళ్లే సమయంలో సైకిల్‌ను వాహనానికి వెనుక మాల కట్టుకుని మరీ వెళ్తున్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా కంపెనీలు సైతం అనేక రకాల మోడళ్లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



ఆకారంలో మార్పు.. ధరల్లో వ్యత్యాసం..

సైకిల్ తయారు చేసిన తొలినాళ్లలో దాని ఆకారం ఇప్పుడున్నట్లు లేదు. ముందు చక్రం పెద్దదిగాను, వెనుక చక్రం చిన్నదిగాను ఉండేది. కాలక్రమేణా దాని రూపం మారుతూ వచ్చింది. సైకిల్ ధర అప్పట్లో రూ.వందల్లో ఉండేది. ప్రస్తుతం మోడల్ బట్టి వేలల్లో అమ్మకాలు చేస్తున్నారు. 1980లో సుమారు రూ.500 నుంచి రూ.800 మధ్యలో లభించేది. అది కాస్త 2000 సంవత్సరం వచ్చే సరికి సుమారుగా రూ.3 వేల నుంచి రూ.4500 వరకూ పెరిగింది. ప్రస్తుతం పాత తరం వినియోగించే మోడల్స్ ఉత్పత్తి నిలిచిపోయింది. 1950 నుంచి దాదాపు 2000 సంవత్సరం వరకు సైకిల్ విరివిగా వినియోగించేవారు. హెర్క్యులస్, హీరో, అట్లాస్ వంటి సైకిల్ కంపెనీలు భారత దేశంలో గుర్తింపు పొందిన కంపెనీలు. దాదాపు రెండు దశాబ్దాల కాలం పాటు దీని వినియోగానికి విరామం ఏర్పడింది. అనంతరం కొత్త మోడళ్ల సైకిళ్లు అందుబాటులోకి వచ్చాయి. సామాన్యులు తొక్కే సైకిల్ ప్రారంభ ధర రూ.5 వేల నుంచి ప్రారంభమవుతున్నాయి. చిన్న పిల్లల సైకిళ్లు సుమారు రూ.3 వేల నుంచి రూ.పది వేలకుపైబడిన ధరల్లో అమ్ముడుపోతున్నాయి. చిన్న పిల్లలు, మహిళలు, పురుషులు, సైక్లింగ్ చేసేవాళ్లు, ఇలా వేర్వేరు కేటగిరీలు, విభిన్నమైన మోడళ్లలో సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి.



ఎన్నో ఉపయోగాలు..

సైకిల్ తొక్కువడం వల్ల ఆరోగ్య పరంగా, పర్యావరణ పరంగానూ అనేక ఉపయోగాలు ఉన్నాయి. ప్రస్తుత కాలంలో ప్రజలు అన్నిటికంటే ఆరోగ్యానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. క్యాన్సర్, మధుమేహం, స్థూలకాయం, గుండె జబ్బులు, అధిక రక్తపోటు, ఒత్తిడి, దీర్ఘకాలిక రోగాలకు సైక్లింగ్‌తో చెక్ పెట్టవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. నగరవాసులు బిజీ లైఫ్‌లో ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణిలు, ఇతర రంగాల వారికి తమతమ పనుల్లో శారీరక శ్రమ తగ్గిపోతోంది. దీంతో సైక్లింగ్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. మోటారు సైకిళ్లు, కార్లకు బదులుగా సైకిళ్లను వినియోగిస్తే కాలుష్య నివారణతో పాటు, ఆర్థికంగానూ, ఆరోగ్య పరంగానూ ఉపయోగకరంగా ఉంటుంది. నగరంలో సైక్లింగ్ కోసం ప్రభుత్వం ప్రత్యేకించి ఓఆర్ఆర్, కేబీఆర్ పార్క్, తదితర ప్రదేశాల్లో సైకిల్ ట్రాక్స్ నిర్మించింది.



దేశంలో సైకిల్ చరిత్ర ఇలా..

భారత దేశంలో 1890ల్లో యూరోపియన్ దేశస్తులు సైకిల్ తొక్కడం ప్రారంభించారు. ఉన్నత, ఎగువ మధ్యతరగతి కుటుంబాలు స్టేటస్ సింబల్‌గా వినియోగించేవారు. 1920–1935 మధ్య కాలంలో ప్రపంచ సైకిల్ యాత్రలు ప్రారంభమ్యాయి. బ్రిటిష్, నవాబుల పరిపాలనలో సమాచార సరఫరా, తపాలా, పోలీసులు, సైన్యం సైతం వివిధ అవసరాలకు సైకిళ్లనే వినియోగించేవారు. తొలి నాళ్లలో కార్మికులు హెర్క్యులస్ సైకిళ్లు వినియోగిస్తే.. ఉన్నత వర్గాలు రాలీ, జేమ్స్ సైకిళ్లను వినియోగించేవారట.



ఫిట్నెస్ మోటివేట్ అవుతుంది..

సైక్లింగ్ చేయడం వల్ల ఫిట్నెస్ మోటివేట్ అవుతుంది. వీలు చిక్కినప్పుడల్లా స్నేహితులంతా కలసి సైక్లింగ్ చేస్తాం. ఫలితంగా రొటీన్ లైఫ్‌కు భిన్నంగా ఉంటుంది. ఒత్తిడి నుంచి రిలాక్సేషన్ లభిస్తుంది. కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలను నియంత్రించవచ్చు.

– నేహ, మణికొండ



పర్సనల్ టైం సైక్లింగ్..

తొమ్మిదేళ్ల నుంచి సైక్లింగ్ చేస్తున్నాను. ఉదయం 5.30 గంటల నుంచి 8 గంటల వరకూ సైక్లింగ్ చేస్తాం. ఇంటికి చేరుకుని కుటుంబం, పిల్లలు ఇతర పనుల్లో బిజీ అయిపోతాం. నాకంటూ దొరికే పర్సనల్ టైం సైక్లింగ్. ఔట్ సైడ్ నేచర్ ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చు. ప్రాణం ప్రశాంతంగా ఉంటుంది. 70 కిలోమీటర్ల వరకూ వెళ్తుంటాను. 500 కిలోమీటర్లు సైక్లింగ్ చేయాలన్నది నా లక్ష్యం. 35 మంది మహిళలు కలిసి వెళ్తుంటాం. అంతా మంచి మిత్రులైపోయాం.

– వందన లోకేష్ యుగంధర్, మణికొండ



విశ్వనగరానికి వీడ్కోలు..

నగరంలో అట్టహాసంగా జరిగిన ప్రపంచ సుందరి పోటీలు ముగిశాయి. దీంతో ఆయా దేశాలకు చెందిన ఒక్కో కంటెస్టెంట్ నగరాన్ని వీడి తమ తమ దేశాలకు ప్రయాణమయ్యారు. ఇందులో భాగంగా ఆఫ్రికా ఖండంలోని వివిధ దేశాలకు చెందిన మిస్ టోగో, మిస్ కిర్గిస్థాన్, మిస్ హైతీ, మిస్ నైజీరియా, మిస్ ఉగాండా, మిస్ ఈక్వటోరియల్ గినియా, మిస్ సియెర్రా లియోన్ నగరానికి వీడ్కోలు పలుకుతూ విమానాశ్రయంలో సెల్ఫీలు దిగారు.

– సాక్షి, సిటీ బ్యూరో

లోకల్ వోకల్స్..

లోకో వోకో

› నగర వేదికగా మరో లైవ్ కాన్సర్ట్

› పాటలతో సందడి చేయనున్న ప్రముఖ సింగర్స్ రాహుల్ సిప్లిగంజ్, చిన్మయి శ్రీపాద



సాక్షి, సిటీ బ్యూరో: హైదరాబాద్ నగరం మరో ప్రతిష్టాత్మక లైవ్ కాన్సర్ట్‌కు వేదిక కానుంది. అయితే ఈ సారి లోకల్ వోకల్స్ తమ స్వరాలతో హోరెత్తించనున్నారు. ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్, చిన్మయి శ్రీపాద ద్వయం 'లోకో వోకో' పేరుతో అతి పెద్ద లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహించనున్నారు. ఈ నెల 7వ తేదీన నగరంలోని బౌల్డర్ హిల్స్ వేదికగా బీట్స్ అండ్ బ్యాండ్‌తో పాటల జల్లు కురిపించనున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో కొనసాగనున్న ఈ కాన్సర్ట్ సాయంత్రం జరగనుంది. దీనికి 16 ఏళ్ల వయసు పై బడిన వారికి మాత్రమే అనుమతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఈవెంట్స్‌కు సంబంధించిన పాస్‌లు బుక్ మై షో లో అందుబాటులో ఉన్నాయి.



వారానికో సెలబ్రిటీ.. ఫొర్సెస్ ఆఫ్

త్యానీ..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని జూబ్లీహిల్స్‌లో ఉన్న త్యానీ జ్యువెలరీ బై కరణ్ జోహార్‌కు బాలీవుడ్ నటి షెఫాలీ షా బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని బ్రాండ్ నిర్వాహకుడు, బాలీవుడ్ ప్రముఖుడు కరణ్ జోహార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రచార పంధాలో కొత్త పోకడలు తెస్తూ, వారానికో సెలబ్రిటీని ఫోర్సెస్ ఆఫ్ త్యానీగా ఎంచుకోనున్నామని, ఈ క్రమంలో తొలి స్టార్‌గా దేశవ్యాప్తంగా తమ బ్రాండ్ కోసం షెఫాలీ పని చేస్తారని ఆయన వివరించారు.



అలరించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు

నృత్యం నయనానందకరం..

శిల్పారామంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మాదాపూర్ : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు సోమవారం ప్రదర్శించిన నృత్యాలు సందర్శకులను అలరించారు. పేరిణి, భరతనాట్యం, ఒడిస్సీ, సంబల్పూరి నృత్యప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పేరిణి సంతోష్ శిశమ్ బృందంచే పుష్పాంజలి, బ్రహ్మగద్యం, దేవీకైవారం, శ్రీమన్మహారాజ, దేవిస్తుతి, శబ్దపల్లవి వంటి పలు అంశాలను ప్రదర్శించారు. అస్మిత కాలే శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శనలో భాగంగా శివశంకర, చంద్రచూడ, శివతాండవం తదితర అంశాలను ప్రదర్శించారు. అర్చనమిశ్ర శిష్యబృందంచే కథక్ నృత్య ప్రదర్శనలో భాగంగా నృత్యసంగీత్, మధురాష్టకం, సర్గం, హసం ధ్వని పల్లవి, మాతంగి ధ్యానం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.



పేరెంటింగ్‌కు సరికొత్త దిక్సూచి

పేరెంట్ షాలా..

చిన్నారుల పెంపకం కోసం అధునాతన యాప్ ఆవిష్కరణ..




సాక్షి సిటీ బ్యూరో: ప్రస్తుత కాలంలో పిల్లల్ని పెంచడం ఒక ఛాలెంజింగ్‌గా మారిందని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, లైఫ్ స్టైల్ ఇందుకు ముఖ్య కారణాలని ప్రముఖ మనస్తత్వవేత్త సుధీర్ సంద్రా తెలిపారు. సుధీర్ ఆధ్వర్యంలో నగరంలోని శిల్పకళా వేదికగా నిర్వహించిన సూపర్ ఫ్యామిలీ ఫెస్ట్ ఈవెంట్‌లో 1,300 మందికి పైగా తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు ఉపయోగపడే అధునాతన యాప్ 'పేరెంట్ షాలా' ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మంది తల్లిదండ్రులు చిన్నారులకు సరైన గైడెన్స్ ఇచ్చే వేదిక కోసం వెతుకుతున్నారని, దీనికి అనువైన వేదిక 'పేరెంట్ షాలా' అని పేర్కొన్నారు. వారికి ఇదొక మెంటార్ లా సాయపడుతుందని చెప్పారు. నిపుణుల మార్గదర్శకత్వంతో పాటు కమ్యూనిటీ పరంగా సహాయం అందిస్తుందని, భారతీయ సంప్రదాయాలకు, ఆధునిక పేరెంటింగ్ పద్ధతులను జత చేసి అనుబంధాలను పెంచేందుకు దోహదపడుతుందని తెలిపారు. మొబైల్ ఫోన్లకు అతుక్కుపోకుండా చిన్నారుల దృష్టిని మళ్లిస్తుందని, అలాగే తల్లిదండ్రుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచి పిల్లల భవిష్యత్తును అద్భుతంగా తీర్చిద్దేందుకు ఒక సాధనంగా ఉపయోగపడుతుందని అన్నారు. ఇదే వేదికపై సూపర్ ఫ్యామిలీ ఫెస్ట్‌లో భాగంగా నలుగురు మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత స్టోరీ టెల్లర్ రమా రావి, డాక్టర్ ఇప్పలపల్లి రమేశ్, నేషనల్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ (ఎన్‌హెచ్ఏ) డైరెక్టర్ మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఆధునిక అభివృద్ధికి తెలంగాణ కేంద్ర బిందువు

రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రి శుభాకాంక్షలు





సాక్షి, న్యూఢిల్లీ: యువ రాష్ట్రం అయిన తెలంగాణ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉండటంతో పాటు, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో ఆధునిక అభివృద్ధికి కేంద్రబిందువుగా మారిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నానని ఆమె ఆకాంక్షించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా సోమవారం రాష్ట్ర ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం జాతీయ పురోగతికి అవిరళ కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. గత దశాబ్దంలో, రాష్ట్ర ప్రజల 'జీవన సౌలభ్యాన్ని' పెంచేందుకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఉన్నతమైన సంస్కృతి, సంప్రదాయాలను, కష్టజీవులైన ప్రజలను ఆభరణంగా కలిగిన తెలంగాణ రాష్ట్రం, దేశ సాంస్కృతిక పటంలో ప్రకాశవంతంగా వెలుగుతోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ఆయన తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన విద్యార్థులు సహా అమరవీరులను వారు స్మరించుకున్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణ దిశగా ముందుకు..

పదేళ్ల ఆర్థిక విధ్వంసాన్ని అధిగమిస్తున్నాం: మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళుతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన పదేళ్ల ఆర్థిక విధ్వంసాన్ని అధిగమిస్తూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ పరిపాలన సాగిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం గాంధీభవన్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

హరీశ్‌రావుకు బీఆర్‌ఎస్ బీఫారం వస్తుందా?

అనంతరం గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనపై తాము ఎక్కడైనా, ఎవరితోనైనా చర్చకు సిద్ధమని అన్నారు. కంచె చేను మేసినట్టు బీఆర్‌ఎస్ నేతలు పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నారని, ప్రభుత్వ ఆస్తులను నాశనం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం నోటీసుల నేపథ్యంలో హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లు కలిసినట్టు తమకు పక్కా సమాచారం ఉందన్నారు. పార్టీ పొత్తులపై మాట్లాడుతున్న హరీశ్‌రావుకు అసలు బీఆర్‌ఎస్ బీఫారం వస్తుందా అని ప్రశ్నించారు.

రూ.10 లక్షల కోట్ల అప్పు చేసి దివాలా తీయించారు

- ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేసింది
- కేంద్ర మంత్రి బండి సంజయ్



జాతీయ జెండాకు వందనం చేస్తున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో దాదాపు రూ.10 లక్షల కోట్లు అప్పు చేసి, తెలంగాణనుపూర్తిగా దివాలా తీయించారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. లక్షల కోట్ల అప్పు చేసినా రాష్ట్ర ప్రజల బతుకులు మారలేదని, ఆరు గ్యారంటీలు సహా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని అన్నారు. ఈ రెండు పార్టీల పాలన, అవినీతి వల్ల తెలంగాణను దిగజార్చారని విమర్శించారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



మిస్ వరల్డ్–2025 ఒపల్ సుచాతా చువాంగ్‌శ్రీకి హైదరాబాద్‌లో కస్టమైజ్డ్ చార్మినార్ థీమ్ 'మై స్టాంప్'ను తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి బహూకరించారు.



పోలీసు దళాల గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్‌లతో పురస్కార గ్రహీతలు గోరటి సుప్రజ, హేమనళిని, జయరాజ్, విమల, ఎక్కా యాదగిరి రావు, అందెశ్రీ, సుద్దాల అశోక్‌తేజ, నలిమెల భాస్కర్, పాశం యాదగిరి తదితరులు

2047 నాటికి ప్రపంచంలోనే నంబర్ 1గా తెలంగాణ

- పదేళ్లలో ట్రిలియన్ ఎకానమీ... 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ
- ఆ దిశగా ప్రణాళికలకు రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన... తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ల ఎకానమీగా తీర్చిదిద్దడంలో తెలంగాణ అగ్రభాగాన నిలువనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రైజింగ్–2047 నినాదంతో పదేళ్లలో రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్ది, 2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమీగా మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. దేశంలోనే గాక ప్రపంచంలోనే తెలంగాణను నంబర్ వన్‌గా నిలిపే దిశగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. పారదర్శక పాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే ప్రయత్నంలో ప్రజలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జపాన్‌లోని కితాక్యూషూ నగర మేయర్ కజుహిసా టకేచి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం సీఎం ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల కలలను సాకారం చేసిన సోనియాగాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతికి చేస్తున్న కృషిని, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

అన్ని వ్యవస్థలనూ చక్కదిద్దుతున్నాం..

'రాష్ట్రం వచ్చి పదేళ్లయినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. కట్టు బానిసత్వాన్ని తెలంగాణ సమాజం సహించదు. అందుకే పదేళ్ల ఆధిపత్యాన్ని తిరస్కరించి.. ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. మేము అధికారం చేపట్టే నాటికి వ్యవస్థలన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఆ వ్యవస్థలన్నింటినీ చక్కదిద్దుతున్నాం. ప్రజా ఆలోచనలే ఆచరణగా ముందుకు సాగుతున్నాం. నిర్లక్ష్యానికి గురైన యూనివర్సిటీలకు వీసీలను నియమించాం. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యా కమిషన్, వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసుకున్నాం. సమాచార కమిషనర్లను, లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ సభ్యులను నియమించుకుని, వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నాం.

ఇందిరా మహిళా శక్తి మిషన్

మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిరా మహిళా శక్తి మిషన్ పాలసీని ఆవిష్కరించుకున్నాం. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తొలి ఏడాదిలోనే రూ.21 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను పంపిణీ చేశాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించే బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించాం. మహిళా స్వయం సహాయక సంఘాలతో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయించాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. బస్సులకు మహిళలను యజమానులుగా మార్చే కార్యక్రమాలను చేపట్టాం. ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా ఇప్పటికే 150 బస్సులను అందజేశాం. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లలాంటి పథకాలు అమలు చేస్తున్నాం.

రైతన్న సంక్షేమానికి పెద్దపీట

రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. కేవలం 8 నెలల్లో 25,35,964 మందికి రూ.20,617 కోట్లు మాఫీ చేశాం. వారికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.12 వేలకు పెంచాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంతో భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నాం. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా భూ భారతి–2025 చట్టాన్ని తీసుకువచ్చాం. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నాం.

యువతే మన భవిష్యత్తు..

యువతే మన భవిష్యత్తు అనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే 60 వేలకు పైగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి, నియామక పత్రాలను అందించాం. డీఎస్సీ ప్రకటించి 10 వేల మందికి పైగా టీచర్లను నియమించాం. సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రీ స్కూల్ విధానం తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నాం. అన్నివర్గాల విద్యార్థులు ఒకేదగ్గర ఉండేందుకు వీలుగా తొలిదశలో రూ.11,600 కోట్లతో 58 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం చేపట్టాం.

కులగణనతో దేశానికి ఆదర్శంగా..

కులగణన ద్వారా దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపాం. తెలంగాణ బాటలోనే కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టేందుకు సిద్ధమైంది. ఎస్సీ ఉప కులాలను మూడు గ్రూపులుగా విభజించి చట్టబద్ధత కల్పించాం.

నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు

ఇళ్లు లేని నిరుపేదలు ఇంటిని నిర్మించుకునేందుకు ఇందిరమ్మ పథకం ద్వారా రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నాం. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. పేదల ఆకలి తీర్చడమే కాదు.. వారు ఆత్మగౌరవంతో జీవించేలా సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించాం. తెలంగాణలో 3 కోట్ల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. సంక్షేమ పథకాల చరిత్రలో సన్న బియ్యం ఒక ట్రెండ్ సెట్టర్. తెలంగాణను పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. దావోస్, సింగపూర్, జపాన్ లాంటి దేశాల్లో పర్యటించి ఇప్పటివరకు రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఐటీ దిగ్గజాలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్ వంటి పెద్ద కంపెనీలు హైదరాబాద్‌లో తమ సంస్థలను విస్తరిస్తున్నాయి. తెలంగాణ రైజింగ్‌లో ఇదొక తొలి మెట్టు.

30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ

మూసీని పునరుజ్జీవింప చేయడంతో పాటు బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో గాంధీ సరోవర్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించాం. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయబోతున్నాం. హైదరాబాద్ నగర అభివృద్ధి లక్ష్యంగా దాదాపు రూ.18 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాం. రూ.24 వేల కోట్లతో మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రాజెక్టును చేపడుతున్నాం. ప్రభుత్వ ఆధ్వర్యంలో 'భారత్ సమ్మిట్' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాం.

దేశ సమగ్రత కోసం రాజకీయాలకు అతీతంగా..

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రపంచ సుందరి పోటీలకు ఆతిథ్యం కల్పించాం. 100కు పైగా దేశాల నుంచి పోటీల్లో పాల్గొన్నారు. వారంతా తెలంగాణ చారిత్రక కట్టడాలను, టూరిస్ట్ ప్రదేశాలను సందర్శించి తెలంగాణ చారిత్రక వైభవాన్ని 'తెలంగాణ.. జరూర్ ఆనా' అంటూ ప్రపంచం నలుదిశలా చాటారు. పహల్గాం దాడి నేపథ్యంలో మన సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ప్రకటించడమే ఇందుకు నిదర్శనం.

కవులు, కళాకారులకు రూ.కోటి చొప్పున పురస్కారం

- 9 మందికి అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- నలిమెల భాస్కర్‌కు కాళోజీ పురస్కారం
- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులు, ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, జపాన్‌లోని కితాక్యూషూ సిటీ మేయర్ కజుహిసా టకేచీ తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం.. వివిధ పోలీసు దళాల గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖలకు చెందిన పోలీసులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ జరిపిన కవాతు ఆకట్టుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జానపద కళాకారులు ప్రదర్శనలిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, తెలంగాణ ప్రజాపోరాటానికి స్ఫూర్తినిచ్చిన 9 మంది కవులు, కళాకారులకు సీఎం రేవంత్‌రెడ్డి కోటి రూపాయల చొప్పున నగదు పురస్కారం అందజేశారు. 2024 డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా 9 మందికి ఒక్కొక్కరికి కోటి రూపాయల నగదు పురస్కారం అందించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ మేరకు పురస్కారాలను చెక్కుల రూపంలో అందించిన సీఎం.. వారి సేవలను కొనియాడారు.

అవార్డు అందుకున్న గద్దర్ సతీమణి..

దివంగత ప్రజాకవి గద్దర్ తరఫున ఆయన సతీమణి విమల, గూడ అంజయ్య తరఫున ఆయన సతీమణి హేమనళిని, బండి యాదగిరి తరఫున ఆయన కుటుంబసభ్యులు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. గోరటి వెంకన్న విదేశాల్లో ఉండడంతో ఆయన కుమార్తె సుప్రజ స్వీకరించారు. వీరితోపాటు అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, శిల్పి ఎక్కా యాదగిరి రావు, జర్నలిస్టు పాశం యాదగిరికి నగదు పురస్కారాలు అందజేశారు. బహు భాషా సాహితీవేత్త నలిమెల భాస్కర్‌కు కాళోజీ పురస్కారం అందించి గౌరవించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 19 మంది పోలీస్ అధికారులకు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, మరో 11 మందికి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డులను సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు.



రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా హైకోర్టు ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేస్తున్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్. పాల్గొన్న న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు

తెలంగాణ రైజింగ్.. భవిష్యత్‌కు భగవద్గీత

ఖమ్మంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి



రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో అమరవీరుల కుటుంబాలను సన్మానిస్తున్న భట్టి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: తెలంగాణ సమగ్రాభివృద్ధికి.. ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో 'తెలంగాణ రైజింగ్–2047' విజన్ డాక్యుమెంట్ రూపొందించామని. ఇది భవిష్యత్‌కు భగవద్గీతలా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ డాక్యుమెంట్‌పై ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఖమ్మం పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో భట్టి జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. అమరవీరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ.. అన్ని రంగాల్లో వెలుగులు విరజిమ్ముతోందన్నారు. భవిష్యత్ తరాలకు పర్యావరణ హిత ఇంధనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా తమ ప్రభుత్వం తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని రూపొందించిందని భట్టి తెలిపారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో దాదాపు 29 లక్షల వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు భట్టి వివరించారు.

భిన్నత్వంలో ఏకత్వంగా పురోగమిస్తున్న తెలంగాణ

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

- రాజ్‌భవన్‌లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం
- సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మిస్‌వరల్డ్ విజేతలను ఘనంగా సన్మానించిన గవర్నర్ దంపతులు



మిస్ వరల్డ్ సుచాత చువాంగ్ శ్రీకి జ్ఞాపిక అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

సాక్షి, హైదరాబాద్: వికసిత్ భారత్ లక్షణాలను పుణికి పుచ్చుకొని తెలంగాణ పురోగమిస్తోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. భిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శిస్తుండటం ఈ ప్రాంత ప్రధాన బలంగా అభివర్ణించారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందినవారు తెలంగాణలో ఒకటిగా జీవిస్తూ రాష్ట్ర పురోగతికి తోడ్పడుతున్నారన్నారు. భారతదేశం యూనియన్ ఆఫ్ స్టేట్స్ మాత్రమే కాదని..యూనియన్ ఆఫ్ హార్ట్స్ అని అది తెలంగాణలో ప్రస్ఫుటంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. తాను ఈశాన్య భారతానికి చెందిన వాడినైనప్పటికీ, అక్కడ ఉన్నప్పటి కంటే తెలంగాణ గవర్నర్‌గా ఎక్కువమంది ఈశాన్య భారత ప్రాంత వాసులను కలిశానని గుర్తు చేశారు. అన్ని ప్రాంతాల సమాహారంగా తెలంగాణ వెలుగొందుతోందని కితాబిచ్చారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్‌భవన్‌లో సోమవారం, ప్రపంచ సుందరి పోటీ విజేతలను ఆయన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రాష్ట్ర పురోగతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. తేనీటి విందులో భాగంగా అతిథులకు భోజన పదార్థాలను ప్రత్యేకంగా విస్తరాకులు, ఆకు దొప్పల్లో వడ్డించారు. ఇది తాను ప్రత్యేకంగా ఆదేశించి ఏర్పాటు చేయించానని గవర్నర్ పేర్కొంటూ, ప్రపంచ పర్యావరణానికి ప్రతి ఒక్కరు తోడ్పడాలని, ఇందుకు ఇలాంటి పర్యావరణ అనుకూల విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు. నెల రోజుల పాటు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు, ఇక్కడి పురోగతిని దగ్గరగా గమనించినందున మిస్ వరల్డ్‌లో పాల్గొన్నవారు వారి దేశాలకు వెళ్లిన తర్వాత తెలంగాణ అంబాసిడర్లుగా మారి అక్కడి వారికి ఇక్కడి విషయాలను కథలుగా వివరించాలని మిస్ వరల్డ్ విజేతలను కోరారు. మిస్ వరల్డ్ పోటీదారుల ప్రేరణాత్మక గాథలను ఆయన శ్లాఘించారు. తెలంగాణ ప్రజలు చూపిన ఆదరాభిమానాలను ఎన్నటికీ మరిచిపోలేమని మిస్ వరల్డ్ ఓషియానియా జాస్మిన్ స్ట్రింగర్ (మిస్ ఆస్ట్రేలియా) అన్నారు. తెలంగాణ చాలా అందమైన ప్రాంతమని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు బిద్రి వర్క్‌తో రూపొందించిన జ్ఞాపిక, పోచంపల్లి పట్టుచీరలను మిస్ వరల్డ్ విజేతలకు అందించగా, సిల్వర్ ఫిలిగ్రీతో రూపొందించిన నెమలి బొమ్మను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, దానకిషోర్, డీజీపీ జితేందర్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు దంపతులు, సినీ దర్శకుడు సుకుమార్ తదితరులు హాజరయ్యారు.

ఈ రోజు హైదరాబాద్‌లో ఉండటం గౌరవంగా భావిస్తున్నాం

తెలంగాణకు గొప్ప సుదినమైన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున మేం హైదరాబాద్‌లో ఉండటాన్ని గౌరవంగా భావిస్తున్నాం. నెల రోజులపాటు ఈ గొప్ప నేలపై ఉండి, ఇక్కడి అద్భుత సంస్కృతీ సంప్రదాయాలను స్వయంగా చూడటంతోపాటు అనుక్షణం ప్రజల ప్రేమానురాగాలు పొందాం. ఇక్కడి సంప్రదాయాలు, సాంకేతిక, ఆవిష్కరణల మేళవింపు, సాంకేతికత, ఆధునిక వైద్యంలో ముందుకు సాగుతున్న తెలంగాణ.. ప్రజల జీవనంలో గొప్ప మార్పులు తెస్తోంది. ఇక్కడి ఆధునిక వైద్య వసతి నన్ను బాగా ఆకట్టుకుంది.. జై తెలంగాణ, జైహింద్

– మిస్ వరల్డ్ ఒపల్ సుచాత చువాంగ్ శ్రీ

మా ఇంట్లో ఉన్న అనుభూతి

ఇక్కడ గడిపిన నెలరోజులు మేం మా ఇంట్లో ఉన్న అనుభూతి పొందాం. తెలంగాణ అద్భుత ప్రాంతం. ఇక్కడి గొప్పదనం గురించి మేం వేరే ప్రాంతాల్లో వివరించి ఇక్కడి పర్యాటకరంగ పురోగతికి మా వంతు సాయం చేస్తాం.

– మిస్ వరల్డ్ ఆఫ్రికా హస్సెట్ దెరెజ్ అద్మాస్సు (ఫస్ట్ రన్నరప్– మిస్ ఇథియోపియా)

ఇది ఎంతో అందమైన ప్రాంతం

తెలంగాణ ఎంత అందమైన ప్రాంతమో.. ఇక్కడి ప్రజల మనసులు అంతకంటే అందమైనవి. తెలంగాణకు రావటం నాకు ఇది మొదటిసారి, కానీ ఇదే చివరిసారి కాదని మాత్రం కచ్చితంగా చెప్పగలను.

– మిస్ వరల్డ్ యూరప్ మిస్ మాజా క్లాడ్జా (సెకండ్ రన్నరప్–మిస్ పోలాండ్)

అవేవీ తెలంగాణకు సాటిరావు

నేను ప్రపంచంలో ఎన్నో ప్రాంతాలు చూశాను. కానీ అవేవి తెలంగాణకు సాటిరావని ఇక్కడి అనుభవం చెప్తోంది. ఇండియా ఎంతో పెద్ద దేశం, ఇక్కడ ఎన్నో సంస్కృతులు, సంప్రదాయాలు, భాషల వారున్నారు. పరస్పరం భిన్న సంస్కృతులతో ఉన్నా అంతా కలిసిమెలిసి ఉండగలం అన్న గొప్ప విషయం తెలంగాణను చూసి తెలుసుకున్నా..

– మిస్‌వరల్డ్ అమెరికా ఎథెన్నా క్రాస్బీ

భారత్‌కు రావాలన్న కల నెరవేరింది

భారత్‌కు రావాలన్న నా కల ఈ పోటీల రూపంలో నెరవేరింది. ఇక్కడ కాలు మోపిన క్షణం నుంచి ఇక్కడి ప్రజల ఆప్యాయతలకు ఫిదా అయ్యాను. తెలంగాణ ఘన చరిత్ర, ఇక్కడి భిన్నత్వంలో ఏకత్వ విధానం చాలా గొప్పవి. మరోసారి ఈ ప్రాంతానికి రావాలని ఉంది.

– మిస్ వరల్డ్ కరేబియన్ ఆరెలీ జోకిమ్ (మిస్ మార్టినిక్)

మా జీవితంలో మరిచిపోలేనిది

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఒక ఉత్సవంగా జరుపుకోవటమే కాదు..ఇందుకు కారణమైన త్యాగధనుల త్యాగాలు నెమరేసుకునే రోజు. మా తెలంగాణ జర్నీ.. మా జీవితంలో మరిచిపోలేని, మధురానుభూతిని మిగిల్చాయి..

మిస్ వరల్డ్ ఏషియా కృష్ణా గ్రవిడేజ్ (మిస్ ఫిలిప్పీన్స్)

తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలి

సాక్షి, హైదరాబాద్: ప్రజలు ఐక్యంగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి సాధించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆకాంక్షించారు. సాంకేతిక పురోభివృద్ధితోపాటు యువత, మహిళలు, రైతాంగం, పేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ తెలంగాణలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయని చెప్పారు. రోడ్డు, మెట్రో రవాణా వ్యవస్థలు విస్తరిస్తున్నాయన్నారు.

పురస్కారాలు అందుకున్నది వీరే...

తెలంగాణలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని గవర్నర్ సత్కరించారు. ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, ప్రజాగాయకుడిగా, కళాకారుడిగా విశిష్ట సేవలు అందించిన అంతడుపుల నాగరాజు, జాతీయస్థాయిలో ఉత్తమ మాటల రచయితగా గుర్తింపు పొందిన నటుడు, రచయిత దాస్యం తరుణ్‌భాస్కర్, హైదరాబాద్ బ్రదర్స్‌గా కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో ప్రత్యేకత చాటిన సోదరుల్లో ఒకరైన రాఘవాచారి, అధ్యాపకురాలిగా, పరిశోధకురాలిగా, జానపద కళల పరిరక్షకురాలిగా సేవలందించిన చింతపల్లి వసుంధరారెడ్డి, చిత్రకళా ప్రదర్శనల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన చిత్రకారుడు సీవీ అంబాజీ, రచయితగా, చరిత్ర పరిశోధకుడిగా, డాక్యుమెంటరీ ఫిల్మ్‌మేకర్‌గా బహుముఖ ప్రతిభ కనబరిచిన మామిడి హరికృష్ణ గవర్నర్ నుంచి పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు.

ప్రత్యేక రాష్ట్రంలో ప్రజలు మోసపోతూనే ఉన్నారు

- వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం : కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి
- బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దిన వేడుకలు



జై తెలంగాణ అంటూ నినదిస్తున్నకిషన్‌రెడ్డి. చిత్రంలో ఈటల, పొంగులేటి, గుజ్జుల తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటై పదకొండేళ్లు గడిచినా, ఇప్పటికీ ప్రజలు మోసపోతూనే ఉన్నారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ మాటలు నమ్మి రెండుసార్లు అధికారం కట్టబెడితే పదేళ్లు మోసపోయారని, తర్వాత కాంగ్రెస్ హామీలు నమ్మి ఓట్లేసి మరోసారి మోసపోయారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేది బీజేపీ అని చెప్పారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం కిషన్‌రెడ్డి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్‌ఎస్ బాటలోనే నడుస్తోందని, పాలనలో ఎలాంటి మార్పు లేదన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజైనా రైతైనా.. కొడుకైనా కూతురైనా
కలెక్టరైనా బంట్రోతైనా.. ఊరైనా పట్నమైనా
మనిషికి ప్రాప్తమయ్యే మొదటి వాహనం సైకిల్.
దోగాడే వయసులో ట్రై సైకిల్ తొక్కి
బైస్కిల్‌కు ఎదగడమే చేయాల్సింది.
ఇక అక్కడి నుంచి ఎక్కడికి చేరినా
జీవితాన్ని బేలెన్స్ చేసుకుంటూ
ముందుకు సాగమని చెబుతుంది సైకిల్.
ప్రతి ఒక్కరి బాల్యంలో సైకిల్ విడదీయరానిది.
ఆ మాటకొస్తే సైకిల్‌లోని ప్రతి పార్ట్
జీవన సందేశాన్ని వినిపిస్తుంది.
అసలు సైకిల్‌ని ఇష్టపడని వారెవరు?



నేడు వరల్డ్ సైకిల్ డే

మొదటి వాహనముకు వందనం!



సైకిల్!

ట్రింగ్ ట్రింగ్‌మని బెల్లు కొడుతూ జ్ఞాపకాలు కమ్ముకుంటున్నాయా?

చిన్నప్పుడు ఎవరిదో ఇంటి ముందు సైకిల్ స్టాండ్ వేసి ఉంటే కింద కూచుని పెడల్ తిప్పుతూ వెనుక చక్రం గిర్రున తిరుగుతుంటే చూసిన జ్ఞాపకం. ముందు చక్రంలో వెనుక చక్రంలో స్పోక్స్ మధ్యన ఉండే ఇంద్రధనువు రంగుల కుచ్చు గుబ్బలను ఆసక్తిగా చూసిన జ్ఞాపకం. వెనుక సీటుకు డైనమో ఉంటుంది. అది ఆన్ చేస్తే బ్యాక్ టైర్‌కు అంటుకుంటుంది. టైరు తిరిగే కొద్దీ డైనమో నుంచి కరెంటు జనరేట్ అయ్యి ముందున్న బల్బు వెలుగుతుంది. ఆ రోజుల్లో రాత్రుళ్లలో లైటు వెలిగే సైకిల్ తొక్కేవాడు గొప్ప.



అవును. సైకిల్ తొక్కడం గొప్పే. ఎంతమంది దగ్గర ఉండేదని. ఒకవేళ ఉన్నా అందులో అంతరం. ర్యాలీ, హంబర్ సైకిళ్లు ఉన్నవారు శ్రీమంతులు, హీరో సైకిల్ ఉన్నవారు మధ్య తరగతి వారు, అట్లాస్ అంటే ఇక పేదవాళ్లు కొని తెగ తొక్కడమే. ఆ తర్వాత బి.ఎస్.ఏ సైకిళ్లు వచ్చాయి. వాళ్లు తెచ్చిన లేడీస్ సైకిళ్లు ఆడపిల్లలను వాటిపై కూచోబెట్టి నేరుగా స్కూళ్లకు కాలేజీలకు పంపాయి. చిన్న పట్టణాల్లో సాయంత్రాలు సైకిల్ తొక్కుతూ వెళ్లే ఆడపిల్లలకు ఉండే క్రేజ్ సామాన్యం కాదు.

మగాడికి 'మగాడు' అనిపించుకునే సవాళ్లు సమాజం పెడుతూ ఉంటుంది. ఆ సవాళ్లలో ఒకటి సైకిల్ తొక్కడం నేర్చుకోవడం. ఏడు, ఎనిమిది తరగతులకు రావడంతోటే ఊళ్లలో పల్లెల్లో పిల్లలు సైకిల్ నేర్చుకుని ఉండాల్సింది. 'ఏంటి.. మీవాడికి ఇంకా సైకిల్ తొక్కడం రాదా' అనంటే అవమాన పడిపోయే తండ్రులు ఉండేవారు. కొడుకు తిట్లతో రెచ్చగొట్టి 'సైకిల్ తొక్కుతావా లేదా' లేదా అని ఎక్కించి వెనుక పరిగెత్తుతూ నేర్పించేవారు. ఆ రోజుల్లో పిల్లలు తొక్కే సైకిళ్లు ఎక్కడివని? అన్నీ పెద్దలు తొక్కేవే. అందుకే పిల్లలు మొదట అఫ్ పెడల్ తొక్కి, ఆ తర్వాత ఫ్రంట్ బార్ మీద కూచుని తొక్కి, కాళ్లందే ఎత్తు పెరిగాక సీటు మీద కూచుని తొక్కేవారు.

సైకిల్ తొక్కడం అంత ఈజీ కాదు. ఆ రోజుల్లో ప్రతి సైకిలూ తన యజమానిని సొంత ఊరి చెరువు నీళ్లు గటగటా తాగించేది. ఒక సైకిలుకు బ్రేకులు పడవు. ఒక సైకిల్‌కు పెడళ్లు ఊడిపోతాయి. ఒక సైకిల్‌కు చైను లూజు. మరో సైకిలుకు స్టాండ్ పడదు. స్టాండ్ వేసి జరగ్గానే ధబేలున పడుతుంది. ఒక సైకిలుకైతే సీటు అట్టగట్టుకుని పోయి కూచుంటే ముళ్ల మీద కూచున్నట్టు ఉంటుంది. ఒక సైకిలు సైడుకు లాగుతూ ఉంటుంది. ఒక సైకిలుకు హ్యాండిలు వంకర. ఇక పంక్చర్లు వేసి వేసి లోపల టైరు బ్యారుమన్నా ఓనరు కనికరించక దాన్ని తొక్కుతూనే ఉంటాడు. డబ్బులే లేని ఆ కాలంలో సైకిలే సిరి.

సైకిల్ వల్ల ఫ్రెండ్‌షిప్స్ ఏర్పడతాయి. ఫ్రంట్ రాడ్ మీద కూచుని సినిమాకొచ్చే వాడొకడు. బ్యాక్ క్యారేజీ మీద కూచుని సంతకు పోదాం అనేవాడొకడు. ఎదురుగాలిలో తొక్కుతుంటే వెనుక కూచున్నవాడు కూడా తోడు తొక్కుతాడు. అంటే రెండు పెడళ్ల మీద నాలుగు కాళ్లు. సైకిల్ డౌన్‌లో తొక్కేటప్పుడు గడ్డిపోచకంటే తేలిగ్గా ఉంటుంది. ఎదురుగాలిలో తొక్కుతుంటే రాకాసి దెయ్యమంత బరువు పెరుగుతుంది.

అన్నింటి కంటే హింస ఏమిటంటే చైనుకు ఉన్న మడ్‌గార్డు గనుక పెడల్‌కు రాసుకుంటూ ఉంటే మనం వీధి వెంట వెళుతున్నామని ప్రతి ఒక్కరూ గుర్తిస్తారు.. ఆ గర్‌గర్‌మనే సౌండ్‌కి.

సైకిల్‌కు సింగారాలు చేసేవారు ఉండేవారు. హ్యాండిల్‌కు చెరొక మిర్రర్‌ని బిగించే సోగ్గాళ్లు ఉండేవారు. హ్యాండిల్ మీద ఫ్రంట్ క్యారేజీ బిగిస్తే వాటి మీద బుక్స్ పెట్టుకోవచ్చు. సీటుకు స్పాంజ్ కవర్ చాలా షోకు. స్టీలు బిందెల మీద పేర్లు రాసినట్టు సైకిల్ హ్యాండిల్ మీద ఓనర్ పేరు రాయించడం సేఫ్. సైకిల్ దొంగతనం అయితే పోలీసులు ఆ పేరును బట్టి వాపసు చేసేవారు.

ఆ రోజుల్లో అద్దె సైకిళ్ల జమానా నడిచింది. ఐదారు సైకిళ్లు అద్దెకు ఇస్తూ బతికే వారుండేవారు. సైకిళ్లన్నీ అద్దెకెళ్లిపోతే కావాల్సిన వాళ్లు వెయిట్ చేస్తూ కూచునేవారు. కొందరైతే రేప్పొద్దున నాకు సైకిల్ కావాలి అని ముందే అద్దెకు మాట్లాడుకునేవారు. సైకిల్ లేకుండా పని ఎవరికి జరిగేదని? సామాన్లు తెచ్చుకోవాలన్నా, పక్కూరికి పనికి వెళ్లాలన్నా, నీళ్లు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా బాగా లేకపోతే డాక్టర్‌ని పిలుచుకు రావాలన్నా, చావు కబురు చెప్పాలన్నా సైకిలే గతి.

సైకిల్ వేదాంతి. బతుకు బండిని బేలెన్స్ తప్పకుండా చూసుకోమని, అత్యాశలకూ అతి కోరికలకూ బ్రేకులు వేస్తూ నువ్వెంత తొక్కగలవో అంతలోనే బతకమని, మంచి అనుబంధాలనే ఆయిల్‌ను తరచూ రిమ్ములకు రాస్తూ ఉండమని, మంచి చెడ్డల్లో పాల్గొంటూ సైకిల్ బెల్లులా ఉనికి చూపమని, వెనుక క్యారేజీ మీద కూచోబెట్టుకునే పాటి సహాయమైనా ఇతరులకు చేస్తూ ఉండాలని, జీవితపు పరుగుకు అప్పుడప్పుడు స్టాండ్ వేసి నిలబెట్టమని లేదంటే కనీసం సైడ్ స్టాండ్ వేయమని చెబుతుంటుంది. లేదంటే హటాత్తుగా సైకిల్ మొరాయించి ఓవరాయిలింగ్‌కు వస్తుందని హెచ్చరిస్తుంది.

సైకిల్‌లా సింపుల్‌గా బతకడం ఇవాళ చాలా కష్టమైపోతుంది. కాసింత గాలి కొడితే ఇక సైకిల్ ఏమీ అడగదు. కాని నేడు మనం ఉపయోగిస్తున్న, వాడుతున్న, అందుకోవాలనుకుంటున్న ప్రతిదీ మన నుంచి చాలా అడుగుతున్నాయి.

ఇంటి వాకిటలో నిలబెట్టిన సైకిల్ ఎంత నిమ్మళంగా ఉంటుంది!

'వరల్డ్ సైకిల్ డే' రోజున జీవితపు వేగాన్ని తగ్గించుకుని ఆస్వాదనకు పెడల్ వేద్దాం.

– కె.

ఉమెన్ సేఫ్టీ

ఆపదలో అండగా...



కరణ్



బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని మైసూర్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ కరణ్ సరికొత్త పరికరాన్ని తయారు చేశాడు.

ఐజీడబ్ల్యూఎస్(ఇన్నోవేటివ్ ఇంటెలిజెంట్ జీయోఫెన్స్–ఎనేబుల్డ్ వేరబుల్స్ సిస్టమ్స్) అనే పరికరం మహిళలు ఆపదలో ఉంటే వారి ఎమర్జెన్సీ కాంటాక్ట్‌ను ఎలార్ట్ చేస్తుంది.

'డివైజ్‌లోని ముఖ్యమైన ఫీచర్‌లలో ఒకటి...జియోఫెన్స్–బేస్డ్ డిటెక్టర్. ఒక మహిళని ఎవరైనా మూడు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాలో అవుతున్నప్పుడు ఈ డివైజ్ సందేహాస్పద వ్యక్తి మొబైల్ ఫోన్‌ను గాని, బ్లూటూత్ డివైజ్ అడ్రస్ గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అంటున్నాడు కరణ్.

ఈ డివైజ్‌లో జియోఫెన్స్–బేస్డ్ సేఫ్టీ టైమర్ కూడా ఉంటుంది. యూజర్ ఒక డెస్టినేషన్ చేరుకోవడానికి టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఒక అమ్మాయి షాపింగ్‌కు వెళ్తూ 30 నిమిషాలలో ఇంటికి వస్తానని చెబితే సిస్టమ్ ఆమె జియోలొకేషన్‌ని మానిటర్ చేస్తుంది. సెట్ చేసిన టైమ్ లోపు ఇంటి జియోఫెన్స్‌లోకి రాకపోతే డివైజ్ ఆటోమెటిక్‌గా ఆమె లోకేషన్‌ని ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి పంపిస్తుంది. డివైజ్‌లో 'రిటర్న్ హోమ్ సేఫ్టీ రిమైండర్' కూడా ఉంటుంది. డివైజ్‌లో మరో సేఫ్టీ ఫీచర్...డేంజర్–జోన్ నోటీఫైయర్. ఇది హై–రిస్క్ జీపీఎస్ లొకేషన్స్ ప్రీలోడెడ్ జాబితాను ఉపయోగిస్తుంది. యూజర్ ఈ ప్రాంతాలలోకి వెళ్లినప్పుడు వేరబుల్ బజర్ యాక్టివేట్ అవుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి తెలియజేస్తుంది.

సమ్‌థింగ్ స్పెషల్

దుప్పటి లెహంగా



'ఫ్యాషన్ అనేది ఫ్యాబ్రిక్ స్టోర్ నుంచి కాదు మన ఊహల నుంచి మొదలవుతుంది' అంటారు. సిమ్రాన్ క్రియేటివిటీని చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. ఢిల్లీకి చెందిన కంటెంట్ క్రియేటర్ సిమ్రాన్ ఆనంద్ ఇరవై కిలోల బెడ్ షీట్‌ను ఆకట్టుకునే లెహంగాగా మార్చి ఔరా అనిపిస్తోంది.

'ఔట్‌ఫిట్ ఫ్రమ్ స్క్రాచ్' కాప్షన్‌తో ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సిమ్రాన్.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు... 'బెడ్ షీట్‌లలో నాకు ఫ్యాషన్ కనిపించింది'

'లెహంగాగా మార్చడం ద్వారా దుప్పట్లకు సెకండ్ లైఫ్ కూడా ఇవ్వవచ్చు' అంటుంది సిమ్రాన్.

ఇక నెటిజనుల స్పందన విషయానికి వస్తే... 'దుప్పటితో లేహంగా ఏమిటీ!' అనే వెక్కిరింపుల కంటే...

'క్రియేటివ్ ఐడియా' అనే ప్రశంసలే ఎక్కువగా కనిపించాయి.

బులియన్

జూన్ 2న ముగింపు రూ.లలో (బంగారం 10 గ్రా.: వెండి కిలో)

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,110
బంగారం (22 క్యారెట్లు)	90,069
వెండి	99,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,00,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,910
బంగారం (22 క్యారెట్లు)	89,751
వెండి	1,01,090
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	92,180
వెండి	1,00,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,250
బంగారం (22 క్యారెట్లు)	88,550
వెండి	98,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,630
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
రోహిణి కార్తె: జూన్ 8 వరకు
మృగశిర కార్తె: 8 నుంచి





'విత్తన బిళ్ల'లతో వరి నాట్లు!



వరి విత్తనాలతో నారుమడి పోసి, తర్వాత పొలంలో నాటేయటం మనకు తెలుసు. అయితే, కేరళకు చెందిన అజి థామస్ అనే రైతు వినూత్నంగా ట్రేలలో విత్తన బిళ్లల్లో నారు పెంచి, ఆ తర్వాత బిళ్లలతో కూడిన నారునే పొలంలో నాటుతున్నారు. ఎకరానికి 2.5-5 కిలోల వరి విత్తనాలు చాలు. 20 రోజులు ముందే పంట కోతకు వస్తోంది. కూలీల ఖర్చు 75% తగ్గింది. హెక్టారుకు 5.5-6 టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని ఆవిష్కర్త చెబుతున్నారు.

- ఆవు పేడ, పంచగవ్య, జీవామృతంతో కూడిన బయో స్లర్రీతో వరి విత్తన బిళ్లల తయారీ
- విత్తన బిళ్లల్లో పెరిగిన వరి నారుతో పొలంలో నాట్లు
- మొక్కకు 50–60 పిలకలు.. హెక్టారుకు 6 టన్నుల ధాన్యం దిగుబడి
- 75% తగ్గిన మానవ శ్రమ • కేరళ రైతు శాస్త్రవేత్త అజి థామస్ అద్భుత ఆవిష్కరణ

కేరళలోని వయనాడ్ జిల్లా అంబలవాయల్‌కు చెందిన అజి థామస్ కూరగాయలు, అరటి, రబ్బరుతో పాటు వరిని పండిస్తారు. రైతులు తగిన ఆదాయం లేక వరి సాగు మానుకుంటున్నారు. ఈ పూర్వరంగంలో బయో స్లర్రీతో వరి విత్తనాల 'పెల్లెటైజేషన్' పద్ధతిని ఆయన అభివృద్ధి చేశారు. విత్తనం చుట్టూ మట్టిని లేపనం చేస్తే వాటిని విత్తన గుళికలు అనొచ్చు. ఇది అలా కాదు. నాలుగు పలకలుగా ఉండే పేడ తదితర పోషకాలతో కూడిన బిళ్లలో వరి విత్తనం పెంచి, నాట్లేస్తారు. కాబట్టి 'విత్తన బిళ్లలు' అని చెప్పుకుందాం.

కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు దీనిపై అధ్యయనం చేసి బయో స్లర్రీలోని సూక్ష్మజీవులు పొలం మట్టిలోని పోషకాలను విచ్ఛిన్నం చేసి వరి మొక్కలకు అందించటంతో రెట్టింపు దిగుబడి వస్తున్నదని వారు తెలిపారు.

ఈ పద్ధతిలో హెక్టారుకు 5.5–6 టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని, వయనాడ్ ప్రాంతంలో సాధారణ పద్ధతిలో వచ్చే ధాన్యం దిగుబడితో పోల్చితే రెట్టింపని థామస్ తెలిపారు. కూలీల ఖర్చు 25 శాతానికి తగ్గింది. ప్రతి కుదురుకు 50–60 పిలకలు వస్తున్నాయి. కంకి పొడవు పెరిగింది. ఎకరానికి వరి విత్తనాల అవసరం 30–50 కిలోల నుంచి 2.5–5 కిలోలకు తగ్గింది. పంట 15–20 రోజులు ముందే కోతకు వస్తోందని అజి థామస్ తెలిపారు.

విత్తన బిళ్లల తయారీ ఖర్చు ఎంత?

హెక్టారుకు సరిపడా వరి విత్తన బిళ్లల తయారీకి 12–14 కిలోల బయో–స్లర్రీ అవసరం. దీనికి హెక్టారుకు రూ. 20 వేల వరకు ఖర్చవుతుందని అంచనా. ఇది సాధారణ రసాయనిక సాగు పద్ధతిలో ఎరువులు, ఇతర ఉత్పాదకాల సగటు ఖర్చు కంటే రెట్టింపు. అయినప్పటికీ, కూలీల అవసరం/ఖర్చు, విత్తనాల ఖర్చు తగ్గి ధాన్యం దిగుబడి రెట్టింపు కావటంతో ఈ పద్ధతిలో వరి సాగు లాభదాయకంగా మారిందని థామస్ వివరించారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

కేరళ ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) ఈ పద్ధతిని ప్రోత్సహిస్తోంది. దీంతో, ఈ పద్ధతి కేరళలో రైతుల ఆదరణ పొందుతోంది. ఇతర రాష్ట్రాల్లో కూడా రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారని అజి థామస్ చెబుతున్నారు.

'విత్తన బిళ్ల' అంటే? తయారీ ఎలా?

వరి విత్తనాలను ట్రేలలోని చిన్న చిన్న చతురస్రాకారపు గదుల్లో బయో స్లర్రీని నింపి, అందులో వరి విత్తనం పెట్టి, మొలకెత్తిస్తారు. ఆ తర్వాత పొలంలో నాట్లు వేసే పద్ధతి ఇది. ఆవుపేడ, పులియబెట్టిన ఆకుల ద్రావణం, పంచగవ్య, ద్రవ జీవామృతంతో పాటు సూడోమోనాస్, అజోస్పైరిల్లమ్ వంటి జీవన ఎరువులు కలిపి బయో–స్లర్రీ మిశ్రమాన్ని తయారు చేస్తారు. బల్ల మీద ఉంచిన స్టెయిన్‌లెస్ స్టీల్ ట్రేలో లేదా సాధారణ బోలు రబ్బరు మ్యాట్‌లో 1–1.5 అంగుళాల లోతు/పొడవు/వెడల్పుతో నలుచదరంగా ఉండే గుంతల్లో బయో స్లర్రీని పోసి, అందులో వరి విత్తనాలను గుచ్చుతారు. ఒక రోజులో ఆ స్లర్రీ గట్టిపడి విత్తన బిళ్లలు తయారవుతాయి. ఆ తర్వాత ట్రే నుంచి విత్తనంతో కూడిన ఆ బిళ్లలను బయటకు తీసి 12 గంటలు ఎండబెడతారు. ఆ తర్వాత వాటిపై నీరు చిలకరిస్తారు. 3 రోజుల్లో వరి మొలకలు బయటకు వచ్చి, తగినంత ఎత్తు పెరిగిన తర్వాత, ఆ బిళ్లతో కూడిన వరి నారును దమ్ము చేసిన పొలాల్లో మనుషులతో వరుసలుగా నాటుతారు. వరుసల మధ్య 25 సెం.మీ. (పది అంగుళాలు) దూరం పెడుతున్నారు. ఎకరానికి ఇట్లాంటి వరి నారు బిళ్లలు 64 వేలు అవసరమవుతాయి. ఇదే ప్యాడీ సీడ్ పెల్లెటైజేషన్ పద్ధతి.

జటిలమైన చెదలుకు ప్రకృతిసిద్ధమైన పరిష్కారాన్ని కనుగొన్న రాజస్థాన్ వృద్ధ మహిళా రైతు

యూకలిప్టస్ కర్ర ముక్కలను పొలంలో ఉంచటం ద్వారా.. చెద పురుగులు పంటలను పాడు చెయ్యకుండా కాపాడుతున్నారు



చెదలుకు యూకలిప్టస్‌తో చెక్!

చెద పురుగులు.. ఇళ్లలోనే కాదు, పంట పొలాల్లో కూడా సమస్యలు సృష్టిస్తుంటాయి. పంటలను ఆశిస్తూ 10 నుంచి 50% వరకు దిగుబడి నష్టం కలిగిస్తుంటాయి. రైతులు సాధారణంగా రసాయనాలు చల్లి పంట పొలాల్లో చెదలును నియంత్రించే ప్రయత్నం చేస్తుంటారు. అయితే, రసాయనాలతో పని లేకుండా సులభంగా, స్వల్ప ఖర్చుతో చెదలు సమస్యకు పరిష్కారాన్ని వెదకటంలో ఓ వృద్ధ మహిళా రైతు అసాధారణమైన విజయం సాధించారు. యూకలిప్టస్ కొమ్మలు/కట్టె ముక్కలను పొలంలోని పంటల సాళ్ల మధ్య ఉంచితే, చెద పురుగులు పక్కనే ఉన్న పంటల జోలికి వెళ్లకుండా యూకలిప్టస్ కొమ్మలనే ఆశిస్తున్నాయని ఆమె కనుగొన్నారు.

తళుక్కుమన్న ఉపాయం

పనులు చేస్తూనే అసాధారణంగా ఉన్న విషయాలను గమనిస్తూ ఉండటం భగవతి దేవికి అలవాటు. వంట కలపను ఇంటికి తెచ్చి పొయ్యిలో పెడుతున్న ఒక సందర్భంలో ఆమె దృష్టిని యూకలిప్టస్ కర్రలు ఆకర్షించాయి. యూకలిప్టస్ కర్ర ముక్కల పైకి మిగతా కర్రల కంటే చాలా ఎక్కువ చెదపురుగులు చేరుతున్నట్లు ఆమె గుర్తించారు. ఈ గ్రహింపు కలిగిన మరుక్షణమే ఆమె మదిలో ఒక కొత్త ఉపాయం తళుక్కున మెరిసింది. ఆలోచన వచ్చిందే తడవుగా అప్పుడు సాగులో ఉన్న సజ్జ పంటలో అమలు చేసింది. 2 నుంచి 3 అడుగుల పొడవు, 2 నుంచి 3 అంగుళాల లావు ఉన్న యూకలిప్టస్ కర్ర ముక్కలను తీసుకొని, సజ్జ పొలం అంతటా సాళ్ల మధ్యలో పెట్టింది. ఆమె అనుకున్నట్లుగానే, ఆ కర్ర ముక్కల చుట్టూ వేలకొలది చెద పురుగులు చేరి, కర్రలను కొరికి తినటం ప్రారంభించాయి. ఆశ్చర్యమేమిటంటే.. చెద పురుగులు ఇక సజ్జ మొక్కల జోలికి పోలేదు. యూకలిప్టస్ కర్ర ముక్క నుంచి 4 అంగుళాల దూరంలో ఉన్న సజ్జ మొక్కలను కూడా అవి ఆశించలేదు. అంతే. భగవతి దేవి మోహం ఆనందంతో వెలిగిపోయింది.

సజ్జ నుంచి గోధుమ వరకు..

గోధుమ చేనులో 12× 12 మీటర్ల దూరంలో ఎకరానికి 32 చొప్పున స్ప్రింక్లరు ఉంటాయి. ప్రతి స్ప్రింక్లర్‌కు దగ్గర్లో ఒక యూకలిప్టస్ కట్టె ముక్క/కొమ్మను ఆమె పెట్టారు. ఒక్క గోధుమ మొక్కను కూడా చెదలు ఆశించలేదు. ఒక్కో కట్టె ముక్కను వేలకొద్దీ చెద పురుగులు చుట్టుముట్టాయి. అంటే పంట వైపు నుంచి ఈ యూకలిప్టస్ కట్టెలు చెదపురుగుల దృష్టిని వంద శాతం మళ్లించాయన్న మాట. ఎకరానికి ఖర్చు కేవలం రూ. 320లు. ఈ కట్టెలను ప్రతి పంట కాలానికీ కొత్తవి వేయాల్సిన అవసరం లేదు. మూడు పంటల వరకు అవే సరిపోతున్నాయని ఆమె తెలిపారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ గుర్తింపు

భగవతి దేవి ఈ విషయాన్ని ఫతేపూర్ షెఖావతిలోని కేవీకే శాస్త్రవేత్తలకు చెప్పారు. వరుసగా నాలుగేళ్ల పాటు అనేక పంటల్లో ప్రయోగం చేసి సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. బికనెర్‌లోని రాజస్థాన్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు బార్లీ పంటలోనూ అద్భుత ఫలితాలు రావటంతో, రైతులందరికీ ఇది అనుసరించమని చెబుతున్నారు.

చిరుధాన్యాలను సాళ్లుగా విత్తుకుంటే మేలు

ఐఐఎంఆర్‌లో 11 రకాల చిరుధాన్యాల విత్తనాలు సిద్ధం



హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్)లో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తుకోవటానికి అనువైన 11 రకాల చిరుధాన్యాల విత్తనాలను విక్రయిస్తున్నారు. జొన్నలు, పచ్చజొన్నలు ఎకరానికి 3 కిలోలు విత్తుకోవాలి. ఇతర చిరుధాన్యాలన్నీ ఎకరానికి 2 కిలోలు సరిపోతాయని, ఎకరానికి సరిపోయే విత్తనంతో బ్యాగ్‌లను సిద్ధం చేశామని ఐఐఎంఆర్ విత్తన విభాగం సాంకేతిక అధికారి రఘునాథ్ కులకర్ణి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

వరుసలుగా విత్తుకుంటే మేలు: చిరుధాన్య పంటలను వెదజల్లటం కాకుండా వరుసలుగా విత్తుకోవటం మేలు. కూలీలతో కలుపు తీయిస్తే రైతుకు మిగిలేదేమీ ఉండదు. వరుసలుగా విత్తుకుంటే యంత్రాలతో అంతరసేద్యం చేస్తూ కలుపును నిర్మూలించుకోవచ్చు. సాధారణంగా వరుసల మధ్య 22.5 సెం.మీ. దూరం పెడతారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న వీడర్ యంత్రాల వెడల్పును బట్టి సాళ మధ్య దూరాన్ని నిర్ణయించుకోవచ్చు. అవసరాన్ని బట్టి 30 సెం.మీ. / 40 సెం.మీ. / 45 సెం.మీ. వరకు కూడా సాళ్ల మధ్య దూరం పెట్టుకోవచ్చని రఘునాథ్ వివరించారు.

- జొన్న (దేశీ రకం/ హైబ్రిడ్), పచ్చజొన్న, పచ్చిగడ్డి కోసం పెంచే జొన్న ఎకరానికి 3 కిలోలు విత్తుకోవాలి.
- సజ్జ, రాగు (కెఎంఆర్ 301), కొర్ర (సూర్యనంది), సామ (సిఎల్ఎంవి1), ఊద (డిహెచ్‌బిఎం93-3), వరిగ (టిఎన్ఏయు 202), అరిక (సికెఎంవి2), అండుకొర్ర (హెచ్‌బిఆర్2)లను ఎకరానికి 2 కిలోలు విత్తుకోవాలి. ఈ విత్తనాలు ఐఐఎంఆర్‌లో అందుబాటులో ఉన్నాయి. రైతులు స్వయంగా వచ్చి కొనుక్కెళ్లాలి. ఇతర వివరాలకు.. 040–24599305.

చిరుధాన్యాల విత్తనాలు దొరికే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు: నంద్యాల (99896 25208), పెరుమామిళ్లపల్లి (87906 38715), పాలెం (97050 69580)లలోని కూడా కొన్ని రకాల చిరుధాన్య పంటల విత్తనాలు అందుబాటులో ఉంటాయి.

కార్ల్‌సన్‌కు గుకేశ్ షాక్

క్లాసికల్ ఫార్మాట్‌లో తొలిసారి ప్రపంచ నంబర్‌వన్‌పై నెగ్గిన భారత గ్రాండ్‌మాస్టర్



స్టావెంజర్: మాగ్నస్ కార్ల్‌సన్... చెస్ గురించి తెలిసిన వారికి, క్రీడాభిమానులకూ సుపరిచితమైన పేరు... ప్రపంచ చదరంగంలో అతను 14 ఏళ్లుగా వరల్డ్ నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు... క్లాసికల్ ఫార్మాట్‌లో ఐదుసార్లు... ర్యాపిడ్ ఫార్మాట్‌లో ఐదుసార్లు... బ్లిట్జ్ ఫార్మాట్‌లో ఏకంగా ఎనిమిదిసార్లు విశ్వవిజేతగా నిలిచాడు. ఏమాత్రం చిన్న అవకాశం దొరికినా ఓటమి అంచుల్లో నుంచి విజయాన్ని అందుకోవడంలో దిట్ట. ఇలాంటి అసాధారణ నైపుణ్యమున్న ప్లేయర్‌తో గేమ్ ఆడుతూ 'డ్రా' చేసుకుంటే అది విజయంతో సమానం. ఇక నేరుగా గెలిస్తే అది పెద్ద సంచలనమే అవుతుంది. అలాంటి సంచలనమే నమోదు చేశాడు భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్. ఆరుగురు మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న నార్వే ఓపెన్ టోర్నీలో కార్ల్‌సన్‌పై గుకేశ్ చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని... తన కెరీర్‌లో తొలిసారి క్లాసికల్ గేమ్‌లో కార్ల్‌సన్‌పై గెలిచాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఆరో రౌండ్ గేమ్‌లో 19 ఏళ్ల గుకేశ్ తెల్ల పావులతో ఆడుతూ 62 ఎత్తుల్లో కార్ల్‌సన్ ఆట కట్టించాడు. నాలుగు గంటలపాటు జరిగిన ఈ గేమ్‌లో కార్ల్‌సన్ 52వ ఎత్తులో చేసిన తప్పిదాన్ని గుకేశ్ అనుకూలంగా మల్చుకొని సంచలన ఫలితం సాధించాడు. తనను 'ఢీ'కొట్టే సరైన ప్రత్యర్థులు లేకపోవడంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌పై ఆసక్తి కోల్పోయి కొన్నాళ్లుగా ఆ మెగా ఈవెంట్‌కు దూరంగా ఉంటున్న 34 ఏళ్ల కార్ల్‌సన్‌కు... భవిష్యత్‌లో గట్టి ప్రత్యర్థి కాగల సత్తా తనలో ఉందని గుకేశ్ నిరూపించుకున్నాడు.

అసహనంతో...



గుకేశ్ చేతిలో తొలిసారి ఓటమి చవిచూసిన కార్ల్‌సన్ పరాజయ భారాన్ని తట్టుకోలేకపోయాడు. ఊహించనిరీతిలో స్పందించాడు. తన నుంచి జరిగిన ఒక్క తప్పిదాన్ని అనుకూలంగా మల్చుకొని గుకేశ్ గెలుపు బాట పట్టడంతో కార్ల్‌సన్ ఆ కోపాన్నంతా తాము ఆడిన చెస్ బోర్డు టేబుల్‌పై చూపించాడు. తన పిడికిలితో ఒక్కసారిగా టేబుల్‌పై కార్ల్‌సన్ గట్టిగా కొట్టాడు. ఆ వెంటనే తమాయించుకున్న కార్ల్‌సన్ పావులను చెస్ బోర్డుపై అమర్చి... గుకేశ్‌కు వద్దకు వెళ్లి రెండుసార్లు సారీ చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కార్ల్‌సన్‌ను ఓడించిన తర్వాత గుకేశ్ కొన్ని క్షణాలపాటు షాక్‌లో ఉండిపోయి ఆ తర్వాత ఈ విజయాన్ని ఆస్వాదించాడు. ఆరో రౌండ్ తర్వాత గుకేశ్ 8.5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మొదటి ట్రోఫీని ముద్దాడేందుకు...

ఐపీఎల్ 2008లో మొదలైంది... తొలి సీజన్... రెండు.... మూడు... నాలుగు... ఇలా చూస్తూ చూస్తూ 17 సీజన్లు గడిచిపోయాయి. కానీ ఒక్కసారైనా విజేతగా నిలవాలనే ఆ రెండు జట్ల కోరిక మాత్రం నెరవేరలేదు. ఇన్నేళ్లలో ఎంతో మంది ఆటగాళ్లు మారారు... కోచ్‌లు కొత్తగా వచ్చారు, వ్యూహాలూ మారాయి... వైఫల్యాలతో నిష్క్రమించిన ప్రతీసారి వచ్చే ఏడు మనదే అవుతుందనే ఆశతో మళ్లీ సున్నా నుంచి మొదలు పెట్టడం, ఆపై కీలక దశలో కుప్పకూలడం సాధారణంగా మారిపోయాయి తప్ప ఐపీఎల్ టైటిల్ ద్రాక్ష అందనే లేదు... ఒక టీమ్ ఈ ప్రయత్నంలో మూడుసార్లు తుది పోరుకు చేరి నిరాశతో వెనుదిరగ్గా... మరో జట్టు ఒకే ఒక్కసారి ఆఖరి మెట్టుకు చేరి చతికిలపడింది... ఇప్పుడు ఆ రెండు టీమ్‌లలో ఒకరికి ఉపశమనం దక్కే సమయం వచ్చింది. ఐపీఎల్ 18వ సీజన్‌లో కొత్త జట్టు చాంపియన్‌గా నిలవడం ఖరారైన నేపథ్యంలో తొలిసారి ఈ టైటిల్‌ను ఎవరు అందుకుంటారనేది ఆసక్తికరం. మొదటి ట్రోఫీ వేటలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), పంజాబ్ కింగ్స్ జట్లు నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో సర్వశక్తులూ ఒడ్డనున్నాయి.

రాత్రి 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



శ్రేయస్ అయ్యర్
రజత్ పాటీదార్

అహ్మదాబాద్: ఐపీఎల్-18 సీజన్‌లో 73 హోరాహోరీ మ్యాచ్‌ల తర్వాత ఈ ఏడాది విజేతను తేల్చే అసలు సమరానికి అంతా సిద్ధమైంది. నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), పంజాబ్ కింగ్స్ జట్లు తలపడనున్నాయి. లీగ్ దశలో ప్రదర్శనను చూస్తే ఇరు జట్లు సమ ఉజ్జీలుగా కనిపించాయి. రన్‌రేట్ కారణంగా పంజాబ్ మొదటి స్థానంలో, బెంగళూరు రెండో స్థానంలో నిలిచినా... రెండు టీమ్‌లూ సమంగా తొమ్మిదేసి విజయాలు సాధించి 19 పాయింట్లతో నిలిచాయి. 'ప్లే ఆఫ్స్'కు ముందు ప్రత్యర్థులుగా తలపడిన మ్యాచ్‌లలో ఇరు జట్లు ఒక్కో విజయాన్ని అందుకోగా... క్వాలిఫయర్-1లో పంజాబ్‌ను చిత్తు చేసి బెంగళూరు పైచేయి సాధించింది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో గెలిచి పంజాబ్ లెక్క సరి చేస్తుందా లేదా ఆర్‌సీబీ ఆధిత్యం కొనసాగుతుందా చూడాలి. మొత్తంగా ఎవరు గెలిచినా తొలి ట్రోఫీతో సంబరాలు అంబరాన్ని తాకడం ఖాయం.

సమష్టి ప్రదర్శనతో...

ఐపీఎల్‌లో ఆర్‌సీబీ 2016లో ఆఖరిసారిగా ఫైనల్ చేరింది. ఆ మ్యాచ్‌లో ఓటమి తర్వాత ఆడిన ఎనిమిది సీజన్లలో జట్టు ప్రదర్శన అంతంత మాత్రమే. ముఖ్యంగా ఎవరో ఒక ఆటగాడి ప్రదర్శనపైనే ఆధారపడటం, అతను విఫలమైతే జట్టు కుప్పకూలడం తరచుగా సాగాయి. కానీ ఈ సీజన్ పూర్తి భిన్నంగా కనిపించింది. జట్టు పది మ్యాచ్‌లు గెలిస్తే తొమ్మిది మంది వేర్వేరు ఆటగాళ్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'లుగా నిలిచారు. ఒకరు విఫలమైతే మరొకరు ఆదుకోవడంతో కీలక సమయాల్లో కూడా జట్టు పట్టు వీడలేదు. ఇప్పుడు అదే శైలి, పోరాటతత్వం బెంగళూరును ఫైనల్‌కు చేర్చాయి. ఎప్పటిలాగే స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి 600కు పైగా పరుగులు, 8 అర్ధసెంచరీలతో జట్టుకు చుక్కానిలా నిలిచాడు. అతని ఓపెనింగ్‌లో సరైన జోడీగా ఫిల్ సాల్ట్ 387 పరుగులతో శుభారంభాలు అందించాడు. మిగతా బ్యాటర్లలో షెఫర్డ్, జితేశ్, కృనాల్ పాండ్యా కూడా ప్రభావవంతమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. కెప్టెన్ పాటీదార్ గత ప్రదర్శనలతో పోలిస్తే ఈసారి అంత అద్భుతంగా ఆడకపోయినా... కెప్టెన్‌గా తొలి సీజన్‌లో జట్టును ఫైనల్ చేర్చిన ఘనత అతనికి దక్కింది. మైదానంలో కోహ్లి అనుభవం, సూచనలు అండగా ఉన్న పాటీదార్ నాయకత్వంలో టీమ్ టైటిల్ గెలిస్తే ఆర్‌సీబీ అభిమానుల కోరిక నెరవేర్చిన ప్రత్యేక వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతాడు. బౌలింగ్‌లో కూడా టీమ్ పటిష్టంగా కనిపిస్తోంది. జట్టు బౌలింగ్ సత్తా తొలి క్వాలిఫయర్‌లో పంజాబ్‌పైనే కనిపించింది. ముఖ్యంగా హాజల్‌వుడ్ ఆస్ట్రేలియా నుంచి తిరిగి రావడం ఒక్కసారిగా జట్టు బలాన్ని పెంచింది. 21 వికెట్లతో అతను టీమ్ విజయాల్లో కీలకపాత్ర పోషించగా... భువనేశ్వర్, యశ్ దయాళ్ సహకరించారు. లెగ్ స్పిన్నర్ సుయాశ్ శర్మ కూడా పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టిపడేయగలడు.

తుది జట్ల వివరాలు (అంచనా)	పిచ్, వాతావరణం
బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), కోహ్లి, సాల్ట్, మయాంక్ అగర్వాల్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, షెఫర్డ్, భువనేశ్వర్, కృనాల్ పాండ్యా, యశ్ దయాళ్, హాజల్‌వుడ్. **పంజాబ్:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్, ఇన్‌గ్లిస్, నేహల్ వధేరా, స్టొయినిస్, శశాంక్ సింగ్, అజ్మతుల్లా, చహల్, జేమీసన్, అర్ష్‌దీప్ సింగ్.	సీజన్ ఆరంభం నుంచి భారీ స్కోర్లు నమోదయ్యాయి. రెండో క్వాలిఫయర్ తరహాలోనే టాస్ గెలిచిన జట్టు ఛేదనకే మొగ్గు చూపవచ్చు. వర్ష సూచన ప్రస్తుతానికి లేదు కానీ వాన వస్తే అదనపు సమయంతో పాటు బుధవారం 'రిజర్వ్ డే' కూడా ఉంది.

ఆ నలుగురితో కలిసి...

తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌ను మినహాయిస్తే సీజన్ ఆసాంతం పంజాబ్ ప్రదర్శన అద్భుతంగా సాగింది. ముఖ్యంగా రెండో క్వాలిఫయర్‌లో ముంబైని చిత్తు చేసిన తీరు ఆ జట్టు సామర్థ్యాన్ని చూపించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన అసాధారణ బ్యాటింగ్‌తో 600కు పైగా పరుగులు చేయడంతో పాటు సమర్థ నాయకత్వంతో జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ఇద్దరు విదేశీ బ్యాటర్లు ఇన్‌గ్లిస్, స్టొయినిస్‌లకు కీలక సమయాల్లో ఒత్తిడిని దాటి చెలరేగిపోగల నైపుణ్యం ఉంది. అయితే పంజాబ్ విజయాల్లో కీలక పాత్ర మరో నలుగురు బ్యాటర్లు పోషిస్తున్నారు. వీరంతా జాతీయ జట్టుకు ఆడని 'అన్‌క్యాప్డ్' ఆటగాళ్లే కావడం విశేషం. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్‌తో పాటు నేహల్ వధేరా, శశాంక్ సింగ్ ఈ మ్యాచ్‌లో రాణిస్తే కింగ్స్‌కు తిరుగుండదు. పంజాబ్ బౌలింగ్‌లో కాస్త తడబాటు కనిపిస్తోంది. అర్ష్‌దీప్ ఆశించిన స్థాయిలో సరైన ఆరంభాలు ఇవ్వడం లేదు. జేమీసన్ మెరుగ్గా ఉన్నా, మూడో పేసర్ అజ్మతుల్లా బౌలింగ్ కూడా సాధారణంగానే ఉంది. చహల్ స్పిన్ మరోసారి కీలకం కానుంది. ఫైనల్ ఒత్తిడిని అధిగమిస్తే పంజాబ్‌కు గెలుపు కష్టం కాబోదు.

సాక్షి సినిమా

మనసు నీకై రథమయ్యే రారా...



• కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వం వహించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, అభిరామి, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ మూవీస్‌పై ఎన్. సుధాకర్ రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'విశ్వద నాయక...' అంటూ సాగే నాలుగో పాటని విడుదల చేశారు. 'విశ్వద నాయక.. విహిత వీరా... మనసు నీకై.. రథమయ్యే రారా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''ఈ పాటలో కమల్‌హాసన్ క్యారెక్టర్ నేచర్, అభిరామి, త్రిష పాత్రల్లోని డైనమిక్స్‌ని లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రశాంత్ వెంకట్ రాసిన ర్యాప్ ఈ పాటకు మరో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. అలెగ్జాండ్రా జాయ్ వండర్ ఫుల్ వోకల్స్ ఎమోషన్‌ని నావిగేట్ చేయగా, ఏఆర్ అమీన్ ర్యాప్ ఎనర్జీని మరింతగా పెంచింది'' అని చిత్రబృందం పేర్కొంది.

కుబేర ప్రేక్షకులకి నచ్చుతుంది

- నాగార్జున



• నాగార్జున, ధనుష్

''చెన్నై ప్రేక్షకుల నుండి సంవత్సరాలుగా నాకు లభించిన ప్రేమకు కృతజ్ఞతలు. 'కుబేర'ని శేఖర్‌గారు అద్భుతంగా తీశారు. ఈ చిత్రం ప్రేక్షకులకి కచ్చితంగా నచ్చుతుంది. ఈ మూవీ తర్వాత రజనీకాంత్ గారి 'కూలీ' సినిమా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడానికి రెడీగా ఉంది'' అని హీరో నాగార్జున అక్కినేని తెలిపారు. ధనుష్, నాగార్జున హీరోలుగా, రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన 'కుబేర' ఆడియో లాంచ్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ధనుష్ మాట్లాడుతూ-''కుబేర' కోసం తిరుపతిలో ఎండలో చెప్పులు లేకుండా, చిరిగిన బట్టలతో బిచ్చగాడిగా నటించడం మరచిపోలేను. ఆ అనుభవం జీవితంలోని ముఖ్యమైన సత్యాలను గుర్తు చేసింది'' అన్నారు. ''కుబేర' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన సినిమా'' అన్నారు రష్మికా మందన్నా. ''ధనుష్, నాగార్జునగారి నటన మెస్మరైజింగ్‌గా ఉంటుంది'' అని శేఖర్ కమ్ముల తెలిపారు. ''సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.. గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు పుస్కుర్ రామ్‌మోహన్ రావు, సునీల్ నారంగ్. ఈ కార్యక్రమంలో దేవి శ్రీ ప్రసాద్, నిర్మాతలు జాన్వీ నారంగ్, భరత్ నారంగ్, సిద్రమాన్ నారంగ్, కెమేరామేన్ నికేత్ బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి, లిరిక్ రైటర్స్ వివేక, చంద్రబోస్, నంద కిషోర్ పాల్గొన్నారు.

జూలైలో ఘాటి



• 'ఘాటి' పోస్టర్

హీరోయిన్ అనుష్కాశెట్టి, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'ఘాటి'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు మరో లీడ్ రోల్ చేశారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ సినిమాని జూలై 11న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న 'ఘాటి' సినిమాకు నాగవెల్లి విద్యా సాగర్ సంగీతం అందించగా, సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. వ్యాపార రంగంలో పైస్థాయికి వెళ్లాలనుకునే ఓ మహిళను కొందరు మోసం చేస్తారు. దీంతో ఆ మహిళ వారికి తగిన బుద్ధి చెప్పి, వ్యాపారంలో అత్యున్నత స్థాయికి ఎలా చేరుకుంటారు? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని టాక్.

దీపావళికి తెలుసు కదా



• సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా, రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా, వైవా హర్ష కీలక పాత్రలో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 17న రిలీజ్ చేయనున్నట్లు సోమవారం మేకర్స్ ప్రకటించారు. ''మనసును తాకేలా, ఊహించని మలుపులతో ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

నాన్న అంటేనే దైవం



• పృథ్వీ అంబర్, సాయికుమార్

''నాన్న అంటేనే మొదటి దైవం.. తను పోసిన ప్రాణమిది.. నాన్న అనగానే వాలే నీ ముందు.. అలుపెరుగని ప్రాణమిది.. మన కొరకే బతికే ప్రాణం.. మన బాధ్యత ఒకటే ధ్యానం'' అంటూ సాగుతుంది 'చౌకీదార్' సినిమాలోని 'నాన్న' యాంథమ్ పాట లిరికల్ వీడియో. పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా, సాయికుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'చౌకీదార్'. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో డా. కల్లహళ్లి చంద్ర శేఖర్ నిర్మించారు. సచిన్ బస్రూర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'నాన్న..' పాటను విడుదల చేశారు. ఈ పాటకు సంతోష్ వెంకీ సాహిత్యం అందించగా, విజయ్ ప్రకాష్ ఆలపించారు. త్వరలో సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.

క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు

- రూపేశ్



• పవన్ ప్రభ, రాజేంద్ర ప్రసాద్, రూపేశ్

''షష్టిపూర్తి' అనేది కల్చరల్ బ్లాక్ బస్టర్ కాదు.. కల్ట్ బ్లాక్ బస్టర్. 'పెళ్లి పుస్తకం' చిత్రం నుంచి 'షష్టిపూర్తి' వరకు ఏ నటుడికి దక్కని సినిమా ప్రయాణం నాకు దక్కింది. 'షష్టిపూర్తి' చూస్తూ ప్రేక్షకులు ఏడ్చేస్తున్నారంటేనే మేం విజయం సాధించినట్టు'' అని రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. పవన్ ప్రభ దర్శకత్వంలో రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్షా సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. రూపేశ్ నిర్మించిన ఈ సినిమా మే 30న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కల్చరల్ బ్లాక్‌బస్టర్ మీట్‌లో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ-''విజయ, వాహినీ, ఏవీఎం వంటి గొప్ప ప్రొడక్షన్ కంపెనీల్లో పని చేసిన అనుభవంతో చెబుతున్నాను.. నిర్మాతగా రూపేశ్ గొప్ప స్థాయికి వెళ్తాడు. ఇలాంటి పాత్రలు నా చివరి శ్వాస వరకు చేయాలనుకుంటున్నాను'' అన్నారు. హీరో, నిర్మాత రూపేశ్ మాట్లాడుతూ-''షష్టిపూర్తి'ని ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు'' అని తెలిపారు. ''షష్టిపూర్తి' లాంటి మంచి చిత్రాలను ఆదరిస్తే నా లాంటి దర్శకులు, రూపేశ్ లాంటి నిర్మాతలు ఇంకా ముందుకు వస్తారు'' అన్నారు పవన్ ప్రభ. ఈ కార్యక్రమంలో కెమేరామేన్ రామ్, పాటల రచయిత చైతన్య ప్రసాద్ మాట్లాడారు.

తెలంగాణ కళాకారులకు అన్యాయం జరిగింది

- ప్రతాని రామకృష్ణగౌడ్



• అమృత్ గౌడ్, రమేశ్ నాయుడు, ప్రతాని రామకృష్ణ, కిరణ్

''తెలంగాణ ప్రభుత్వం గద్దర్‌గారి పేరుతో అవార్డ్స్ ఇవ్వడం సంతోషంగా ఉంది. అయితే ఈ అవార్డు కమిటీ జ్యూరీకి మురళీ మోహన్, జయసుధలను చైర్మన్లుగా నియమించడం ఏంటో అర్థం కాలేదు. ఎఫ్‌డీసీ చైర్మన్‌గా 'దిల్' రాజు తన అధికారాలను దుర్వినియోగం చేశారు. తన వాళ్లకే అవార్డ్స్ ఇచ్చుకున్నారు. జ్యూరీ కమిటీలో ఉన్నవాళ్ల సినిమాలకు అవార్డ్స్ ఇవ్వకూడదనే నిబంధనలను పాటించ లేదు. థియేటర్స్ బంద్ విషయంలోనూ 'దిల్' రాజు ప్రమేయం ఉంది'' అని 'తెలంగాణ ఫిలిం చాంబర్' చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ-''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లో తెలంగాణ కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అన్యాయం జరిగింది. జ్యూరీ కమిటీ సభ్యులు అన్ని సినిమాలు చూడలేదు. థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం వల్ల గతంలో లాభాలు ఆర్జించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు ప్రస్తుత విధానాల వల్ల నష్టాలు వస్తున్నాయి. 2002 వరకు థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం ఉండేది. ఆ తర్వాత నిర్మాత డి. సురేష్ బాబులాంటి కొందరు తమ స్వార్థంతో అద్దె విధానాన్ని మొదలు పెట్టారు. ఆ తర్వాత నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, ఏషియన్ సునీల్.. లాంటి వాళ్లు సురేష్ బాబు బాటలోనే నడిచి థియేటర్స్‌ను తమ కబంధ హస్తాల్లో పెట్టుకున్నారు'' అన్నారు. ''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లను ప్రభుత్వం పునః పరిశీలించాల్సిన అవసరం ఉంది'' అన్నారు టీఎఫ్‌సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, నటుడు కిరణ్, తెలంగాణ డైరెక్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ రమేష్ నాయుడు, తెలంగాణ రైటర్స్ యూనియన్ ప్రెసిడెంట్ అమృత్ గౌడ్ కోరారు.

డేంజర్ బాయ్స్



• వికాస్, రాధా

వికాస్ ఉత్తయ్య, రాధా భగవతి, అశ్విన్ హాసన్, రాఘవ్ కొడబాద్రి, మిథున్ తీర్థహళ్లి ప్రధాన పాత్రల్లో నటించిన కన్నడ చిత్రం 'అపాయవీడి హెచ్చరిక'. అభిజిత్ తీర్థహళ్లి దర్శకత్వంలో వి.జి.మంజునాథ్, పూర్ణిమ ఎమ్.గౌడ్ నిర్మించిన ఈ చిత్రం కన్నడలో హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను యశశ్విని క్రియేషన్స్, గీతా ఫిలిమ్స్‌పై శ్రీరంగం సతీష్ కుమార్ తెలుగులో 'డేంజర్ బాయ్స్' టైటిల్‌తో త్వరలో విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ 'డేంజర్ బాయ్స్' ఫస్ట్‌లుక్‌ని, దర్శక-నిర్మాత సాయివెంకట్ టీజర్‌ను, నిర్మాత టి.రామసత్యనారాయణ- జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ సత్య వర్ధన్ ఈ సినిమా పాటలను రిలీజ్ చేశారు.

తొలిప్రేమ తోపేం కాదు !



• శ్రీ గౌరీప్రియ, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఖరారు చేశారు. 'కలర్ ఫొటో', 'బేబి' చిత్రాల దర్శకుడు సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ గౌరీప్రియ హీరోయిన్. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై సాయి రాజేశ్, ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా చేతుల మీదుగా 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఫస్ట్ లుక్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలవుతుంది', 'తొలిప్రేమ అంత తోపేం కాదు' అంటూ కిరణ్ చెప్పే డైలాగులు గ్లింప్స్‌లో ఉన్నాయి.

సాక్షి బిజినెస్
మంగళవారం
3-6-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	77	81,374
నిఫ్టీ ▽	34	24,717

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,174	△	60
డోజోన్స్	42,086	▽	184
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,774	△	2
డాక్స్	23,931	▽	67
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,347	▽	16
నికాయ్	37,461	▽	494

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.90	116.83
€	యూరో	ఎస్‌బీఐ	95.88	98.58
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.84	60.38
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.80	56.00
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.10	68.79
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.88	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.36	24.14
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.98	12.81

స్వల్ప నష్టాలతో సరి

- తొలుత 797 పాయింట్లు డౌన్
- చివరికి 77 పాయింట్లు మైనస్
- 81,374 వద్ద ముగిసిన సెన్సెక్స్



ముంబై: కనిష్ట స్థాయిల నుంచి కోలుకున్నా.., దేశీయ స్టాక్ సూచీలకు నష్టాలు తప్పలేదు. ఇంట్రాడేలో 797 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ 77 పాయింట్లు నష్టంతో 81,374 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు కోల్పోయి 24,717 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో సూచీలు నష్టాలతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో నిఫ్టీ 225 పాయింట్లు కోల్పోయి 24,526 వద్ద కనిష్టాన్ని తాకింది. ఆర్బీఐ కీలక వడ్డీరేట్ల తగ్గింపు ఆశలతో తదుపరి లాభాల్లోకి మళ్లినప్పటికీ నష్టాల ముగింపు తప్పలేదు.

➤ బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్ 0.58%, 0.36 శాతం లాభపడ్డాయి.

➤ నష్టాలతో లిస్టయిన ఏజిస్ వొపాక్ టెర్మినల్ షేరు అప్పర్ సర్క్యూట్ తాకింది. ఇష్యూ ధర రూ.235తో బీఎస్‌ఈలో 6.38% డిస్కౌంట్‌తో రూ.220 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో బౌన్స్‌బ్యాక్ అయ్యింది. 3% ఎగసి రూ.242 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి.. ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.26,808 కోట్లకు చేరింది.

➤ లిస్టింగ్ నష్టాలు భర్తీ చేసుకున్న ష్లాస్ బెంగళూరు షేరు స్వల్ప లాభంతో గట్టెక్కింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర రూ.435తో పోలిస్తే 6.55% డిస్కౌంట్‌తో రూ.406 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 7% క్షీణించి రూ.404 వద్ద కనిష్టాన్ని తాకింది. మిడ్ సెషన్ నుంచి బలపడి 1% లాభంతో రూ.439 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.14,546 కోట్లుగా నమోదైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-6-2025	
విశాఖ	535-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

ఈవీ మేకర్స్‌కు గుడ్ న్యూస్!

- దేశీయంగా తయారు చేస్తే.. ట్యాక్స్ తక్కువే!
- పెట్టుబడిని బట్టి సుంకం 15 శాతమే
- ఈవీల స్కీము విధివిధానాల నోటిఫికేషన్

దిగుమతి సుంకాల్లో భారీ తగ్గింపు




న్యూఢిల్లీ: విదేశీ ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలు కూడా దేశీయంగా తయారీ కార్యకలాపాలు చేపట్టేలా ప్రోత్సహించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా పెట్టుబడుల పరిమాణం ఆధారంగా దిగుమతి సుంకాలను తగ్గించేలా కొత్త ఈవీ పాలసీ మార్గదర్శకాలను నోటిఫై చేసింది దీని ప్రకారం రూ. 4,150 కోట్ల వరకు స్థానికంగా ఎలక్ట్రిక్ ఫోర్ వీలర్ల తయారీపై ఇన్వెస్ట్ చేస్తే 8,000 వరకు ఈవీలను అత్యంత తక్కువగా 15 శాతం సుంకాలతో దిగుమతి చేసుకునేందుకు వీలవుతుంది. ప్రస్తుతం ఈ సుంకాలు 70–100 శాతం వరకు ఉన్నాయి. సదరు సంస్థలు అనుమతులు పొందిన నాటి నుంచి మూడేళ్లలోగా భారత్‌లో తయారీ ప్లాంట్ల కార్యకలాపాలు ప్రారంభించాల్సి ఉంటుంది. మరికొద్ది వారాల్లో ఈ స్కీముకు దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ ప్రారంభమవుతుందని, కనీసం 120 రోజుల పాటు ఇది అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. భారీ పరిశ్రమల శాఖ గతేడాది మార్చి 15న ఈ స్కీమును ప్రకటించింది.

విధివిధానాల్లో కొన్ని..

ప్లాంటు ఏర్పాటు, యంత్ర పరికరాలు మొదలైన వ్యయాలకు స్కీము కింద పెట్టుబడుల ఆధారిత ప్రయోజనాలు లభిస్తాయి. స్థల సమీకరణ కోసం చేసిన వ్యయాలను పరిగణనలోకి తీసుకోరు. అప్లికేషన్ ఫారంతో పాటు దరఖాస్తుదారు రూ. 5,00,000 నాన్-రిఫండబుల్ ఫీజు చెల్లించాలి. ఆటోమోటివ్ తయారీకి సంబంధించి గ్లోబల్ స్థాయిలో గ్రూప్ ఆదాయం రూ. 10,000 కోట్లు దాటిన కంపెనీలకు ఈ స్కీము వర్తిస్తుంది.

గరిష్ఠంగా రూ. 6,484 కోట్ల వరకు సుంకాలపరమైన మినహాయింపు ఉంటుంది. కార్ల తయారీకి సంబంధించి తొలి మూడేళ్లలో దేశీయంగా జోడించే అదనపు విలువ కనీసం 25 శాతం ఉండాలి. అయిదేళ్లలో దీన్ని 50 శాతానికి పెంచుకోవాలి. చార్జింగ్ మౌలిక సదుపాయాలపై చేసే వ్యయాలను కూడా పెట్టుబడి కింద పరిగణిస్తారు. కంపెనీ హామీ ఇచ్చిన పెట్టుబడి మొత్తంలో ఇది 5 శాతం లోపు వరకు దీన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

టెస్లాకు భారత్‌లో కార్ల తయారీపై ఆసక్తి లేదు..



కేంద్ర మంత్రి కుమారస్వామి వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లాకు భారత్‌లో షోరూమ్‌లను ప్రారంభించడంపైనే ఆసక్తి ఉంది తప్ప ఉత్పత్తి చేయడంపై లేదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. ఈవీ పాలసీ మార్గదర్శకాల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. స్కీముకు సంబంధించిన తొలి విడత చర్చల్లో మాత్రమే టెస్లా ప్రతినిధులు పాల్గొన్నారని, రెండో .. మూడో విడత సంప్రదింపుల్లో పాల్గొనలేదని మంత్రి వివరించారు. మరోవైపు, మెర్సిడెస్ బెంజ్, స్కోడా-ఫోక్స్‌వ్యాగన్, హ్యుందాయ్, కియాలాంటి అంతర్జాతీయ దిగ్గజాలు మాత్రం భారత్‌లో తయారీపై ఆసక్తి కనపర్చాయని చెప్పారు.

‘మే’లో తయారీ మందగమనం

మూడు నెలల కనిష్టానికి వృద్ధి



న్యూఢిల్లీ: దేశీ తయారీ రంగ వృద్ధి గత నెలలో మందగించింది. మూడు నెలల కనిష్టానికి చేరింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్(పీఎంఐ) మే నెలలో 57.6కు చేరింది. అంతకుముందు నెల ఏప్రిల్‌లో 58.2గా నమోదైంది. ఇందుకు ప్రధానంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, డిమాండ్ నీరసించడం, భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రభావం చూపాయి. పీఎంఐ 50కుపైగా నమోదైతే తయారీ రంగం వృద్ధిలో కొనసాగుతున్నట్లే. 50 దిగువకు చేరితే ప్రతికూల వృద్ధికి చేరినట్లు. అయితే మే నెలలో తయారీ రంగ వృద్ధి రేటు గత మూడు నెలల్లోనే కనిష్ఠంగా నమోదైనట్లు సర్వే పేర్కొంది.

యూపీఐ లావాదేవీల రికార్డ్

మే నెలలో రూ. 25.14 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: పేద, ధనిక తేడా లేకుండా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులందరికీ అత్యంత చేరువైన యూపీఐ లావాదేవీలు గత నెలలో సరికొత్త రికార్డ్ నెలకొల్పాయి. మే నెలలో యూపీఐ లావాదేవీల విలువ రూ. 25.14 లక్షల కోట్లను తాకింది. 2024 మే నెలలో నమోదైన రూ. 20.44 లక్షల కోట్ల విలువైన లావాదేవీలతో పోలిస్తే వార్షికంగా 23 శాతం వృద్ధి నమోదైంది. అంతక్రితం నెల అంటే ఈ ఏప్రిల్‌లో నమోదైన రూ. 23.94 లక్షల కోట్లతో చూసినా వీటి విలువ 5 శాతం ఎగసింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్(ఎన్‌పీసీఐ) విడుదల చేసిన తాజా గణాంకాలివి. పరిమాణంలోనూ లావాదేవీల సంఖ్య 1,789.3 కోట్ల నుంచి 1,867.7 కోట్లకు పెరిగింది. కాగా..రోజువారీ లావాదేవీల విలువ ఈ ఏప్రిల్‌తో చూస్తే రూ. 79,831 కోట్ల నుంచి రూ. 81,106 కోట్లకు బలపడింది.

చిన్న కార్ల విభాగాన్ని ఆదుకోవాలి

ప్రభుత్వానికి మారుతీ సుజుకీ వినతి



న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ చిన్న కార్ల విభాగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది. కారు కొనలేని కస్టమర్ల కోసం ప్రభుత్వం కొన్నిరకాల ప్రోత్సాహకాలు ప్రకటించవలసి ఉన్నట్లు కంపెనీ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ పేర్కొన్నారు. అందుబాటు ధరలు దూరంకావడంతో ఇటీవల చిన్న కార్ల విక్రయాలు తగ్గుతున్నట్లు విలేకరుల వర్చువల్ సమావేశంలో తెలియజేశారు. పెరిగిన నియంత్రణల కారణంగా చిన్న కార్ల ధరలు పెరిగిపోయినట్లు వెల్లడించారు. దీంతో ద్విచక్ర వాహనం నుంచి కారుకు అప్‌గ్రేడ్ కావాలనుకునే కస్టమర్లపై ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు వివరించారు. రూ. 5 లక్షల ధరలోపు ఎంట్రీలెవల్ కార్ల విక్రయాలు 2016లో నమోదైన 9,34,538 యూనిట్ల నుంచి గతేడాది 25,402 వాహనాలకు పడిపోయినట్లు తెలియజేశారు.

గ్లోబల్ టెక్ దిగ్గజాల్లో రిలయన్స్

30 లిస్టెడ్ సంస్థల జాబితాలో ఏకైక భారతీయ కంపెనీ



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లలో ట్రేడవుతున్న 30 అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాల్లో దేశీ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ చోటు దక్కించుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ట్రెండ్స్ పేరిట రూపొందించిన నివేదికలో భాగమైన లిస్టులో 23వ స్థానంలో నిల్చింది. తద్వారా భారత్ నుంచి ఈ జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక సంస్థగా నిల్చింది. కృత్రిమ మేధ సాంకేతికత వినియోగ ధోరణులు, ప్రభావంపై రూపొందించిన ఈ నివేదికలో మార్కెట్ క్యాపిటలైజేషన్‌పరంగా తొలి ఎనిమిది స్థానాల్లో అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్ తదితర సంస్థలు ఉన్నాయి. ఈ ఏడాది చైనా నుంచి 3 సంస్థలు, జర్మనీ కంపెనీలు 2, తైవాన్.. నెదర్లాండ్స్ .. దక్షిణ కొరియా.. భారత్ నుంచి ఒక్కో కంపెనీ చొప్పున తొలిసారిగా ఈ లిస్టులో చేరాయి.

అమెరికా టాప్.. అత్యంత విలువైన 30 గ్లోబల్ టెక్ కంపెనీల జాబితాలో మూడు దశాబ్దాలుగా అమెరికా ఆధిపత్యమే కొనసాగుతోంది. ఈ లిస్టులో 1995లో అమెరికా వాటా 53 శాతంగా ఉండగా 2025లో 70 శాతానికి పెరిగింది. 30 టాప్ కంపెనీల్లో 21 సంస్థలు అమెరికావే ఉన్నాయి. 1995లో జపాన్‌కి 30 శాతం వాటా ఉండగా ప్రస్తుతం అది సున్నా స్థాయికి పడిపోయింది.

రూ. 7,600 కోట్లతో అపోలో హాస్పిటల్స్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హెల్త్‌కేర్ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ సుమారు రూ. 7,600 కోట్ల పెట్టుబడులతో కార్యకలాపాలను భారీగా విస్తరిస్తోంది. ఇప్పటికే రూ. 2,000 కోట్లు ఇన్వెస్ట్ చేయగా, వచ్చే 3-4 ఏళ్లలో మిగతా మొత్తాన్ని పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ తెలిపింది. నగదు నిల్వలు, అంతర్గత వనరుల నుంచి ఇందుకు అవసరమైన నిధులను సమకూర్చుకోనున్నట్లు వివరించింది. హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్, కోల్‌కతా, న్యూఢిల్లీలో కీలక ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని అపోలో హాస్పిటల్స్ తెలిపింది. కొత్తగా 4,300 పడకలను జోడించుకోనున్నట్లు వివరించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో 2,000 బెడ్స్ అందుబాటులోకి వస్తాయని పేర్కొంది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య



యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(2)-2025కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా త్రివిధ దళాల్లో 453 ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనుంది. రెండంచెల ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిస్తే.. శిక్షణ అనంతరం ఇండియన్ మిలిటరీ అకాడమీ, ఇండియన్ నావల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీల్లో ఆఫీసర్ కొలువు సొంతం చేసుకోవచ్చు. ఆకర్షణీయ వేతనాలతో రక్షణ రంగంలో ఉజ్వల కెరీర్‌ను ఖాయం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో... యూపీఎస్సీ సీడీఎస్‌ఈ(2)-2025తో భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

డిగ్రీతో త్రివిధ దళాల్లో ఆఫీసర్ కొలువు

» సీడీఎస్‌ఈ(2) నోటిఫికేషన్ విడుదల చేసిన యూపీఎస్సీ
» మొత్తం 453 ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా నియామకం

యూపీఎస్సీ ప్రతి ఏటా రెండుసార్లు సీడీఎస్‌ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తోంది. దీనిద్వారా ఇండియన్ మిలిటరీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఆఫీసర్ స్థాయి కీలక పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తోంది. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

మొత్తం పోస్టుల సంఖ్య : 453

పోస్టుల వివరాలు

ఇండియన్ మిలిటరీ అకాడమీ-డెహ్రాడూన్‌లో 100 పోస్టులు, ఇండియన్ నేవల్ అకాడమీ- ఎజిమలలో 26 పోస్టులు, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ- హైదరా బాద్‌లో 32 పోస్టులు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడ మీ-చెన్నైలో 276 పోస్టులు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (మహిళలు)- చెన్నైలో 19 పోస్టులు ఉన్నాయి.

విద్యార్హతలు:

- ఇండియన్ మిలిటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ-చెన్నైలకు దరఖాస్తు చేసుకునేందుకు గుర్తింపుపొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.
- ఇండియన్ నేవల్ అకాడమీకి దరఖాస్తు చేసుకునేందుకు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి దరఖాస్తు చేసుకునేందుకు ఇంటర్ లేదా 10+2 స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్‌తో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి లేదా ఇంజనీరింగ్ డిగ్రీ పాసవ్వాలి.

వయసు

ఇండియన్ మిలిటరీ అకాడమీ, ఇండియన్ నావల్ అకాడమీకి 19-24 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. అదేవిధంగా ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి 19-24 ఏళ్ల మధ్య ఉండాలి. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి 20-24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ

రాత పరీక్ష, ఇంటర్వ్యూ (ఫర్ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్) ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష విధానం

- ఇండియన్ మిలిటరీ అకాడమీ, ఇండియన్ నావల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీల్లో అభ్యర్థుల ఎంపికకు నిర్వహించే రాత పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. అవి..ఇంగ్లిష్ 100 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ 100 మార్కులకు, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి విభాగానికి రెండు గంటల సమయం కేటాయించారు.
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో అభ్యర్థుల ఎంపికకను నిర్వహించే రాత పరీక్షలో రెండు విభాగాలు ఉంటాయి. అవి..ఇంగ్లిష్ 100 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ 100 మార్కులకు జరుగుతాయి. ప్రతి విభాగానికి రెండు గంటల సమయం కేటాయించారు.
- రాత పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కులను తగ్గిస్తారు.

300 మార్కులకు ఇంటర్వ్యూ

- రాత పరీక్షలో ప్రతిభ చూపిన వారికి తదుపరి దశలో ఎస్ఎస్‌బీ(సర్వీస్ సెలక్షన్ బోర్డ్) ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూకు 300 మార్కులు కేటాయించారు. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మాత్రం ఇంటర్వ్యూ 200 మార్కులకు ఉంటుంది.
- ఇంటర్వ్యూలో రెండు దశలు స్టేజ్1, స్టేజ్ 2 ఉంటాయి. స్టేజ్ 1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్(ఓఐఆర్), పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్ట్(పీపీ అండ్ డీటీ) నిర్వహిస్తారు. స్టేజ్ 1లో అర్హత సాధించిన వారికి స్టేజ్ 2 ఉంటుంది. స్టేజ్2లో భాగంగా ఇంటర్వ్యూ, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్క్స్, సైకాలజీ టెస్ట్, కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూ ఆఫీసర్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, సైకాలజిస్టులు అభ్యర్థి వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తారు.

శిక్షణ

రాత పరీక్షతోపాటు ఇంటర్వ్యూలోనూ ప్రతిభ చూపిన అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి తుది విజేతలను ప్రకటిస్తారు. అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాల ప్రకారం ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలకు ఎంపిక చేస్తారు. ఇండియన్ మిలిటరీ అకాడమీకి ఎంపికైన వారికి ఇండియన్ మిలిటరీ అకాడమీ, డెహ్రాడూన్‌లో శిక్షణ ఉంటుంది. నేవల్ అకాడమీలో చేరిన వారికి కేరళలోని ఎజిమలలో శిక్షణ ఇస్తారు. అదేవిధంగా ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో పైలెట్ శిక్షణ ఉంటుంది. అలాగే ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరిన వారికి చెన్నైలో ట్రైనింగ్ ఇస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఆర్మీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో లెఫ్టినెంట్ హోదా; నేవీలో సబ్ లెఫ్టినెంట్ హోదా, ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో కెరీర్ ప్రారంభమవుతుంది.

వేతనం

ఎంపికైన వారికి శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టైపెండ్ లభిస్తుంది. శిక్షణ అనంతరం ప్రారంభంలో నెలకు మూలవేతనం రూ.56,100తోపాటు మిలిటరీ సర్వీస్ పే, డీఏ, హెచ్ఆర్ఏ తదితర అలవెన్సులు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 17.06.2025
» రాత పరీక్ష తేదీ: 14.09.2025
» వెబ్‌సైట్: https://upsconline.nic.in/, https://upsc.gov.in/

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీఎన్‌సెట్-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల బీఎస్సీ(నర్సింగ్) కోర్సులో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఎన్‌సెట్)-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 13,726.
» అర్హత: కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్(బైపీసీ)/10+2 ఉత్తీర్ణులవ్వాలి. సైన్స్ గ్రూప్, ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా తప్పనిసరిగా ఉండాలి.
» వయసు: 31.12.2025 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.
» ఎంపిక విధానం: కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.06.2025.
» హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ తేది : 25.06.2025.
» ప్రవేశ పరీక్ష తేది: 06.07.2025.
» వెబ్‌సైట్: https://drntr.uhsap.in/

బీడీఎల్, హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్).. వివిధ విభాగాల్లో సీనియర్ మేనేజర్, మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 05.
» పోస్టుల వివరాలు: సీనియర్ మేనేజర్-04, మేనేజర్-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: మేనేజర్‌కు 40 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 45 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు మేనేజర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, సీనియర్ మేనేజర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఎస్.ఎం, సి-హెచ్ఆర్(టీఏ-సీపీ), కార్పొరేట్ ఆఫీస్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, గచ్చిబౌలి, హైదరాబాద్-500032 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరి తేది: 16.06.2025.
» వెబ్‌సైట్: https://bdl-india.in/

ఈఎస్ఐసీ, పుణెలో 23 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

పుణె(మహారాష్ట్ర)లోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ సొసైటీ(ఈఎస్ఐసీ).. ఏఎంవో ఆఫీస్‌లో ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 23.
» అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 30.06.2025 నాటికి 69 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.1,67,844.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్/పోస్ట్/ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులకు చివరితేది: 01.06.2025.
» ఇంటర్వ్యూ తేది: 04.06.2025.
» ఇంటర్వ్యూ వేదిక: ఆఫీస్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్, గ్రౌండ్ ఫ్లోర్, పంచదీప్ భవన్, పుణె-411037.
» వెబ్‌సైట్: https://www.esic.gov.in/

ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో 171 పోస్టులు

తమిళనాడులోని ఎన్ ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో వివిధ విభాగాల్లో జూనియర్ ఓవర్‌మ్యాన్(ట్రైనీ), మైనింగ్ సర్దార్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 171.
» పోస్టుల వివరాలు: జూనియర్ ఓవర్‌మ్యాన్ (ట్రైనీ)-69, మైనింగ్ సర్దార్-102.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ(మైనింగ్ ఇంజనీరింగ్), డిప్లొమా(మైనింగ్)లో ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 01.04.2025 నాటికి 30 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు జూనియర్ ఓవర్‌మ్యాన్‌కు రూ.31,000 నుంచి రూ.1,00,000, మైనింగ్ సర్దార్‌కు రూ.26,000 నుంచి రూ.1,10,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 04.06.2025.
» వెబ్‌సైట్: https://www.nlcindia.in/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-కెమిస్ట్రీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


SR'S LEGACY CONTINUES!
When dedication meets direction, AIRs are just milestones.
JEE ADVANCED RESULTS-2025
50 YEARS OF BRILLIANCE
All India Rank 8 M.RAVI CHANDRA REDDY R.No. 256015010 (R)
Groomed by SR from School to College
All India Rank 13 V.NAGA SIDDHARTHA R.No. 256196129 (R)
All India Rank 40 P.SAKSHI R.No. 256159038 (R)
All India Rank 47 A.ANUSRI R.No. 256183009 (R)
All India Rank 68 BANAVATH SAI R.No. 256152005 (R)
Groomed by SR from School to College
All India Rank 90 Y.BHARANI SHANKAR R.No. 256196022 (R)
106 G.RAJESH R.No. 256165339 (R)
115 B.VINOD R.No. 256178179 (R)
123 M.VENKATA KOWSIK R.No. 256039003 (R)
204 S.PAVAN R.No. 256168251 (R)
265 A.SANTHOSH R.No. 256179171 (R)
269 B.VAAGDEVI R.No. 256199037 (R)
279 CH.ANSIKA R.No. 256200171 (R)
279 B.NIKHIL R.No. 256192046 (R)
376 G.MANJULA R.No. 256193140 (R)
389 B.GANESH R.No. 256195015 (R)
395 B.RAM CHARAN R.No. 256146476 (R)
438 J.RAJESH R.No. 256146400 (R)
452 D.NAVEEN R.No. 256196136 (R)
464 V.SWARAN NAIK R.No. 256175071 (R)
465 B.D.SHANMUKHA SREE R.No. 256182006 (R)
471 K.M.SATHWIK BHARATH R.No. 256019221 (R)
506 B.RAJENDER R.No. 256195150 (R)
555 K.SANJAY R.No. 256196074 (R)
566 K.GANESH R.No. 256145241 (R)
566 K.SUDHA RANI R.No. 256166596 (R)
567 L.VIGNESWAR R.No. 256014144 (R)
570 M.VENU R.No. 256176184 (R)
594 M.MAHESH NAIK R.No. 256022158 (R)
633 B.ARUN R.No. 256195192 (R)
662 T.TEJAS UDBHAV REDDY R.No. 256018041
698 M.AKHILESH R.No. 256170261 (R)
772 S.BHARGAV R.No. 256131239 (R)
784 MD.KAIF FARMAAN R.No. 256195286 (R)
839 CH.RUCHITH REDDY R.No. 256150019 (R)
867 J.ABHI RAM R.No. 256196108 (R)
886 C.KAMALA VARDHAN R.No. 256146186 (R)
LONG TERM JEE (MAIN & ADVANCED) ADMISSIONS ARE IN PROGRESS 2025-26
HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433 | WARANGAL: 9642117378 | VIJAYAWADA: 8142111302 | VIZAG: 9052222274, 9154854707 | GUNTUR: 9154854694 | TIRUPATI: 9154854699 | NELLORE: 9154854696 | ANANTHAPURM: 9154854691 | KURNOOL: 9154854695 | NIZAMABAD: 9642117110, 096421 15777 | SRIKAKULAM: 9154854697 | BHIMAVARAM: 9642223762, 7331122579 | RAJAHMUNDRY: 9154854693 | KARIMNAGAR: 9642117335 | NALGONDA: 9573927070 | ONGOLE: 8712609156 | KHAMMAM: 9121155002 | ADILABAD: 9154854690 | KOTHAGUDEM: 9154854692 | NIRMAL: 9642117835 | HOSAPETE: 9154854713.
SR Educational Academy
TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA

యాదగిరిగుట్ట క్షేత్రానికి భద్రత ఏది?

అమలుకు నోచుకోని టెంపుల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు

- ప్రతిపాదనలకే పరిమితమైన ఆలయ భద్రత వ్యవస్థ.. శ్రీస్వామివారికి కోట్లు విలువ చేసే ఆస్తులు
- అలంకారప్రాయంగా కమాండ్ కంట్రోల్ కార్యాలయం.. యాదాద్రికి పెరుగుతున్న భక్తుల తాకిడి
- రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు, న్యాయమూర్తులు వంటి ప్రముఖుల రాక
- ఏసీపీ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ డివిజన్ ఏర్పాటు చేసినా సిబ్బంది సున్నా


గుట్టపైన నిర్మించిన పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం

సాక్షి, యాదాద్రి:

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. శ్రీస్వామివారికి కోట్లు విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. ఇటీవల జరిగిన చింతపండు దొంగతనం వెలుగుచూడటంతో ఆలయ భద్రతలో ఉన్న డొల్లతనం భయట పడింది. కొండపైన కమాండ్ కంట్రోల్ కార్యాలయం ఏర్పాటు చేసినప్పటికీ సిబ్బంది, పరికరాలు లేకపోవడంతో అలంకార ప్రాయంగా మిగిలింది. యాదగిరి క్షేత్రం అభివృద్ధి తర్వాత భక్తుల సంఖ్య పెరిగింది. రాష్ట్రపతి, ప్రధాని వంటి ఉన్నత స్థాయి పదవుల్లో ఉన్న ప్రముఖులతోపాటు ముఖ్యమంత్రులు, న్యాయమూర్తులు, ఇటీవల విశ్వం నలుమూలల నుంచి అందగత్తెలు వచ్చారు. ఇలా ఒకరే మిటి వివిధ స్థాయిల్లోని సెలబ్రిటీలు వస్తున్నారు. వీరి భద్రత కోసం ఎప్పటికప్పుడు ఇతర ప్రాంతాల నుంచి పోలీసులను తీసుకు వచ్చే కంటే స్థానికంగా ఆర్మ్‌డ్‌ఫోర్స్‌ను సిద్ధగా ఉంచాలని గతంలో నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా గుర్తించిన గుట్ట క్షేత్రం భద్రతకు ప్రత్యేక భద్రతా ప్రణాళికను రూపొందించారు. దేశ విదేశాల నుంచి వీవీఐపీలు, వీఐపీలు వచ్చిన ప్రతిసారీ భద్రత కోసం రాచకొండ కమిషనరేట్ నుంచి నలుమూలల నుంచి సిబ్బందిని రప్పిస్తున్నారు.

భద్రతకు ఏదీ ప్రాధాన్యం?

ఆలయంతో పాటు భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. సీసీ కెమెరాల నిఘాలో శాంతిభద్రతల పర్యవేక్షణ ఉండాలి. వైటీడీఏ (యాదాద్రి ఆలయ అభివృద్ధి బోర్డు) స్వయంగా సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలి. వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుంది. భక్తుల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతుంది. దీనికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ సిద్ధంగా ఉండాలి. 100 నుంచి 150 మంది సాయుధ పోలీసులు నిత్యం అందుబాటులో ఉండాలి. దాని కోసం రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు చెందిన ఏఆర్ హెడ్‌క్వార్టర్‌ను యాదగిరి గుట్టలోనే ఏర్పాటు చేయాలి. ఏసీపీ కార్యాలయం, టెంపుల్ సిటీకి ప్రత్యేకంగా పోలీస్‌స్టేషన్ మంజూరు చేసి వదిలేశారు.

సిబ్బంది లేరు..

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం బాధ్యతలను చూడటానికి ఏసీపీ స్థాయిలో అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ డివిజన్ ఏర్పాటు చేశారు. ఏసీపీని నియమించినా.. పూర్తిస్థాయి సిబ్బంది లేరు. కొండపైన అప్‌హిల్ పోలీస్ స్టేషన్, సీసీఎస్, మహిళా పోలీస్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ప్రస్తుతం ఉన్న యాదగిరిగుట్ట పీఎస్‌తోపాటు మరో పీఎస్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. వీటికి స్టేషన్‌హౌస్ అధికారులుగా ఇన్‌స్పెక్టర్‌లు ఉంటారు. దీంతోపాటు మొత్తంగా ఎస్సైలు ,ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు మొత్తంగా 300 మంది వరకు అదనంగా సిబ్బంది అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

సాయుధ దళం ఏర్పాటు చేయాలని..

బ్రహ్మోత్సవాల సమయంలో వీవీఐపీలు గుట్టకు వచ్చినప్పుడు రక్షణ బాధ్యతలను చూడటానికి సాయుధ దళాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రిజర్వ్‌పోలీస్, ఆక్టోపస్ గ్రేహౌండ్స్ పోలీసులు నిరంతరం అందుబాటులో ఉండేలా నిర్ణయించారు. 25 మందితో ఆక్టోపస్ పోలీస్ దళం ఉంటుందని అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డి వెల్లడించారు. ఇంకా ఆది కార్యరూపం దాల్చలేదు.

30 ఎకరాల స్థలం కేటాయింపు

దేవాలయ అభివృద్ధికి కేటాయించిన భూమిలోనే 30 ఎకరాల స్థలం యాదాద్రి ప్రొటెక్షన్ ఫోర్స్ కోసం కేటాయించారు. ఆ స్థలాన్ని చదును చేసి వదిలేశారు. నిధులు మంజూరు కాకపోవడంతో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టడం లేదు. ఇందులోనే ప్రధాన కార్యాలయాలు, పరేడ్ గ్రౌండ్, శిక్షణా కేంద్రం క్వార్టర్‌లు నిర్మించాలి.

ఉద్యమంలో ముందున్న నాయకుడు ఈటల

పలు విద్యార్థి సంఘాల నాయకులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో ముందున్న నాయకుడు ఎంపీ ఈటల రాజేందర్ అని పలు విద్యార్థి సంఘాల నాయకులు కొనియాడారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ ఈటలను కలిసి సన్మానించారు. ఉద్యమంలో పాల్గొన్న అనేకమంది విద్యార్థుల కడుపు నింపారని, జైళ్లలో మగ్గుతున్న విద్యార్థులకు బెయిల్ ఇప్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సురేశ్ యాదవ్, నెహ్రూ నాయక్, తెలంగాణ సంపత్, రాస వెంకట్, గడ్డం సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరిన రోజు

ఢిల్లీ తెలంగాణ భవన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశాంక్‌గోయల్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని ఢిల్లీ తెలంగాణ భవన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ శశాంక్ గోయల్ అన్నారు. రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ ఆనాటి ఉద్యమంలో అమరులైన వారిని స్మరించుకోవడం, వారి త్యాగాలను గుర్తు చేసుకోవడం అభినందనీయమన్నారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర అవతరణ దిన వేడుకలు ఘనంగా జరిగాయి. రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్‌తో కలిసి శశాంక్ గోయల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. 2014, జూన్ 2న ప్రజాస్వామ్య బలం ఎలా గెలిచిందనే దానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఒక ఉదాహరణగా నిలిచిందని గౌరవ్ ఉప్పల్ పేర్కొన్నారు.

బీసీ కమిషన్ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్‌లో జరిగే నిర్ణయాలు, ప్రకటనలు ప్రజలకు తెలిసేలా www.bccommission.telangana.gov.in వెబ్‌సైట్‌ను నిరంజన్ ఆవిష్కరించి మాట్లాడారు. 1956లో పెద్ద మనుషుల ఒప్పందం జరిగిందని, 1969లో తొలి దశ ఉద్యమం, 2014లో తెలంగాణ ఆకాంక్షతో రాష్ట్రం ఆవిర్భవించిందని వెల్లడించారు.



ట్రాన్స్‌కో బలోపేతానికి రూ.18 వేల కోట్లు

సీఎండీ కృష్ణభాస్కర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ట్రాన్స్‌కో నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలని నిర్ణయించామని, అందుకోసం రానున్న ఐదేళ్ల కాలంలో రూ.18,384 కోట్లు వ్యయం చేస్తామని ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ చెప్పారు. ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ కోసం పెద్ద ఎత్తున సబ్‌స్టేషన్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. సోమవారం రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా ఆయన ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. 400 కేవీ స్టేషన్లు 9, 220కేవీ స్టేషన్లు 34 అలాగే 132 కేవీ సబ్‌స్టేషన్లు 75 నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వేగంగా పారిశ్రామిక రంగం విస్తరణ, అనేక అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్న నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవడం, రాష్ట్ర విద్యుత్ కొనుగోళ్లలో పారదర్శకత కారణంగా డిసెంబర్ 2023 నుంచి ఈ సంవత్సరం మే వరకు దాదాపు రూ.1,226 కోట్లు ఆదా చేసినట్లు ఆయన తెలిపారు. విద్యుత్ సంస్థల ప్రోయాక్టివ్ కారణంగా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విశేష కృషి ఉందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేఎండీ ట్రాన్స్‌కో సూర్యప్రకాశ్, ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లు జి. నర్సింగ్‌రావు, బి.నర్సింగ్‌రావు, సచ్చిదానందం, ఎ.అజయ్, లక్ష్మయ్య, అనురాధ తదితర అధికారులు పాల్గొన్నారు.

చట్టసభల్లో జాతీయ జెండా విష్కరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మండలి ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాగా, అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు విజయశాంతి, అద్దంకి దయాకర్, ఆమేర్ అలీఖాన్, అంజిరెడ్డి, దయానంద్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, వాణీదేవి, కోదండరాం, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, రాకేశ్‌రెడ్డి అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీపీఎల్‌పై ప్రత్యేక కార్యాచరణ

నేటి నుంచి వారం రోజులపాటు ఎక్సైజ్ దాడులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్)ను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం వెల్లడించారు. గత నెలలో డ్రగ్స్, గంజాయి టార్గెట్‌గా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మంచి ఫలితాలు వచ్చాయని, ఇదే స్ఫూర్తితో మంగళవారం నుంచి వారం రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌డీపీఎల్ పట్టుకోవడమే టార్గెట్‌గా జల్లెడపడ తామని సోమవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. స్టేట్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ టీంలతో కలిసి తెలంగాణలోని గల్లీల నుంచి పట్టణాల వరకు ఈ దాడులు నిర్వహించడం ద్వారా అక్రమ మద్యం అమ్మకాలు సాగించే ముఠాలకు ముకుతాడు వేస్తామని, ఇందుకు అవసరమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఢిల్లీ, గోవా, కర్ణాటక, హరియాణా తో పాటు ఇతర ప్రాంతాల నుంచి వివిధ మార్గాల్లో వచ్చే మద్యంపై నిఘా పెడతామని, రైళ్లు, బస్సులు, విమానాలు, ఇతర రవాణా మార్గాల్లో అక్రమంగా దిగుమతి అవుతున్న ఎన్‌డీపీఎల్‌ను పట్టుకునేందుకు ఎక్సైజ్ బృందాలు సిద్ధం కావాలని ఆ ప్రకటనలో షానవాజ్ ఖాసిం ఆదేశాలు జారీ చేశారు.

గురుకుల విద్యార్థులతో పనులు చేయించడం దుర్మార్గం

సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 240 గురుకులాల్లో 1,200 మంది అసిస్టెంట్ కేర్‌టేకర్ పోస్టులను తొలగించి పిల్లలతో టాయిలెట్స్, తరగతి గదులు, విద్యా సంస్థ ఆవరణ శుభ్రం చేయించాలని నిర్ణయించడం దుర్మార్గమని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. గతంలో గురుకులాల మెయింటెనెన్స్, స్వీపింగ్, శానిటేషన్ కోసం కేటాయించే నిధులను ప్రభుత్వం నిలిపివేసిందని, గురుకుల విద్యార్థుల గురించి గురుకుల కార్యదర్శి అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరానిదని సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం గౌలిదొడ్డి, చిలుకూరు లాంటి ప్రతిష్టాత్మక (సీఓఈఎస్) గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఇక్కడ చదివే ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థులకు కచ్చితంగా 95 శాతం మార్కులు వస్తేనే ఈ గురుకులాల్లో కొనసాగించాలని, లేకపోతే వారిని సాధారణ గురుకులాల్లోకి పంపాలని ఆదేశాలివ్వడం సరైంది కాదన్నారు. దాదాపు 12 గురుకులాలను మూసివేశారని, దీనివల్ల 11,520 మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతారని చెప్పారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతులకు అండగా ఉంటున్నాం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతాంగానికి అండగా నిలిచి..వారు ఆర్థికంగా ఎదిగేందుకు అన్నిరకాలుగా కృషి చేస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు పేరిట రూ. 5వేలు ఇస్తూ, రైతులకు దక్కాల్సిన అన్ని పథకాలను రద్దు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పునరుద్ధరించామని చెప్పారు. వరితోపాటు ఇతర పంటలను కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నట్టు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ కూడా చెల్లించక చేతులెత్తేస్తే, ఆ బకాయిలు చెల్లించి, వాటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చేశామన్నారు. పంట నష్ట పరిహారం కూడా వెంటనే చెల్లిస్తున్నట్టు తెలిపారు. తాము 2 లక్షల లోపు పంటరుణాలను గత ఐదేళ్ల బాకీ పడ్డ రైతులకు కూడా కలిపి మాఫీ చేసినట్టు చెప్పారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ. 36,450 కోట్లు జమ చేశామని, రూ. 40,683 కోట్లు వెచ్చించి ధాన్యం కొను గోలు చేసిన లెక్క వేరేనని ఆయన పేర్కొన్నారు. కందుల పరిమితిని ఎకరానికి 3.1 క్వింటాళ్ల నుంచి 6 క్వింటాళ్లకు, సోయాబీన్ పరిమితిని ఎకరానికి 6 నుంచి 10 క్వింటాళ్లకు, జొన్న పంట పరిమితిని ఎకరానికి 8 నుంచి 14 క్వింటాళ్లకు పెంచి మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు.

8న 'సామాజిక శాంతి-ఐక్యత'లో మీడియా పాత్రపై చర్చ

సాక్షి, హైదరాబాద్: 'సామాజిక శాంతి-ఐక్యత'లో మీడియా పాత్రపై చర్చా కార్యక్రమం నిర్వహించనున్నామని బ్రహ్మకుమారీస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమాన్ని ఈనెల 8న ఉదయం 10 గంటల నుంచి సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. మీడియా ప్రతినిధులు వృత్తి నైపుణ్యాలు, ఒత్తిళ్లను సమర్థంగా ఎదుర్కొనే మెళకువలు, మానసిక-శారీరక ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై జాతీయ స్థాయి పాత్రికేయ నిపుణులు శిక్షణ అందిస్తారని బ్రహ్మకుమారీస్ మీడియా వింగ్ వైస్ చైర్‌పర్సన్ సరళ తెలిపారు. కార్యక్రమానికి మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు లక్ష్మణ్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ హాజరుకానున్నారని చెప్పారు.

పదవి రావడం లేదనే ఈటల ఫ్రస్ట్రేషన్

అధికార దుర్వినియోగానికి రోల్‌మోడల్ హరీశ్‌రావు: చామల



సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేత ఈటల రాజేందర్ ఇంట్లో రెడ్డి అని బయటకు రాగానే ఆయన ఓబీసీ నాయకుడు అవుతాడని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. లెఫ్ట్ వింగ్‌లో పనిచేసే రాజేందర్ పదవుల కోసం రైట్‌వింగ్‌కు పోయాడని, అక్కడ పదవులు రాకపోవడంతో ఫ్రస్ట్రేషన్‌తో కాంగ్రెస్ నేతలపై మాట్లాడుతున్నాడని విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధి శ్రీకాంత్ యాదవ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ, అసలు రాజేందర్ బీజేపీలో ఉన్నాడన్న విషయాన్ని ఆ పార్టీ నేతలే గుర్తించడం లేదని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డికి సీఎం హోదాను బీఆర్ఎస్ ఇచ్చిందని హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందని, అసలు తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ అని, ఆమె చలవతోనే వీళ్లంతా మంత్రులు, ముఖ్యమంత్రులుగా పనిచేశారని చెప్పారు. ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్న హరీశ్‌రావు మిస్ ఇంగ్లండ్ పట్ల ఎవరో అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తున్నాడని, అలాంటివి ఏమైనా ఉంటే వీడియో ఫుటేజీ బయట పెట్టాలని చామల డిమాండ్ చేశారు. దళితుడిని ముఖ్యమంత్రిగా చేస్తానని పదేళ్లు అధికారాన్ని అనుభవించిన కేసీఆర్ త్యాగాల నేత ఎలా అవుతాడో హరీశ్‌రావు చెప్పాలని ప్రశ్నించారు. అధికార దుర్వినియోగానికి రోల్‌మోడల్ హరీశ్‌రావు అని ఆయన వ్యాఖ్యానించారు.

బీజేపీ వదిలిన బాణమే కవిత

- జాగృతి పేరుతో వందల కోట్ల దోపిడీ
- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. లేడీ మాఫియా డాన్ అని, ఆమె బీజేపీ వదిలిన బాణమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ వ్యాఖ్యానించారు. బతుకమ్మ పేరుతో ఆమె బతక నేర్చారని, లిక్కర్ కేసుల నుంచి బయటపడాలంటే ఆమెకు బీజేపీ సహకారం అవసరమని చెప్పారు. జీఎస్టీ, దొంగనోట్ల కుంభకోణాల్లో కూడా కవిత భాగస్వామ్యం ఉందని, అందుకే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చెప్పినట్టు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో బలహీనమైతే బీజేపీకి లబ్ధికలుగుతుందన్నది కవిత ఆలోచన అని చెప్పారు. తెలంగాణ జాగృతి పేరుతో ఆమె వందల కోట్లు దోచుకున్నారని, స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ. 800 కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. జాగృతి కోసం ఫినిక్స్ లాంటి రియల్ సంస్థల నుంచి డబ్బులు వసూలు చేశారని, ఇప్పుడు ఆ డబ్బులను దాచుకునేందుకే మళ్లీ ఆమె తెలంగాణ జాగృతిని బలోపేతం చేస్తానంటూ కొత్త నాటకం ప్రారంభించారని ధ్వజమెత్తారు. అమెరికా, దుబాయ్‌లలో కేటీఆర్, కవితలకు పెట్టుబడులున్నాయని, వాటిని చూసుకునేందుకే తరచూ కేటీఆర్ విదేశాలకు వెళుతున్నారని ఆరోపించారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వకపోతే కేసీఆర్, కేటీఆర్‌లు మొహంజాహీ మార్కెట్‌లో గులాబీ పూలు అమ్ముకునే వారని, కవిత ఉమ్మడి రాష్ట్రంలో బ్యూటీపార్లర్ పెట్టుకునేదని వ్యాఖ్యానించారు. లిక్కర్‌స్కాంలో కేసీఆర్ కూడా భాగస్వామి అని మధుయాష్కీ ఆరోపించారు.

ఊయల.. ఊగేదెలా..



చెట్టుకు చీరతో కట్టిన ఊయలలో కోతి కూర్చున్న ఈ ఫొటో చూస్తే ఎవరన్నా వచ్చి కాసేపు ఊపండి అన్నట్లు కనిపిస్తోంది కదా! ఖమ్మం జిల్లా రఘునాథపాలెం బైపాస్ వద్ద పెట్రోల్‌బంక్‌లో మామిడిచెట్టుకు సిబ్బంది చీరతో ఊయల కట్టారు. పిల్లల కోసం కట్టిన ఈ ఊయల ఖాళీగా ఉండటంతో అటుగా వెళ్తున్న ఓ కోతి ఆక్రమించేసింది. కాసేపు ఊగడానికి ప్రయత్నించినా ఫలితం లేక దిగి నిరాశగా వెళ్లిపోయింది!

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

క్లుప్తంగా...

ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జవహర్

సాక్షి, అమరావతి: ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా కేఎస్ జవహర్ విజయవాడలోని ఎస్సీ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ చైర్మన్ వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, ఎమ్మెస్ రాజు, బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, రాష్ట్ర ఎస్సీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ బత్తుల జీవపుత్ర కుమార్ పాల్గొన్నారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, శాసనసభ్యులు బండారు సత్యానందరావు, తంగిరాల సౌమ్య, వేగుళ్ల జోగేశ్వరావు, పితాని సత్యనారాయణ, ఎస్సీ మాల సంక్షేమ సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు తదితరులు జవహర్‌ను సత్కరించారు.

సినీ దర్శకుడు విక్రమ్ సుకుమారన్ కన్నుమూత



తమిళసినిమా: సినీ దర్శకుడు విక్రమ్ సుకుమారన్ ఆదివారం రాత్రి మదురైలో గుండెపోటుతో మరణించారు. ఈయన మదయానై కూట్టం, రావణ కోట్టం చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఈయన నిర్మాతకు కథ చెప్పడానికి మదురై వెళ్లారు. ఆదివారం రాత్రి చెన్నైకి తిరిగి వస్తూ బస్సు ఎక్కుతుండగా గుండెపోటుకు గురయ్యారు. దీంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించగా తుదిశ్వాస విడిచారు. విక్రమ్ సుకుమారన్ చెన్నై రెడ్‌హిల్స్ ప్రాంతంలో కుటుంబ సమేతంగా ఉంటున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పలువురు సినీ ప్రముఖులు ఆయన మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఊయలే... ఉరితాడైంది

పెదకూరపాడు: ఊయల ఉరితాడై ప్రాణాలు తీసిన సంఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం మూసాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పెదకూరపాడు ఎస్సై గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాటిబండ్ల వీరయ్య (57) గత నెల 24న రాత్రి 8:30 గంటల సమయంలో మద్యం తాగి తన కుమార్తె కూచిపూడి నిర్మల ఇంటికి నిద్రించేందుకు వెళ్తున్న సమయంలో పిల్లల కోసం చెట్టుకు కట్టి ఉంచిన ఊయలపై పడ్డాడు. మెడకు చీర చుట్టుకోవడంతో అపస్మారక స్థితికి చేరాడు. వీరయ్య భార్య అన్నమ్మ అటువైపుగా వస్తూ వీరయ్యను చూసి కేకలు వేయడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు వచ్చి 108 వాహనంలో వీరయ్యను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం వీరయ్య మృతి చెందాడు. వీరయ్య కుమారుడు పాటిబండ్ల వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనాల కొనుగోళ్లు ఢమాల్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వాహనాల కొనుగోళ్లు తగ్గడంతో రవాణా రంగం ద్వారా వచ్చే ఆదాయం తగ్గింది. గత ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు రవాణా, రవాణేతర వాహనాలు 3,02,758 కొనుగోళ్లు జరిగాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు రవాణా, రవాణేతర వాహనాలు 2,77,325 మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 25,433 వాహనాల కొనుగోళ్లు తగ్గినట్లు స్పష్టం అవుతోంది. మోటార్ సైకిళ్లతో పాటు కార్ల కొనుగోళ్లు తగ్గిపోయాయి. సాధారణంగా ఏటా వాహనాల కొనుగోళ్లు పెరుగుతాయి. అయితే రాష్ట్రంలో అందుకు పూర్తి విరుద్ధంగా గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది అన్ని రకాల వాహనాల కొనుగోళ్లు తగ్గిపోవడం గమనార్హం. వాహనాల కొనుగోళ్లు తగ్గడంతో రవాణా రంగం ద్వారా వచ్చే ఆదాయం కూడా గత ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు పోల్చితే ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు రవాణా ఆదాయం రూ.276 కోట్లు తగ్గింది. గత ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు రవాణా ఆదాయం రూ.1699 కోట్లు వస్తే ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు రూ.1423 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు కొనుగోళ్లు తగ్గుతున్నాయంటే ప్రజలు వ్యక్తిగత వాహనాలు కొనుగోళ్లు చేయడం లేదని స్పష్టం అవుతోంది. పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడుల్లో రవాణా ఆదాయం పెరుగుతుండగా రాష్ట్రంలో ఆదాయం తక్కువగా వస్తోంది. ఈ విషయాన్ని ఇటీవల సమీక్షలో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలో రవాణా ఆదాయం తగ్గడానికి గల కారణాలను అన్వేషించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు.

పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు ఎస్జీటీలకే ఇవ్వాలి: ఆప్టా

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల బదిలీల్లో సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్లను ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా నియమించడం సరైన నిర్ణయం కాదని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) తెలిపింది. ఈ విధానంతో సెకండరీ గ్రేడ్ టీచర్లకున్న పదోన్నతుల అవకాశాలు పోతాయన్నారు. సీనియర్ ఎస్జీటీలకు పదోన్నతులిచ్చి ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు(పీఎస్ హెచ్ఎం)గా నియమించాలని డిమాండ్ చేసింది. స్కూల్ అసిస్టెంట్ల సేవలను ఉన్నత పాఠశాల లేదా ప్రాథమికోన్నత పాఠశాలలో బోధనకు వినియోగించుకోవడమే ఉత్తమ మార్గమని సూచించింది. వీరిని ప్రాథమిక పాఠశాలల విభాగంలో నియమించడాన్ని అంగీకరించబోమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు పేర్కొన్నారు.

ఏడాదయినా.. ఎగరని కిసాన్ డ్రోన్



2024-25లో 875 కిసాన్ డ్రోన్స్ పంపిణీ లక్ష్యం

సీజన్ ముగిసినా ఒక్కటీ ఇవ్వని దుస్థితి

గత ప్రభుత్వంలోని సీహెచ్‌సీలను పక్కనపెట్టి కూటమి కార్యకర్తలతో కొత్త కమిటీల నియామకం

17 సంస్థలు ముందుకొచ్చినా 15 తిరస్కరణ

2 కంపెనీలతో ఎంప్యానెల్.. అయినా పట్టాలెక్కని ప్రాజెక్టు

తొలి ఏడాది తుస్.. మలి ఏడాదిలో రెట్టింపు టార్గెట్

2025-26లో ఏకంగా 1515 డ్రోన్స్ ఇవ్వాలని లక్ష్యం

నమో డ్రోన్ దీదీ పథకాన్నీ ఖాతాలో వేసుకునే ఎత్తు

అంతన్నారు.. ఇంతన్నారే అన్నట్టుగా ఉంది కూటమి ప్రభుత్వంలో కిసాన్ డ్రోన్ ప్రాజెక్టు పరిస్థితి. పగ్గాలు చేపట్టి ఏడాదైనా కూటమి డ్రోన్స్ ఎగరనంటున్నాయి. గతంలోనే డ్రోన్ పైలట్ల శిక్షణ ఇచ్చారు. రైతు కమిటీలను సిద్ధం చేశారు. కానీ, ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో కిసాన్ డ్రోన్స్ అడుగు ముందుకుపడలేదు. తొలి ఏడాది విఫలమైనప్పటికీ రెండో ఏడాది రెట్టింపు టార్గెట్ పెట్టుకోవడం విస్మయానికి గురిచేస్తోంది.

రైతు సేవా కేంద్రాల (పూర్వపు రైతు భరోసా కేంద్రాలు)కు అనుబంధంగా కస్టమ్ హైరింగ్ సెంటర్స్ (సీహెచ్‌సీ)కు కిసాన్ డ్రోన్స్‌ను పంపిణీ చేయాలని గత వైఎస్ జగన్ ప్రభుత్వం సంకల్పించింది. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి 596 మండలాల్లో 1,755 ఆర్బీకేలను ఎంపిక చేసింది. యూనిట్ రూ.10 లక్షల అంచనాతో రూ.85 కోట్లు సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు. డ్రోన్స్ నిర్వహణకు నలుగురు లేదా ఐదుగురు రైతులతో సీహెచ్‌సీలను సైతం ఏర్పాటు చేసి, వారిలో అర్హులైన 676 మందికి ఏన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఏపీ సెన్సార్ అండ్ స్మార్ట్ అప్లికేషన్స్ రీసెర్చ్ ఇన్ అగ్రికల్చర్ (అప్సరా) ద్వారా పైలట్లుగా శిక్షణ ఇచ్చారు. డీజీసీఏ సర్టిఫైడ్ డ్రోన్స్ ఎంపిక, తయారీదారులతో ఎంప్యానల్ కోసం రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీని సైతం ఏర్పాటు చేశారు. సరిగ్గా.. కంపెనీ ఎంపిక సమయంలో పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై గడిచిన రబీ సీజన్‌కు ముందుగానే కిసాన్ డ్రోన్స్ ఎగరవేస్తామంటూ గొప్పలు చెప్పింది. తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ మేరకు బడాయి పోయింది. డ్రోన్ సమ్మిట్‌లో సైతం కిసాన్ డ్రోన్స్‌పై ఊదరగొట్టారు.

– సాక్షి, అమరావతి

లక్ష్యానికి దూరంగా..

ఆర్‌కేవీవై–ఎఫ్‌పీఆర్ 2024-25లో సబ్సిడీ కింద రూ.80 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది. డీజీసీఏ ధ్రువీకరించిన హెక్సా కాప్టర్ మోడల్ డ్రోన్స్ (కనీసం 30 కేజీల బరువుతో)ను ఎంపిక చేయాలని రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ (ఎస్ఎల్‌టీసీ) సిఫార్సు చేసింది. కనీసం 20 ఎకరాల విస్తీర్ణంలో పంటకు ఒకేసారి పిచికారీ చేయగల బ్యాటరీ సామర్థ్యం ఉన్నవాటిని మాత్రమే ఎంపిక చేయాలని ప్రతిపాదించారు.

17 కంపెనీలు 23 మోడల్స్‌ను ప్రదర్శించగా, క్షేత్రస్థాయి పరిశీలనలో 15 కంపెనీలకు చెందిన 19 మోడల్స్‌ను డీజీసీఏ ప్రమాణాల సాకుతో తిరస్కరించారు. కేవలం విహంగ టెక్నాలజీస్, డ్రోగో డ్రోన్స్ కంపెనీలను ఎంపిక చేయడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు గతంలో రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేసిన సీహెచ్‌సీలను పక్కనపెట్టి కూటమి రైతుల (సాగుకు దూరంగా ఉన్నవారితో) కమిటీలు ఏర్పాటు చేశారు. 80% సబ్సిడీ అని గొప్పలు చెప్పిన ప్రభుత్వం తొలుత 100% రైతు కమిటీలే భరించాలని, యూనిట్ గ్రౌండింగ్ తర్వాత సబ్సిడీని విడతల వారీగా జమ చేస్తామని ప్రకటించడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

ఏడాది పాటు ఇదిగో ఇచ్చేస్తున్నాం.. అదిగో ఇచ్చేస్తున్నామంటూ కాలయాపన తప్ప ఒక్క డ్రోన్ కూడా పొలాల్లో ఎగురవేయలేని దుస్థితిలో ఉన్న కూటమి ప్రభుత్వం ఈ ఏడాది (2025-26)లో భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవడం గమనార్హం.

నిరుడు 875 కిసాన్ డ్రోన్స్‌లో ఒక్కటీ ఇవ్వలేకున్నా.. ఈసారి దాదాపు రెట్టింపుగా 1,515 డ్రోన్స్ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. రైతు సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 80 శాతం సబ్సిడీపై వెయ్యి, వ్యవసాయ పట్టభద్రులకు 50 శాతం సబ్సిడీపై 75 కిసాన్ డ్రోన్లు ఇవ్వాలని సంకల్పించారు. ఇందుకోసం రూ.83.75 కోట్లు రాయితీగా ఖర్చు చేయనున్నట్టు చెబుతున్నారు.

నమో డ్రోన్‌నూ ఖాతాలో వేసుకునే ఎత్తు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటికే డ్రోన్ ప్రాజెక్టు అమలులో విఫలమైంది. కొత్తగా భారీగా ఇస్తామని చెబుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నమో డ్రోన్ దీదీ' పథకంపై కన్నేసింది. దీని ద్వారా మహిళా సంఘాలకు 80 శాతం రాయితీపై ఇవ్వబోతున్న 440 డ్రోన్లను కూడా తన ఖాతాలో వేసుకునేందుకు ఎత్తు వేస్తోంది.

మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఐదు జిల్లాలకు చెందిన మహిళా శిశు సంక్షేమ సాధికార (డీడబ్ల్యూసీడబ్ల్యూఈఓ) అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారి పేరు	ప్రస్తుత జిల్లా	కొత్త పోస్టింగ్ జిల్లా
ఎన్.సూర్యలక్ష్మి	ఏఎస్సార్	అనకాపల్లి
బి.సుజాతరాణి	పశ్చిమగోదావరి	ఏలూరు
డి.శ్రీలక్ష్మి	ఎన్టీఆర్	పశ్చిమగోదావరి
ఎస్.సువర్ణ	ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు	ప్రకాశం
బి.హేన్నా సుజన్	ప్రకాశం	ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు

వసూల్ రాజాగా మారిన సర్వేయర్

ఫిర్యాదుల నేపథ్యంలో పరార్

సాక్షి టాస్క్ ఫోర్స్: ఒక విలేజ్ సర్వేయర్ తన పదవిని దుర్వినియోగం చేసి, పెద్ద ఎత్తున అక్రమంగా డబ్బులు వసూలు చేసి పరారైన ఘటన చిత్తూరు జిల్లాలో వెలుగులోకి వచ్చింది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం, చిత్తూరు మండలంలోని ఓ సచివాలయ పరిధిలో ఒక సర్వేయర్.. సర్వే సమస్యలు ఉన్నవారిని నమ్మించి, వాటిని పరిష్కరిస్తానని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ.80 వేల వరకు వసూలు చేశాడు. గ్రామంలో మొత్తం రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. చివరకు ఎవరికీ పనులు జరగకపోవడంతో ఓ బాధితుడు ఫోన్‌పే ద్వారా పంపిన డబ్బుల ఆధారంగా ఇతర బాధితుల వివరాలు కూడా సేకరించి అధికారులకు ఫిర్యాదు చేశాడు. డబ్బులు తీసుకున్నట్టు నిర్ధారణ కావడంతో సర్వేయర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. అయితే అప్పటికే సర్వేయర్ పరారీలో ఉండడంతో అధికారులు వాట్సాప్ ద్వారా నోటీసులు పంపినట్టు తెలుస్తోంది. కాగా, ఇదంతా ముందే తెలిసినా, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా విస్మరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అధికారులు సర్వేయర్‌కు పరారీలో ఉండమని సూచించారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

కాఫీ రైతులతోనూ చెలగాటం

అంతర్జాతీయ మార్కెట్‌లో మన్యం కాఫీకి మంచి డిమాండ్ ఉన్నా, గిరిజన రైతులకు జీసీసీ గిట్టుబాటు ధర కల్పించలేకపోయింది. ఈ విషయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రైవేట్ వ్యాపారులకు ధీటుగా నిలవలేకపోయింది. దీంతో ఈ సంస్థకు విక్రయించిన రైతుల ఆర్థికపరిస్థితి దయనీయంగా మారింది.

- గిట్టుబాటు ధర కల్పించలేని గిరిజన సహకార సంస్థ
- ప్రైవేట్‌తో పోటీపడలేక లక్ష్యసాధనలో వెనుకబాటు
- రెండు వేలకు 752 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు
- పాచ్‌మెంట్‌కు జీసీసీ ధర రూ.400
- వ్యాపారుల ధర రూ.500
- ఆర్థికంగా నష్టపోయిన గిరి రైతులు



కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్న జీసీసీ సిబ్బంది (ఫైల్)

సాక్షి, పాడేరు: ఈ ఏడాది మన్యం కాఫీకి అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ధరలు కూడా లాభదాయకంగా ఉన్నాయి. అయితే అందుకు తగ్గట్టుగా గిట్టుబాటు ధరతో మన్యంలో కాఫీ గింజలను కొనుగోలు చేయాల్సిన జీసీసీ కూడా ప్రైవేట్ సంస్థలాగే వ్యవహరించింది. ప్రైవేట్ వ్యాపారులతో జీసీసీ పోటీ పడలేకే పోయింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సంతల్లో ప్రైవేట్ వ్యాపారులంతా పాచ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.500కు మించి కొనుగోలు చేశారు. జీసీసీ మాత్రం కిలో రూ.400 ధర మాత్రమే చెల్లించింది. దీంతో గిరిజన రైతులంతా ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకున్నారు.

ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నా




జీసీసీ కాఫీ కొనుగోలుకు తక్కువ ధర చెల్లించడం వల్ల కాఫీ రైతులు ప్రైవేట్ సంస్థలు, వ్యాపారులకు అమ్ముకున్నారు. గతంలో జీసీసీకు అమ్మిన రైతులు కూడా ఈ ఏడాది జీసీసీని నమ్మలేదు. పాచ్‌మెంట్, చెర్రీ గుల్ల కాఫీ గింజలకు మార్కెట్‌లో అధిక ధరలు పలకగా, జీసీసీ మాత్రం తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకుని మంచి ఆదాయం పొందా.

– పాలికి లక్కు, కాఫీ రైతులు సంక్షేమ సంఘ ప్రతినిధి, గుర్రగరువు, పాడేరు మండలం



పాచ్‌మెంట్ కాఫీ గింజలు



చెర్రీ గుల్ల రకం కాఫీ గింజలు

సిబ్బంది రంగంలోకి దిగినా..

ఏజెన్సీలో 1.56 లక్షల ఎకరాల్లో కాఫీతోటలు ఉన్నాయి. ఏటా 15వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను గిరిజన రైతులు మార్కెటింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గిరిజన సహకార సంస్థ ఈ ఏడాది రెండు వేల మెట్రిక్ టన్నుల పాచ్‌మెంట్ కాఫీ గింజల సేకరణ లక్ష్యంతో గత ఏడాది డిసెంబర్‌లో కొనుగోలు ప్రారంభించింది. జీసీసీ సిబ్బంది అంతా గిరిజన గ్రామాల్లో ఇంటింటా తిరిగినప్పటికీ కొనుగోలుకు సంబంధించి అనుకున్న లక్ష్యాలను సాధించలేక పోయింది. రెండు వేల టన్నుల లక్ష్యంలో 752 మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను మాత్రమే కొనుగోలు చేసింది. వీటిలో పాచ్‌మెంట్ గింజలు 132 కిలోలకు పరిమితమైంది. మిగిలిన 620 కిలోలు చెర్రీ రకాన్ని కిలో రూ.330తో జీసీసీ కొనుగోలు చేసింది. ఇదే చెర్రీ రకం గుల్ల కాఫీ గింజలను ప్రైవేట్ వ్యాపారులు కిలోకు రూ.400కు పైగా చెల్లించి కొనుగోలు చేశారు.

వ్యాపారంలో వెనుకబాటు

గత నెలలో కాఫీ గింజల సీజన్ ముగిసినప్పటికీ జీసీసీ మాత్రం కాఫీ వ్యాపారంలో బాగా వెనుకబడింది. జీసీసీ తక్కువ ధర చెల్లించడంతో కాఫీ రైతులు సీజన్ చివరిలో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి మంచి ఆదాయం పొందారు. ఈ సంస్థకు సీజన్ ప్రారంభంలో అమ్ముకున్న రైతులు ఆదాయపరంగా నష్టపోయారు. జీసీసీ కూడా దళారి వ్యవస్థ మాదిరిగానే తమ పట్ల వ్యవహరించిందని గిరిజన రైతుల నుంచి విమర్శలు ఎదుర్కొంది. బెంగళూరు మార్కెట్‌లో పాచ్‌మెంట్ కాఫీ గింజలు కిలో రూ.550 ధరకు అమ్మకాలు జరిగినప్పటికీ జీసీసీ మాత్రం కాఫీ గింజల కొనుగోలు ధరను పెంచకపోవడం వల్ల గిరిజన రైతులు ప్రైవేట్ వైపే మొగ్గు చూపారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 78, 031 మంది స్వామి వారిని దర్శించుకోగా 32,936 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.46 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

ఆరంభం.. బ్రహ్మోత్సవం



తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో వైభవంగా ఆరంభమయ్యాయి. ముందుగా స్వామివారు, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి మాడ వీధుల్లో విహరించారు. ఉదయం 7.02 నుంచి 7.20 గంటల నడుమ మిథున లగ్నంలో గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటం ప్రతిష్ఠించారు. అనంతరం శాస్త్రోక్తంగా శ్రీవారి ఆస్థానం చేపట్టారు. తొలి రోజు రాత్రి స్వామి వారు పెద్దశేషవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

నేటి నుంచి కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్న ఆలయ క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలను ఈ నెల 3 నుంచి 5 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచన, రుత్విగ్వరణ, పంచగవ్య ప్రాసన, దీక్షాధారణ, అంకురార్పణలు జరుగనున్నాయి. 4న ఉదయం సర్వతో భద్ర మండలి ఆరాధన, మూల మంత్ర అనుష్టానం, హోమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల ఆఖరి రోజైన 5న ఉదయం మూల వరుల ఉత్సవ మూర్తికి నవకలశ స్నపన, శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ, హోమాలు, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం, పండిత సత్కారం కార్యక్రమాలు జరుగుతాయని ఈఓ తెలిపారు.

వేదిక్‌లో పలు కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం


తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు కోర్సులకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ (శాస్త్రి), ఎంఏ (ఆచార్య), పీహెచ్‌డీ, సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు అర్హత, దరఖాస్తు వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల తెలియజేశారు.

ఆగమ సలహాదారుగా వేదిక్ ఆచార్యులు



తిరుపతి సిటీ: టీటీడీ వైఖానస ఆగమ సలహాదారులుగా ఎస్వీ వేదిక్ వర్సిటీ వైఖానస విభాగ సహాయ ఆచార్యులు డీఆర్ పరాశరం భావనారాయణ నియమితులయ్యారు. వర్సిటీలో సోమవారం రిజిస్ట్రార్ డాక్టర్ పి.భాస్కరుడు ఆయన్ను అభినందించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు




నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల 11వ సీనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్- 2025 పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. రన్నర్స్ స్థానంలో కర్నూలు జిల్లా నిలిచింది. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన ఈ పోటీలలో పురుషుల వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను ఎం.శరత్ (ఎన్టీఆర్ జిల్లా) సాధించగా, మహిళల విభాగంలో సన్వి కొంగర, యు.ప్రేమాంమృత (ఎన్టీఆర్ జిల్లా) సంయుక్తంగా వ్యక్తిగత చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు.



ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ (ఈసీటీ)

సినిమాల్లో ఈ థెరపీని భయంకరంగా చూపిస్తారు. ఎవరినైనా హింసించడానికి దాన్ని వాడుకుంటున్నట్టుగా చూపుతారు. అంతేకాదు... కొన్ని హాస్య సన్నివేశాల్లోనూ నవ్వించడానికీ దాంతో కామెడీ యాక్టర్లకు షాక్ ఇస్తున్నట్టు చూపి, నవ్వు తెప్పించడానికి వాడతారు. ఇక వార్తా కథనాల్లో ఎదుటి పార్టీవారికీ, ప్రత్యర్థులకు షాక్ ఇచ్చినప్పుడు **'షాక్ ట్రీట్‌మెంట్'** అనే పదాన్ని విచ్చలవిడిగా వాడుతుంటారు. అలా దానిపై ఎన్నో అనుమానాలూ, అపోహలూ కల్పిస్తారు. కానీ నిజానికి **అదో మంచి ట్రీట్‌మెంట్.** బాధితులకు షాక్ తగినట్లుగా తెలియనివ్వని చికిత్స. మరెంతో మందికి మానసిక చికిత్సల కోసం, అనేక మందికి **ప్రాణరక్షణ కోసం వాడే థెరపీ.** దాదాపు ఎనిమిది దశాబ్దాల నుంచి అనేక మందికి ప్రాణరక్షణ ఇచ్చిన చికిత్సా ప్రక్రియ. ఎంతో మందిని రక్షించిన ఆ చికిత్స పేరే ఎలక్ట్రిక్ షాక్ ట్రీట్‌మెంట్. వైద్య పరిభాషలో **'ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ'** అని పిలుస్తూ సంక్షిప్తంగా **'ఈసీటీ'** అనే ఈ చికిత్సపై ఉండే అపోహలూ, అపార్థాలు తొలగించి, ఈ చికిత్స ప్రక్రియపై మంచి అవగాహన కల్పించేందుకే ఈ కథనం.



ఫియర్ లెస్ 'పవర్'ఫుల్



డాక్టర్ శ్రీనివాస్ ఎస్ఆర్ఆర్‌వై
హెచ్‌వోడీ ఆఫ్ సైకియాట్రీ & సీనియర్ సైకియాట్రిస్ట్
ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రి, వరంగల్

సినిమాల్లో, అలాగే కొన్ని టీవీ సీరియల్స్‌లో ఎంతగానో భయంగొలిపేలా చూపే ఈ షాక్ ట్రీట్‌మెంట్ నిజజీవితంలో ఎంత మాత్రమూ భయం గొలిపే చికిత్స కాదు. దీనిపై ఎంతగా అపార్థాలు నెలకొన్నాయంటే బాధితుడికి ఎలక్ట్రిక్ షాక్ ఇవ్వాలంటూ డాక్టర్లు చెబితే... అతడి బంధువులూ, స్నేహితులూ ఆందోళనకు గురయ్యేంతగా ఇది అపోహలకు గురయ్యింది. కొన్ని రకాల మానసిక సమస్యలతో బాధపడుతున్న అనేకమందిని తిరిగి సాధారణ స్థితికి రావడానికి 'ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ' ఎంతగానో ఉపయోగపడింది. ప్రతి ఏటా దాదాపు లక్షల సంఖ్యలోని బాధితులకు వారి సమస్యలను నయం చేస్తూ, అనేక రకాలుగా స్వస్థత చేకూర్చే ఈ చికిత్స ప్రక్రియ అందుబాటులోకి రావడమూ చాలా నాటకీయంగా జరిగింది. అది సివియర్ డిప్రెషన్, కెటటోనియా లాంటి ఎన్ని రకాల సమస్యలనుంచి విముక్తి కల్పిస్తుందనే విషయంతో పాటు అసలు అది ఓ చికిత్సగా ఆవిర్భవించిన తీరుతెన్నులూ... ఈ విశేషాలన్నింటి గురించీ తెలుసుకుందాం...

షాక్ ట్రీట్‌మెంట్ ఓ చికిత్సగా ఆవిర్భవించిన తీరిది...

అసలు కరెంటు షాక్ ద్వారా కొన్ని మానసిక వ్యాధులను నయం చేయవచ్చని ఎలా తెలిసిందన్నదే అబ్బురాన్ని కలిగించే విషయం. తొలుత 1934లో డాక్టర్ మెడూనా అనే శాస్త్రవేత్త మానసిక సమస్యలు ఉన్న బాధితులకు క్యాంఫర్‌ను ఇంజెక్షన్ రూపంలో ఇచ్చాడు. అలా ఇవ్వడం ద్వారా బాధితుడికి మూర్ఛ (ఫిట్స్ / కన్వల్సెన్స్)ను కలిగించి, మానసిక సమస్యలను నయం చేయడానికి ప్రయత్నించాడు.

సైకోసిక్ సమస్యలున్న వారికి మూర్ఛలు కలిగిస్తే లక్షణాలు మాయం

సైకోసిస్ అనే మానసిక సమస్యతో బాధపడేవారికి మూర్ఛలు (ఫిట్స్ లాంటివి) వచ్చేలా చేసినప్పుడు వారి మానసిక లక్షణాలు తగ్గడం గమనించాడు డాక్టర్ మెడూనా. అలా ఫిట్స్ వచ్చేలా చేయడం వల్ల సైకోసిస్ తగ్గుతుందని మెడునా తెలుసుకున్న తర్వాత తొలుత క్యాంఫర్ సహాయంతో ఆ పరిస్థితిని కలిగేలా చేయడం ద్వారా సైకోసిస్‌కు చికిత్స అందించాడు. అలా చేయడం వల్ల 13 మందికి వ్యాధి పూర్తిగా నయమైంది.

అయితే క్యాంఫర్ వల్ల కొన్ని దుష్ప్రభావాలు కలుగుతున్నాయని తెలుసుకున్న తర్వాత, ఇతరత్రా పద్ధతులు లేదా ప్రక్రియల ద్వారా ఫిట్స్ వచ్చేలా చేయడానికి పరిశోధకులు కొన్ని ప్రయత్నాలు చేశారు. ఇలాంటి ప్రయత్నాల్లో భాగంగానే 'ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ' లేదా కరెంట్ షాక్ లేదా ఎలక్ట్రిక్ షాక్‌తో చికిత్స చేయడం మొదలు పెట్టారు.

ఇక 1938లో బీనీ, సెరెలెట్టీ అనే శాస్త్రవేత్తలు చాలా పరిమిత ఓల్టేజీలో కరెంట్‌ను పంపడం ద్వారా మూర్ఛలు కలిగించవచ్చని కనుగొన్నారు. తలకు రెండువైపులా రెండు ఎలక్ట్రోడ్స్‌ను ఉపయోగించి షాక్ ఇచ్చినప్పుడు దాని ప్రభావం మెదడుపై మాత్రమే ఉండటం, ఎలక్ట్రిక్ తరంగాల సహాయంతో స్పందనలు కలిగే గుండె లేదా ఇతర అవయవాలపై వాటి దుష్ప్రభావం లేకపోవడాన్ని వారు పరిశోధనల్లో చూశారు. అంతేగాక... 1940 ప్రాంతాలలో సైకోసిస్ వంటి మానసిక సమస్యలకు ఇతరత్రా మందులు లేకపోవడంతో ఈ ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ – ఈసీటీని విరివిగా వాడారు.

ఇప్పుడు మరింత సమర్థంగా మాడిఫైడ్ ఈసీటీ రూపంలో ...

ఇటీవల పెరిగిన వైద్యవిజ్ఞానంతో చాలా తక్కువ డోసులో మత్తు మందుతో పాటు తక్కువ మోతాదులో కరెంట్ ఇవ్వడం ఆధునిక మాడిఫైడ్ ఈసీటీలో జరుగుతుంది.

శాస్త్రవిజ్ఞానం ఎంతో పెరిగిన ఇటీవల కాలంలో బాధితులకు ఇప్పుడు మత్తు కూడా చాలా తక్కువ మోతాదులో (షార్ట్ యాక్టింగ్) అలాగే చాలా సురక్షితంగా కూడా ఇస్తున్నారు. కండరాలుకు తగినంత విశ్రాంతి కలిగించే మందులు ఇవ్వడం ద్వారా ఎలక్ట్రో కన్వల్సివ్ చికిత్స (ఈసీటీ) చేయడం జరుగుతుంది. ఇందులో బాధితులకు తమకు కరెంట్ షాక్ ఇస్తున్న విషయమూ తెలికుండానే... వారికి అసలేమీ జరగదలేదని అనిపించేలా... కేవలం 15 నుంచి 20 నిమిషాల్లో ఈ ప్రక్రియను పూర్తిచేయడం సాధ్యమవుతోంది. నిద్రలోకి వెళ్లి మళ్లీ లేచినప్పుడు మాత్రమే బాధితులకు తమకేదో చికిత్స చేశారనే విషయం తెలుస్తుందిగానీ.... ఇందులో నిజానికి ఎలాంటి బాధా ఉండదు.

ఈసీటీ ఇచ్చిన తర్వాత సుమారు 2 గంటల పాటు వైద్యులు సదరు మానసిక సమస్యల బాధితుల్ని తమ పర్యవేక్షణలోనే ఉంచుకుని (తాము వాడిన మందుల ప్రభావం తగ్గేంతవరకు) ఆ తర్వాత ఇంటికి పంపిస్తారు. అంటే ఈసీటీకి ప్రస్తుతం అత్యంత సులువైన, ప్రమాదరహితమైన ఔట్‌పేషెంట్ పద్ధతిలోనే చికిత్స జరుగుతుందన్న మాట.

ఎలక్ట్రో కన్వల్సివ్ ప్రక్రియ (ఈసీటీ) ఎలా పని చేస్తుందంటే...

మన సమాజంలో నిజానికి మానసిక సమస్యలు వాటి కారణాలు గురించి చాలా తక్కువ అవగాహనే ఉంది. ఇప్పటికీ చాలా కుటుంబాల్లోని సభ్యులకు ఏదైనా మానసిక సమస్య ఉందంటే... వారు దాన్ని బయటకు చెప్పడానికి ఇష్టపడరు. చాలా గోప్యంగా ఉంచడానికే మొగ్గుచూపుతారు. ఇది సరైన పద్ధతి కాకపోయినా... దురదృష్టవశాత్తు ఇంకా ఇప్పటికీ ఇలాంటి ఆలోచన ధోరణే ప్రజల్లో / సమాజంలో కొనసాగుతోంది.

నిజానికి మన దేహంలో ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానానికి ఇంకా పూర్తి స్థాయిలో అంతుచిక్కనిదీ లేదా చాలా తక్కువగా తెలిసిన విషయం ఏదైనా ఉందంటే అది మన మెదడు గురించే. మెదడు నిర్మాణం, జీవక్రియలూ అత్యంత సంక్లిష్టంగా ఉండటం వల్ల ఇలా జరుగుతూ... ఈ అంశం మన మెదడు తాలూకు సంక్లిష్టతను తెలియజేస్తుంది. అందుకే మానసిక సమస్యల తాలూకు కారణాలు తెలుసుకోవడం చాలా సంక్లిష్టమైన కఠినమైన విషయంగా మారింది. ఇప్పుడిప్పుడు మెదడుకు సంబంధించిన చాలా రహస్యాలు మెల్లమెల్లగా తెలిసివస్తున్నాయి.

ఈసీటీ ప్రక్రియ... మెదడులోని అనేక స్థాయుల్లో చాలారకాల మాలిక్యులార్ బయోకెమికల్, ఎండోక్రైన్, స్ట్రక్చరల్, జెనెటిక్ మార్పులను కలగజేస్తుంది. తద్వారా ఈ ప్రక్రియ వ్యాధిని నయం చేయడానికి కారణమవుతోంది.

ఎంత సేఫ్ అంటే...

నిజానికి ఈసీటీ చికిత్స ఎంత సురక్షితమైనదో చెప్పడానికి తార్కాణమేమిటంటే... గర్భవతుల్లో (ప్రెగ్నెన్సీలో) అలాగే ప్రసవం అయ్యాక కొత్తగా తల్లులైన మహిళల్లో వచ్చే పోస్ట్‌పార్టమ్ సైకోసిస్‌కు చికిత్స ఇచ్చేటప్పుడు ఆ బాలెంతకూ... అంతేకాదు... గర్భంలో ఉన్న శిశువుకు సైతం ఈసీటీ అనేది చాలా సురక్షితమైన ప్రక్రియ అని తేలింది. ఈ నేపథ్యంలో సమాజంలో ఈ చికిత్సపై ఉన్న అపోహలు తొలగించుకోవం అన్నది ఎంతో ముఖ్యమైన విషయం.



ఈసీటీతో ఏయే సమస్యలు ఉన్నవారికి చికిత్స అందిస్తారంటే...

- తీవ్రమైన వ్యాకులత, కుంగుబాటు (డిప్రెషన్) వంటి సమస్యలు ఉన్నవారికి.
- ఆత్మహత్య చేసుకోవాలని తీవ్రంగా అనుకుంటున్నవారికీ, ఆత్మహత్యలకు ప్రయత్నించేవారికీ (సూసైడల్ టెండెన్సీస్ ఉన్నవారికీ) ఆహారాన్ని తిరస్కరించేవారికి.
- బైపోలార్ డిప్రెషన్ ఉన్న బాధితులకు
- మందులతో పైన పేర్కొన్న వ్యాధులు నయం కాని సందర్భాల్లో...
- స్కిజోఫ్రీనియా వంటి మానసిక సమస్యలు ఉన్న వారికి.
- కెటటోనియా అనే మానసిక సమస్యలో (ఈ పరిస్థితిలో బాధితులు పూర్తిగా ఓ శిలాప్రతిమలా బిగుసుకుని ఉండిపోతారు. నిజానికి ఈ స్థితి అనేక మానసిక వ్యాధుల కారణంగా కలుగుతుంది. కెటటోనియా స్థితి నుంచి బాధితులను మామూలు స్థితికి తీసుకురావడానికి షాక్‌థెరపీ బాగా ఉపయోగపడుతుంది.

తొలినాళ్లలో కాస్త ముతకగా... ఆ తర్వాత మెరుగ్గా

తొలినాళ్లలో బాధితులకు మత్తు మందు ఇవ్వకుండానే ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ (ఈసీటీ)ని ఇచ్చేవారు. దాంతో బాధితుల్లో మూర్ఛలు కలిగినప్పుడు వారికి గాయాలు కావడం, ఒళ్లు నొప్పులు రావడం, ఎముకలు గాడితప్పడం (డిస్ లొకేట్ కావడం), ముఖ్యంగా దవడ ఎముక (జా డిజ్‌లొకేషన్) వంటివి ఎక్కువగా కనిపించేవి. అయితే తొలిసారిగా 1940లో బెనెట్ అనే శాస్త్రవేత్త మత్తుమందు ఇచ్చి ఈ చికిత్స ఇవ్వడం వల్ల పైన పేర్కొన్న సమస్యలేవీ రావనీ, దాంతో కొద్దిగా మత్తు ఇవ్వడం ద్వారా ఇతరత్రా సమస్యలేమీ లేకుండా చాలా సురక్షితంగా ఈ చికిత్సను అందించడం సాధ్యమేనని కనుగొన్నాడు.

ఈసీటీపై అపోహలూ వాస్తవాలు

✗ అపోహ
ఈసీటీ ప్రక్రియ మెదడును గాయపరుస్తుంది.

✓ **వాస్తవం :** ఈసీటీ వల్ల మెదడు నిర్మాణానికి గానీ, లేదా ఇతరత్రాగానీ ఎలాంటి గాయాలూ కావనీ, మెదడులో ఏ రకమైన ప్రమాదకరమైన మార్పులూ కలగవంటూ అనేక పరిశోధనల్లో స్పష్టంగా తేలింది.

✗ అపోహ
ఈసీటీ వల్ల మతిమరపు వస్తుంది.

✓ **వాస్తవం :** ఈసీటీ వల్ల బాధితుల జ్ఞాపకశక్తిపై దాదాపుగా ఎలాంటి ప్రభావమూ పడదని చెప్పవచ్చు. ఒకవేళ పడినా అది చాలా చాలా తక్కువ. ఈసీటీ ఇచ్చే ముందు తాత్కాలికంగా ఇచ్చే మందు మోతాదు కూడా చాలా తక్కువ. అయితే ఈ మత్తు నుంచి బయటకు వచ్చే ముందర బాధితుల్లో కాస్త అయోమయ స్థితి కనిపించవచ్చు. ఇదే ఇలాంటి దురభిప్రాయానికి కారణమవుతోంది. అంతేతప్ప జ్ఞాపకశక్తి పూర్తిగా తగ్గదు. అయితే చాలా కొద్దిమందిలో మాత్రం ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చినప్పుడు తాత్కాలికంగా జ్ఞాపకశక్తి తగ్గినప్పటికీ అది కేవలం ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు మాత్రమే. ఈసీటీ వల్ల శాశ్వతమైన జ్ఞాపకశక్తి లోపం దాదాపుగా ఉండదనే చెప్పవచ్చు.

✗ అపోహ: ఈసీటీ వల్ల మెదడులోనికి ఒక్కోసారి ప్రమాదకరమైన రీతిలో కరెంట్ ప్రవహించవచ్చు.

✓ **వాస్తవం :** ఇది పూర్తిగా అవాస్తవం. అప్పుడున్న అత్యాధునిక పరికరాల వల్ల కరెంట్ ఇచ్చే ప్రక్రియ పూర్తిగా సురక్షితం. దాంతో ఇది పూర్తిగా ప్రమాదరహితమైన వైద్యం ప్రక్రియ అని చెప్పవచ్చు. పైగా ఈసీటీలకు వాడే వోల్టేజీ కూడా చాలా తక్కువ.

✗ అపోహ: ఈసీటీకి వల్ల మెదడు దెబ్బతిని కొన్ని మానసిక వ్యాధులు రావచ్చు.

✓ **వాస్తవం :** ఇది పూర్తిగా అవాస్తవం. ఈసీటీతో కొన్ని మానసిక సమస్యలు తగ్గడమే తప్ప కొత్తగా ఎలాంటి మానసిక వ్యాధులూ రావని స్పష్టంగా చెప్పవచ్చు.

✗ అపోహ: కరెంట్ షాక్ ఇస్తారు కాబట్టి ఇది చాలా ప్రమాదకరమైనది.

✓ **వాస్తవం :** ఇది పూర్తిగా ప్రమాదరహితం. అయితే ఎలక్ట్రో కన్వల్సివ్ ట్రీట్‌మెంట్‌లో ఇచ్చే మత్తుమందు (అనస్థీషియా) వల్ల ఇతరత్రా శస్త్రచికిత్సలో ఉండే రిస్క్ మాత్రమే ఇందులోనూ ఉంటుంది. అంతేతప్ప ఇందులో ఎలాంటి అదనపు ముప్పూ ఉండదు.

అయితే అనస్థీషియా ఇచ్చేందుకు ఇతరత్రా జబ్బుల్లో ఇచ్చినప్పుడు చూసినట్టుగానే బాధితులకు దాన్ని తట్టుకునే ఫిట్‌నెస్ ఉందే లేదో చూసుకోవాలి. గుండెజబ్బులు, ఇతర శారీరక సమస్యలు ఉన్నాయేమో గమనించాలి. అప్పుడే అనస్థీషియాతో వచ్చే సమస్యలను గుర్తించి వాటిని నివారించవచ్చు. ఈసీటీ ఇచ్చే సమయంలో పల్స్ ఆక్సీమీటర్ అనే సాధనంతో గుండె, ఊపిరితిత్తులు మొదలైన శారీరక వ్యవస్థలను గమనిసూ ఉంటే ఇరత శరీరక సమస్యలపై పడే ప్రమాదాలను నివారించవచ్చు.

ఈసీటీ ఇవ్వడం ఎప్పుడు సరికాదంటే...

నిజానికి కొన్ని రకాల సమస్యలు ఎంతకీ తగ్గకుండా ఉన్నప్పుడు... ఒకవేళ అవి ఈసీటీ ఇవ్వడం వల్ల తగ్గేవైతే... అలాంటి సందర్భాల్లో మందులు మార్చి చూడటం కంటే ఈసీటీతోనే మంచి ఫలితాలు ఉంటాయంటూ వైద్యపరిశోధకులు, వైద్యులు గుర్తించారు. అయితే ఈసీటీ అన్నది పూర్తిగా ప్రమాదరహితమైన ప్రక్రియే అయినప్పటికీ ఈ చికిత్సకూ కొన్ని పరిమితులు ఉన్నాయి. అవేమిటంటే... మెదడులో సెరిబ్రోస్పినల్ ఫ్లుయిడ్ కలిగించే ఒత్తిడి ఉన్నప్పుడు ఈసీటీ వాడకూడదు. ఇటీవల ట్రాన్స్ క్రేనియల్ మాగ్నెటిక్ స్టిమ్యులైజేషన్ అనే ప్రక్రియ వల్ల కూడా ఈసీటీతో ఉండే ప్రయోజనాలే కలుగుతాయని కొత్త పరిశోధనలతో తేలింది. కాబట్టి ఇదే ఈసీటీనే ఇంకాస్త అధునాతంగా ఇవ్వడంపై కూడా ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయి.



అంతర్జాతీయ క్రికెట్‌కు క్లాసెన్ వీడ్కోలు

ఫ్రాంచైజీ లీగ్‌లకే పరిమితం కానున్న సఫారీ హిట్టర్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా 'పవర్ హిట్టర్' హెన్రిచ్ క్లాసెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. మూడు ఫార్మాట్లకు గుడ్‌బై చెబుతున్నట్లు సోమవారం ప్రకటించాడు. అయితే విశ్వవ్యాప్త ఫ్రాంచైజీ లీగ్ క్రికెట్‌లో కొనసాగుతానన్నాడు. 33 ఏళ్ల విధ్వంసకర బ్యాటర్ గతేడాది జనవరిలో సంప్రదాయ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా పరిమిత ఓవర్ల క్రికెట్ (వన్డే, టి20) నుంచి కూడా తప్పుకుంటున్నట్లు స్పష్టం చేశాడు. అంతర్జాతీయ కెరీర్‌లో క్లాసెన్ కేవలం 4 టెస్టులు, 60 వన్డేలు, 58 టి20 మ్యాచ్‌లు ఆడాడు. అయితే మూడు ఫార్మాట్లలోనూ భారత్‌పైనే అరంగేట్రం చేయడం విశేషం. 2018లో సఫారీ గడ్డపై టీమిండియాతో తొలి వన్డే, టి20 మ్యాచ్‌లు ఆడాడు. మరుసటి ఏడాది రాంచీలో టెస్టుతో సంప్రదాయ క్రికెట్ ప్రారంభించాడు.

'నాకిది ఇబ్బందికరమైన రోజు. నాకెంతో ఇష్టమైన క్రికెట్ నుంచి తప్పుకుంటున్నాను. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాను. ఇదేమీ ఆకస్మిక నిర్ణయం కాదు. సుదీర్ఘకాలంగా ఆలోచించే రిటైర్ కావాలనుకుంటున్నాను. మొత్తానికి భవిష్యత్తులో నాకు, నా కుటుంబానికి ఏది మంచో అదే చేయాలనే ఈ నిర్ణయానికి వచ్చాను. క్రికెట్‌కు గుడ్‌బై చెప్పడం ముమ్మాటికి క్లిష్టమైనా... చివరకు తప్పలేదు. నా నిర్ణయం నన్ను ప్రశాంతంగా ఉంచుతుందనే విశ్వసిస్తున్నాను' అని ఇన్‌స్టాగామ్‌లో తన రిటైర్మెంట్ సందేశాన్ని క్లాసెన్ పోస్ట్ చేశాడు. ఇకపై తన కుటుంబసభ్యులతో ఎక్కువ సమయం గడిపేందుకు అవకాశం లభిస్తుందని చెప్పాడు. దేశానికి ప్రాతినిధ్యం వహించడమనేది గొప్ప గౌరవమని, చిన్నప్పటి నుంచి సఫారీకి ప్రాతినిధ్యం కోసం కన్న కలల్ని నిజం చేసుకున్న ప్రయాణం ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఈ సందర్భంగా వివరించాడు. గతేడాది టి20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్‌పై లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా తరఫున క్లాసెన్ చెలరేగాడు. ఓ దశలో అతని విధ్వంసంతో భారత్‌కు ఈ కప్ కూడా గల్లంతనిపించింది. చివరకు హార్దిక్ పాండ్యా అతన్ని అవుట్ చేశాకే భారత్ ఫైనల్ మ్యాచ్‌ను, ప్రపంచకప్‌ను తమ చేతుల్లోకి తెచ్చుకోగలిగింది. ఈ డాషింగ్ బ్యాటర్‌కు సంప్రదాయ టెస్టులేమీ అచ్చిరాలేదు. 4 మ్యాచ్‌లే ఆడిన క్లాసెన్ 104 పరుగులు చేశాడు. కానీ 60 వన్డేల్లో 43.69 సగటుతో 2141 పరుగులు చేశాడు. ఇందులో 4 సెంచరీలు, 11 అర్ధసెంచరీలున్నాయి. 58 టి20ల్లో 23.25 సగటుతో 1000 పరుగులు చేశాడు. ఐదు అర్ధసెంచరీలు సాధించాడు.

ఈ గణాంకాలను పక్కనబడితే ఐపీఎల్‌తో భారత ప్రేక్షకులకు సుపరిచితుడు క్లాసెన్. మరీ ముఖ్యంగా హైదరాబాద్ 'ఆరెంజ్ ఆర్మీ'కి అతనొక ఆరాధ్య క్రికెటర్. రాజస్తాన్ రాయల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరులకు ప్రాతినిధ్యం వహించినా... సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మారిన తర్వాతే ఐపీఎల్‌లో ఓ విధ్వంస కెరటంగా ఎదిగాడు. గత మూడు సీజన్లుగా సన్‌రైజర్స్ తరఫున నిలకడగా 400 పైచిలుకు పరుగులతో హైదరాబాద్ అభిమానుల్ని విశేషంగా అలరిస్తున్నాడు. గత సీజన్‌లో అతని మెరుపు ఇన్నింగ్స్‌లతోనే రైజర్స్ ఫైనల్‌కు చేరింది. చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈ సారి లీగ్ దశలోనే నిష్క్రమించినా... తమ చివరి లీగ్ మ్యాచ్‌లో కోల్‌కతాపై మెరుపు శతకంతో హైదరాబాద్‌ను విజయవంతంగా నిష్క్రమించేలా చేశాడు.

వన్డేలకు మ్యాక్స్‌వెల్ గుడ్‌బై

ఇకపై టి20లపైనే దృష్టి పెట్టనున్న ఆసీస్ స్టార్ క్రికెటర్



మెల్‌బోర్న్: ఆ్రస్టేలియన్ స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ అంతర్జాతీయ వన్డే క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. పూర్తిగా టి20 క్రికెట్‌పైనే దృష్టి సారిస్తానని స్పష్టం చేశాడు. 36 ఏళ్ల ఈ సీనియర్ బ్యాటింగ్ ఆల్‌రౌండర్ స్వార్థపూరిత కారణాలతో ఆడాలనుకోవడం లేదని, అందుకే వన్డే కెరీర్‌కు గుడ్‌బై చెబుతున్నానని పేర్కొన్నాడు. తన శరీరం చేసే సంకేతాల్ని గుర్తుంచుకొనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. విధ్వంసకర బ్యాటర్‌గా, అవసరానికి అక్కరకొచ్చే ఆఫ్‌స్పిన్ బౌలర్‌గా 'మ్యాక్సీ'కి పేరుంది. ముఖ్యంగా వన్డే క్రికెట్‌లో తన మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌లను మలుపు తిప్పే ఇన్నింగ్స్‌లెన్నో ఆడాడు. ఎన్నో మచ్చుతునకలు ఉన్నప్పటికీ మ్యాక్స్‌వెల్ అంటే ఠక్కున గుర్తొచ్చేది... 2023 వన్డే వరల్డ్ కప్ ఇన్నింగ్స్. క్రికెట్ కూన అఫ్గానిస్తాన్ విసిరిన 292 పరుగుల ఛేజింగ్ సవాల్‌ను ఆసీస్ జట్టు కాకుండా మ్యాక్సీ స్వీకరించారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. 91/7 స్కోరు వద్ద ఆసీస్‌కు ఘోర పరాజయం ఖాయమైన దశలో మ్యాక్స్‌వెల్ ఆడిన ఆట చరిత్రలో నిలిచిపోయింది. 128 బంతుల్లో చేసిన అజేయ డబుల్ సెంచరీ (201 నాటౌట్)తో ఒంటిచేత్తో ఆసీస్‌ను గెలిపించాడు. 2015, 2023 ఈ రెండు వన్డే ప్రపంచకప్‌లను సాధించిన ఆ్రస్టేలియా జట్టులో కేవలం మ్యాక్సీ సభ్యుడే కాదు... కీలక పాత్ర పోషించిన ఆల్‌రౌండర్. 2012లో అఫ్గానిస్తాన్‌తో జరిగిన వన్డే పోరుతో అరంగేట్రం చేసిన మ్యాక్స్‌వెల్ 149 మ్యాచ్‌లాడి 33.81 సగటుతో 3990 పరుగులు చేశాడు. 4 సెంచరీలు, 23 అర్ధసెంచరీలున్నాయి. స్పిన్‌తో 77 వికెట్లు తీశాడు. ఉత్తమ ప్రదర్శన 4/40. ఈ ఏడాది ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో ఆడిన మ్యాచే అంతర్జాతీయ వన్డేల్లో ఆఖరుది. టెస్టుల్లో ఎనిమిదేళ్ల క్రితం 2017లోనే ఆఖరి మ్యాచ్ ఆడేశాడు.

మ్యాక్స్ 'వెల్‌డన్ ఇన్నింగ్స్'ల్లో కొన్ని...

- వన్డే ప్రపంచకప్ (2023) చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీని మ్యాక్సీ 40 బంతుల్లో సాధించాడు. ఢిల్లీలో నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత వహించాడు.
- 2015 ప్రపంచకప్‌లోనూ 51 బంతుల్లో శ్రీలంకపై నాలుగో వేగవంతమైన శతకం బాదిన చరిత్ర మ్యాక్స్‌వెల్‌ది. ఈ రెండు వరల్డ్‌కప్‌లను ఆసీసే గెలిచింది.
- 2020 ఇంగ్లండ్ పర్యటనలో 303 పరుగుల ఛేదించే క్రమంలో 73/5 వద్ద ఓటమికి సిద్ధమైన ఆసీస్‌ను వీరోచిత సెంచరీతో మ్యాక్సీ గెలిపించాడు.



- స్పిన్ బౌలింగ్‌తోనూ జట్టును గెలిపించాడు. 2014లో పాకిస్తాన్‌తో జరిగిన వన్డేలో మ్యాక్సీ మెయిడిన్ ఓవర్ వేసి 2 వికెట్లు తీయడం ద్వారా ఆ్రస్టేలియా అనూహ్యంగా 2 పరుగుల తేడాతో గెలిచింది.
- 2015 వరల్డ్‌కప్‌లో ఆసీస్ జట్టుకు అందుబాటులో ఉన్న ఒకే ఒక్క స్పిన్నర్ మ్యాక్స్‌వెల్. ఆరే వికెట్లు తీసినా... ప్రతీ వికెట్ విలువైందే! జట్టు ప్రపంచకప్ విజయంలో భాగమైందే!
- భారత గడ్డపై 2023లో జరిగిన వరల్డ్‌కప్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న రోహిత్ శర్మను పవర్‌ప్లేలోనే పడగొట్టి భారత స్కోరుకు ముకుతాడు వేసిన ఘనత మ్యాక్స్‌వెల్‌దే!

రాణించిన జైస్వాల్, అభిమన్యు, నితీశ్


నితీశ్

కాంటర్‌బరీ: భారత్ 'ఎ', ఇంగ్లండ్ లయన్స్ జట్ల మధ్య జరిగిన నాలుగు రోజుల తొలి అనధికారిక టెస్టు మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. అయితే ఆఖరి రోజు భారత యువ బ్యాటర్లు చక్కగా ప్రాక్టీస్ చేసుకున్నారు. ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (68; 8 ఫోర్లు), యశస్వి జైస్వాల్ (64; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) సహా టాప్-4 బ్యాటర్లు అర్ధసెంచరీలతో కదంతొక్కారు. ధ్రువ్ జురేల్ (53 నాటౌట్; 4 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (52 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీలు సాధించారు. తొలి వికెట్‌కు ఓపెనర్లు 123 పరుగులు జోడిస్తే... జురేల్, నితీశ్ అబేధ్యమైన మూడో వికెట్‌కు 91 పరుగులు జతచేశారు. అయితే ఫలితం వచ్చే అవకాశమే లేకపోవడంతో నిర్ణీత సమయానికి గంటన్నర ముందే మ్యాచ్‌ను ఆపేశారు.

లయన్స్‌కు ఆధిక్యం

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 527/7తో ఆఖరి నాలుగోరోజు ఆటను కొనసాగించిన లయన్స్ 145.5 ఓవర్లలో 587 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ జమాన్ అక్తర్ (41; 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడగా, టెయిలెండర్లు ఎడీ జాక్ (25; 2 ఫోర్లు), అజిత్ సింగ్ (27 నాటౌట్; 5 ఫోర్లు) పోరాడారు. భారత బౌలర్లలో ముకేశ్ 3, శార్దుల్ ఠాకూర్ 2 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 557 పరుగులు చేయగా... ఇంగ్లండ్ లయన్స్‌కు 30 పరుగుల ఆధిక్యం లభించింది. ఈ నెల 6 నుంచి నార్తంప్టన్‌లో రెండో అనధికారిక టెస్టు జరుగుతుంది.

మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీ వేదికలు ఖరారు

- సెప్టెంబర్ 30 నుంచి షురూ
- నవంబర్ 2న ఫైనల్
- విశాఖపట్నంలోనూ మ్యాచ్‌లు
- పాక్ మ్యాచ్‌లు కొలంబోలో



దుబాయ్: ఈ ఏడాది భారత్ ఆతిథ్యమిచ్చే మహిళల వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ ఖరారైంది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు ఈ మెగా ఈవెంట్ జరుగుతుంది. ఎనిమిది జట్లు పాల్గొనే ఈ టోర్నీకి భారత్‌లోని నాలుగు నగరాలతో పాటు శ్రీలంక రాజధాని కొలంబో కూడా వేదిక కానుంది. బెంగళూరు, గువాహటి, ఇండోర్, విశాఖపట్నంలలో ప్రపంచకప్ మ్యాచ్‌లు జరుగుతాయి. అయితే పాకిస్తాన్ కోసం తటస్థ వేదికగా కొలంబోను చేర్చారు. ఈ ఏడాది పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భారత్ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో ఆడినట్లే... ప్రపంచకప్ మ్యాచ్‌లను పాకిస్తాన్ మహిళల జట్టు కొలంబోలో ఆడుతుంది. ఒకవేళ పాక్ ఫైనల్ చేరితే కొలంబోలోనే టైటిల్ పోరు జరుగుతుంది. పాక్ కాకుండా ఇతర జట్లయితే నవంబర్ 2న బెంగళూరు ఫైనల్స్‌కు ఆతిథ్యమిస్తుంది. సెప్టెంబర్ 30న బెంగళూరులో జరిగే తొలి మ్యాచ్‌తో భారత్ ప్రపంచకప్ వేట మొదలుపెడుతుంది. తొలి సెమీఫైనల్ అక్టోబర్ 29న గువాహటి లేదంటే కొలంబో (పాక్ సెమీస్ చేరితే)లో, రెండో సెమీఫైనల్ 30న బెంగళూరులో నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఆతిథ్య భారత్ సహా ఆ్రస్టేలియా, ఇంగ్లండ్, శ్రీలంక, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాలు నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సంపాదించగా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా అర్హత పొందాయి.

మరో సంచలనం


బొయిసన్


- ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఓడిన మూడో సీడ్ పెగూలా
- ఫ్రాన్స్ అన్‌సీడెడ్ ప్లేయర్ బొయిసన్ అద్భుతం


పెగూలా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో మరో సంచలనం నమోదైంది. టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకరైన ప్రపంచ మూడో ర్యాంకర్, మూడో సీడ్ జెస్సికా పెగూలా ప్రిక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ఫ్రాన్స్‌కు చెందిన అన్‌సీడెడ్ ప్లేయర్, ప్రపంచ 361వ ర్యాంకర్ లూయి బొయిసన్ 3-6, 6-4, 6-4తో పెగూలాను ఓడించింది. తద్వారా తన కెరీర్‌లో ఆడుతున్న తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన పెగూలా ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆరో ప్రయత్నంలోనూ క్వార్టర్ ఫైనల్‌ను దాటి ముందుకెళ్లడంలో విఫలమైంది. పెగూలా పరాజయంతో ప్రస్తుతం టాప్-10లో ఆరుగురు మాత్రమే క్వార్టర్ ఫైనల్ దశకు చేరుకున్నారు. నాలుగో సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ), తొమ్మిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా), పదో సీడ్ పౌలా బదోసా (స్పెయిన్) ఇప్పటికే ఇంటిదారి పట్టారు. పెగూలాతో 2 గంటల 40 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో బొయిసన్ మూడు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 34 సార్లు దూసుకొచ్చి 24 సార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు రెండో సీడ్ కోకో గాఫ్ (అమెరికా), ఆరో సీడ్ మిరా ఆంద్రీవా (రష్యా), ఏడో సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో కోకో గాఫ్ 6-0, 7-5తో ఎకతెరీనా అలెగ్జాండ్రోవా (రష్యా)పై, ఆంద్రీవా 6-3, 7-5తో దరియా కసత్‌కినా (ఆ్రస్టేలియా)పై, మాడిసన్ కీస్ 6-3, 7-5తో హైలీ బాప్టిస్ట్ (అమెరికా)పై విజయం సాధించారు.

జొకోవిచ్‌కు 100వ విజయం

పురుషుల సింగిల్స్ విభాగంలో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ వరుసగా 16వ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. అంతేకాకుండా ఈ టోర్నీలో 100వ విజయాన్ని నమోదు చేసుకున్నాడు. సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంకర్ జొకోవిచ్ 6-2, 6-3, 6-2తో కామెరాన్ నోరీ (బ్రిటన్)పై గెలుపొందాడు. రోజర్ ఫెడరర్ (ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో 102 విజయాలు; వింబుల్డన్‌లో 105 విజయాలు), రాఫెల్ నాదల్ (ఫ్రెంచ్ ఓపెన్‌లో 112 విజయాలు) తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో 100 మ్యాచ్‌ల్లో గెలిచిన మూడో ప్లేయర్‌గా జొకోవిచ్ గుర్తింపు పొందాడు. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్) 5-7, 6-3, 6-2, 6-4తో ఐదో సీడ్ జేక్ డ్రేపర్ (బ్రిటన్)ను బోల్తా కొట్టించాడు. తద్వారా తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. అంతేకాకుండా ఓపెన్ శకంలో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరిన తొలి కజకిస్తాన్ క్రీడాకారుడిగా బుబ్లిక్ గుర్తింపు పొందాడు. మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) వరుసగా ఐదో ఏడాది క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. టాలన్ గ్రీక్‌స్పూర్ (నెదర్లాండ్స్)తో జరిగిన మ్యాచ్‌లో జ్వెరెవ్ 6-4, 3-0తో ఆధిక్యంలో నిలిచిన దశలో అతని ప్రత్యర్థి గాయం కారణంగా వైదొలిగాడు.


జొకోవిచ్

బీసీసీఐ అధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా!

రోజర్ బిన్నీ స్థానంలో తాత్కాలిక బాధ్యతలు



న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తాత్కాలిక అధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ప్రస్తుత అధ్యక్షుడు రోజర్ బిన్నీకి ఈ ఏడాది జూలై 19న 70 ఏళ్లు పూర్తవుతాయి. నిబంధనల ప్రకారం బోర్డు ఆఫీస్ బేరర్లు ఈ వయసు రాగానే పదవి నుంచి తప్పుకోవాలి. ఆయన స్థానంలో మరో సీనియర్ ఆఫీస్ బేరర్ శుక్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తారని బోర్డు వర్గాలు వెల్లడించాయి. 65 ఏళ్ల శుక్లా ప్రస్తుతం బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే ఏజీఎంలో అధ్యక్ష పదవి కోసం ఎన్నికలు నిర్వహిస్తారు. అప్పటి వరకు తాత్కాలికంగా శుక్లా రోజువారీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. 2022 నుంచి బిన్నీ అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు.

కనిక రెండు గోల్స్



రొసారియో (అర్జెంటీనా): నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్‌ను భారత జట్టు పరాజయంతో ముగించింది. ఆతిథ్య అర్జెంటీనా జట్టుతో సోమవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 2-4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ చేసిన రెండు గోల్స్‌ను కనిక సివాచ్ (11వ, 45వ నిమిషాల్లో) చేయడం విశేషం. అర్జెంటీనా తరఫున సోల్ గుగ్‌నెట్ గునాజు (5వ నిమిషంలో), సోల్ ఒలాలా డి లబ్రా (7వ నిమిషంలో), మిలాగ్రోస్ అలాస్ట్రా (13వ నిమిషంలో), మాక్సిమా డుపోర్టల్ (37వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ఉరుగ్వే, చిలీ జట్లు కూడా పాల్గొన్న ఈ డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ టోర్నీలో భారత్ మొత్తం నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి, రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.



సౌదీ అరేబియాలోని పవిత్ర నగరం మక్కాలో వార్షిక హజ్ యాత్ర ఈ నెల 4 నుంచి మొదలుకానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే చేరుకున్న 10 లక్షల మందిపైగా యాత్రికుల కోసం మినాలో ఏర్పాటు చేసిన శిబిరాలివి



గాజా దక్షిణ ప్రాంతం ఖాన్ యూనిస్ నగరంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కిచెన్ వద్ద సోమవారం నెలకొన్న పరిస్థితి. పాలస్తీనా ప్రజల ఆకలి కేకలకు నిదర్శనమీ చిత్రం

భూకంప ప్రభావం అంతరిక్షంలో!!

అవని కుదుపులతో శాటిలైట్ కమ్యూనికేషన్లకు అంతరాయం

- భవిష్యత్ శాస్త్రీయ ప్రయోగాలకు అవరోధం!
- కొత్త విషయాలను వెల్లడిస్తున్న జపాన్ శాస్త్రవేత్తల నూతన అధ్యయనం

పట్టాలపై రైలు పరుగులు తీస్తుంటే.. హఠాత్తుగా ముందున్న ఇంజిన్ కాస్తంత నెమ్మదించినా వెనకాలే క్యూ కట్టిన బోగీలన్నీ టపటపా ఢీకొన్నంత పనిచేస్తాయి. ఎందుకంటే ప్రతి బోగీ పక్క బోగీతో అనుసంధానమై ఉంటుంది. కానీ ఎలాంటి అనుసంధానం లేని సుదూర శాటిలైట్లు సైతం భూకంపం వేళ ప్రభావితం అవుతున్నాయని తాజా అధ్యయనంలో తేలింది. భూకంపం ధాటికి భూకంపకేంద్ర సమీప భవనాలు, భవంతులు పేకమేడల్లా కదలిపోవడం చూస్తుంటాం. కానీ ఆకాశంలో ఉండే కృత్రిమ ఉపగ్రహాల పనితీరు సైతం భూకంపాల తీవ్రతకు లోనవుతోందని తాజా పరిశోధనలో తేలింది. భౌతికంగా భూమితో అనుసంధానంకాని ఉపగ్రహాలకు భూకంప పర్యవసానాలకు మధ్య గల సంబంధాన్ని తొలిసారిగా ఈ పరిశోధన ఆవిష్కరించింది. జపాన్‌లోని నగోయా విశ్వవిద్యాలయంలోని శాస్త్రవేత్తల బృందం చేసిన ఈ పరిశోధనా తాలూకు వివరాలు 'ఎర్త్, ప్లానెట్స్, స్పేస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

భూతలం సహా గగనతలం..

రెండు భూఫలకాల కొనల వద్ద రాపిడి, ఢీకొనే సందర్భాల్లో భూకంపం సంభవిస్తుంది. ఇవి భూతల వనరులనే కాదు గగనతల కృత్రిమ వనరులైన శాటిలైట్లనూ ప్రభావితం చేస్తాయని అధ్యయనకారుల్లో అనుమానం మొదలైంది. ఈ అనుమానాన్ని నివృత్తిచేసుకునేందుకు గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(జీఎన్ఎస్ఎస్)లోని 4,500కుపైగా రిసీవర్ల ద్వారా సమగ్ర సమాచారాన్ని తెప్పించుకుని ఆ డేటాతో త్రిమితీయ(3డీ) ''వాతావరణ ఇబ్బందుల''ముఖచిత్రాన్ని రూపొందించారు. 2024 జనవరి ఒకటో తేదీన జపాన్‌లోని ఇషికావా ప్రిఫెక్చర్‌లోని నోటో ద్వీపకల్పంలో రిక్టార్ స్కేల్‌పై 7.5 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం సంభవించింది. అప్పుడు ఆకాశంలోకి సంక్లిష్టమైన ధ్వని తరంగాలు దూసుకెళ్లాయి. ఇవి భూమి నుంచి ఆకాశంలో 60 నుంచి 1,000 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉన్న అయనో ఆవరణం(ఐనోస్పియర్)లోకి వెళ్లాయి. అక్కడి స్వేచ్ఛాయుత ఎలక్ట్రాన్లతో నిండిన వాయువులను ఈ ధ్వనితరంగాలు విపరీతంగా ప్రేరేపించాయి. దాంతో ఈ వాయువులు కింద పొర అయిన థర్మోస్పియర్ వాతావరణంలోకి కొంత శక్తిని విడుదలచేశాయి. అప్పటికే థర్మోస్పియర్ ఆవరణలో స్థిరంగా ఉన్న శాటిలైట్లపై ఈ అదనపు శక్తి ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో శాటిలైట్ల నుంచి భూమి మీదకు జరగాల్సిన కమ్యూనికేషన్ సిగ్నళ్ల ప్రసరణ వేగంలో మార్పులు కనిపించాయి. సిగ్నళ్లు ఆలస్యంగా రావడంతోపాటు సిగ్నళ్లలో సాంద్రత సైతం తగ్గిపోయినట్లు గుర్తించారు. టోమోగ్రఫీ సాయంతో వైద్యరంగంలో వాడే సీటీ స్కాన్ తరహాలో వేర్వేరు కోణాల్లో శాటిలైట్ల డేటాను క్రోడీకరించి 3డీ చిత్రాలను రూపొందించారు. భూకంపం సంభవించినప్పుడు కేవలం పది నిమిషాల వ్యవధిలోనే ధ్వని తరంగాలు ఐనోఆవరణను చేరిపోతున్నాయి. ప్రశాంత కొలనులో రాయి విసిరితే ఏర్పడే వలయాకార అలల్లా ధ్వని తరంగాలు ఐనోస్పియర్‌లోకి వెళ్తున్నాయి. భూకంపం సంభవించినప్పుడు భూఫలకాలు ఢీకొన్న ఒక్క ప్రాంతంలోనే ధ్వని తరంగాలు ఉద్భవిస్తాయని గతంలో భావించారు. అలాకాకుండా నోటో ద్వీపకల్ప ఘటనలో 150 కిలోమీటర్ల పొడవునా రెండు భూఫలకాలు ఢీకొన్న చోట్ల నుంచి ధ్వనితరంగాలు పుట్టుకొచ్చాయని, ఇలాంటి సందర్భాల్లోనే అధిక తరంగాలు ఉద్భవిస్తున్నాయని ఈ పరిశోధనలో ముఖ్య రచయిత డాక్టర్ వెజియాంగ్ ఫూ చెప్పారు.

పలు సమస్యలు..

థర్మోస్పియర్‌పై అదనపు ఒత్తిడితో శాటిలైట్ల నుంచి ప్రసారాల నాణ్యత తగ్గిపోవడంతో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్), శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భూకంపాలతో ఉపగ్రహాల పనితీరూ దెబ్బతింటుందని స్పష్టంగా అర్థమైందని మరో రచయిత, ప్రొఫెసర్ యుచీ ఒట్సుకీ చెప్పారు. భూకంపాల ముందస్తు హెచ్చరికల వ్యవస్థను మరింత పటిష్ఠచేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని యుచీ అభిప్రాయపడ్డారు. భూకంపాలతోపాటు సునామీ, అగ్నిపర్వతాల విస్ఫోటం వంటి అత్యంత తీవ్ర వాతావరణ పరిస్థితులకూ తమ అధ్యయన మోడళ్లను అన్వయించి మరింత విస్తృత స్థాయి అవగాహనకు ప్రయత్నిస్తున్నామని పరిశోధకులు వెల్లడించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఉగ్రవాదంతో మానవాళికే ప్రమాదం

దేశాల నేతలకు వివరిస్తున్న అఖిలపక్షం

లండన్/కౌలాలంపూర్/కైరో/మాడ్రిడ్: మానవాళి మనుగడకే ప్రమాదంగా మారిన ఉగ్రవాదంపై పోరుకు భారత్ కృతనిశ్చయంతో ఉందని కేంద్ర ప్రభుత్వం పంపించిన అఖిల పక్ష బృందాల ప్రతినిధులు వివిధ దేశాల నేతలకు వివరిస్తున్నారు. బీజేపీ ఎంపీ రవి శంకర్ ప్రసాద్ సారథ్యంలో లండన్ వెళ్లిన ప్రతినిధి బృందం యూకే మంత్రి కేథరిన్ వెస్ట్‌ను కలిశారు. ఉగ్రవాదంపై పోరాటంలో యూకే భారత్‌తో కలిసి వస్తుందని ఈ సందర్భంగా కేథరిన్ హామీ ఇచ్చారు. ఇండో–పసిఫిక్ ప్రాంత స్థిరతకు భారత్ చేస్తున్న కృషిని ఆమె కొనియాడారు. బీజేపీ ఎంపీ బైజయంత్ జే పాండా సారథ్యంలోని బృందం ఆదివారం రాత్రి అల్జీరియా మంత్రి మహ్మద్ ఖౌనెతో భేటీ అయ్యారు. జేడీయూ ఎంపీ సంజయ్ కుమార్ ఝా సారథ్యంలో మలేసియా వెళ్లిన మరో బృందం కౌలాలంపూర్‌లో వివిధ పార్టీల ముఖ్య నేతలతో సమావేశమై, ఉగ్రవాదంపై భారత్ వైఖరిని వివరించింది. ఈజిప్టుకు ఎన్సీపీ(ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే నేతృత్వంలో వెళ్లిన బృందం ఈజిప్టు పార్లమెంట్ సభ్యులతో సమావేశమయ్యారు. సోమవారం డీఎంకే ఎంపీ కనిమొళి ఆధ్వర్యంలో స్పెయిన్ వెళ్లిన బృందం సభ్యులు మాడ్రిడ్‌లో విదేశాంగ మంత్రి జోస్ మాన్యుయెల్ అల్బరెస్‌తో చర్చలు జరిపారు. ఉగ్రవాదాన్ని సహించరాదన్న భారత్ వైఖరిని తాము బలపరుస్తామన్నారు. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే సారథ్యంలోని బృందం లైబీరియాకు, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఆధ్వర్యంలోని అఖిలపక్ష బృందం బ్రెజిల్‌కు వెళ్లి, పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాలను అక్కడి ప్రభుత్వాలకు వివరించాయి.



ఇటలీలోని సిసిలీ ద్వీపంలో ఉన్న ఎట్నా అగ్ని పర్వతం మరోసారి బద్దలైంది. సోమవారం ఆ పర్వత శిఖరం నుంచి భారీగా విడుదలవుతున్న వాయువులు, బూడిద. యూరప్‌లోని అతిపెద్ద, అత్యంత క్రియాశీలకంగా ఉన్న అగ్ని పర్వతమిదే.

అన్నా వర్సిటీ కేసులో దోషికి జీవిత ఖైదు

చెన్నై: గతేడాది డిసెంబర్‌లో తమిళనాడు అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురిచేసిన దోషికి మహిళా కోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో మే 28వ తేదీతో వాదనలు ముగియగా మహిళా కోర్టు జడ్జి రాజలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు. దోషి గుణశేఖరన్‌పై నమోదైన 11 ఆరోపణలు నిర్ధారణ కావడంతో అన్నిటికీ కలిపి కనీసం 30 ఏళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉందని జడ్జి స్పష్టం చేశారు. కుటుంబం తనపైనే ఆధారపడి ఉందని, శిక్షాకాలం తగ్గించాలంటూ గుణశేఖరన్ చేసిన వినతిని జడ్జి తోసిపుచ్చారు. 2024 డిసెంబర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన తమిళనాడులో తీవ్ర సంచలనం రేపింది. ఇతడికి అధికార డీఎంకే పార్టీతో సంబంధాలున్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. గుణశేఖరన్‌తో తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని, కనీసం అతడికి డీఎంకే ప్రాథమిక సభ్యత్వం కూడా లేదంటూ సీఎం ఎంకే స్టాలిన్ ప్రకటించాల్సి వచ్చింది. బాధితురాలు డిసెంబర్ 23వ తేదీన కొట్టుపురంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాయ్‌ఫ్రెండ్‌తో క్యాంపస్‌లో ఉన్న సమయంలో గుణశేఖరన్ వచ్చి బెదిరించి, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని అందులో పేర్కొంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, అందులోని సెక్షన్లు నేర తీవ్రతను తగ్గించేలా ఉన్నాయంటూ మళ్లీ నిరసనలు రేగాయి. దీనిపై మద్రాస్ హైకోర్టు వేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్), ఎఫ్ఐఆర్ లీకేజీ అంశం సహా కేసుపై దర్యాప్తు చేపట్టింది. ఫిబ్రవరిలో మేజిస్ట్రేట్ కోర్టులో సిట్ ఛార్జిషీట్ వేసింది. అనంతరం, ఈ కేసు మహిళా కోర్టుకు బదిలీ అయ్యింది. గుణశేఖరన్‌పై కోర్టు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది.

ఏడాదిలోపు సుదర్శన చక్రాలిచ్చేస్తాం

రష్యా ప్రకటన

న్యూఢిల్లీ: కొత్తగా తయారుచేసి భారత్‌కు ఇవ్వాల్సిన ఎస్–400 గగనతల రక్షణ వ్యవస్థ(సుదర్శన చక్ర)లను 2025–2026 షెడ్యూల్ ప్రకారం అందజేస్తామని రష్యా స్పష్టంచేసింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌పైకి భారత్ క్షిపణులను ప్రయోగించడం, ప్రతిగా అటు నుంచి దూసుకొచ్చిన క్షిపణులను భారత ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ విజయవంతంగా అడ్డుకోవడం తెల్సిందే. దీంతో ఒప్పందం ప్రకారం మిగతా ఎస్–400 యూనిట్లనూ త్వరగా తయారుచేసి సరఫరాచేయాలని భారత్ ఇటీవల రష్యాను కోరింది. దీనిపై రష్యా డెప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ ఇన్ ఇండియా రోమన్ బబూష్కిన్ సోమవారం స్పందించారు. ''భారత్, పాక్ పరస్పర సైనిక చర్యల్లో ఎస్–400 అద్భుత పాటవాన్ని ప్రదర్శించిందని మేం కూడా విన్నాం. భారత్‌తో భాగస్వామ్యానికి దశాబ్దాల చరిత్ర ఉంది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో యూరప్ మాత్రమేకాదు భారత్‌లోనూ రక్షణ సన్నద్ధత అత్యంత కీలకమైన అంశంగా మారింది. మరో రెండు యూనిట్లను భారత్‌కు అందించాల్సి ఉంది. వాటిని షెడ్యూల్ ప్రకారం తయారుచేసి డెలివరీ ఇస్తాం''అని బబూష్కిన్ అన్నారు. 2018లోనే రష్యాతో భారత్ రూ.46,000 కోట్లతో ఎయిర్ డిఫెన్స్ డీల్ కుదుర్చుకోవడం తెల్సిందే. ఇందులోభాగంగా ఐదు స్క్వాడ్రాన్ల ఎస్–400 యూనిట్లను రష్యా తయారుచేసి భారత్‌కు ఇవ్వనుంది. మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన పర్యటన షెడ్యూల్ మరికొద్ది వారాల్లో ఖరారుకానుంది.

ఉగ్రవాదంపై భారత్, పరాగ్వే సమష్టిపోరు: మోదీ

న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై భారత్, పరాగ్వేలు కలిసి పోరాడుతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కొనేందుకు అవకాశాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఇరుదేశాల నడుమ డిజిటల్ టెక్నాలజీ, అరుదైన ఖనిజాలు, ఇంధనం, వ్యవసాయం, హెల్త్ కేర్, రక్షణ, రైల్వేలు, అంతరిక్షం, పూర్తిస్థాయి ఆర్థిక భాగస్వామ్యం వంటి అంశాల్లో సహకారానికి గల మరిన్ని అవకాశాలను అన్వేషిస్తున్నామన్నారు. దక్షిణ అమెరికా దేశాల కూటమితో 'మెర్కొసుర్'పేరుతో భారత్ ఏర్పాటు చేసుకున్న వాణిజ్య భాగస్వామ్యాన్ని పరాగ్వేకు సైతం విస్తరించే అవకాశముందని చెప్పారు. 'కోవిడ్ మహమ్మారి సమయంలో భారత దేశం తన వ్యాక్సిన్లను పంచుకోవడం ద్వారా పరాగ్వేకు సాయపడింది. మా సామర్థ్యాలను మరింతగా పంచుకోవడం ద్వారా ఈ సహకార స్ఫూర్తిని కొనసాగించాలని ఎదురుచూస్తున్నాం' అని ప్రధాని చెప్పారు. భారత్‌లో మూడు రోజుల పర్యటనకు గాను పరాగ్వే అధ్యక్షుడు సాంటియాగో పెనా పలాసియోస్ తన ప్రతినిధి బృందంతో సోమవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. అనంతరం ఆయన ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. లాటిన్ అమెరికాలోని పరాగ్వే భారత్‌తో కీలక వాణిజ్య భాగస్వామిగా ఉంది. భారత్‌కు చెందిన పలు ఆటోమొబైల్, ఫార్మాస్యూటికల్ కంపెనీలు పరాగ్వేలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. భారత్, పరాగ్వేలు 1961 నుంచి దౌత్య సంబంధాలు కొనసాగిస్తున్నాయి. ఈ కాలంలో భారత్‌లో పరాగ్వే అధ్యక్షుడు పర్యటించడం ఇది రెండోసారి.

పీఓకేలో నిరసనల హోరు

గిల్గిత్–బాల్టిస్తాన్‌లో మరింత ఎగసిన ఆగ్రహ జ్వాల

- తమ వ్యాపార ప్రయోజనాలను పాక్ సర్కార్ పణంగా పెట్టిందని వ్యాపారుల ఆగ్రహం
- చైనా సరిహద్దు కారాకోరమ్ హైవేను దిగ్బంధించిన స్థానిక దిగుమతి, ఎగుమతిదారులు
- మరింత ఉధృతమవుతున్న గిల్గిత్–బాల్టిస్టాన్ స్థానికుల ఉద్యమం

గిల్గిత్: ఆపరేషన్ సిందూర్‌తో పరువు పోగొట్టుకున్న పాకిస్తాన్‌కు స్థానిక వ్యాపారులు నిరసనల సెగ మరింత తగులుతోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని గిల్గిత్–బాల్టిస్తాన్‌లోని స్థానిక వ్యాపారులు తమ స్వప్రయోజనాలను పాక్ ప్రభుత్వం పణంగా పెడుతోందని ఆందోళనబాటపట్టారు. వీళ్లకు స్థానిక రాజకీయ పార్టీల మద్దతు సైతం తోడవడంతో ఉద్యమం మరింత ఉధృతమవుతోంది. గత మూడు రోజులుగా స్థానిక సరకు ఎగుమతి, దిగుమతిదారులు, చిరు వ్యాపారులు ఆందోళన కొనసాగిస్తున్నారు. స్థానిక గుల్మార్ట్ నగర్‌లో వేలాది మంది వ్యాపారులు, స్థానికులు బైఠాయించి నిరసనకు దిగారు. చైనా, పాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్(సీపీఈసీ)లో కలికితురాయి వంటి కారాకోరమ్ జాతీయ రహదారిని గత మూడు రోజులుగా వ్యాపారులు దిగ్బంధించారు. దీంతో పాక్, చైనా మధ్య భారీ సరకు రవాణా వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఆందోళన కార్యక్రమాల్లో అధికార పీఎంఎల్(నవాజ్) పార్టీకి చెందిన నేతలు సైతం పాల్గొన్నారు. ఫెడరల్ బోర్డ్ ఆఫ్ రెవిన్యూ(ఎఫ్‌బీఆర్) నిర్ణయాలు పూర్తి లోపభూయిష్టంగా ఉన్నాయని, కేవలం చైనాకు లబ్ధిచేకూర్చేలా ఆర్థిక విధానాలను అవలంబిస్తున్నారని సరకు ఎగుమతి, దిగుమతిదారులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. చైనా దోపిడీ విధానాలు పాకిస్తాన్‌ను ఆర్థికంగా హత్య చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యాపారులకు తోడుగా హూంజా, సమీప పట్టణాల నుంచి వేలాదిగా విద్యావేత్తలు, పౌర సంఘాల ప్రతినిధులు తరలివచ్చి ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. 2023 అక్టోబర్‌లోనూ గిల్గిత్–బాల్టిస్తాన్ ప్రజలు భారత్ అనుకూల ఉద్యమం చేశారు. భారత్‌లోని కార్గిల్‌ను కలిపే రోడ్డును మళ్లీ తెరవాలని, తద్వారా సరకు దిగుమతులకు అనుమతించి స్థానికంగా ద్రవ్యోల్బణాన్ని కిందకు దిగొచ్చేలా చేయాలని స్థానికులు ఉద్యమించారు. 'సరిహద్దులు చెరిపేయండి, కార్గిల్ సరిహద్దును తెరవండి''అంటూ ప్రముఖ కార్యకర్త షబ్బీర్ మయ్యార్ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగడం తెల్సిందే. తర్వాత ఆయనను ఉగ్రవ్యతిరేక చట్టం కింద పాక్ సర్కార్ అరెస్ట్‌చేసింది.

పరస్పర నిందారోపణలు

గిల్గిత్–బాల్టిస్తాన్‌లో ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పీటీఐ పార్టీ అధికారంలో ఉందని, ఫెడరల్ బోర్డ్ ఆఫ్ రెవిన్యూ(ఎఫ్‌బీఆర్) నిర్ణయాలతో తమకు సంబంధంలేదని పీఎంఎల్(నవాజ్) పార్టీ చెబుతోంది. ''పీటీఐ పార్టీ విధానాల కారణంగా స్థానికంగా వ్యాపారం దెబ్బతింటోంది. ఎగుమతిదారులు, వ్యాపారులు, దుకాణదారులు, కార్మికులు, కస్టమ్స్ క్లియరెన్స్ ఏజెంట్లు, హోటళ్లు, చిరువ్యాపారులు అందరూ ఆరు నెలలుగా తీవ్రంగా నష్టపోతున్నారు. స్థానిక ప్రభుత్వం ఏకంగా ఉగ్రవాదులకే క్షమాభిక్షలు పెట్టింది. కనీసం వ్యాపారులను పట్టించుకోరా?''అని పీఎంఎల్(నవాజ్) పార్టీ నేత జావేద్ హుస్సేన్ ప్రశ్నించారు. హుస్సేన్ వ్యాఖ్యలను పీటీఐ పార్టీ నేతలు ఖండించారు. ''ఫెడరల్ బోర్డ్ ఆఫ్ రెవిన్యూ అనేది కేంద్రప్రభుత్వానికి సంబంధించిన విషయం, మా ప్రభుత్వంతో సంబంధం లేదు''అని గిల్గిత్–బాల్టిస్తాన్ ముఖ్యమంత్రి కార్యాలయం అధికార ప్రతినిధి మొహమ్మద్ అలీ ఖయీద్ చెప్పారు. ఇరు ప్రభుత్వాల నడుమ వ్యాపారులు ఆర్థిక చితికిపోతున్నారు. సరకుల కొరతతో ధరలు పెరిగి సామాన్యులు ఆరునెలలుగా అల్లాడిపోతున్నారు.

కస్టమ్స్ క్లియరెన్సుతో..

సరిహద్దుల్లోని సోస్త్ డ్రై పోర్ట్ ద్వారా దిగుమతి చేసుకున్న ఉత్పత్తులకు కస్టమ్స్ క్లియరెన్సు అనుమతులు ఇవ్వకపోవడంతో తాజాగా వ్యాపారులు నిరసనకు దిగారు. గత ఆరు నెలలుగా 257 కన్‌సైన్‌మెంట్లు ఇలా డ్రై పోర్ట్‌లోనే ఆగిపోయాయి. దీంతో కొంత సరకు పాడయింది. దీంతో వ్యాపారులు ఆర్థికంగా నష్టపోయారు. ఇదిగాక మిగిలిన సరకుకు సైతం రోజువారీ నిల్వ చార్జీలు ఇతరత్రాలు మోపడంతో వ్యాపారుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తమ సరకుకు మోక్షం కల్గించేదాకా కారాకోరమ్ హైవేను తెరిచేదిలేదని వ్యాపారులు భీష్మించుకుని కూర్చున్నారు. నగర్, హూంజా, గిల్గిత్ ప్రాంతాలకు చెందిన గిల్గిత్–బాల్టిస్తాన్ దిగుమతి, ఎగుమతిదారుల సంఘం ఆధ్వర్యంలో పాక్–చైనా ట్రేడర్స్ యాక్షన్ కమిటీ నేతృత్వంలో ఈ ఉద్యమం కొనసాగుతోంది. హైవేపై రాకపోకలు ఆగిపోవడంతో ఇరువైపులా కిలోమీటర్ల కొద్దీ సరకు, ప్రయాణికుల వాహనాలు నిలిచిపోయాయి.

బెంగళూరులో క్రికెటర్ కోహ్లీ పబ్‌పై కేసు

సాక్షి బెంగళూరు: ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లీకి చెందిన బెంగళూరులోని పబ్, రెస్టారెంట్ 'ఒన్ 8 కమ్యూన్' మరోసారి వార్తల్లోకెక్కింది. మే 29న సోదాలు చేపట్టిన పోలీసులు స్మోకింగ్ జోన్ లేని విషయాన్ని గుర్తించారు. ఇందుకు సంబంధించి మే 31న కేసు నమోదు చేశారు. స్థానిక మహాత్మాగాంధీ రోడ్డులో ఉన్న ఈ రెస్టారెంట్, పబ్‌కు సహయజమానిగా ఉన్న కోహ్లీకి, సిబ్బందికి నోటీసులు సైతం జారీ చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, విమానాశ్రయాలు తదితర ప్రాంతాల్లో తప్పనిసరిగా స్మోకింగ్‌జోన్‌లను ఏర్పాటు చేయాలి. అయితే, 'ఒన్ 8 కమ్యూన్'గతంలోనూ ఉల్లంఘనలకు పాల్పడిన సందర్భాలున్నాయి. 2024 జూలై 6న అర్ధరాత్రి దాటాక 1.20 గంటల వరకు పబ్‌ను తెరిచే ఉంచడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్నిమాపక శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదంటూ గతేడాది డిసెంబర్‌లో నగర పాలక సంస్థ నోటీసులు పంపింది.

సెమీ క్రయోజనిక్ ఇంజిన్ హాట్ టెస్ట్ విజయవంతం

సూళ్లూరుపేట: తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో సెమీ క్రయోజనిక్ ఇంజిన్ హాట్ టెస్ట్‌ను మూడోసారి విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో సోమవారం తెలిపింది. ఇదో మైలు రాయని అభివర్ణించింది. ఇప్పటికే, మార్చి 28, ఏప్రిల్ 24వ తేదీల్లో జరిపిన హాట్ టెస్ట్‌లు సక్సెస్ అయిన విషయాన్ని గుర్తు చేసింది. మార్చి 28న హాట్ టెస్ట్‌ను 2.5 సెకన్లు, ఏప్రిల్ 24న 3.5 సెకన్లు హాట్ టెస్ట్ జరపగా సోమవారం 3 సెకన్లపాటు హాట్ టెస్ట్ చేపట్టి ఇంజిన్ సామర్థ్యాన్ని ధ్రువీకరించుకున్నారు. ఎల్ఎంవీ3 లాంచ్ వెహికల్ పేలోడ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు గాను లిక్విడ్ కోర్‌స్టేజ్ స్థానంలో సెమీ క్రయోజనిక్ ఇంజిన్‌ను వాడాలన్నదే ఇస్రో లక్ష్యం.

ఆర్‌టీఐ ఈ మెయిల్ దరఖాస్తులకు ఈ నెల 16 నుంచి ఓటీపీతో వెరిఫికేషన్

న్యూఢిల్లీ: సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) కింద అందే అన్ని ఈ–మెయిల్స్‌కు ఈనెల 16వ తేదీ నుంచి వన్ టైమ్ పాస్‌వర్డ్(ఓటీపీ) వెరిఫికేషన్‌ను అమలు చేయనున్నట్లు కేంద్రం సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. డేటా సెక్యూరిటీ, పౌర గోప్యతను పెంచడంతోపాటు పోర్టల్ సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయడమే దీని ఉద్దేశమని పేర్కొంది. పౌరులు ఆర్‌టీఐ దరఖాస్తులను www.rtionline.gov.in పోర్టల్ ద్వారా పంపుకోవచ్చు. ఇందులోనే దరఖాస్తుల స్టేటస్‌ను సైతం పరిశీలించుకునే వీలుంది.

పార్టీ కోసం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా

ఎల్జేపీ(రాం విలాస్)చీఫ్ చిరాగ్ పాశ్వాన్ వెల్లడి

రాయ్‌పూర్: బిహార్‌లో తమ పార్టీ మరింత మెరుగైన స్థితిలో ఉంటుందంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీకి సిద్ధమని లోక్ జనశక్తి పార్టీ(రాం విలాస్) చీఫ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చెప్పారు. ప్రస్తుతానికి రాష్ట్ర ముఖ్యమంత్రి సీటు ఖాళీగా లేదంటూ ఆయన..అసెంబ్లీ ఎన్నికలకు సీఎం నితీశ్ కుమారే సారథ్యం వహిస్తారన్నారు. 'కేంద్ర రాజకీయాల్లో కొనసాగాలన్న ఉద్దేశం నాకు ఏమాత్రం లేదని ఎప్పటి నుంచో చెబుతున్నా. బిహార్, బిహారీల కోసం రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటా. 'బిహార్ ఫస్ట్, బిహారీ ఫస్ట్'అన్నదే నా నినాదం. అభివృద్ధి చెందిన రాష్ట్రాల కంటే బిహార్ ముందుండాలన్నదే నా లక్ష్యం. ఢిల్లీలో ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం అసాధ్యమని తెలుసుకున్నా. త్వరలోనే రాష్ట్ర రాజకీయాల్లో ప్రవేశించాలని భావిస్తున్నట్లు పార్టీ కేడర్‌కు సైతం తెలిపా'అని చిరాగ్ చెప్పారు. రాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేసిన జాతీయ నేతలతో అనేక పార్టీలు లాభ పడ్డాయని చెప్పారు. బీజేపీ గతంలోనే ఈ వ్యూహాన్ని అమలు పర్చిందని వివరించారు. త్వరలోనే జరగనున్న పార్టీ ఉన్నత స్థాయి సమావేశం చిరాగ్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని కోరుతూ తీర్మానించే అవకాశముందని భావిస్తున్నారు.

మరో 14 మంది పాలస్తీనియన్ల మృతి


డెయిర్ అల్–బలాహ్: గాజాపై ఇజ్రాయెల్ ఆర్మీ మారణకాండ కొనసాగుతోంది. తాజాగా సోమవారం, జబాలియాలోని శరణార్థుల తాత్కాలిక శిబిరంపై జరిగిన దాడిలో మొత్తం 14 మంది చనిపోయారు. వీరిలో ఐదుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులున్నారని స్థానిక షిఫా, అల్–అహ్లి ఆస్పత్రి వర్గాలు ధ్రువీకరించాయి. 2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి కొనసాగుతున్న ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటి వరకు 54 వేల మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. తాజా ఘటనపై ఇజ్రాయెల్ ఆర్మీ స్పందించలేదు.

రేపు మోదీ మంత్రిమండలి సమావేశం

కీలక అంశాలపై చర్చించే వీలు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర మంత్రి మండలి బుధవారం ఢిల్లీలో సమావేశంకానుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత మంత్రిమండలి సమావేశమవుతుండటం ఇదే తొలిసారి. కీలక అంశాలపై ఈ భేటీలో చర్చించే వీలుందని తెలుస్తోంది. మరోవైపు మోదీ మూడోసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా చేపట్టబోయే కార్యక్రమాలపైనా మంత్రులు చర్చిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ అంశంపైనా చర్చ జరగనుందని తెలుస్తోంది. తమ ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా మంత్రులనుద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. పాలనా వార్షికోత్సవాల్లో ప్రజలతో ఎలా మమేకం కావాలో మంత్రలకు మోదీ దిశానిర్దేశం చేయనున్నారు. కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రభుత్వ పథకాలపై చర్చ, సంబంధిత నిధుల మంజూరు వంటి కీలక అంశాలపై చర్చలు జరుగుతాయి. కానీ మంత్రి మండలి సమావేశంలో అలాంటి నిధుల మంజూరు తదితర చర్చలు ఉండవు.

భీకర నదిపై సాహస ప్రయాణం



ఈటానగర్: కుండపోత వానలతో తడిముద్దయిన అరుణాచల్ ప్రదేశ్‌లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొండప్రాంతాల గుండా వడివడిగా ప్రవహిస్తున్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌లో ఓ చోట కొండ ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహం ఉధృతంగా కిందకు దూసుకొస్తున్నాసరే ఓ వ్యక్తి సాహసానికి సిద్ధపడ్డాడు. నీటి ప్రవాహం మీద నిర్మించిన తాళ్ల వంతెనను ఎలాగైనా దాటి ఆవలి ఒడ్డుకు చేరుకోవాలని దుస్సాహసానికి తెగించాడు. భీకరంగా పారుతున్న నదిని అతను సాహసంతో దాటిన వీడియోను అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో సోమవారం పోస్ట్‌చేశారు. తమ రాష్ట్రంలో వర్షబీభత్సం స్థాయిని ఈ వీడియో పట్టిచూపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. అరుణాచల్‌లోని అంజా జిల్లాలోని కొండ ప్రాంతంలో తాళ్లతో ఈ సంప్రదాయక వేలాడే వంతెన నిర్మించారు. ఆదివారం నాటివర్షాలతో ఇక్కడ నీటి ఒరవడి ఎక్కువైంది. నడిచివెళ్లే చెక్క పలకలను బలంగా తాకుతూ ఉధృతంగా నీరు ప్రవహిస్తుండగా ఒక స్థానికుడు బ్యాక్‌ప్యాక్‌తో ఆ వంతెన పైతాళ్లను పట్టుకుని నెమ్మదిగా దాటుతున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. ఈ ప్రాంతం భారత్, చైనా, మయన్మార్ సరిహద్దులో ఉంది.

అమ్మానాన్నా అక్కర్లేదు.. పేరెంట్ చాలు

ట్రాన్స్‌జెండర్ జంట సంతానానికి కొత్త సర్టిఫికేట్ జారీ

కొచ్చి: లింగమార్పిడి జంటకు చెందిన సంతానానికి జనన ధృవీకరణ పత్రంలో అమ్మా, నాన్నా కాలమ్‌లకు బదులు కేవలం పేరెంట్ అని రెండు సార్లు సూచించాలని కేరళ హైకోర్టు స్థానిక యంత్రాంగానికి ఆదేశాలిచ్చింది. అబ్బాయిగా మారిన జహాద్, అమ్మాయిగా మారిన జియా పావల్‌లు తమ సంతానానికి లింగ నిష్పాక్షిక(జెండర్ న్యూట్రల్) జనన ధృవీకరణ సర్టిఫికేట్ ఇవ్వాలని ఈ జంట చేసిన అభ్యర్థనను కేరళలోని కోజికోడ్ మున్సిపల్ కార్పొరేషన్ నిరాకరించింది. అప్పటికే జహాద్‌ను తల్లిగా, జియాను తండ్రిగా పేర్కొంటూ జారీచేసిన బర్త్ సర్టిఫికేట్‌లో సవరణలు చేయడం కుదరదని తేల్చిచెప్పింది. దీంతో ఈ జంట కేరళ హైకోర్టును ఆశ్రయించగా జస్టిస్ ఎ.ఎ. జియాద్ రహమాన్ సారథ్యంలోని ధర్మాసనం కేసును విచారించి పై విధంగా తీర్పునిచ్చింది. జహాద్ వాస్తవానికి జన్మతః అమ్మాయి. గర్భంతో ఉన్నప్పుడు అబ్బాయిగా మారడానికి ప్రయత్నించినా కుదర్లేదు. దాంతో బిడ్డను జన్మనిచ్చి తర్వాత అబ్బాయిగా మారింది.

తొలి తెలుగు చరిత్రకారుడు ఏకామ్రనాథుడు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కాకతీయానంతర యుగం

భాష-సాహిత్యం

దేవగిరి యాదవులు, కాకతీయులపై ఢిల్లీ సుల్తాన్ల దండయాత్ర సమయంలో ఉర్దూ భాష దక్కన్ ప్రాంతంలో ప్రవేశించింది. ఉర్దూ భాష ఈ ప్రాంతంలో దక్కనీ ఉర్దూగా మారింది. తెలంగాణ భాషా సాహిత్యాలపై తనదైన ముద్ర వేసింది. పద్మనాయకుల రాజ్యంలో సంస్కృతంతోపాటు, తెలుగు భాషా సాహిత్యాలు ఆదరణ పొందాయి. సర్వజ్ఞ సింగభూపాలుడు రచించిన సారంగధరచరిత్రను తొలి యక్షగానంగా భావించవచ్చు. ఇతణ్నే ఒకటో సింగ భూపాలుడిగా పిలుస్తారు. అతడి కుమారుడైన అనపోతానాయకుడు రాచకొండ రాజ్యాన్ని విస్తరించాడు. అన పోతానాయకుడు కవి పండిత పోషకుడు. ఇతడు 'అభిరామ రాఘవమ'నే నాటకాన్ని రాశాడు.

విశ్వేశ్వరుడు చమత్కార చంద్రిక అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. దీన్ని సంస్కృత లక్షణ గ్రంథాలైన ధ్వన్యాలోకం, కావ్య ప్రకాశంతో పోల్చవచ్చు. ప్రతాపరుద్ర యశోభూషణం తరహాలోనే ఈ గ్రంథంలోని శ్లోకాలు కూడా సింగ భూపాలుడి ప్రశంసతో ఉన్నాయి. ఈ గ్రంథం నాటి చారిత్రక విషయాలను తెలుపుతోంది. వీరభద్ర విజృంభణం(డిమం), కరుణాకందళం(అంకం) ఇతడి ఇతర రచనలు. విశ్వేశ్వరుడు.. అనపోతానాయ కుడి, రెండో సింగ భూపాలుడి ఆస్థానాల్లోనూ స్థానం పొందాడు. అనపోతనాయకుడి మరో ఆస్థానకవి పశుపతి నాగనాథ కవి. ఇతడు విశ్వేశ్వరుడి శిష్యుడు. ఇతడు మదన విలాసం(సంస్కృతం), విష్ణుపురాణం అనే గ్రంథాలను రచించాడు. మదన విలాసంలో పద్మనాయకుల చరిత్ర విశేషాలు కనిపిస్తాయి. ధర్మపురికి చెందిన గొప్ప పండితుడు నరసింహసూరి. ఇతడు విద్యారణ్య స్వామి సమకాలికుడు. ఇతడు ప్రయోగపారిజాతం అనే స్మృతి గ్రంథాన్ని రచించాడు.

అనపోతానాయకుడి కుమారుడైన రెండో సింగ భూపాలుడు బహుముఖ ప్రజ్ఞాశాలి, కవి. ఇతడికి సంగీతం, నాటకం, నాట్యంలో మంచి ప్రావీణ్యం ఉంది. విశ్వేశ్వరుడు, నాగనాథుడు, బొమ్మకంటి అప్పయాచార్యుడు, శాకల్య మల్ల భట్టు తదితర కవి పండితులను పోషించాడు. రెండో సింగభూపాలుడు రసార్ణవ సుధాకరమనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. ఇతడి మరో ప్రసిద్ధ గ్రంథం సంగీత సుధాకరం. కందర్ప సంభవం అనే డిమం (నాటక భేదం)ను, కువలయావళి అనే నాటికను ఇతడు రచించాడు.

రాచకొండకు చెందిన మరో కవి మాధవ భూపాలుడు(రావుమాదానీడు). ఇతడు రామాయణానికి రాఘవీయ వ్యాఖ్య రాశాడు. ఇతడే 1376లో శ్రీశైల ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర బృహత్ శిలా మండపం కట్టించాడు. మాయిభట్టు దీనికి శాసనం రాశాడు. ఈ శాసన కావ్యంలో 28 శ్లోకాలు ఉన్నాయి. ఇందులో మాధవ నాయకుడి శౌర్య పరాక్రమాలను వర్ణించారు. మాధవ భూపాలుడి భార్య నాగాంబిక. ఈమె ఒక తటాకాన్ని నిర్మించింది. దాని కోసం 1429లో నాగారం శాసనాన్ని వేయించింది. ఈ శాసన రచయిత శంభునాథ కవి.


పద్మనాయకులతో సంబంధం లేకపోయినా ఈ యుగానికి చెందినవాడు కందనామాత్యుడు. ఇతడు సబ్బినాడు (కరీంనగర్, వరంగల్) పాలకుడైన ముప్ప భూపాలుడి మంత్రి. పద్మపురాణం, భాగవత దశమ స్కంధాలను మడికి సింగన, కందనామాత్యుడికి అంకితమిచ్చాడు. కదనా మ్యాతుడు రచించిన నీతితారావళి ద్వారా ఆ కాలం నాటి వ్యక్తుల ప్రవర్తనను తెలుసుకోవచ్చు. మడికి సింగన రచించిన 'సకలనీతి సమ్మతం' తెలుగులో తొలి సంకలన గ్రంథం. కాలగర్భంలో కలిసిపోయిన చాలామంది కవులపేర్లు ఈ గ్రంథం ద్వారా తెలుస్తున్నాయి. 21 గ్రంథాల నుంచి లోక, రాజ నీతులను సంపుటీకరించిన గ్రంథమిది. ఇతడు పద్మపురాణోత్తర ఖండం, భాగవత దశమ స్కంధం, జ్ఞాన వాసిష్ఠ రామాయణం తదితర రచనలు చేశాడు.

తొలి కవయిత్రి గంగాదేవి

ఈ యుగానికి చెందిన తొలి కవయిత్రి గంగాదేవి. కాకతీయుల ఆడపడచు అయిన గంగాదేవి విజయనగర రాజైన బుక్కరాయల కోడలు. కంపరాయల భార్య. ఈమె సంస్కృతంలో 'మధురావిజయ'మనే కావ్యాన్ని రచించింది. నాగేంద్రకవి తొలి శతకాల్లో ఒకటిగా పేర్కొనదగిన రమాధీశ్వర శతకాన్ని రచించాడు. ఇతడు భువనగిరికి చెందినవాడు. కవి భల్లటుడు గణమంజరి, పదమంజరి, శూద్రక రాజ చరిత్ర, భేతాళ పంచవింశతి, విక్రమార్క చరిత్ర (తెలుగు) అనే కావ్యాలను రాశాడు.

పోతన కొంత కాలం మూడో సింగభూపాలుడి ఆస్థానంలో ఉన్నాడు. పోతనను ఒంటిమిట్ట నుంచి ఓరుగల్లు తీసుకురావడానికి ఎంతో శ్రమించాల్సి వచ్చింది. దేశీఛందస్సును పాల్కురికి ప్రవేశ పెట్టాడు. పోతన దీన్ని స్వీకరించలేదు. కానీ దేశీ కవిత్వంలోని సరళత్వం ఇతడి కవిత్వంలో కనిపిస్తుంది. పోతన భోగినీ దండకంలో నాటి రాజుల భోగలాలసత్వాన్ని వర్ణించాడు. ఇతడు రాజాశ్రయాన్ని తిరస్కరించి ప్రత్యామ్నాయ సంస్కృతికి పట్టం కట్టాడు. మూడో సర్వజ్ఞ సింగభూపాలుడు స్వయంగా గొప్ప పండితుడు. వెలుగోటి వంశావళిలో పేర్కొన్న శ్రీనాథుడి పద్యం ద్వారా ఈ విషయం తెలుస్తోంది. మల్లినాథసూరి మెదక్ జిల్లా కొలిచెలిమకు చెందినవాడు. ఇతడు రఘువంశం,

కుమారసంభవం, మేఘ సందేశం, కిరాతార్జునీయం, శిశుపాలవధకు వ్యాఖ్యానాలు రాశాడు. మల్లినాథసూరి తమ్ముడైన పెద్దిభట్టు సంస్కృతంలో గొప్ప పండితుడు. పెద్దిభట్టు కుమారుడైన కొలిచెలిమ కుమారస్వామి సోమపీథి(సోమయాజి) కూడా గొప్ప వ్యాఖ్యాత. ఇతడు ప్రతాపరుద్రీయానికి రత్నాపణం అనే వ్యాఖ్యానం రాశాడు. రాచకొండకు చెందిన బొమ్మకంటి హరిహరుడు అనర్ఘరాఘవానికి వ్యాఖ్య రాశాడు.



నాథ సంప్రదాయం

రాచకొండ మంత్రుల వంశానికి చెందిన గౌరన ఈ యుగానికి చెందిన మరో గొప్పకవి. పాల్కురికి 'ద్విపద'ను స్వీకరించి హరిశ్చంద్రోపాఖ్యానం, నవనాథ చరిత్రలను రచించాడు. ఇతడు తెలుగు సాహిత్యంలో తొలిసారిగా నాథ సంప్రదాయాన్ని ప్రవేశపెట్టాడు. అది తెలంగాణ, రాయలసీమల్లో విశేష ప్రాచుర్యం పొందింది. నాథ సంప్రదాయం విగ్రహారాధన, కులతత్వాన్ని నిరసించింది. దేవరకొండకు చెందిన సూరన తొలి కల్పిత కావ్య మైన ధనాభిరామాన్ని రచించాడు. గౌరన కుమా రుడైన భైరవకవి తెలంగాణలో బంధకవిత్వ ప్రక్రియకు ఆద్యుడు. ఇతడు శ్రీ రంగమహాత్మ్యం, రత్నపరీక్ష, కవి గజాంకుశం (ఛందోగ్రంథం)ను రచించాడు.

అనంతామాత్యుడు భోజరాజీయ కావ్యం, ఛందోదర్పణం, రసాభరణం అనే గ్రంథాలను రచించాడు. ఏర్చూరి సింగన భాగవత షష్ఠమస్కంధాన్ని రాశాడు. ఇతడు నల్లగొండ జిల్లాలోని ఏరూర్పుకు చెందినవాడు. ఇతడి మరో రచన కువలయాశ్వ చరిత్ర. బొప్పరాజు గంగన పంచమస్కంధను రచించాడు.

రేచర్ల రెడ్డి వంశస్థుల రాజధాని పిల్లలమర్రి. ఇది పిన వీరభద్రుడి జన్మస్థలం. 'వాణి నా రాణి' అని సగర్వంగా చెప్పుకున్న మహాకవి పిల్లలమర్రి పినవీరభద్రుడు. ఇతడు అవతారదర్పణం, నారదీయ పురాణం, మాఘమహాత్మ్యం, మానసోల్లాస సారం, శృంగార శాకుంతలం, జైమినీ భారతం అనే గ్రంథాలను రచించాడు. ప్రబంధాల్లో కనిపించే అనేక వర్ణనలకు, పద్యాల ఎత్తుగడలకూ ఒరవడి సృష్టించిన మార్గదర్శి పినవీరభద్రుడు.

కొలని గణపతి దేవుడు శివయోగసారం, మనోబోధ రచించాడు. కాకతీయ సామ్రాజ్య చరిత్రలో కొన్ని ఘట్టాలకు శివయోగసారం ఆధారం. భాగవతంలోని షష్ఠ, ఏకాదశ, ద్వాదశ స్కంధాలను పోతన అనువదించలేదు. వీటిని హరిభట్టు అనువదించాడు. రతి రహస్యం, వరాహపురాణం, మత్స్య పురాణం, నారసింహపురాణం ఇతడి ఇతర రచనలు. త్రిలోకభేది సకల ధర్మసారం రాశాడు. ఇతడు గౌరన మనవడు. రాజుల మెప్పు కోసం కవులు.. అవధానం, సమస్య పూరణం, గర్భ, గోప్య, బంధ, అక్షరచ్యుత, మాత్రాచ్యుత, ఏక, ద్విసంధాదారణ ప్రక్రియలను అనుసరించడం ఈ కాలం నుంచే మొదలైంది.

ఏకామ్రనాథుడు

కాకతీయ రాజుల చరిత్ర, వంశావళి, వారి పూర్వీకుల క్రమాభివృద్ధి తదితరాలను తెలిపేందుకు ఏకామ్రనాథుడు ప్రయత్నించాడు. ఇతడు తొలి తెలుగు చరిత్రకారుడు. ఓరుగల్లుకు చెందిన ఇతడు ప్రతాపరుద్ర చరిత్రం, ద్వాత్రింశత్సాలభంజికల కథలు అనే గ్రంథాలను రచించాడని తెలుస్తోంది. ప్రతాపరుద్ర చరిత్రం తెలుగులో తొలి వచన రచన. తొలి చారిత్రక గ్రంథం. కాకతీయుల వివరాలతో పాటు నాటి మతాలు, మత వైషమ్యాలు, సంప్రదాయాలు, సాంఘిక ఆచారాలు,

సంప్రదాయాలను ఇందులో పేర్కొన్నారు. ప్రతాపరుద్రుడి దినచర్య, వ్యక్తిత్వాన్ని గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. ఓరుగల్లు సమీపంలోని వివిధ వర్ణాల, వృత్తుల వారి సంఖ్య తదితర విషయాలను ఈ గ్రంథం తెలుపుతోంది. ప్రతాపరుద్ర చరిత్రం

ఆనాటి సాంఘిక చరిత్ర. కొరవి గోపరాజు

పాల్కురికి రచనల తర్వాత తెలంగాణ సాంఘిక జీవితాన్ని విస్తృతంగా వర్ణించిన కావ్యం 'సింహాసన ద్వాత్రింశిక'. దీని రచయిత కొరవి గోపరాజు. ఇతడు నిజామాబాద్ జిల్లా వేముగల్లు (భీమగల్లు)కు చెందినవాడు. ఇతడి పూర్వీకులు రాచకొండలో మంత్రులుగా పనిచేశారు. సింహాసన ద్వాత్రింశికకు విక్రమార్క చరిత్ర అనే సంస్కృత కావ్యం మూలం. కానీ గోపరాజు అనేక కల్పనలు చేసి దీన్ని స్వతంత్ర కావ్యంగా రూపొందించాడు. అందుకే ఈ గ్రంథంలో నాటి సాంఘిక జీవితాన్ని చిత్రించడం సాధ్యమైంది. గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో పేద, ధనిక తారతమ్యాలను చక్కగా వర్ణించాడు. మనసు లోతుల్ని విశ్లేషించిన తొలి మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తగా ఫ్రాయిడ్‌ను పేర్కొంటారు. కానీ శతాబ్దాల ముందే కొరవి గోపరాజు మనసు లోతుల్ని, కలల్ని విశ్లేషించాడు. సింహాసన ద్వాత్రింశిక తెలంగాణ గొప్ప కావ్యాల్లో ఒకటిగా నిలిచిపోయింది.

పిడుపర్తి కవులు పాల్కురికి మార్గంలో శైవ సాహిత్యాన్ని విరివిగా రాశారు. ఓరుగల్లుకు చెందిన పిడుపర్తి ఒకటో బసవకవి పిల్లనైనారుకథ, బ్రహ్మోత్తర ఖండంతోపాటు గురుదీక్షాబోధను రచించాడు. ఇతడి పెద తండ్రి కుమారుడైన పిడుపర్తి నిమ్మనాథుడు 'నిజ లింగ చిక్కయ్య కథ' అనే యక్షగానాన్ని రచించాడు. రెండో సోమనాథుడు పాల్కురికి సోమనాథుడి పండితారాధ్య చరిత్రను పద్య ప్రబంధంగా రచించాడు. ఇతడు ఒకటో బసవకవి కుమారుడు. ఇతడే 'ప్రభులింగలీలలు' అనే ద్విపద కావ్యాన్ని కూడా రచించాడు. పిడుపర్తి రెండో బసవ కవి దీన్నే పద్యకావ్యంగా కూర్చాడు. ఇతడు ఒకటో బసవకవి మనవడు.

మత పరిస్థితులు

ఈ యుగంలో శైవమత ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. వైష్ణవ మతం కూడా ప్రాచుర్యం పొందింది. ఈ రెండు మతాల మధ్య వివాదాలు తలెత్తేవి. పద్మనాయకుల ఆస్థానంలోని శాకల్య భట్టు, పరాశర భట్టు మధ్య జరిగిన వివాదమే అందుకు నిదర్శనం. పద్మనాయకులు తాము శివ దేవతాపారాయణులమని చెప్పుకున్నారు. ఒకటో అనపోతానాయకుడు శైవమతాభిమాని. ఆయన ఉమామహేశ్వరం వద్ద శ్రీశైల ఉత్తర ద్వార మండపాన్ని నిర్మించాడు. అనేక శివాలయాలు, శ్రీ పర్వత శిఖరానికి సోపానాలు నిర్మించాడు. తొలి పద్మనాయకులు శైవమతాన్ని ఆదరించారు. కానీ రెండో సింగభూపాలుడి కాలం నుంచి వైష్ణవ మత ప్రాధాన్యం పెరిగింది. రెండో అనపోతానాయకుడు రామాలయం నిర్మించాడు. రావు మాదానీడు రాఘవీయ వ్యాఖ్య రాశాడు, శ్రీ రంగనాథుడికి దానాలిచ్చాడు. మూడో సింగ భూపాలుడు బెల్లంకొండ, తిరుపతి శాసనాలు వేయించాడు. వసంత నాయకుడు కంజీవర శాసనాన్ని, ధర్మానాయకుడు శాయంపేట శాసనాన్ని వేయించాడు. ఇవన్నీ వైష్ణవ మత ఉన్నతిని సూచిస్తున్నాయి. వేదాంత దేశికులు వైష్ణవ మత వ్యాప్తికి తోడ్పడ్డారు. వీరు సుభాషిత నీతి, తత్త్వ సందేశ, రహస్య సందేశ గ్రంథాలను రచించారు. వైష్ణవం వడగల్, తెంగల్ అనే శాఖలుగా చీలిపోయింది. వేదాంత దేశికులు వడగల్ శాఖను ప్రచారం చేశారు. ఈ శాఖకు చెందిన వారు వైదిక ఆచార వ్యవహారాలను పాటించేవారు. ఈ శాఖ తెలంగాణ అంతటా వ్యాపించింది. మత ప్రచారం కోసం మఠాలను నిర్మించేవారు. వైదిక, పురాణ దేవతలతోపాటు కట్టమైసమ్మ, రేణుక, ముత్యాలమ్మ, మైసమ్మ, మారె మ్మ, ఏకవీర దేవతలకు కూడా ఆలయాలు నిర్మించేవారు. యక్షగానాలు, భాగోతుల ప్రాచుర్యం కూడా వైష్ణవ మత వ్యాప్తిని సూచిస్తున్నాయి. బహమనీ సుల్తాన్‌లు మత అసహనాన్ని ప్రదర్శించారు. హుమాయూన్ జలీం షా పిల్లలమర్రి దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. బహమనీ సుల్తాన్ల చర్యలకు మత కారణాలే కాక రాజకీయ, ఆర్థిక కారణాలు కూడా ఉన్నాయి. వీరి దాడుల నుంచి ప్రాణాలను రక్షించుకోవడానికి లక్షలాది మంది ప్రజలు ఇస్లాం మతాన్ని స్వీకరించారు.

అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ



వ్యాధులు

1. ఒక వ్యాధిగ్రస్తుడికి నీటిని చూస్తే భయం, వణుకు పుడుతుంది. అతనికున్న వ్యాధి?
   1) డెంగ్యూ 2) టెటానస్
   3) రేబిస్ 4) ఎయిడ్స్
2. కిందివాటిలో ఏ వ్యాధి లైంగిక సంపర్కానికి సంబంధించింది కాదు?
   1) వైరల్ ఎన్‌సెఫాలిటిస్
   2) గనేరియా 3) సిఫిలిస్
   4) యాంటీ ఇమ్యునో డెఫిషియన్సీ- సిండ్రోమ్
3. లాలాజల గ్రంథులపై దాడి చేసే పారామిక్సో వైరస్ వల్ల కలిగే వ్యాధి?
   1) జలుబు 2) గవద బిళ్లలు
   3) మీజిల్స్ 4) డయేరియా
4. సిఫిలిస్, మలేరియా, కలరా వంటి వ్యాధులు సంక్రమించడానికి కారకాలు వరుస క్రమంలో?
   1) ప్రోటోజోవా - ప్రత్యక్ష సంబంధం - ఈగలు
   2) ఎలుకలు - ఆడ అనాఫిలిస్ దోమ - నీరు
   3) లైంగిక సంపర్కం - ఆడ అనాఫిలిస్ దోమ - ఈగలు
   4) మట్టిలోని బ్యాక్టీరియా -కలుషిత ఆహారం - గాలి
5. ట్రిపనోసోమా గాంబియన్సీ అనే ప్రోటోజోవన్ వల్ల కలిగే వ్యాధి?
   1) టైఫాయిడ్ 2) అతిసారం
   3) న్యుమోనియా 4) నిద్రాజాడ్యం
6. కిందివాటిలో సరైన జత?
   1) ప్లాస్మోడియం - సాండ్ ఈగ
   2) విబ్రియో కలరా - ఆడ అనాఫిలిస్ దోమ
   3) ట్రిపనో సోమా - సీసీ ఈగ
   4) క్లాస్ట్రీడియం టెటాని - పెంపుడు జంతువు
7. చికిత్స కోసం వైద్యుడి వద్దకు వెళ్లిన వ్యాధిగ్రస్థులు చెప్పిన లక్షణాల క్రమం కింది విధంగా ఉంది.
   ఎ. చలిజ్వరం, తీవ్ర తల నొప్పి
   బి. రక్త విరేచనాలు - పొత్తి కడుపు నొప్పి
   సి. కండరాల సంకోచం - నరాల తీపులు
   వీరు బాధపడుతున్న వ్యాధులు వరుస క్రమంలో తెల్పండి.
   1) కలరా - టైఫాయిడ్ - డిఫ్తీరియా
   2) అమీబియాసిస్ - మలేరియా - డయేరియా
   3) మలేరియా- అమీబియాసిస్ - ధనుర్వాతం
   4) అపెండెసైటిస్ - ధనుర్వాతం - పోలియో
8. కిందివాటిలో ఏ వ్యాధి కలుషిత ఆహారం, ఈగల వల్ల సంక్రమించదు?
   1) మలేరియా 2) కలరా
   3) టైఫాయిడ్ 4) అమీబియాసిస్
9. న్యుమోనియా వ్యాధిని కలిగించే సూక్ష్మజీవికి సంబంధించింది?
   1) వైరస్ 2) బ్యాక్టీరియా
   3) ప్రోటోజోవన్ 4) శిలీంధ్రం
10. వ్యాధి, వ్యాధి కారకానికి సంబంధించి సరి కాని జత?
    1) మలేరియా - ప్లాస్మోడియం
    2) స్లీపింగ్ సిక్‌నెస్ - ట్రిపనోసోమా
    3) గవదబిళ్లలు - ఎన్‌సెఫలాటిస్ వైరస్
    4) జలుబు - రినో వైరస్
11. ఏ వ్యాధి ప్రభావం శ్వాస అవయవాలపై ఉండదు?
    1) ట్యుబర్ క్యులోసిస్ 2) న్యుమోనియా
    3) కోరింత దగ్గు 4) మీజిల్స్
12. కిందివాటిలో క్షయ వ్యాధికి చెందిన లక్షణం?
    1) శ్లేష్మంతో కూడిన దగ్గు
    2) ఆకలి తగ్గడం, బరువు తగ్గడం
    3) జ్వరం 4) పైవన్నీ
13. 'హైడ్రోఫోబియా'ను కలిగించే వైరస్?
    1) హెర్పెస్ వైరస్ 2) రాబ్డో వైరస్
    3) ఎన్‌సెఫలాటిస్ 4) ఆరోమిక్సో వైరస్
14. ప్లేగు వ్యాధి నిర్మూలనకు ఎవరు కనుగొన్న టెట్రాసైక్లిన్ అనే ఔషధం ఉపయోగపడింది?
    1) అబ్దుల్ కలాం
    2) డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు
    3) లూయీ పాశ్చర్
    4) అలెగ్జాండర్ ఫ్లెమింగో
15. ఏ వ్యాధి బ్యాక్టీరియా, వైరస్, ప్రోటోజోవన్ వల్ల కలుగదు?
    1) క్యాషియోర్కర్ 2) టెటానస్
    3) మలేరియా 4) న్యుమోనియా
16. క్యాషియోర్కర్ దేని లోపం వల్ల వస్తుంది?
    1) ఇనుము 2) ప్రోటీన్
    3) అయోడిన్ 4) కాల్షియం
17. పొటాషియం లోపం వల్ల వచ్చే వ్యాధి?
    1) హైపోకలేమియా 2) హైపోనట్రేమియా
    3) హైపోగ్లైసిస్ 4) అనీమియా
18. పోషక పదార్థాలు, వాటి లోపాలకు సంబంధించి సరైన జతలు?
    ఎ. ఇనుము - కండరాల పక్షవాతం
    బి. సోడియం - హైపోనట్రేమియా
    సి. కాల్షియం - ఆస్టియో మలేసియా
    డి. పొటాషియం - క్వాషియోర్కర్
    1) ఎ, బి 2) ఎ, సి 3) బి, డి 4) సి, డి
19. అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధి?
    1) రక్తహీనత 2) బానపొట్ట
    3) థైరాయిడ్ వాయడం 4) మెరాస్మస్
20. ఒక వ్యక్తిలో నిర్జలీకరణం, రక్తపోటు తగ్గడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాలు గుర్తించారు. ఆ వ్యక్తిలో కింది వాటిలో ఏ ధాతు లోపం ఉన్నట్లు నిర్ధారించవచ్చు?
    1) కాల్షియం 2) అయోడిన్
    3) పొటాషియం 4) సోడియం

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2;
4) 3; 5) 4; 6) 3;
7) 3; 8) 1; 9) 2;
10) 3; 11) 4; 12) 4;
13) 2; 14) 2; 15) 1;
16) 2; 17) 1; 18) 3;

పోషక పదార్థాల లోపం వల్ల వచ్చే వ్యాధులు

పదార్థ లోపం	వ్యాధి	కారణం/లక్షణాలు
ప్రోటీన్	క్యాషియోర్కర్	తల్లిపాల బదులు కార్బోహైడ్రేట్ ఆహారంపై ఆధారపడ్డ ఐదేళ్లలోపు పిల్లలు ఈ వ్యాధికి లోనవుతారు. వికారంగా ఉండటం, పెరుగుదల ఆగిపోవడం, బరువు కోల్పోవడం, బాన పొట్ట, మానసిక వైకల్యం కలుగుతాయి.
ఖనిజాలు	మెరాస్మస్	తల్లిపాలకు బదులు పోషక విలువలు తక్కువగా ఉన్న ఆహారం తీసుకునే ఏడాదిలోపు పిల్లలు ఈ వ్యాధికి లోనవుతారు. కండరాలు సరిగా ఎదగక పోవడం, అవయవాల బలహీనత, పక్క టెముకలు బయట పడటం వంటివి కలుగుతాయి.
ఇనుము (Fe)	రక్త హీనత	ఎర్ర రక్తకణాల్లో హీమోగ్లోబిన్ లోపం వల్ల వ్యక్తులు పాలిపోవడం, ఆకలి కోల్పోవడం, త్వరగా అలసిపోవడం.
సోడియం	హైపోనట్రేమియా	సోడియం నష్టపోవడం, నిర్జలీకరణం, రక్తపోటు తగ్గడం, బరువు కోల్పోవడం
అయోడిన్ (I)	గ్రంథివాపు	థైరాయిడ్ గ్రంథివాపు
కాల్షియం Ca	రికెట్స్, ఆస్టియో మలేసియా	విటమిన్ డి లోపం ఏర్పడుతుంది.

వైరస్‌ల వల్ల వచ్చే వ్యాధులు

వ్యాధి	కారకం	వ్యాపించే విధానం	లక్షణాలు
జలుబు	రినోవైరస్	తుంపరల వల్ల, ప్రత్యక్ష సంబంధం	ముక్కు కారడం, తలనొప్పి
పోలియో మైలిటిస్	పోలియో వైరస్, ఎంటరో వైరస్	ఈగలు, నీరు, ఆహారం	తలనొప్పి, వాంతులు, శరీరంలో ఒకటి రెండు అవయవాలకు పక్షవాతం, బలహీనత
గవద బిళ్లలు (మంప్స్)	పారామిక్సో వైరస్ పరోటైడస్	ప్రత్యక్ష సంబంధం, వైరస్ లాలాజల గ్రంథుల మీద దాడి	జ్వరం, తలనొప్పి, లాలాజలం అధికంగా ఊరడం - లాలాజల గ్రంథులు వాయడం, గొంతుఎండిపోవడం
తట్టు (మీజిల్స్)	పారామిక్సో వైరస్ (తట్టు వైరస్)	ప్రత్యక్షసంబంధం దగ్గేటప్పుడు తంపరల ద్వారా	ముక్కు కారడం, శ్లేష్మ పటలం వెలువడే వాపు, చర్మం మీద ఎర్రని గుల్లలు
మశూచి	వరియొల వైరస్	ప్రత్యక్ష సంబంధం	జ్వరం, తలనొప్పి, వెన్నునొప్పి, (స్మాల్‌పాక్స్) చర్మం మీద గుల్లలు, పొక్కులు ఏర్పడి గుంటలు పడటం
ఇన్‌ఫ్లూయెంజా	ఆర్థోమిక్సో వైరస్	ప్రత్యక్ష సంబంధం, వస్తువుల ద్వారా	జ్వరం, కండరాల నొప్పి, గొంతు పుండు, పొడిదగ్గు, ఊపిరితిత్తు (ఫ్లూ)లపై బ్యాక్టీరియా దాడి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. మలేరియా సోకిన మానవునిలో చలి జ్వరం వచ్చే సమయం?
   1) ఎర్ర రక్తకణాలు పగిలి మీరో జాయింట్లు విడుదలయ్యే సమయం
   2) స్పోరో జాయింట్ల ఉత్పత్తి సమయం
   3) స్పోరో జాయింట్లు కాలేయ కణాల్లో చేరే సమయం
   4) క్రిప్టో మీరో జాయింట్లు ఎర్ర రక్త కణాల్లో ప్రవేశించే సమయం
2. మానవుల్లో వచ్చే x-డిఫ్తీరియా, y-తట్టు, z-కోరింత దగ్గు అనే వ్యాధులను కల్గించే సూక్ష్మజీవుల పేర్ల క్రమం?
   1) x-వైరస్,y-బ్యాక్టీరియా, z-ప్రోటోజోవా
   2) x-ప్రోటోజోవా, y-బ్యాక్టీరియా, z- వైరస్
   3) x-వైరస్, y-బ్యాక్టీరియా, z- వైరస్
   4) x-బ్యాక్టీరియా, y-వైరస్, z-బ్యాక్టీరియా
3. ఏ వ్యాధి సోకితే శరీరం నుంచి ఎక్కువ శాతం నీరు బయటకు పోయి నిర్జలీకరణ స్థితి ఏర్పడుతుంది?
   1) టైఫాయిడ్ 2) మలేరియా
   3) కలరా 4) డిఫ్తీరియా
4. వేటిని తగినంత మొత్తాల్లో భుజించకపోతే మనం త్వరగా అలసిపోయి నీరసంగా తయారవుతాం?
   1) కార్బోహైడ్రేట్‌లు 2) ప్రోటీన్‌లు
   3) కొవ్వులు 4) విటమిన్‌లు
5. 'మిక్సోవైరస్ పరోటైడస్' వల్ల కలిగే వ్యాధి?
   1) మెదడువాపు
   2) గవద బిళ్లలు
   3) తట్టు
   4) హెపటైటిస్

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3;
4) 1; 5) 2.

విద్య, ఉద్యోగ సమాచారం



ఐఐఐటీడీసీ, ఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఢిల్లీలోని వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-01, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ /డిగ్రీ (ఇంజనీరింగ్)/పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 32 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,500 నుంచి రూ.81,100.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** 06.06.2025.
» **వెబ్‌సైట్:** https://iiitd.ac.in/

ఐన్‌స్టీన్‌కు ఏ పరిశోధనకు నోబెల్ లభించింది?

పరమాణు నిర్మాణం

క్వాంటం సిద్ధాంతం - కాంతి విద్యుత్ ఫలితం


కాంతి విద్యుత్ ఫలితం: ఒక లోహ ఉపరితలాన్ని కాంతి కిరణపుంజంతో ఢీకొట్టించినప్పుడు, దాని ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదలవుతాయి. ఈ దృగ్విషయాన్నే కాంతి విద్యుత్ ఫలితం(Photo Electric Effect) అంటారు.


- అన్ని రకాల కాంతి కిరణాలు అన్ని లోహాల ఉపరితలాల నుంచి ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేయవు.
- ఎలక్ట్రాన్‌లను తేలికగా కోల్పోయే స్వభావం అంటే అతి తక్కువ అయనీకరణ శక్మం (ఒక వాయు స్థితిలోని ఒంటరి పరమాణువు చిట్ట చివరి కక్ష్యలోని ఎలక్ట్రాన్‌ను తొలగించడానికి కావాల్సిన శక్తి) ఉన్నటువంటి లోహాలే కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపిస్తాయి.
- ప్రతి లోహానికి సంబంధించి ఒక అభిలాక్షణిక (దానికే ప్రత్యేకమైన) పౌనఃపున్యం ఉంటుంది. లోహ ఉపరితలాన్ని ఢీకొట్టే పతనకాంతి పౌనఃపున్యం, ఆ లోహానికి సంబంధించిన అభిలాక్షణిక పౌనఃపున్యం కంటే ఎక్కువ ఉన్నప్పుడే లోహ ఉపరిత లం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదలవుతాయి.
- ఉదాహరణకు పొటాషియం లోహ ఉపరితలం నుంచి ఊదారంగు కిరణాలు ఎలక్ట్రాన్‌లను విడుదల చేస్తాయి. కానీ, ఎరుపు రంగు కిరణాలు ఎలక్ట్రాన్‌లను విడుదల చేయవు.
- దీనికి కారణాలను ఆయా కాంతి కిరణాల పౌనఃపున్యాల (లేదా తరంగదైర్ఘ్యం లేదా శక్తి) ఆధారంగా విశ్లేషించొచ్చు.
- కింది పట్టికను పరిశీలిస్తే ఎరుపు కిరణాల పౌనఃపున్యం లేదా శక్తి తక్కువ (తక్కువ తరంగదైర్ఘ్యం) కాబట్టి పొటాషియం లోహ ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదల కావని తెలుస్తుంది.
- సాధారణంగా తక్కువ అయనీకరణ శక్మం ఉన్న క్షార లోహాలు ఫొటో విద్యుత్ ఫలితాన్ని చూపిస్తాయి. అవి పొటాషియం, రుబీడియం, సీజియం. ఈ క్రమంలోనే పరమాణు సైజు పెరిగి అయనీకరణ శక్మాలు పెరగడం వల్ల కాంతి విద్యుత్ ఫలితం చూపించే సామర్థ్యం కూడా ఎక్కువ. అంటే క్షార లోహాలైన లిథియం, సోడియం దాదాపుగా కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపించవు. సీజియం తేలికగా కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపిస్తుంది.
- కాంతి విద్యుత్ ఫలితాన్ని 'సాధారణీకృత క్వాంటం సిద్ధాంతం' ద్వారా ఐన్‌స్టీన్ వివరించాడు. ఆయన కృషి ఫలితంగా 1905 లో నోబెల్ బహుమతి లభించింది.
- ఈ సిద్ధాంత ప్రకారం ఫోటాన్‌లుగా భావించే కాంతి కణాల శక్తి (E), పౌనఃపున్యానికి (υ) అనులోమానుపాతంలో ఉంటుంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

కెమిస్ట్రీ





[$E = h\upsilon$, h ప్లాంక్ స్థిరాంకం]

- లోహం నుంచి ఎలక్ట్రాన్‌ను బయటకు తొలగించడానికి అవసరమైన శక్తి ఫోటాన్ కు ఉన్నప్పుడే లోహ ఉపరితలాన్ని ఫోటాన్ ఢీకొట్టినప్పుడు దాని నుంచి ఎలక్ట్రాన్‌లు బహిర్గతమవుతాయి. ఫోటాన్ శక్తి అవసరమైన దానికంటే తక్కువగా ఉంటే అది లోహం నుంచి ఎలక్ట్రాన్‌లను విడుదల చేయదు.
- ఒక ఫోటాన్ లోహ ఉపరితలాన్ని ఢీకొట్టినప్పుడు అది రెండు పనులు చేయాలి. ఎలక్ట్రాన్‌ల మీద ఉన్న లోహ కేంద్రక ఆకర్షణ బలాలను అధిగమించి విడుదల చేయగలగాలి. తర్వాత వాటికి కొంత శక్తి(గతిజశక్తి) నిచ్చి లోహ ఉపరితలానికి దూరంగా(తిరి గి లోహంలో చేరకుండా) తీసుకెళ్లగలగాలి. అంటే ఈ రెండు పనులు చేయగలిగిన శక్తి లోహాన్ని ఢీకొట్టే ఫోటాన్‌లకు ఉండాలి.
- దీనికి సమీకరణ రూపం: $h\upsilon = W + KE$

$h\upsilon$ = ఫోటాన్‌ల శక్తి

W = ఎలక్ట్రాన్‌లపై ఉన్న లోహ ఆకర్షణ బలాలను అధిగమించే శక్తి (పని ప్రమేయం)

KE = విడుదలైన ఎలక్ట్రాన్‌ల గతిజశక్తి

కాంతి విద్యుత్ ఫలితానికి సంబంధించిన ముఖ్య విషయాలు

- ప్రతి లోహం, కొంత కనీస పౌనఃపున్యం లేదా శక్తి ఉన్న కాంతి పడినప్పుడే ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేస్తుంది. దీన్నే ఆరంభ లేదా ద్వార పౌనఃపున్యం (Threshold Frequency) అంటారు. ఈ ఆరంభ పౌనఃపున్యం కంటే తక్కువ పౌనఃపున్యం ఉన్న కాంతిని ఎంతసేపు ప్రసరింపజేసినా లోహ ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేయలేం.
- వేర్వేరు లోహాలకు ఈ ఆరంభ పౌనఃపున్యం వేరుగా ఉంటుంది. విడుదలైన ఎలక్ట్రాన్‌ల గతిజ శక్తి పతన (ఢీకొట్టిన) కాంతి పౌనఃపున్యం పై ఆధారపడి ఉంటుంది. దాని తీవ్రతపై ఆధారపడదు.
- ఒక సెకనులో విడుదలైన ఎలక్ట్రాన్‌ల సంఖ్య కాంతి తీవ్రతపై ఆధారపడి ఉంటుంది. దాని పౌనఃపున్యంపై ఆధారపడి ఉండదు.
- ఒకవేళ ఎలక్ట్రాన్ విడుదలకు కావాల్సిన శక్తికంటే తక్కువ శక్తి ఉన్న ఫోటాన్‌ను వస్తువు గ్రహించినప్పుడు ఎలక్ట్రాన్‌లు భూస్థాయి (అల్ప శక్తిస్థాయి) నుంచి ఉత్తేజిత శక్తిస్థాయి (అధిక శక్తిస్థాయి)లోకి పరివర్తనం చెందుతాయి. అయితే అధిక శక్తి స్థాయిల్లో ఎలక్ట్రాన్‌లు ఎక్కువసేపు ఉండలేవు (అస్థిరం). కాబట్టి తిరిగి భూస్థాయికొస్తాయి. ఈ ప్రక్రియలో అంటే ఎలక్ట్రాన్‌లు అధికశక్తి నుంచి తిరిగి భూస్థాయిలోకి వస్తున్నప్పుడు గ్రహించిన శక్తి విడుదలవుతుంది. ఈ విడుదలయ్యే శక్తి వికిరణ రూ పంలో ఉంటుంది. తద్వారా వర్ణపటాలు ఏర్పడతాయి. కాబట్టి వివిధ మూలకాలను వేడిచేసినప్పుడు అవి విలక్షణమైన రంగులనిస్తాయి. (దీపావళి టపాకాయలు)

లోహం	-	జ్వాల రంగు
మెగ్నీషియం	-	తెలుపు
కాల్షియం	-	ఇటుక ఎరుపు
స్ట్రాన్షియం	-	కెంపు రంగు
బేరియం	-	లేత ఆకుపచ్చ
లిథియం	-	సింధూర ఎరుపు
సోడియం	-	పసుపు
పొటాషియం	-	ఊదా
రుబీడియం	-	ఎరుపు – ఊదా
సీజియం	-	నీలి వర్ణం.

మాదిరి ప్రశ్నలు

1. ప్లాంక్ సిద్ధాంతం ప్రకారం సరైన వాక్యాలు ఏవి?
   ఎ) కాంతి ఫోటాన్‌లు (క్వాంటా) అనే చిన్న చిన్న శక్తి ప్యాకెట్‌ల రూపంలో ఉద్గారం లేదా శోషణం చెందుతుంది
   బి) ఫోటాన్‌లు కాంతి వేగానికి సమానమైన వేగంతో ప్రయాణిస్తాయి.
   సి) పదార్థ కాంతి శోషణం లేదా ఉద్గారం అవిచ్ఛిన్నంగా ఉంటుంది.
   1) ఎ, సి 2) ఎ, బి
   3) బి, సి 4) ఎ, బి, సి
2. తనపై పడిన వికిరణాలను సంపూర్ణంగా శోషించుకునే లేదా ఉద్గారం చేసే వస్తువును ఏమంటారు?
   1) ఉత్సర్గ నాళిక 2) శీతల వస్తువు
   3) కృష్ణ వస్తువు 4) హరిత వస్తువు
3. క్వాంటా అనేది?
   1) శక్తి ప్యాకెట్ 2) కరెన్సీ
   3) క్వింటాలు 4) కాంతి ప్రమాణం
4. ఫొటో విద్యుత్ ఫలితంలో ఫొటో ఎలక్ట్రాన్‌ల ఉద్గారం దేనిపై ఆధారపడి ఉంటుంది?
   1) ఆరంభ పౌనఃపున్యం
   2) పతన కాంతి తీవ్రత
   3) లోహ స్వభావం 4) అన్నీ
5. ఐన్‌స్టీన్‌కు ఏ పరిశోధనకు నోబెల్ బహుమతి లభించింది?
   1) సాపేక్షతా సిద్ధాంతం 2) కాంతి పరిక్షేపణం
   3) కాంతి విద్యుత్ ఫలితం
   4) క్వాంటం సిద్ధాంతం
6. ఒక ఫోటాన్ శక్తి ..... కు అనులోమానుపాతంలోనూ ..... కు విలోమానుపాతంలోనూ ఉంటుంది?
   1) పౌనఃపున్యం, తరంగదైర్ఘ్యం
   2) తరంగదైర్ఘ్యం, పౌనఃపున్యం
   3) కాంతి తీవ్రత, తరంగదైర్ఘ్యం
   4) పౌనఃపున్యం, కాంతి తీవ్రత
7. ఎక్కువ పౌనఃపున్యం (తక్కువ తరంగ దైర్ఘ్యం ఉన్న) దృగ్గోచర కాంతి రంగు?
   1) నారింజ 2) ఎరుపు
   3) పసుపు 4) ఊదా
8. అల్యూమినియం (Al) తలం పని ప్రమేయం 4.2eV. సోడియం (Na) తలం పని ప్రమేయం 2.0eV ఈ రెండు లోహాల తలాలపై వికిరణాలు పడి ఫొటో విద్యుత్ ఫలితం ఇవ్వగా కింది పరిశీలనలు వచ్చాయి.
   1) Al, Naలకు ఒకే ద్వార పౌనఃపున్యం ఉంది.
   2) Al ద్వార పౌనఃపున్యం > Na ద్వార పౌనఃపున్యం
   3) Na ద్వార పౌనఃపున్యం > Al ద్వార పౌనఃపున్యం 4) ఏదీకాదు
9. లిథియం, సోడియం, పొటాషియం, కాల్షియంల ప్రథమ అయనీకరణ శక్మాలు (eV) వరుసగా 5.39, 5.13, 4.34, 6.11 అయితే ఏది కాంతి విద్యుత్ ఫలితాన్ని సులభంగా ప్రదర్శిస్తుంది?
   1) పొటాషియం 2) లిథియం
   3) సోడియం 4) కాల్షియం
10. సీజియం, సోడియం, అల్యూమినియంల పని ప్రమేయాలు వరుసగా 1.9eV, 2.0eV, 4.2eV అయితే అతి తక్కువ ఆరంభ పౌనఃపున్యం ఉన్నది?
    1) సీజియం 2) సోడియం
    3) అల్యూమినియం 4) చెప్పలేం
11. నిశ్చిత వాక్యం (A): రేడియో తరంగాలు, అయస్కాంత క్షేత్రంలో వంగి ప్రయాణిస్తాయి.
    వివరణ (R): రేడియో తరంగాలు స్వభావ రీత్యా విద్యుదయస్కాంతాలు
    1) A, R రెండూ సరైనవే R, A కు సరైన వివరణ
    2) A, R రెండూ సరైనవే, కానీ, R, A కు సరైన వివరణ కాదు
    3) A సరైంది. R సరైంది కాదు.
    4) A సరైంది కాదు. R సరైంది.

సమాధానాలు:
1) 2; 2) 3; 3)1; 4) 2; 5)3; 6) 1;
7) 4; 8) 2; 9) 1; 10) 1; 11) 1.

రంగు	తరంగ దైర్ఘ్య అవధి (nm)	పౌనఃపున్య అవధి (Hz)
ఎరుపు (Red)	622 – 780	$4.8 \times 10^{14} - 3.85 \times 10^{14}$
నారింజ (Orange)	597 – 622	$5.01 \times 10^{14} - 4.82 \times 10^{14}$
పసుపు (Yellow)	577 – 597	$5.19 \times 10^{14} - 5.05 \times 10^{14}$
ఆకుపచ్చ (Green)	492 – 577	$4.92 \times 10^{14} - 5.19 \times 10^{14}$
నీలి (Blue)	455 – 492	$6.59 \times 10^{14} - 6.10 \times 10^{14}$
ఊదా (Violet)	390 – 455	$7.69 \times 10^{14} - 6.59 \times 10^{14}$

The synonym of Surreptitious is..

BANK EXAMS

GENERAL ENGLISH



Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Hindus constitute less than one per cent of the American population, (1)/ an overwhelming majority of who (2)/ are either from India (3)/or are people of Indian-origin. (4)/ No error (5)
2. Ever since the Supreme Court ruling (1)/ on the entry of women of all ages into Sabarimala, (2)/ questions of patriarchy, equality, (3)/ constitutional and tradition have been raised. (4)/ No error (5)
3. The controversy that began with a public tussle among (1)/ Mr. Verma and Special Director Rakesh Asthana (2)/ has ended with the former's removal, (3)/ although it is couched as a transfer. (4)/ No error (5)
4. India's largest software exporter Tata Consultancy Services has appointed Daniel Hughes Callahan, (1)/ popularly known Don Callahan as additional and independent director for a period of five years (2)/ with effect from January 10, 2019, based on the recommendations of the Nomination and Remuneration Committee, (3)/ and subject to approval of shareholders. (4)/ No error (5)
5. ISRO had hit upon (1)/ the idea of transforming (2)/ the expendable fourth stage (3)/ in a makeshift satellite to reduce space debris. (4)/ No error (5)

Directions: (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Drinking milk enriched with vitamin D may significantly reduce the risk of rickets and also aid for sufferers of heart disease, according to studies recently completed at the Indian Institute of Medical Sciences, New Delhi.
   1) be significant in reducing the risk of rickets and aid for
   2) significantly reduce the risk of rickets and aid
   3) cause a significant reduction in the risk of rickets and aid to
   4) significantly reduce the risk of rickets as well as aiding
   5) no correction required
7. If you are in a three-month software design project and, in two weeks, you've put together a program that solving part of the problem, show it to your boss without delay.
   1) and, you've put together a program that solves part of the problem in two weeks
   2) and, you've put together a program that has solved part of the problem in two weeks
   3) and, in two weeks, you've put together a program that solves part of the problem
   4) and, in two weeks, you put together a program that solved only part of the problem
   5) no correction required
8. Many of these environmentalists proclaim to save nothing less than the planet itself.
   1) to save nothing lesser than
   2) that they are saving nothing lesser than
   3) to save nothing less than
   4) that they save nothing less than
   5) no correction required
9. The rate of inflation in this country has been increasing steadily, and this is a source of concern for those in power.
   1) steadily: which
   2) steadily; this trend
   3) steadily, this increase
   4) steadily: this
   5) no correction required
10. Generally, in the fine print of insurance documents lies the clauses that make a fool out of the gullible consumer.
    1) lie the clauses that makes a fool
    2) lies the clauses that makes a fool
    3) lie the clauses that make a fool
    4) Lied the clause that making a fool
    5) no correction required

Directions (Q.No.11-15): In the passage given below there are several blanks with numbers, choose the right word to fill in the blanks from the five options given against each blank to complete the passage.

Come New Year and the state of Andhra Pradesh will ______(11) a separate High Court as the Supreme Court has given the green signal for issuing the notification to this_____ (12). It will be the 25th high court in the country and will ______ (13) function from a temporary structure till the permanent building comes up in the ambitious Justice City complex in the state's capital Amaravati. ______(14) the bifurcation of the state on June 2, 2014, Andhra Pradesh and Telangana have had a common High Court situated at Hyderabad, the_____ (15) capital city.

11. 1) have 2) have been
    3) being 4) have being
    5) been
12. 1) affect 2) purpose
    3) problem 4) effect
    5) issue
13. 1) initial 2) initially
    3) initialize 4) informally
    5) formerly
14. 1) from 2) further
    3) farther 4) for
    5) since
15. 1) former 2) farther
    3) latter's 4) later's
    5) further

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) On the one hand, Mr. Trump has steadily contributed to the strident and crude anti-migrant rhetoric, characterising prospective migrants from Latin America as drug-dealers, rapists and violent criminals and shutting down the U.S. border to travellers from certain Muslim-majority countries.

B) Matters took a darker turn as Mr. Trump doubled down on his refusal to negotiate over funding for the wall and said he may declare a state of national emergency over this uncomfortable status quo.

C) It began as a populist campaign promise that brought President Donald Trump's supporters cheering to their feet and paved the way for his election.

D) On the other, his insistence that he will not sign any appropriations bill to break the funding logjam in Congress and end what could soon become the longest shutdown in U.S. history, unless that bill includes $5.7 billion in financing for a border wall, has gone down badly with Democrats, who control the House.

E) Now, the border wall with Mexico has become a morass of partisan bickering that has stalemated the U.S. federal government into a three-week-long shutdown, leaving nearly 800,000 public sector workers furloughed without pay.

F) At the heart of this political crisis is the increasingly bitter polarization of public opinion over immigration.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 21-23): Choose the correct synonym for the words given below

21. OBNOXIOUS
    1) abhorrent 2) detect
    3) pleasant 4) project
    5) propel
22. SURREPTITIOUS
    1) fugitive 2) renegade
    3) punitive 4) clandestine
    5) castigate
23. DOCILE
    1) uncontrollable
    2) plaint 3) wild
    4) irrepressible 5) loathsome

Directions (Q.No. 24-25): Choose the correct antonym for the words given below

24. ABHORRENT
    1) obscene 2) nasty
    3) vile 4) salubrious
    5) lousy
25. EXUBERANT
    1) phlegmatic 2) ruckus
    3) commotion 4) frolic
    5) crank

Directions (Q.No. 26-35): Choose a word/words to fill in the blanks given below to complete the sentence.

26. There is no way around it: plagiarism is ______ to thievery.
    1) tantamount 2) apathetic
    3) fatuous 4) unscrupulous
    5) indecisive
27. For ____ deeds during her mission overseas, Eesha was awarded the Congressional Medal of Honor.
    1) inept 2) valorous
    3) erroneous 4) malodorous
    5) benign
28. Adrith read the employee manual so that he might ______ himself with his new responsibilities at the company.
    1) relinquish 2) synthesize
    3) orient 4) validate
    5) motivate
29. I am ______ of the problems that this solution will cause, but I still believe that this is the best possible solution.
    1) innocuous 2) cognizant
    3) precipitous 4) reminiscent
    5) belligerent
30. The spectacular presentation by a rainforest adventurer ______ Sampath with the desire to travel to South America to see the jungles for himself.
    1) disheartened 2) inhibited
    3) imbued 4) reconstituted
    5) abhorred
31. As the city grew and stretched its borders, it began to feel the ______ problems of urban sprawl and over-population.
    1) improvident
    2) mendacious
    3) ersatz 4) concomitant
    5) surreptitious
32. Terrance, a dentist, ______ to be with the media, so he could see the concert for free.
    1) facilitated 2) conjugated
    3) purported 4) tended
    5) placated
33. ______ on a lounge chair by the pool was the very tan owner of the estate, relaxing in the midday sunshine.
    1) Trident 2) Renegade
    3) Fraught 4) Renowned
    5) Supine
34. Observing his sister's ______ behavior of riding without a helmet, Bandarkar ran to get his mother.
    1) contemptuous
    2) contented 3) ctitious
    4) parlous 5) pensive
35. As the discussions _____concluded, the_____continued further.
    1) Definitely , problem
    2) Miserably, issues
    3) Purposefully, impasse
    4) abruptly, stalemate
    5) Soon, curfew

KEY

1) 2	2) 4	3) 1	4) 2	5) 4
6) 2	7) 3	8) 4	9) 2	10) 3
11) 1	12) 4	13) 2	14) 5	15) 3
16) 1	17) 4	18) 4	19) 3	20) 2
21) 1	22) 4	23) 2	24) 4	25) 1
26) 1	27) 2	28) 3	29) 2	30) 3
31) 4	32) 3	33) 5	34) 4	35) 4